సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 37

సోమవారం 29-4-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'




జాక్స్ ధమాకా..

41 బంతుల్లో అజేయ సెంచరీ.. గుజరాత్‌పై బెంగళూరు విజయం.. - 14లో



కేవైసీ చేస్తేనే పెట్టుబడులు

ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టాలంతే కేవైసీ స్థితిని చెక్ చేసుకోవాల్సిందే.. - 15లో



బాద్‌షాల అరాచకాలు కన్పించలేదా?

మన దేశానికి చెందిన రాజులను కించపర్చిన రాహుల్ నవాబులు, నిజామ్‌లు, సుల్తాన్లు, బాద్‌షాలు సాగించిన అరాచకాలపై నోరుమెదపడం లేదని మోదీ అన్నారు.

- వివరాలు 6లో



రేవణ్ణ, ప్రజ్వల్‌పై లైంగిక వేధింపుల కేసు

లైంగిక వేధింపుల కేసులో మాజీ ప్రధాని దేవెగౌడ కుమారుడు రేవణ్ణ, మనవడు ప్రజ్వల్‌పై దర్యాప్తునకు కర్ణాటక ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది.

- వివరాలు 6లో

సాక్షి ఎలక్షన్ 2024

తెలంగాణ

ఈసారి ఎవరు?

ప్రతి ఎన్నికల్లోనూ మార్పును ఆహ్వానిస్తున్న మల్కాజిగిరి ఓటర్లు

దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గంతో పాటు మినీ భారత్‌గా పేరొందిన మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో గెలుపు మూడు ప్రధాన పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారింది. 37 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 10లో

జాతీయం..

ఖనిజం ఎవరికి సొంతం?!

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలు, కాంగ్రెస్ మెరుగైన ప్రదర్శన చేస్తున్నా లోక్‌సభకు వచ్చేసరికి జార్ఖండ్‌లో పదేళ్లగా కమనాథులే సత్తా చాటుతున్నారు. ఈసారి క్లీన్‌స్వీప్‌పై కన్నేసిన బీజేపీని అడ్డుకోవడానికి కాంగ్రెస్ సారథ్యంలో ఇండియా కూటమి సర్వశక్తులూ ఒడ్డుతోంది.. 11లో

ఆంధ్రప్రదేశ్

ఆర్థిక కేటుగాళ్లకు టీడీపీ అడ్డా

మాల్యా, నీరవ్ మోదీ వారసులు సుజనా, రఘురామకృష్ణరాజు, సీఎం రమేశ్, గంటా 12లో

ఆదివారం రాత్రి హనుమకొండ చౌరస్తాలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్.. హాజరైన జనం



బీఆర్‌ఎస్‌తోనే రక్ష!

14- 15 మంది బీఆర్‌ఎస్ ఎంపీలను గెలిపిస్తే కేంద్రంలో రాష్ట్రానిదే కీలకపాత్ర

హనుమకొండ బస్సుయాత్రలో మాజీ సీఎం కేసీఆర్

- గోదావరి ఎత్తుకుపోతామంటున్న బీజేపీకి ఎందుకు ఓటేయాలి?
- అది ప్రమాదకర పార్టీ.. విద్వేషం నింపడమే దాని పని
- హామీలిచ్చి అమలు చేయని కాంగ్రెస్‌కు ఓటేస్తే ఏం లాభం?
- అడ్డగోలు హామీలు చూసి ఓట్లేస్తే.. 4 నెలల్లో ఆగం చేశారు
- లంచాల కోసం బిల్డింగ్ పర్మిషన్లు ఆపేశారని ఆరోపణ

2లో

రిజర్వేషన్లపై జవాబివ్వాలి

ఆ తర్వాతే రాష్ట్రానికి మోదీ రావాలి • మల్కాజిగిరి కార్నర్ మీటింగుల్లో సీఎం రేవంత్‌రెడ్డి

- పదేళ్లలో తెలంగాణకు ఏం చేశారో ప్రధాని చెప్పాలి
- బీజేపీ నేతలు దేవుళ్ల పేర్లు చెప్పి ఓట్లు అడుక్కుంటున్నారు
- ఓట్ల కోసం కేసీఆర్ కొంగ జపం చేస్తున్నారంటూ ఫైర్

ఎల్బీనగర్/అల్వాల్ (హైదరాబాద్): 'కేంద్రంలో మరోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేసేందుకు బీజేపీ కుట్రలు పన్నుతోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఉండాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి. ఈ నెల 30న రాష్ట్ర పర్యటనకు వస్తున్న ప్రధాని మోదీ.. ముందుగా రిజర్వేషన్లు ఎందుకు రద్దు చేయాలనుకుంటున్నారో సమాధానం చెప్పాలి. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఎందుకు జాతీయ హోదా ఇవ్వలేదో, బయ్యారం ఉక్కు పరిశ్రమ, ఖాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఎందుకు ఏర్పాటు చేయలేదో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలి. ఆ తర్వాతే రాష్ట్ర పర్యటనకు రావాలి. పది సంవత్సరాలు ప్రధాన మంత్రిగా ఉండి రాష్ట్రానికి ఏం చేశారో చెప్పాలి..'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. మల్కాజిగిరి నియోజకవర్గం తనకు రాజకీయంగా తోడ్పాటును అందించిందని, ఈ నియోజకవర్గ అభివృద్ధికి తాను బాధ్యత వహిస్తానని అయన హామీ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎల్బీనగర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌కు 30 వేల మెజార్టీ ఇచ్చి పార్టీ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఎల్బీనగర్ నియోజకవర్గంలోని వనస్థలిపురం సుష్మా చౌరస్తా నుంచి రైతు బజారు చౌరస్తా వరకు సీఎం రోడ్డు షో నిర్వహించారు. రాత్రి అల్వాల్ సమీపంలోని కౌకూర్‌లో మిగతా 2వ పేజీలో ▶



ఆదివారం రాత్రి మల్కాజిగిరి కార్నర్ మీటింగ్‌లో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో అభ్యర్థి పట్నం సునీతారెడ్డి, మహేందర్‌రెడ్డి

'భువనగిరి' బరిలో కొనసాగుతాం

మా అభ్యర్థిని ఉపసంహరించం.. కాంగ్రెస్‌కు సీపీఎం స్పష్టీకరణ

దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వినతిని తోసిపుచ్చిన వామపక్ష పార్టీ



మిగిలిన 16 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతిస్తామని వెల్లడి 2లో

- ప్రకటన విడుదల చేసిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ఇదండీ జగత్



హామీలివరూ నమ్మట్లేదు! గతంలో చెప్పినట్లు ఇది కూడా అబద్ధాలనుకొని వెళ్లిపోతున్నార్సార్!

బీజేపీ రిజర్వేషన్లు రద్దు చేస్తుందని ఎలా అంటావ్?

దమ్ముంటే దీనిపై చర్చకు రా.. సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి సవాల్



- హామీలు అమలు చేయలేక, ఓట్లు ఎలా అడగాలో తెలియక అవాస్తవ ఆరోపణలు
- రిజర్వేషన్ల రద్దు అంటూ సామాజిక ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ప్రయత్నం..
- అమిత్ షా ప్రసంగాన్ని మార్ఫింగ్ చేశారు..
- ఇది కాంగ్రెస్ దిగజారుడుతనానికి పరాకాష్ట

3లో

రిజర్వేషన్లు రద్దు చెయ్యం ఎవరినీ చేయనియ్యం

ఇది మోదీ గ్యారంటీ

యూపీలో ఎన్నికల ప్రచారంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా 6లో

అసమానతలు తొలగేదాకా రిజర్వేషన్లు

ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ స్పష్టీకరణ 3లో

"డబ్బులు మీ అకౌంట్లోకి, మీ చేతికే పంపితే అది జగన్ పాలన! అదే డబ్బులు తన అకౌంట్లోకి, తన జేబులోకి, తన పెత్తందారీ స్నేహితుల జేబుల్లోకి వేసుకుంటే అది బాబు పాలన! చంద్రబాబుకు ఓటు వేస్తే ప్యాకేజీ స్టార్‌కు, రామోజీరావుకు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణకు, టీవీ 5 నాయుడికి, వదినమ్మకి మనీ ట్రాన్స్‌ఫర్ అవుతుంది. బాబుది ఈనాడు, ఈటీవీ, ఆంధ్రజ్యోతి, టీవీ 5లో మాత్రమే కనిపించే గ్రాఫిక్స్, మోసాల పాలన."



తిరుపతి జిల్లా వెంకటగిరిలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

మోసగాళ్లకు ఓటుతో వేటు

తాడిపత్రి, వెంకటగిరి, కందుకూరు ఎన్నికల సభల్లో ఏపీ సీఎం జగన్

- నా 58 నెలల పాలనలో ఏం చేశానో చెబుతా
- నీ 14 ఏళ్ల పాలనలో చేసిందేమిటో చెప్పగలవా బాబూ?
- నీలా బడాయిలు చెప్పకుండా నా ప్రోగ్రెస్ రిపోర్టు ప్రజలకే అందచేశా
- నువ్వేం చేశావో చెప్పుకోలేక నా పథకాల గురించి మాట్లాడతావ్ ఏమిటయ్యా?

వివరాలు 5లో

జగన్.. రేపు నిన్ను చంపితే ఏమవుతుంది?

నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం సభలో చంద్రబాబు వివాదాస్పద వ్యాఖ్యలు

- బహిరంగంగానే బరితెగించిన టీడీపీ అధినేత.. సీఎం జగన్‌పై తెలుగుదేశం పార్టీ కుతంత్రం!
- ముఖ్యమంత్రిని రాజకీయంగా ఎదుర్కోలేక భౌతికంగా నిర్మూలించే కుట్ర
- కొద్దిరోజుల క్రితం 'ఆ దున్నపోతును మనిషికి ఒక రాయి తీసుకుని కొట్టండి'అంటూ వ్యాఖ్య
- ఆ తర్వాతే విజయవాడలో సీఎంపై హత్యాయత్నం.. మరో సభలో.. గాజు గ్లాసు తీసుకుని పొడవమంటూ సైగలు

వివరాలు 5లో

నిప్పులు కక్కుతున్న సూరీడు

రాష్ట్రమంతటా అత్యధిక స్థాయిలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు



- నల్లగొండ, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో 45 డిగ్రీలపైనే
- సగటున 41.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత.. సాధారణం కంటే 4.6 డిగ్రీలు అధికం
- మరో రెండ్రోజులు పలు ప్రాంతాల్లో వడగాడ్పుల హెచ్చరికలు

3లో

క్లుప్తంగా...

హోంమంత్రినైతే వాళ్లందరినీ జైల్లో వేస్తా

- బీఆర్‌ఎస్ నేతలపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఫైర్



బీబీనగర్, చౌటుప్పల్: 'రాష్ట్ర కేబినెట్‌లో నేను హోంశాఖ మంత్రినైతే ముందుగా వరుస బెట్టి బీఆర్‌ఎస్ నాయకులందరినీ జైల్లో వేస్తాను'అని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లో ఆదివారం జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు హోం మినిస్టర్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో ఆయన స్పందిస్తూ.. ప్రజలు తనను హోం మినిస్టర్‌గా చూడాలని కోరుకుంటున్నారని, అయితే తాను ఎప్పుడూ ఏ పదవీ కావాలని అధిష్టానాన్ని అడగలేదని చెప్పారు. 'నేను చాలా మొండి మనిషిని నామాట నేనే వినను.. కేసీఆర్‌తో సహా బీఆర్‌ఎస్ నాయకులందరినీ జైల్లో కూర్చొబెడుతా' అని అన్నారు. కాగా, చౌటుప్పల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో రాజగోపాల్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అధికార దుర్వినియోగంతోపాటు పూర్తిగా అవినీతికి పాల్పడ్డ కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు జైలు ఊచలు తప్పవని హెచ్చరించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఒక్క సీటు కూడా గెలవదని జోస్యం చెప్పారు.

కేసీఆర్‌కు జనం ఇప్పుడు గుర్తొస్తున్నారా?

- పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: అధికారంలో ఉన్నన్ని రోజులు కేసీఆర్‌కు గుర్తుకు రాని ప్రజలు.. ప్రతిపక్షంలోకి వచ్చాక గుర్తొచ్చారా? అని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి ప్రశ్నించారు. గాంధీభవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిజాలను అసత్యాలుగా మార్చి ప్రజలకు ఎలా చెప్పాలో కేసీఆర్‌కు బాగా తెలుసని ఎద్దేవా చేశారు. తెలంగాణ విభజన తరువాత ప్రజలెలా జీవిస్తున్నారో కేసీఆర్ ఏనాడైనా వారిని అడిగారా? అని ప్రశ్నించారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఇంట్లో కేసీఆర్ భోజనం చేసేటప్పుడు మూడుసార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని మళ్లీ అబద్ధాలు చెప్పారని విమర్శించారు. కేసీఆర్ బాధ విద్యుత్ కోసం కాదని, పొలిటికల్ పవర్ పోయిందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ కుటుంబానికే ప్రజలు పొలిటికల్ పవర్ కట్ చేసారని, ఈ పరిస్థితుల్లో గత్యంతరం లేక ఆయన పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారం చేస్తున్నారని స్పష్టం చేశారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ ప్రజలకు ఏనాడూ అందుబాటులో లేరని, ఎవరినీ పట్టించుకోలేదని గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు 14 పార్లమెంట్ సీట్లు వస్తే.. రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని జగ్గారెడ్డి చెప్పారు.

బీఆర్‌ఎస్‌తోనే రక్ష!

14- 15 మంది బీఆర్‌ఎస్ ఎంపీలను గెలిపిస్తే కేంద్రంలో రాష్ట్రానిదే కీలకపాత్ర

హనుమకొండలో బస్సుయాత్రలో మాజీ సీఎం కేసీఆర్



హనుమకొండ రోడ్‌షోలో అభివాదం చేస్తున్న కేసీఆర్. చిత్రంలో సుధీర్ కుమార్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వినయ్ భాస్కర్

సాక్షి, వరంగల్: ''ప్రధాని నరేంద్ర మోదీ చెప్పినట్టుగా బీజేపీకి 400 సీట్లు కాదు.. కనీసం 200 సీట్లు దాటేలా లేవు. మనకు ఇదే మంచి సమయం. తెలంగాణలో లోక్‌సభ సీట్లన్నీ గెలిస్తే.. రాష్ట్ర ప్రయోజనాల కోసం పేగులు తెగేదాకా కొట్లాడుతాం. కేంద్రంలో హంగ్ వస్తే కీలకపాత్ర పోషించే అవకాశం ఈ రోజు తెలంగాణకు ఉంది..'' అని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. మన గోదావరి నీళ్లను ఎత్తుకుపోతామన్న బీజేపీకి.. హామీలిచ్చి అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్‌కు ఓటేస్తే ప్రయోజనం ఉండదన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్ర ఆదివారం హనుమకొండకు చేరుకుంది. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి హనుమకొండ చౌరస్తా వరకు కేసీఆర్ రోడ్డు షో నిర్వహించారు. కూడలి వద్ద ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''గోదావరి నదిని తీసుకొని పోతా అంటూ ఓట్లు పడే టైంలో నరేంద్ర మోదీ రాష్ట్ర ప్రభుత్వానికి నోటిఫికేషన్ పంపించాడు. ప్రాణం పోయినా ఇవ్వబోమని రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ పెట్టాలి. నేనున్నప్పుడు అదే పంచాయతీ పెట్టిన. అయనేమో ఎత్తుకుపోతా అంటరు. ఈ చేతకాని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నోరు మూసుకొని పడి ఉంది. అందులో ఏం మతలబు దాగి ఉంది. ఎవరూ కాపాడాలి? దయచేసి మన గోదావరిని, కృష్ణాను కాపాడుకోవాలన్నా.. తెలంగాణకు రావాల్సిన నిధులు రాబట్టుకోవాలన్నా.. మన ప్రాజెక్టులకు జాతీయ హోదా రావాలన్నా.. నిరుద్యోగ సమస్య తీరాలన్నా.. మన బతుకులు బాగు పడాలన్నా.. కచ్చితంగా బీఆర్‌ఎస్ అభ్యర్థులే గెలవాలి. అదే తెలంగాణకు క్షేమం. దయచేసి ఆలోచన చేయాలి.

లంచాల కోసమే కాంగ్రెస్ పర్మిషన్లు ఆపింది

తెలంగాణ వచ్చిన తర్వాత రాష్ట్రమంతా భూముల ధరలు బ్రహ్మాండంగా పెరిగాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగింది. కానీ ఇప్పుడు డౌన్ అయింది. దాని మీద బతికే వేల మంది రోడ్ల మీద పడ్డారు. రాష్ట్రంలో హైదరాబాద్‌తో పాటు పెద్ద పట్టణాల్లో ఐదు నెలలుగా బిల్డింగ్ పర్మిషన్లు ఇస్తలేరు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో టీఎస్ బీపాస్ తెచ్చి.. అప్లికేషన్ పెడితే 21 రోజుల్లో ఆటోమేటిగ్గా పర్మిషన్లు ఇచ్చేయాలని చట్టం చేసినం. ఇప్పుడున్న సీఎం, వారి మంత్రివర్గం ఆ చట్టాన్ని ఉల్లంఘించి పర్మిషన్లు ఇవ్వడం లేదు. ఎందుకో తెలుసా. ఎవరైనా బిల్డింగ్‌లు కడితే చదరపు మీటర్‌కు ఇంత అని కాంగ్రెస్‌కు లంచం ఇవ్వాలట. దానికోసం మొత్తం రాష్ట్ర ప్రగతిని, అభివృద్ధిని ఆపేశారు. అంతేకాదు పూర్తయిన భవనాలకు కూడా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వడం లేదు. ఈ బండారమంతా బయటపెడతాం. త్వరలోనే దీనిపై పార్టీ కార్యాచరణతో ముందుకు వెళ్తుంది.

ఒక్క హామీ కూడా అమలు చేయలేదు

ఈ ముఖ్యమంత్రికి తెలంగాణ చరిత్ర తెలియదు. భూగోళం తెలియదు. మొన్న ఎక్కడనో మాట్లాడుతూ కృష్ణానది కూడా నేనే కట్టిన అంటడు. ప్రపంచంలో ఎవరైనా నది కడతారా? 'ఏరి కోరి మొగుడిని తెచ్చుకుంటే ఎగిరి ఎగిరి తన్నిండంట' అన్నట్టు ఉన్నది. అడ్డగోలు హామీలు చూసి ఓట్లేస్తే.. నాలుగైదు నెలల్లోనే ఆగమాగం చేసేశారు. తెలంగాణకు ఏమైందో అర్థం కావడం లేదు. కరెంట్ ఎక్కడికి పోయింది? సాగునీళ్లు ఏవి? పంటలు ఎందుకు ఎండుతున్నాయి? మంచి నీళ్ల కరువు ఎందుకు వస్తోంది? కాంగ్రెస్ సర్కారు ఒక్క హామీ కూడా సరిగా అమలు చేయలేదు. కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇస్తామన్నారు. ఏమైంది? రైతుబంధు అందరికీ రాలేదు. ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామన్నారు. డిసెంబర్ 9 నాడే రూ.2 లక్షల రుణమాఫీ అన్నారు. ఏదీ కాలేదు.

అచ్ఛేదిన్ కాదు.. సచ్చేదిన్..

బీజేపీ చాలా ప్రమాదకరమైన పార్టీ. దానికి ఎంతసేపూ పంచాయతీలు పెట్టించడం, విద్వేషం నింపడమే. ఆ పార్టీ ఎజెండాలో ప్రజల కష్టసుఖాలు ఉండవు. దయచేసి యువతను కోరుతున్నా.. ఆవేశం కాదు.. ఆలోచన చేయాలి. ఈ దేశం మీది. ఈ రాష్ట్రం మీది. రేపటి భవిష్యత్ మీది. ప్రధాని మోదీ భేటీ బచావో, భేటీ పడావో, జన్ ధన్ యోజన వంద నినాదాలు చెప్పారు. విదేశాల నుంచి నల్లధనమంతా తెచ్చి ఇంటికి రూ.15 లక్షల చొప్పున ఇస్తానన్నారు. ఎవరికైనా కనీసం ఐదు రూపాయలన్నా వచ్చాయా? అచ్చే దిన్ అచ్చే దిన్ అన్నారు.. అది రాలేదు కానీ సచ్చేదిన్ వచ్చింది. ధరలు విపరీతంగా పెరిగాయి. రూపాయి విలువ పడిపోయింది. కేంద్రంలో 18 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే ఒక్క ఖాళీ కూడా నింపలేదు. విభజన చట్టంలో కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ ఇస్తామని ఉంటే.. మోదీ దానిని గుజరాత్‌కు ఎత్తుకెళ్లారు. అలాంటి బీజేపీకి ఎందుకు ఓటేయాలి?'' అని కేసీఆర్ ప్రశ్నించారు.

హైదరాబాద్‌పై కన్నేశారు.. జాగ్రత్త!

- కేంద్ర పాలిత ప్రాంతం చేసేందుకు బీజేపీ, కాంగ్రెస్‌ల కుట్ర: కేటీఆర్
- దాన్ని అడ్డుకునే శక్తి బీఆర్‌ఎస్‌కు మాత్రమే ఉంది
- పన్నెండు ఎంపీ సీట్లు ఇస్తే వారి కుట్రలను ఛేదిస్తాం..
- గాలి మాటల రేవంత్.. మాయ మాటల మోదీతో తెలంగాణకు ఒరిగేదేమీ లేదు
- బీజేపీ మళ్లీ గెలిస్తే రిజర్వేషన్లను ఎత్తివేస్తుందని ఆరోపణ
- కరీంనగర్, వేములవాడలలో పార్టీ శ్రేణులతో సమావేశాలు



కరీంనగర్‌లో మాట్లాడుతున్న కేటీఆర్

కరీంనగర్/ వేములవాడ: హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా చేసే కుట్రలకు కాంగ్రెస్, బీజేపీ తెరలేపాయని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను దెబ్బతీసేందుకు ఆ రెండు పార్టీలు మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నాయని విమర్శించారు. బీఆర్‌ఎస్‌కు పన్నెండు ఎంపీ సీట్లు ఇస్తే వారి కుట్రలను ఛేదిస్తామని పేర్కొన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తలు, బూత్ లెవల్ కమిటీలతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''రాష్ట్ర విభజన సందర్భంగా హైదరాబాద్‌ను పదేళ్లు ఉమ్మడి రాజధానిగా ఉంచేలా ఒప్పందం జరిగింది. వచ్చే జూన్ 2తో ఆ గడువు ముగుస్తోంది. హైదరాబాద్‌పై కన్నేశారు.. తస్మాత్ జాగ్రత్త. కాంగ్రెస్, బీజేపీలు హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటింపజేసేందుకు కుట్రలు మొదలుపెడతాయి. అలా చేస్తే అడ్డుకునే శక్తి గులాబీ పార్టీకి మాత్రమే ఉంది. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ను దెబ్బతీసేందుకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కయ్యాయి. పరస్పరం సహకరించుకుంటూ.. బలహీనమైన అభ్యర్థులను బరిలో నిలిపాయి. రాష్ట్రంలో పన్నెండు ఎంపీ సీట్లు ఇస్తే తెలంగాణ ప్రయోజనాలే లక్ష్యంగా ఆ రెండు పార్టీల కుట్రలను ఛేదిస్తాం. దేశంలో 400 ఎంపీ సీట్లలో గెలిపిస్తే.. రాజ్యాంగాన్ని రద్దు చేసి, రిజర్వేషన్లను ఎత్తివేస్తా మని బీజేపీ నాయకులు ప్రగల్భాలు పలుకుతున్నారు. అలాంటి వాటిని కూడా అడ్డుకునే శక్తి కూడా గులాబీ పార్టీకే ఉంది.

వారితో ఒరిగేదేమీ లేదు..

2014 నుంచి కేంద్రంలో బడేభాయ్ మోదీ.. వంద రోజుల నుంచి రాష్ట్రంలో చోటే భాయ్ రేవంత్.. ఇద్దరూ ప్రజలను మోసం చేస్తున్నారు. గాలి మాటల సీఎం రేవంత్‌రెడ్డి, మాయమాటల ప్రధాని మోదీలతో తెలంగాణకు ఒరిగేదేమీ లేదు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను మోదీ సర్కార్ అమలు చేయలేదు. హైదరాబాద్‌కు ప్రకటించిన ఐటీఐఆర్‌ను కూడా ఎత్తివేసింది. మోదీ పదేళ్ల పాలనలో ప్రజలకు తీరని ద్రోహం చేశారు. రైతుల ఆదాయాన్ని డబుల్ చేస్తామని.. వారి కష్టాలను మాత్రం డబుల్ చేశారు. 2014లో రూ.400 ఉన్న సిలిండర్ ధరను ఇప్పుడు రూ.1,200కు పెంచారు. సామాన్యులపై పెను భారం పడుతోంది. జాతీయ రహదారుల కోసం సెస్ పేరిట రూ.30లక్షల కోట్లు వసూలు చేసి.. ఇందులో సగం రూ.14 లక్షల కోట్లు అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ రుణ ఎగవేతదారులకు అందించారు. యువతలో మతవిద్వేషాలు నింపి తప్పుదోవ పట్టిస్తున్నారు..''అని కేటీఆర్ మండిపడ్డారు. ప్రజలు, యువత మరోసారి బీజేపీ మాయలో పడొద్దన్నారు. ఈ సమావేశాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ భానుప్రసాద్ రావు, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లపై మోదీ జవాబివ్వాలి

▶ మొదటి పేజీ తరువాయి

జరిగిన రోడ్డు షోలో పాల్గొన్నారు. ఈ రెండుచోట్లా జరిగిన కార్నర్ మీటింగుల్లో ఆయన మాట్లాడారు.

బీజేపీని బహిష్కరించాలి

'తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అవమానించిన బీజేపీని బహిష్కరించాలి. రోడ్లపై దేవుళ్ల బొమ్మలు పెట్టుకుని కొందరు పొట్టకూటి కోసం అడుక్కుంటుంటున్నారు. బీజేపీ నేతలు మాత్రం దేవుళ్ల పేరు చెప్పి ఓట్లు అడుక్కుంటున్నారు. బీజేపీ పుట్టక ముందునుంచే, తాతముత్తాల కాలం నాటి నుంచే శ్రీరామ నవమిలు, హనుమాన్ జయంతిలు జరుపుకున్నాం. బతుకమ్మలు ఆడాం. మైసమ్మ, పోచమ్మ, ఎల్లమ్మలకు కల్లు సాక పోశాం. కోళ్లను కోసి భక్తిని చాటుకున్నం..'అని రేవంత్ చెప్పారు.



వనస్థలిపురంలో సీఎం రేవంత్ రెడ్డి రోడ్‌షోకు హాజరైన కాంగ్రెస్ శ్రేణులు

బీజేపీ నేతలు ఈ ప్రాంతాన్ని పట్టించుకున్నారా?

'ఎల్‌బీనగర్‌లో ఎప్పుడు వర్షం వచ్చినా మనుషులు కొట్టుకుపోవడం, వాహనాలు మూసీలో కొట్టుకుపోవడం చూస్తుంటాం. ఈ సమస్యలు పరిష్కరించాలంటే సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించాలి. నాగోల్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు, ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు మెట్రో ఏర్పాటు చేస్తాం. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో 11 డివిజన్లలో గెలిచిన బీజేపీ కార్పొరేటర్లు ఎప్పుడైనా సమస్యల పరిష్కారానికి వచ్చారా? ఇప్పుడు పోటీ చేస్తున్న ఈటల రాజేందర్ మంత్రిగా ఉన్నప్పుడు ఇక్కడ ఏమైనా అభివృద్ధి చేశాడా? గతంలో వర్షాలు వచ్చినప్పుడు మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించిన అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్.. బండి పోతే బండి, లారీ పోతే లారీ ఇప్పిస్తానని చెప్పారు. అయన నుంచి బండి రాలే గుండు రాలేదు. కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా ఉండి రాష్ట్ర అభివృద్ధికి నయా పైసా తేలేదు..'అని సీఎం విమర్శించారు.

రేపు కర్ణాటకలో రేవంత్ పర్యటన

సాక్షి, హైదరాబాద్: లోక్ సభ ఎన్నికల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం కర్ణాటక ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు గుర్మిట్కల్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో కలిసి ప్రచారసభలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు సేడంలో ప్రియాంక గాంధీతో పాటు ప్రచారసభలో రేవంత్ పాల్గొంటారు.

కారు పార్టులు జుమ్మెరాత్ బజార్‌లో అమ్మేశారు

'కేసీఆర్ పదేళ్లు సీఎంగా ఉండి సచివాలయానికి రాకుండా, ఫాం హౌస్‌లో ఉంటూ ప్రజలను కలవనందుకే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించారు. ఇప్పుడు బస్సు యాత్ర పేరుతో తిరుగుతున్నారు. ఓట్ల కోసం కొంగ జపం చేస్తున్నారు. కారు పని అయి పోవడంతో కారు దిగి, బసు ఎక్కి మరోసారి ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారు. కారు పని అయి పోయి షెడ్డుకు పోయింది. అక్కడ పార్టులు పార్టులుగా విడదీసి జుమ్మెరాత్ బజారులో అమ్మేశారు. పదేళ్లు రాష్ట్రానికి ఏం చేశారో చెప్పలేని పరిస్థితిలో కేసీఆర్ ఉన్నారు. కారుకు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లే. బీఆర్‌ఎస్, బీజేపీ రెండూ కలిసి కాంగ్రెస్‌ను ఓడించాలని చూస్తున్నాయి. ఇందుకు నిదర్శనం బీజేపీ అభ్యర్థి ఈటల గెలుస్తాడని మాజీ మంత్రి మల్లారెడ్డి బహిరంగంగా అనడమే..'అని రేవంత్ అన్నారు. మల్కాజిగిరిలో మైనంపల్లి హన్మంతరావు ఎమ్మెల్యేగా గెలుపొందితే మంత్రి అయ్యేవారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని, బీసీ జనాభాను లెక్కిస్తున్నామని, ఎల్‌బీనగలో మూసీ ప్రక్షాళన చేస్తున్నామని తెలిపారు. 118 జీఓ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ అంటే ఏపీ ప్రజలకు నమ్మకం

- మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయం
- ఏపీ మంత్రి మేరుగ నాగార్జున



కేపీహెచ్‌బీకాలనీలో జరిగిన సంతనూతలపాడు వైయస్ఆర్‌సీపీ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ మంత్రి మేరుగ నాగార్జున, నిర్వాహకులు

కూకట్‌పల్లి: ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అంటే ఓ నమ్మకం, ఇష్టంతో పాటు భావోద్వేగ అనుబంధం ఉందనీ, వివక్ష లేకుండా అన్ని వర్గాల ప్రజలకూ మేలు చేయడం వల్లనే వైఎస్ జగన్ ఆ నమ్మకం పొందగలిగారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి మేరుగ నాగార్జున చెప్పారు. ఇచ్చిన మాట తప్పని నాయకుడు అనే నానుడికి జగన్‌మోహన్‌రెడ్డి నిదర్శమనీ, ఇవ్వగలిగే హామీలనే ప్రకటించి వాటిని అమలు చేసి ప్రజలకు చూపించిన జగన్‌మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి సీఎంగా ప్రభంజనం సృష్టించనున్నారని తెలిపారు. ఆదివారం కేపీహెచ్‌బీ కాలనీలో జరిగిన వైయస్ఆర్‌సీపీ ఆత్మీయ సమ్మేళనంలో మేరుగ నాగార్జున మాట్లాడారు. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లో నివాసముండే సంతనూతలపాడు నియోజకవర్గానికి చెందిన ప్రజలు, వైయస్ఆర్‌సీపీ అభిమానులు వందల సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మేరుగ నాగార్జున మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌కి నిజమైన ఆస్తి అంటే నమ్మకమే అని, నమ్మకం ఉన్న చోటనే ఆయన ఉంటారని వ్యాఖ్యానించారు. విజయవాడలో అత్యంత ఎత్తైన భారతరత్న డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటులో తనకు గురుతర బాధ్యత అప్పగించారని చెప్పారు. ఆ విగ్రహ ఏర్పాటు విషయంలో తాను వంద శాతం మార్కులు తీసుకున్నానని అదే నమ్మకంతో సంతనూతలపాడు నియోజకవర్గాన్ని కూడా అప్పగించినట్లు నాగార్జున తెలిపారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో తనను ఎమ్మెల్యేగా, ఎంపీ అభ్యర్థిగా నందిగం సురేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఇక్కడ నివసిస్తున్న అక్కడి ఓటర్లంతా ముందుగానే తమ ఊళ్లకు చేరుకుని అందరూ ఓట్లు వేసేలా చూడాలని కోరారు. వాకా సంజీవరెడ్డి, వాకా శ్రీనివాస్‌రెడ్డి, మారెడ్డి చెంచురామిరెడ్డి, సత్యవర్ధన్‌రెడ్డి, సీతారామరెడ్డి, జూలకంటి వరలక్ష్మీ రెడ్డి, సుధాకర్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి నాగార్జునతో సెల్ఫీలు దిగేందుకు వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పోటీ పడ్డారు.

ఆ ఎమ్మెల్సీ టికెట్ ఎవరికో?

- బీఆర్‌ఎస్‌లో ఆశావహుల సందడి
- 'వరంగల్– ఖమ్మం– నల్లగొండ' నుంచి పోటీకి ఆసక్తి
- రెండు రోజుల్లో అభ్యర్థిని ఖరారు చేయనున్న కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: శాసనమండలి 'వరంగల్ – ఖమ్మం– నల్లగొండ'పట్టభద్రుల నియోజకవర్గం ఉప ఎన్నిక షెడ్యూలు గురువారం వెలువడింది. ఈ నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్) తరఫున టికెట్ కోసం పలువురు ఆశావహులు తమ వంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు. 2021 మార్చిలో ఈ స్థానం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన పల్లా రాజేశ్వర్ రెడ్డి పదవీ కాలం 2027 మార్చిలో ముగియాల్సి ఉంది. అయితే గత డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో రాజేశ్వర్‌రెడ్డి బీఆర్‌ఎస్ నుంచే జనగామ ఎమ్మెల్యేగా గెలుపొంది మండలి సభ్యత్వానికి రాజీనామా చేశారు.

వాసుదేవరెడ్డి, పల్లె రవికుమార్ యత్నాలు


మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో మొత్తం 4.61లక్షల మంది ఓటర్లు ఉన్న ఈ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఎక్కువ మంది యువ నేతలే ఉత్సాహం చూపిస్తుండటం గమనార్హం. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి ఓటరు నమోదు కార్యక్రమం నుంచే తనకు పోటీ చేసే అవకాశం ఇవ్వాల్సిందిగా బీఆర్‌ఎస్ అధిష్టానాన్ని కోరుతూ వస్తున్నారు. కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి నేతగా ఉద్యమంలో తన పాత్రను గుర్తించి టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి పల్లె రవికుమార్ కూడా తనకు బీఆర్‌ఎస్ అధిష్టానం నుంచి హామీ ఉందని చెప్తున్నారు. వీరిద్దరితో పాటు రాకేశ్‌రెడ్డి, ఓ.నర్సింహారెడ్డి, డాక్టర్ చెరుకు సుధాకర్ తదితరులు కూడా టికెట్ ఆశిస్తున్న వారిలో ఉన్నారు.

నేడో, రేపో అభ్యర్థి ఖరారు

వరంగల్ – ఖమ్మం– నల్లగొండ పట్టభద్రుల స్థానానికి మే 2 నుంచి నామినేషన్లు స్వీకరణ ప్రారంభమవుతున్న నేపథ్యంలో పార్టీ అధినేత కేసీఆర్ రెండు రోజుల్లో పార్టీ అభ్యర్థిని ఖరారు చేసే అవకాశముంది. లోక్‌సభ ఎన్నికల ప్రచార వేదికలపైనే ఎమ్మెల్సీ అభ్యర్థిని కూడా పరిచయం చేయాలని కేసీఆర్ భావిస్తున్నట్టు తెలుస్తోంది.

కదన రంగంలోకి కమల దళపతులు

- రాష్ట్రంలో ఎన్నికల ప్రచారాన్ని పరుగులు పెట్టించనున్న బీజేపీ అగ్రనేతలు
- జహీరాబాద్ ఎంపీ సీటు పరిధిలోని అల్లాదుర్గ్‌లో రేపు ప్రధాని సభ
- మే 3న మరోసారి తెలంగాణలో మోదీ ప్రచారం
- నేడు నడ్డా.. ఎల్లుండి హైదరాబాద్‌కు అమిత్ షా
- పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీపాలిత సీఎంలు, జాతీయ నేతలూ ప్రచారానికి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బీజేపీ లోక్‌సభ ఎన్నికల ప్రచార స్పీడ్ పెంచింది. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు నాలుగో విడతలో భాగంగా మే 13న ఎన్నికలు జరగనుండటంతో వచ్చే రెండు వారాలపాటు ప్రచారాన్ని పరుగులు పెట్టించనుంది. ఇందులో భాగంగా ప్రధాని మోదీ మంగళవారం రాష్ట్ర పర్యటనకు రానున్నారు. అలాగే మే 3న సైతం తెలంగాణలో ప్రచారం చేపట్టనున్నారు. ఇక బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సోమవారం వివిధ చోట్ల ప్రచారం నిర్వహించనున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా మే 1న హైదరాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలో ప్రచారం నిర్వహించనున్నారు. మరోవైపు పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీపాలిత రాష్ట్రాల సీఎంలు, జాతీయ నేతలు రాష్ట్రంలో ఎన్నికల ప్రచారపర్వంలోకి దిగనున్నారు.

సభలు, సమావేశాల హోరు..


జేపీ నడ్డా సోమవారం ఉదయం 10 గంటలకు ఖమ్మం లోక్‌సభ పరిధిలోని కొత్తగూడెంలో బహిరంగ సభలో పాల్గననున్నారు. అలాగే మధ్యాహ్నం 12 గంటలకు మహబుబాబాద్ ఎంపీ స్థానం పరిధిలోని మహబుబాబాద్‌లో జనసభలో ప్రసంగించనున్నారు. సాయంత్రం 5 గంటలకు మేడ్చల్ లోక్‌సభ పరిధిలోని నిజాంపేటలో రోడ్డు షో చేపట్టనున్నారు. అనంతరం పార్టీ రాష్ట్ర ముఖ్యనేతలతో సమావేశమై ఎన్నికల సన్నద్ధత తీరు, ప్రచార కార్యక్రమాలను సమీక్షించనున్నారు. మరోవైపు మంగళవారం ఉదయం 11 గంటలకు జహీరాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోని అందోల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న అల్లాదుర్గ్ మండలంలో ప్రధాని మోదీ బహిరంగ సభలో పాల్గొననున్నారు. మరోసారి మే 3న తెలంగాణకు రానున్నారు. ఇక మే 1న అమిత్ షా హైదరాబాద్ లోక్‌సభలోని చార్మినార్ శాసనసభ నియోజకవర్గంలోని గౌలిపురలో సాయంత్రం 5 గంటలకు రోడ్ షో నిర్వహించనున్నారు.

క్యాంపెయిన్‌లో ముందున్న ముఖ్య నేతలు

అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ కంటే దాదాపుగా అన్ని లోక్‌సభ స్థానాల్లో చేపట్టిన విస్తృత ప్రచారంలో బీజేపీ ముందుంది. రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాల్లో అభ్యర్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తల ఇప్పటికే తమ తమ పరిధుల్లో మొదటి విడత ప్రచారాన్ని ముగించి రెండో విడత ప్రచారానికి సిద్ధమయ్యారు. కొన్నిచోట్ల రెండో విడత ప్రచారాన్ని కూడా ప్రారంభించి ముఖ్యనేతలు ముందున్నట్లు పార్టీకి నివేదికలు అందుతున్నాయి. ముఖ్యంగా సికింద్రాబాద్‌లో పోటీ చేస్తున్న కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, కరీంనగర్ లోక్‌సభ అభ్యర్థి, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, మల్కాజిగిరిలో పోటీ చేస్తున్న జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్, చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, నిజామాబాద్ అభ్యర్థి, ఎంపీ అరివ్రంద్ ధర్మపురి, మెదక్ అభర్థి, మాజీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు, హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవీలత నిర్వహిస్తున్న ప్రచారంలో కేంద్ర మంత్రులు, పార్టీ జాతీయ, రాష్ట్ర ముఖ్యనేతలు పాల్గొని హుషారు పెంచుతున్నారు. వరంగల్ లోక్‌సభ అభ్యర్థి ఆరూరి రమేశ్, ఆదిలాబాద్‌లో ఎంపీ అభ్యర్థి గోడెం నగేష్, ఇతర నియోజకవర్గాల్లో ప్రచారాన్ని ఉధృతం చేశారు.

'భువనగిరి' బరిలో కొనసాగుతాం

- మా అభ్యర్థిని ఉపసంహరించం.. కాంగ్రెస్‌కు సీపీఎం స్పష్టీకరణ
- సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వినతిని తోసిపుచ్చిన వామపక్ష పార్టీ
- మిగిలిన 16 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతిస్తామని ప్రకటన
- బీజేపీకి వ్యతిరేకంగా ఇండియా కూటమిని గెలిపించే బాధ్యత కోసమేనని వెల్లడి
- మీడియాకు ప్రకటన విడుదల చేసిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి స్థానం నుంచి బరిలో నిలిపిన అభ్యర్థిని ఉపసంహరించబోమని సీపీఎం స్పష్టం చేసింది. అక్కడ పోటీలోనే ఉంటామని కాంగ్రెస్ పార్టీకి తేల్చిచెప్పింది. అభ్యర్థిని ఉపసంహరించుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి శనివారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని బృందంతో తన నివాసంలో సమావేశమై కోరినా ఆ పార్టీ మాత్రం ఆయన వినతిని తోసిపుచ్చింది. తమ పార్టీ స్వతంత్ర రాజకీయ విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు భువనగిరి పార్లమెంటు నియోజకవర్గంలో పోటీ చేస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గం నిర్ణయం తీసుకుందన్నారు. భువనగిరిలో తమ పార్టీ అభ్యర్థి మహమ్మద్ జహంగీర్‌ను బలపర్చాలని ఆయన ఓటర్లకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మిగిలిన 16 స్థానాల్లో బీజేపీని ఓడించేందుకు ఇండియా కూటమి భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను బలపర్చాలని ప్రజలను కోరారు.

సీఎంతో విభేదాలే కారణమా?

భువనగిరి స్థానం నుంచి సీపీఎం అభ్యర్థిని వెనక్కి తీసుకొనేలా చూడటంలో సీఎం విఫలమయ్యారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. సీఎంకు, సీపీఎంకు మధ్య ఉన్న విభేదాలే ఇందుకు కారణమన్న వాదనలు ఉన్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వివిధ సమస్యలపై సీఎం రేవంత్‌ను కలిసేందుకు అనేకసార్లు అపాయింట్‌మెంట్ కోరినా ఇవ్వలేదన్న భావన సీపీఎంలో నెలకొంది. అలాగే కేరళలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తమ పార్టీ అధికారంలో ఉన్న సీఎం పినరయి విజయన్‌ను అవినీతిపరుడిగా, బీజేపీతో రహస్య ఒప్పందం చేసుకున్న నేతగా రేవంత్ ప్రచారం చేయడంపైనా సీపీఎం నేతలు గుర్రుగా ఉన్నారు. ఈ విషయంలో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు ఒక అడుగు ముందుకేసి 'రేవంత్‌రెడ్డీ... నీ ఓటుకు నోటు సంగతేంటి?' అని ప్రశ్నించారు.

అసెంబ్లీ ఎన్నికల నుంచీ అదే తీరు...

ఇండియా కూటమిలో సీపీఎం కీలక పాత్ర పోషిస్తోంది. అయినా కాంగ్రెస్ పార్టీ తమను లెక్క చేయట్లేదన్న భావన ఆ పార్టీలో ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ సీపీఎంకు చివరి వరకూ ఊరించి చెయ్యిచ్చిందన్న విమర్శలు ఉన్నాయి. ఐదు సీట్లు అడిగితే రెండు ఇస్తామని చెప్పి చివరకు ఒక సీటుకు పరిమితం చేయడంతో అప్పుడు సీపీఎం పూర్తిగా ఒంటరి పోరుకే సిద్ధమైంది. 19 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టింది. బీజేపీకి వ్యతిరేకంగా కొన్ని స్థానాల్లో బీఆర్‌ఎస్‌కు, ఇంకొన్ని స్థానాల్లో కాంగ్రెస్‌కు మద్దతిచ్చింది. సీపీఎంతో ఉపయోగం లేదన్న భావనలో కాంగ్రెస్ ఉందన్న వాదన వామపక్ష వర్గాల్లో నెలకొంది. మరోవైపు సీపీఐ మాత్రం అసెంబ్లీ ఎన్నికల్లో ఒక సీటులో పోటీ చేసి కొత్తగూడెం నుంచి గెలుపొందింది. ఇప్పుడు ఆ పార్టీ అన్ని స్థానాల్లోనూ కాంగ్రెస్‌కు మద్దతిస్తోంది. ఈ నేపథ్యంలో తమ పార్టీ కనీస ఓట్లు సాధించాలన్న భావనలో సీపీఎం ఉంది. జాతీయ పార్టీ హోదాను కాపాడుకోవాలంటే ఓట్ల వాటా ఉండాలి కాబట్టి పోటీ చేస్తోందన్న చర్చ కూడా జరుగుతోంది.

ఇంటర్‌సిటీల మధ్య వందే మెట్రోలు!

జూలై నాటికి ప్రారంభించేందుకు రైల్వే శాఖ ప్రణాళికలు

హైదరాబాద్ నుంచి 250 కి.మీ. పరిధిలోని పట్టణాలకు రాకపోకలు

సికింద్రాబాద్-గుంటూరు, సిర్పూర్ కాగజ్‌నగర్ వంటి రూట్లపై సర్వే

సాక్షి, హైదరాబాద్: వందే భారత్ రైళ్ల తరహాలో వందే మెట్రో రైళ్లను పట్టాలెక్కించేందుకు రైల్వే శాఖ ప్రణాళికలను సిద్ధం చేసింది. జూలై నాటికి ఈ రైళ్లను ప్రారంభించేలా కార్యాచరణ చేపట్టింది. ఇవి ఇంటర్ సిటీ రైళ్లుగా పరుగులు తీయనున్నాయి. గంటకు గరిష్ఠంగా 130 కి.మీ. వేగంతో పరుగులు తీసే సామర్థ్యంగల ఈ రైళ్ల కోసం దక్షిణమధ్య రైల్వే పరిధిలో రూట్లను ఎంపిక చేయాలని రైల్వే బోర్డు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో హైదరాబాద్ నుంచి 250 కి.మీ. పరిధిలో ఉన్న నగరాలు, పట్టణాలకు ఈ రైళ్లను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు కార్యాచరణ చేపట్టారు. ఇందుకనుగుణంగా వివిధ మార్గాల్లో ప్రస్తుతం రాకపోకలు సాగిస్తున్న రైళ్లు, ప్రయాణికుల రద్దీ, డిమాండ్ తదితర అంశాలపై అధ్యయనం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా 124 ప్రధాన నగరాలకు 250 కి.మీ. దూరంలో ఉండే పట్టణాలు, శాటిలైట్ టౌన్‌లకు వందే మెట్రోలను ప్రవేశపెట్టనున్నారని.. అందులో భాగంగానే హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాల మధ్య ఈ రైళ్లను నడిపేందుకు అధ్యయనం చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు చెప్పారు.



రిజర్వేషన్లు ఉండవు...

ఈ రైళ్లన్నీ సాధారణ రైళ్ల తరహాలోనే సేవలు అందిస్తాయి. దీంతో ప్రయాణికులు అప్పటికప్పుడు టికెట్‌లు కొనుక్కొని బయలుదేరొచ్చు. కూర్చొని ప్రయాణం చేసేందుకు వీలుగా సీట్లు ఉంటాయి. అయితే ప్రస్తుతం ఉన్న రైళ్ల కంటే వీటిలో కొద్దిగా టికెట్ ధరలు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. తక్కువ సమయంలో గమ్యస్థానాలకు చేరుకోవాలనుకొనే వారికి ఈ రైళ్లలో ప్రయాణం లాభదాయకం. వివిధ మార్గాల్లో నడిచే ఇంటర్ సిటీ రైళ్ల స్థానంలోనే వందే మెట్రోలు రానున్నాయి. అయితే ప్రస్తుతం సికింద్రాబాద్–విజయవాడ మధ్య నడుస్తున్న ఇంటర్‌సిటీ ట్రైన్ యథాతథంగా సేవలను కొనసాగించనుంది.

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఈ మార్గాల్లోనే!

హైదరాబాద్ నుంచి నల్లగొండ మీదుగా గుంటూరు, సికింద్రాబాద్ నుంచి పెద్దపల్లి మీదుగా కరీంనగర్, సికింద్రాబాద్-కర్నూలు, కాచిగూడ-కర్నూలు, సికింద్రాబాద్-నాందేడ్, సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్, సికింద్రాబాద్ నుంచి వికారాబాద్ మీదుగా రాయచూర్ తదితర ప్రాంతాలకు ఈ రైళ్లను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. మొదట ప్రయాణికుల రద్దీ అత్యధికంగా ఉన్న సికింద్రాబాద్–గుంటూరు, సికింద్రాబాద్–విజయవాడ వంటి రూట్‌లలో వందే మెట్రోలను ప్రవేశపెట్టొచ్చు. అనంతరం దశలవారీగా ఇతర మార్గాలకు విస్తరించే అవకాశం ఉంది.

ముఖ్యమైన స్టేషన్లలోనే హాల్టింగ్..

వందే మెట్రో రైళ్లు ప్రస్తుతం హైదరాబాద్‌లో నడుస్తున్న మెట్రో రైళ్ల తరహాలోనే ఉంటాయి. మొదట 12 కోచ్‌లతో ప్రారంభించి డిమాండ్‌కు అనుగుణంగా ఆ తరువాత 16 కోచ్‌ల వరకు పెంచనున్నారు. మెట్రో రైళ్ల తరహాలోనే పూర్తిగా ఏసీ సదుపాయం, ఆటోమేటిక్‌గా తలుపులు తెరుచుకొని మూసుకొనే ఏర్పాటు ఉంటుంది. ప్రారంభ స్టేషన్ నుంచి గమ్యస్థానం వరకు ముఖ్యమైన స్టేషన్లలోనే ఈ రైళ్లకు హాల్టింగ్ సదుపాయం ఉండనుంది. ప్రస్తుతం పుష్‌పుల్ రైళ్లకు ఉన్నట్లుగానే ముందు, వెనుక రెండు ఇంజన్లు ఉంటాయి. దీంతో ఈ రైళ్లను ప్రత్యేకంగా పిట్ లైన్లకు తరలించాల్సిన అవసరంలేదు. తక్కువ సమయంలోనే తిరుగు ప్రయాణ సేవలను అందించే అవకాశం ఉంటుంది.

క్లుప్తంగా...

కుల వివక్షతోనే ఆర్థిక అసమానతలు

భూదాన్‌పోచంపల్లి: కులవివక్షతోనే సమాజంలో ఆర్థిక అసమానతలు కొనసాగుతున్నాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేశ్, బహుజన ప్రజాశక్తి రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి సాయిబాలాజీ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం బహుజన ప్రజాశక్తి ఆధ్వర్యంలో మహనీయుల జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జనాభాలో అత్యధిక శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలుండగా రాజ్యాధికారం మాత్రం అగ్రవర్ణాలు చెలాయిస్తున్నారని ఆరోపించారు.

జూనియర్ అడ్వొకేట్లకు రూ.5 వేల స్టైపెండ్

- హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ డిమాండ్



మాట్లాడుతున్న శాంతిభూషణ్‌రావు. చిత్రంలో రవీందర్‌రెడ్డి, దీప్తి, సంజీవ్‌రెడ్డి, నవీన్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ న్యాయవాదులకు రూ.5 వేల స్టైపెండ్ ఇవ్వాలని హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ (హెచ్‌సీఏఏ) అధ్యక్షుడు ఎ.రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రూ.10 లక్షల బీమా కూడా కల్పించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని కోర్టుల బార్ అసోసియేషన్ల సమావేశం ఆదివారం హెచ్‌సీఏఏ ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా పలు డిమాండ్లను వారు ప్రభుత్వానికి నివేదించారు. పదేళ్లకు పైగా ప్రాక్టీస్ ఉన్న న్యాయవాదులకు ఇళ్లు, నేషనల్ లా స్కూళ్లలో స్థానికులకు రిజర్వేషన్లు.. తదితర డిమాండ్లపై ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించారు. సమావేశంలో హెచ్‌సీఏఏ ఉపాధ్యక్షురాలు దీప్తి, కార్యదర్శులు శాంతిభూషణ్‌రావు, సంజీవ్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో డిగ్రీ, పీజీ కోర్సులు

- ఆఫర్‌చేస్తున్న హెచ్‌బీఎస్

సాక్షి, హైదరాబాద్: బిజినెస్ అండ్ మేనేజ్‌మెంట్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో వివిధ డిగ్రీ, పీజీ కోర్సులను విద్యార్థులకు అందజేస్తున్నట్లు హిందూస్థాన్ బిజినెస్ స్కూల్ (హెచ్‌బీఎస్) పేర్కొంది. ఏఐసీటీఈ, బెంగళూరు నార్త్ యూనివర్సిటీ అనుబంధ గుర్తింపుతో తమ విద్యాసంస్థలో బీబీఏ ఏవియేషన్, బీఎస్సీ ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్, బీకాం, బీసీఏ, ఎంబీఏ కోర్సులను అందజేస్తున్నట్లు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. అదేవిధంగా ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థ భాగస్వామ్యంతో హిందూస్థాన్ ఏవియేషన్ అకాడమీ ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్ కోర్సులనుకూడా అందిస్తున్నట్లు తెలిపింది. పాలిటెక్నిక్ కోర్సును కూడా అందజేస్తున్నట్లు హెచ్‌బీఎస్ తెలిపింది.

నేతన్నలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- ఎమ్మెల్సీ ఎల్.రమణ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం నేతన్నలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ ఎల్.రమణ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మళ్లీ నేత కార్మికుల ఆత్మహత్యలు ప్రారంభమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేతన్నల ఆత్మహత్యలు కాంగ్రెస్ ప్రభుత్వ హత్యలుగా అభివర్ణించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోవడానికి రేవంత్ రెడ్డి సర్కారే కారణమని ఆరోపించారు. కొందరు నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నాక కాంగ్రెస్ నేతలు దీపాదాస్ మున్షీ, పొన్నం ప్రభాకర్ బాధిత కుటుంబాల పరామర్శలకు వెళ్లారని, ఇది హత్య చేసిన వాళ్లే సంతాప సభకు వెళ్లినట్లు ఉందని అన్నారు.

బీజేపీ రిజర్వేషన్లు రద్దు చేస్తుందని ఎలా అంటావ్..

దమ్ముంటే దీనిపై నాతో చర్చకు రా.. సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సవాల్



సాక్షి, హైదరాబాద్: కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తుందని ఏ ప్రాతిపదికన చెబుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డిని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి నిలదీశారు. దమ్ముంటే దీనిపై తనతో చర్చకు రావాలని సవాల్ చేశారు. తెలంగాణలో అమలవుతున్న బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల రిజర్వేషన్లపైనా చర్చకు సిద్ధమన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయలేక, ఏం చెప్పి ఓట్లు అడగాలో తెలియక.. రేవంత్ అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అబద్ధాలే కాంగ్రెస్ గ్యారంటీగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని కిషన్‌రెడ్డి విమర్శించారు. రేవంత్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని, లేకుంటే లెంపలేసుకుని గద్దె దిగిపోవాలని వ్యాఖ్యానించారు. ఒట్లు, ప్రమాణాలు, సవాళ్లు, ప్రతి సవాళ్లతో ప్రజలకు న్యాయం జరగదని స్పష్టం చేశారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అమలు చేయలేని హామీలు ఇచ్చి, బీసీ రిజర్వేషన్ల పేరుతో సామాజిక ఉద్రిక్తతలను రెచ్చగొడుతోంది. రాష్ట్రంలో ఒకటి రెండు లోక్‌సభ సీట్లకే కాంగ్రెస్ పరిమితం కాబోతుండటాన్ని తట్టుకోలేక బీజేపీపై విష ప్రచారానికి దిగింది. రిజర్వేషన్ల రద్దుపై కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం ఈ దశాబ్దపు పెద్ద అబద్ధం. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీజేపీ–బీఆర్‌ఎస్ ఒకటేనంటూ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి దుష్ప్రచారం చేశారు. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజల ఆదరణ కొరవడటంతో కొత్త నాటకానికి తెరలేపింది. అబద్ధపు పునాదులపై ఎదిగిన కాంగ్రెస్ పార్టీ బీజేపీపై గోబెల్స్ ప్రచారాన్ని మొదలుపెట్టింది. బీసీ రిజర్వేషన్లు తగ్గించి, మతపరమైన రిజర్వేషన్లను అమలు చేస్తూ బీసీలకు విద్య, ఉద్యోగ రాజకీయ రంగాల్లో గండి కొట్టినది కాంగ్రెస్ పార్టీయే. అలాంటి కాంగ్రెస్‌కు రిజర్వేషన్‌లపై బీజేపీని విమర్శించే నైతిక హక్కు లేదు.

అమిత్ షా ప్రసంగాన్ని మార్ఫింగ్ చేశారు

ఇటీవల కేంద్ర హోం మంత్రి అమిత్ షా సిద్దిపేట సభలో చేసిన ప్రసంగాన్ని మార్ఫింగ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు రద్దు చేస్తామని ఆయన చెప్పినట్టుగా కాంగ్రెస్ 'ఎక్స్'లో పోస్ట్ చేసిందంటే.. ఆ పార్టీ దిగజారుడుతనడానికి పరాకాష్ఠ. బీజేపీ స్థైర్యాన్ని దెబ్బతీసి, సామాజిక ఉద్రిక్తతలను రెచ్చగొటే ప్రయత్నం. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీపై పోలీసు కేసు పెట్టాం. ఈసీకి ఫిర్యాదు చేశాం.

కాంగ్రెస్ కుట్రలను ప్రజలు గుర్తించారు

ప్రధాని మోదీని విమర్శించేందుకు ఎలాంటి అంశాలు దొరకక కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోంది. కాంగ్రెస్ నాటకాలను ప్రజల ముందు పెడుతున్నాం. ప్రజలు కూడా కాంగ్రెస్ కుట్రలు, కుతంత్రాలను గుర్తించారు. ఎన్నికల సందర్భంగా ఎక్కడికి వెళ్లినా కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో సానుకూలత కనిపించడం లేదు. భారత్ జోడో అంటూ రాహుల్ గాంధీ యాత్ర చేస్తే.. కాంగ్రెస్ చోడో అంటూ నాయకులు ఆ పార్టీని వీడుతున్నారు.

బీసీలకు న్యాయం బీజేపీతోనే..

దేశంలో అత్యున్నత పదవుల నుంచి రాజకీయ రంగం దాకా బీసీలకు న్యాయం చేసింది బీజేపీ మాత్రమే. తొలిసారి బీసీ వర్గానికి చెందిన వ్యక్తిని ప్రధానిని చేసిన ఘనత బీజేపీదే. స్వాతంత్య్రం అనంతరం తొలిసారిగా కేంద్ర కేబినెట్‌లో ఏకంగా 27 మంది బీసీలు, 12 మంది దళితులు, 8 మంది ఎస్టీలకు అవకాశం ఇచ్చిన ఘనత బీజేపీదే. మోదీ మూడోసారి ప్రధాని కాబోతున్నారని తట్టుకోలేక కాంగ్రెస్ నిరాశ నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతోంది. ప్రస్తుతం తెలంగాణలో బీసీలకు అన్యాయం జరుగుతోంది. రిజర్వేషన్ల విషయంలో వారికి న్యాయం చేయడం బీజేపీతోనే సాధ్యం..''అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

శభాష్.. సాయిచరణ్

సాహస బాలుడిని అభినందించిన సీఎం రేవంత్‌రెడ్డి



సాయి చరణ్‌ను అభినందిస్తున్న సీఎం, చిత్రంలో కుటుంబ సభ్యులు

షాద్‌నగర్: ఆరుగురు కార్మికుల ప్రాణాలను కాపాడిన సాహస బాలుడిని సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ఈనెల 26న రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం నందిగామ మండల కేంద్రంలో ఉన్న అలెన్ హోమియో, హెర్బల్ ఫార్మాస్యూటికల్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాద సమయంలో పరిశ్రమ ఆవరణలో చిక్కుకున్న ఆరుగురు కార్మికులను నందిగామకు చెందిన రేణుక, వెంకటేశ్ దంపతుల కుమారుడు పదిహేనేళ్ల సాయిచరణ్ చెట్టుపై నుంచి పరిశ్రమలోకి దిగి తాడు సాయంతో రక్షించాడు. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో బాలుడు సాయిచరణ్‌కు తల్లిదండ్రుల సమక్షంలో శాలువా కప్పి సన్మానించారు. ధైర్యసాహసాలు ప్రదర్శించిన బాలుడిని అభినందించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నందిగామ ఎంపీటీసీ కొమ్ము కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అసమానతలు తొలగేదాకా రిజర్వేషన్లు

- ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ డాక్టర్ మోహన్ భాగవత్ స్పష్టీకరణ
- రిజర్వేషన్లకు తాము తొలి నుంచీ అనుకూలంగా ఉన్నట్లు వెల్లడి
- చినజీయర్ స్వామితో కలిసి విద్యాభారతి విజ్ఞాన కేంద్ర పాఠశాల ప్రారంభం



మాట్లాడుతున్న మోహన్ భాగవత్

బడంగ్‌పేట్: సమాజంలో అసమానతలు ఉన్నంతకాలం రిజర్వేషన్లు యథావిధిగా ఉంటాయని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ డాక్టర్ మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. మొదటి నుంచీ రిజర్వేషన్లకు సంఘ్ అనుకూలంగా ఉందని వెల్లడించారు. తమ సంస్థ రిజర్వేషన్లకు వ్యతిరేకమంటూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందని... అందులో ఏమాత్రం వాస్తవం లేదని ప్రకటించారు. తాను ఓ సమావేశంలో ఆ వ్యాఖ్యలు చేసినట్లు వీడియోను ప్రచారం చేస్తున్నారని.. కానీ అసలు అలాంటి సమావేశం ఏదీ జరగలేదని వివరించారు. ప్రస్తుతమున్న సాంకేతికత, కృత్రిమ మేథ (ఏఐ) ద్వారా జరగని దాన్ని కూడా జరిగినట్లు చూపించడం సాధమవుతోందని వ్యాఖ్యానించారు. రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో ఏర్పాటు చేసిన విద్యాభారతి విజ్ఞాన కేంద్ర పాఠశాల (సరస్వతి విద్యాపీఠం అనుబంధ సంస్థ)ను ఆదివారం ఆయన చినజీయర్ స్వామితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మోహన్ భాగవత్ మాట్లాడారు. ప్రపంచాన్ని తెలుసుకొనే మార్గంగా విద్యను ఆయన అభివర్ణించారు. 1952లో సరస్వతీ శిశుమందిర్ చిన్న గదిలో ప్రారంభమైందని.. నేడు దేశవ్యాప్తంగా వేలాది పాఠశాలలు నడుస్తున్నాయని చెప్పారు. దేశభక్తి విలువలతో కూడిన విద్యకు తాము పెద్దపీట వేస్తున్నామన్నారు. మనమంతా రాముడి బాటలో నడవాలన్నారు. సోషల్ మీడియాను మంచి కోసం ఉపయోగించాలని సూచించారు. స్వయం సేవక్‌లు చివరి శ్వాస దాకా సమాజం కోసం పనిచేస్తారని మోహన్ భాగవత్ తెలిపారు.

మోదీ కృషి అభినందనీయం: చినజీయర్

దేశం సమస్యల్లో ఉన్నప్పుడు ప్రధాని మోదీ దిశానిర్దేశం చేశారని చినజియర్ స్వామి కొనియాడారు. భారత్‌ను విశ్వగురువుగా మార్చేందుకు ఆయన ఎనలేని కృషి చేస్తున్నారని ప్రశంసించారు. తాను రాజకీయ నాయకుడిని కాదని.. కేవలం భారతీయుడిగా తన వాదన వినిపిస్తున్నానని చెప్పారు. విద్య అనేది పొట్టకూటి కోసం కాదని.. సక్రమమైన పౌరులుగా తయారయ్యేందుకేనని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ్ అఖిల భారతీయ ప్రచార ప్రముఖ్ సునీల్ అంబేకర్, క్షేత్ర ప్రచారక్ సుధీర్, సహ ప్రచారక్ భరత్, ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్, విద్యాభారతి క్షేత్ర అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, రమేష్‌గుప్తా, విష్ణువర్ధన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లపై ప్రధాని ప్రకటన చేయాలి

- రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య డిమాండ్



కాచిగూడ (హైదరాబాద్): ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై స్పష్టమైన ప్రకటన చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కాచిగూడలో ఆదివారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన 13 బీసీ సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని మార్చి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందంటూ.. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నిత్యం ఆరోపణలు చేస్తున్న దృష్ట్యా బీజేపీ తన వైఖరిని స్పష్టం చేయాలన్నారు. కేంద్రంలో బీజేపీ పదేళ్లుగా అధికారంలో ఉన్నా బీసీల సంక్షేమానికి ఒక పథకం కూడా ప్రారంభించలేదని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ సీపీ అధినేత, సీఎం జగన్‌మోహన్ రెడ్డి బీసీలకు ప్రభుత్వంలో, పార్టీలో న్యాయం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని ఆయన పేర్కొన్నారు. జగన్‌మోహన్ రెడ్డిని చూసి బీజేపీ అగ్రనేతలు నేర్చుకోవాలని కృష్ణయ్య హితవు పలికారు.

హిమాలయాలను అధిరోహించిన ఓయూ విద్యార్థి సిద్ధార్థ్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని సైఫాబాద్ పీజీ కాలేజీ బీఎస్సీ విద్యార్థి డొంగ్రి సిద్ధార్థ్ హిమాలయ పర్వతాలను అధిరోహించి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అరుణాచల్‌ప్రదేశ్ నుంచి హిమాలయాల్లోని దిరంగ్ ప్రాంతంలోని 16,460 ఫీట్ల ఎత్తులో ఉన్న గోరిచన్ పర్వతాలను సిద్ధార్థ్ అధిరోహించి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ మేరకు ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్.పల్లాటి నరేశ్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ శరత్ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. హిమాలయ పర్వతాలను అధిరోహించేందుకు నాగపూర్, షిల్లాంగ్, ఆంధ్రప్రదేశ్ ఎన్‌సీసీ విద్యార్థులు, తెలంగాణ నుంచి ఓయూ విద్యార్థి సిద్ధార్థ్ ఎంపికయ్యారు. ఎంపికైన నలుగురు విద్యార్థుల్లో పర్వతాలపై తొలిసారిగా సిద్ధార్థ్ జాతీయజెండాను ఎగురవేశారు. గత నెల 31న రాష్ట్రం నుంచి బయల్దేరిన సిద్ధార్థ్ అరుణచల్ ప్రదేశ్‌లోని నిమస్‌లో 5 రోజుల శిక్షణ పొందారు.

ఏపీలో తెలంగాణ ఆర్టీసీ బస్సు దగ్ధం

షార్ట్ సర్క్యూట్ కారణంగా బస్సులో మంటలు

ప్రయాణికులు సురక్షితం



దగ్ధమైన బస్సు

ఒంగోలు సబర్బన్: షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆర్టీసీ బస్సు దగ్ధమైన ఘటన టంగుటూరులోని ఐటీసీ వద్ద ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో చోటుచేసుకుంది. ప్రయాణికులిచ్చిన సమాచారం మేరకు.. ఆదివారం తెలంగాణకు చెందిన కోదాడ డిపో బస్సు తిరుపతి నుంచి హైదరాబాద్‌కు 23మంది ప్రయాణికులతో బయలుదేరింది. సరిగా ఐటీసీ దగ్గరకు రాగానే బస్సులో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. గమనించిన బస్సు డ్రైవర్ వెంటనే బస్సును నిలిపి ప్రయాణికులను అప్రమత్తం చేసి కిందకు దించేశారు. వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. రెండు ఫైరింజన్లు ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చాయి. ఎవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

జబ్బులు నయం చేస్తామని తప్పుడు ప్రకటనలు

- డీసీఏ స్పెషల్ డ్రైవ్‌లో వెల్లడి..
- పలు చోట్ల నకిలీ మందుల స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: దీర్ఘకాలిక జబ్బుల నుంచి జ్వరం వరకు పలు రకాల జబ్బులను ఆయుర్వేద మందులతో నయం చేస్తామంటూ తప్పుడు ప్రకటనలు ఇస్తున్న పలువురు నిర్వాహకులను గుర్తించినట్లు డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల శనివారం ఏక కాలంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు ఆయన ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఖమ్మంలో ట్యూమర్స్, బాచుపల్లిలో పక్షవాతం, ట్యూమర్లు నయం చేసేందుకు ఆయుర్వేద మందులు ఉన్నాయని ప్రకటనలిచ్చి ఔషధాలు విక్రయిస్తున్నారని ఆయన తెలిపారు. అదేవిధంగా మెదక్, తూప్రాన్‌లో కిడ్నీలో రాళ్లు తొలగిస్తామని, సికింద్రాబాద్, నిజామాబాద్‌ల్లో జ్వరం తగ్గించేందుకు ఆయుర్వేద మందులు ఇస్తామంటూ ప్రకటనలిచ్చి మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. వీరిపై డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్(అబ్జక్షనబుల్ అడ్వైర్టైజ్‌మెంట్స్) యాక్ట్, 1954 కింద కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ చట్టం కింద నమోదైన కేసులలో నిందితులకు ఆరు నెలల జైలుశిక్ష, జరిమానా తప్పదని హెచ్చరించారు.

అనుమతులు లేకుండా క్లినిక్‌ల నిర్వహణ

మేడ్చల్ మండలం ఎల్లమ్మపేట్ గ్రామంలో ఎం.ఆనందదాసు, వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్‌లో వి.విజయ్‌కుమార్, షాబాద్ మండలం నందర్‌ఖాన్‌పేట గ్రామంలో సభావత్ భాస్కర్‌లు అనుమతులు లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. వీరి వద్ద నుంచి రూ.71,300 విలువైన పలు రకాల మందులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

నిప్పులు కక్కుతున్న సూరీడు

- రాష్ట్రమంతటా అత్యధిక స్థాయిలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు
- మరో రెండ్రోజులు పలు ప్రాంతాల్లో వడగాడ్పుల హెచ్చరికలు

సాక్షి, హైదరాబాద్: సూర్యుడు నిప్పులు కక్కుతున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతలు తీవ్ర స్థాయిలో నమోదవుతున్నాయి. ఆదివారం రాష్ట్రంలో చాలాచోట్ల సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో కనిష్ట ఉష్ణోగ్రతలు సైతం ఎక్కువగానే నమోదవుతున్నాయి. ఆదివారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. భద్రాచలంలో గరిష్ఠంగా 43.8 డిగ్రీల సెల్సియస్, మెదక్‌లో 24.5 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. శనివారం రాష్ట్రవ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతలు 41.5 డిగ్రీల సెల్సియస్‌కు మించి నమోదయ్యాయి. ఖమ్మంలో సాధారణం కంటే 4.6 డిగ్రీల సెల్సియస్, భద్రాచలంలో 3.7 డిగ్రీల సెల్సియస్ అధికంగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కాగా, మిగతా ప్రాంతాల్లో 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ వరకు అధికంగా నమోదయ్యాయి. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య ప్రజలు బయటకు రాకపోవడమే మంచిదని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ సూచనలు జారీ చేసింది. రాష్ట్రంలో రానున్న రెండురోజులు పలుచోట్ల వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట్‌లకు ఈనెల 29 నుంచి మే 1వ తేదీ వరకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. ఆయా జిల్లాల్లోని పలుప్రాంతాల్లో వడగాల్పులు తీవ్రస్థాయిలో ఉంటాయని అధికారులు హెచ్చరిస్తున్నారు.

ప్రణాళికా శాఖ ప్రకారం 45 డిగ్రీలపైనే..

ప్రణాళికా శాఖ గణాంకాల ప్రకారం రాష్ట్రంలోని చాలాచోట్ల ఉష్ణోగ్రతలు అత్యధికంగానే నమోదయ్యాయి. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లిలో 45.4, ములుగు జిల్లా మంగపేటలో 45.3, భద్రాద్రి కొత్తగుడెం జిల్లా అశ్వాపురంలో 45.2 డిగ్రీల సెల్సియస్ చొప్పున గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

ఆదివారం ప్రధాన కేంద్రాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
భద్రాచలం	43.8	29.0
నిజామాబాద్	43.4	30.4
ఖమ్మం	43.4	27.0
విజయవాడ	43.0	28.0
మహబూబ్‌నగర్	42.5	29.5
రామగుండం	42.5	28.0
నల్లగొండ	42.5	25.0
మెదక్	42.4	24.5
హైదరాబాద్	41.8	28.7
హనుమకొండ	41.5	26.0
ఆదిలాబాద్	41.3	26.7
విశాఖపట్నం	38.2	28.0



యుద్ధాలు పెద్దలవి; యుద్ధ మరణాలు పేదలవి.
– జీన్ పాల్ సార్త్రే

సాక్షి
సోమవారం, 29 ఏప్రిల్ 2024

పేరులో అభిమానముంది!

జపనీస్ భాషలో 'కా' అంటే మంచి, సాధ్యం అని అర్థాలున్నాయట. 'ఫుకా' అంటే చెడు, అనంగీకారం అని అర్థమట. 'కాఫుకా' అని వాటిని జోడించినప్పుడు, మంచి చెడుల వ్యతిరేకతను కలుపుకొని, ఒక కొత్త సందిగ్ధమైన అర్థాన్ని ఇవ్వడం ఆ పదాన్ని మరింత ఆకర్షణీయం చేస్తోంది. అయితే, 'కాఫ్కా ఆన్ ద షోర్' అని తన నవలకు పేరు పెట్టడానికి హరూకీ మురకామీకి ఉన్న ముఖ్య కారణం, ఈ అసందిగ్ధత కన్నా కూడా ఫ్రాంజ్ కాఫ్కా మీద ఉన్న అభిమానమే. కాఫ్కాను జపనీస్ భాషలో కాఫుకా అని రాస్తారు. ఈ నవల్లో ప్రధాన పాత్ర అయిన పదిహేనేళ్ల బాలుడు కాఫ్కా తమూరా తనకున్న శాపం నుంచి తప్పించుకోవడానికి ఇల్లు వదిలి పారిపోతాడు. కాఫ్కా సుప్రసిద్ధ కథ 'మెటమార్ఫసిస్' స్ఫూర్తితో, అందులో ఉన్నట్టుండి తెల్లారి నిద్ర లేచేసరికల్లా ఒక పెద్ద పురుగుగా మారిపోయే గ్రెగర్ జామ్జా స్ఫురించేలా 'సాంసా ఇన్ లవ్' అనే కథను కూడా రాశారు మురకామీ.

అమెరికాలో పుట్టిన స్విట్జర్లాండ్ జర్నలిస్ట్ దీనా లీ కూంగ్ తను రాస్తున్న నవల్లో ఒక వివేకవంతుడైన వృద్ధుడి పాత్రకు ఏకంగా వాల్టేర్‌నే భూమ్మీదికి దింపారు. 'నువ్వు చెప్పేదానితో నేను అంగీకరించలేకపోవచ్చు, కానీ నువ్వు చెప్పే హక్కు కోసం నా చివరిదాకా పోరాడుతాను' అన్న ఫ్రెంచ్ తత్వవేత్తగా వాల్టేర్ సుప్రసిద్ధులు. పిల్లాడి ఉబ్బసం సమస్య, భర్త దూరంగా ఉండటం, గ్రామంలోని సమస్యలు– ఇవన్నీ తీర్చడానికి పద్దెనిమిదో శతాబ్దపు గొప్ప మెదళ్లలో ఒకటైన వాల్టేర్ ఉన్నట్టుండి కిటికీలోంచి ఊడిపడితే? జీవితాన్ని సంపూర్ణంగా జీవించడం ఎలాగో సరళంగా చెప్పిపోతే? అదే దీనా రాసిన 'ఎ విజిట్ ఫ్రమ్ వాల్టేర్' నవల అవుతుంది.

రచయితలు తమ అభిమానాన్ని రకరకాలుగా చాటుకుంటారు. ఏకంగా తమకు నచ్చిన రచయితలను టైటిల్‌లోకే తెచ్చేయడం అనేది ఆ అభిమానంలో ఇంకో లెవెల్; గరిష్ఠ స్థాయి. రచయితలు లేదా వారి రచనలు లేదా వారిని స్ఫురించేలా చేసే ఏదో ఒకటి శీర్షికగా మారడం అనేది అనేక విధాలుగా ఉపయోగపడుతుంది. ఒకటి, ఇందాక చెప్పుకొన్నదే; దాచుకోలేని అభిమాన ప్రదర్శన. రెండోది, సాహిత్య లోకంలో దీని ద్వారా కొత్త అటెన్షన్ దొరుకుతుంది. మూడో కారణం, దీనికిదే ఒక సంకేతం అవుతుంది. తద్వారా వెల్లడించాల్సిన విషయం ఇట్టే పాఠకులకు వెళ్లిపోతుంది. ఉదాహరణకు నాజీల మారణహోమంలో తనవారిని కోల్పోయిన వెతుకులాటను ప్రతిబింబిస్తూ రాసిన పుస్తకానికి అమెరికా కాలమిస్ట్ డేనియల్ మెండెల్‌సన్ 'ద లాస్ట్: ఎ సెర్చ్ ఫర్ సిక్స్ ఆఫ్ సిక్స్ మిలియన్' అని పేరు పెట్టారు. దీనికి స్ఫూర్తి, గతించిన కాలాన్ని వెతుక్కుంటూ ఫ్రెంచ్ రచయిత మార్సెల్ ప్రూస్ట్ రాసిన ఆత్మకథాత్మక క్లాసిక్ నవల 'ఇన్ సర్చ్ ఆఫ్ లాస్ట్ టైమ్'. ఈ నామకరణాన్ని ఒక రాజకీయ ప్రకటనగానూ వాడుకున్న రచయితలు ఉన్నారు. సామాజికంగా అనంగీకార లైంగికతను ఎక్స్‌ప్లోర్ చేస్తూ రష్యన్–అమెరికన్ రచయిత వ్లదీమీర్ నబకోవ్ రాసిన 'లోలిటా' ఒక పెనుసంచలనం. అయితే, ఇరాన్‌లో స్త్రీల లైంగికత మీద ఉన్న అణచివేతకు నిరసనగా తన జ్ఞాపకాల పుస్తకానికి ప్రొఫెసర్ అజర్ నఫీసీ పెట్టిన పేరు 'రీడింగ్ లోలిటా ఇన్ తెహ్రాన్'. అలాగే, వివాహ బంధంలోని సంక్లిష్టతను చాటడానికి ఏకంగా రచయిత్రి వర్జీనియా వూల్ఫ్‌నే ఒక ప్రతీకగా చేసుకున్నారు అమెరికన్ నాటక రచయిత ఎడ్వర్డ్ అల్బీ. 'హూ ఈజ్ అఫ్రయిడ్ ఆఫ్ వర్జీనియా వూల్ఫ్?' పేరుతో అల్బీ రాసిన మూడంకాల నాటకం, అటుపై సినిమాగానూ వచ్చి ఎలిజబెత్ టేలర్, రిచర్డ్ బర్టన్ అనితరసాధ్యమైన నటులని చాటింది.

రచయితలు హీరోలను సృష్టిస్తారు. ఆ కల్పిత హీరోల వల్ల సమాజంలో నిజమైన హీరోలు ఆవిర్భవిస్తారు. అయితే మైకేల్ పాలిన్ నవల 'హెమింగ్వేస్ చైర్'లో రచయితే హీరోగా కనబడతాడు. 'ఓల్డ్ మాన్ అండ్ ద సీ' రచయితగా సుప్రసిద్ధుడైన హెమింగ్వే అంటే ఈ నవలలోని అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్‌కు వెర్రి అభిమానం. తను చేరాల్సిన హోదాను తన్నుకుపోవడమే కాకుండా, నమ్మకంగా పనిచేస్తున్న వాళ్లను తొలగిస్తూ, ప్రైవేటైజేషన్ చేయడానికి పూనుకుంటాడు కొత్తగా వచ్చిన పోస్ట్‌మాస్టర్. దానికి తలొగ్గడమా, తన హీరో హెమింగ్వేలా ఎదిరించి నిలబడటమా? దీన్నే సరదాగా చెప్పారు ఆంగ్ల నటుడు, కమెడియన్, రచయిత అయిన మైకేల్ పాలిన్. అదే హెమింగ్వేను కాలంలో ప్రయాణం, సమాంతర విశ్వాలను మేళవిస్తూ రాసిన 'ది హెమింగ్వే హోక్స్' నవలలోనూ ప్రతీకగా వాడుకున్నారు సైన్స్ ఫిక్షన్ రచయిత జో హాల్డ్‌మాన్.

ఫ్రెంచ్ సాహిత్య దిగ్గజం గుస్తావ్ ఫ్లాబర్ట్ పేరు మీదుగా ఆంగ్ల రచయిత జూలియన్ బార్నెస్ రాసిన 'ఫ్లాబర్ట్స్ ప్యారట్', మరో ఫ్రెంచ్ మహారచయిత హొనొరే డె బాల్జాక్ పేరుమీద చైనీస్–ఫ్రెంచ్ రచయిత దాయి సిజీ రాసిన 'బాల్జాక్ అండ్ ద లిటిల్ చైనీస్ సీమ్‌స్ట్రెస్', అమెరికా పౌర యుద్ధం నేపథ్యంలో ఇటాలియన్ సాహిత్య శిఖరం డాంటే స్ఫురించేలా మాథ్యూ పెర్ల్ రాసిన 'ద డాంటే క్లబ్' నవల– ఇలాంటివన్నీ ఆయా రచయితలు తమ అభిమాన రచయితలకు రాసుకున్న ఆత్మీయ లేఖలే. అంతెందుకు; గాంధీ, బుద్ధ లాంటి మాటల్ని ఒక ప్రతీకగా వాడుకున్న సృజనాత్మక ప్రక్రియలు మన దగ్గర కూడా లేకపోలేదు. అందుకే ఇదేదో ఇప్పుడు కొత్తగా మొదలైన ట్రెండ్ అనీ కాదు, ఒక భాషకు పరిమితం అనీ కాదు. కాకపోతే ఈ ట్రిబ్యూట్‌గా రాస్తున్న నవలలు కూడా ఒరిజినల్స్ స్థాయిలో ప్రసిద్ధం అవుతుండటమే వాటి గురించి మాట్లాడేట్టు చేస్తోంది!

హింసకు కళాత్మక ప్రతీకారం!

కామెంట్



కరణ్ థాపర్

న్యూయార్క్‌లోని చౌటక్వా ఇన్‌స్టిట్యూషన్‌లో రెండేళ్ల క్రితం ఆగస్టు 12న ఉపన్యాసం ఇచ్చేందుకు సిద్ధమౌతున్న భారత సంతతి రచయిత సల్మాన్ రష్దీ అతి పాశవికంగా పదిహేను కత్తిపోట్లకు గురయ్యారు. చావు తప్పి కన్ను పోగొట్టుకున్న ఆ ప్రాణాపాయం నుండి మెల్లగా కోలుకుంటున్న స్థితిలో ఉన్న రష్దీ... నాటి ఘటనపై తాజాగా 'నైఫ్: మెడిటేషన్స్ ఆఫ్టర్ యాన్ అటెంప్టెడ్ మర్డర్' పుస్తకం రాశారు. భయంకరమైన ఆ దాడి గురించి ఈ పుస్తకంలో సల్మాన్ రష్దీ నేరుగా పాఠకులతో సంభాషించారు. నేటికీ వెంటాడుతున్న తన బాధను, అంతఃసంఘర్షణలను బహిర్గతం చేస్తూ... నెమ్మదిగానే అయినా ఆత్మవిశ్వాసంతో తనెలా కోలుకున్నదీ హృద్యంగా వివరించారు. అదొక గొప్ప మానవీయ పద స్వరీకరణ.


మునుపటి తన కళాఖండాల మాదిరిగా కాకుండా, తన తాజా పుస్తకం 'నైఫ్: మెడిటేషన్స్ ఆఫ్టర్ యాన్ అటెంప్టెడ్ మర్డర్'లో... దాదాపుగా తనను చంపినంత పని చేసిన ఆనాటి భయంకరమైన దాడి గురించి సల్మాన్ రష్దీ నేరుగా పాఠకులతో సంభాషించారు. సన్నిహితంగా, నిజాయితీగా, ఒప్పించే ప్రయత్నంలో విశ్వాసాన్ని చొరగొనే విధంగా, తన అనిశ్చిత స్థితిని పంచుకుంటూ, తన బాధను, అంతఃసంఘర్షణలను బహిర్గతం చేస్తూ, నెమ్మదిగానే అయినా ఆత్మవిశ్వాసంతో నిలకడైన ప్రయాణంగా తనెలా కోలుకున్నదీ చక్కగా వివరించారు. అదొక గొప్ప మానవీయ పద స్వరీకరణ. పూర్తిగా వ్యక్తిగతమైనది. రష్దీ కంటే సల్మాన్‌గానే ఆయన ఎక్కువగా మాట్లాడారని చెప్పొచ్చు.

ఆయన తన పైన జరిగిన దాడి(2022) గురించి రాస్తారని నాకు కచ్చితంగా తెలుసు. అయినా ఒక నవలా రచయిత రాయకుండా ఎలా ఉండగలరు? నాకెప్పుడో తెలుసు అని నేను అనడం ఒక పాఠకుడి అంచనాగా మాత్రమే. దాడి ప్రభావాన్ని తనెలా మానసికంగా తట్టుకుని నిలబడ్డారన్న దానిపై పుస్తకంలో రష్దీ చేసిన విశదీకరణ ఆయన ప్రయత్నబలం ఎంత పటిష్ఠమైనదో చెబుతోంది. ''జరిగిన దానిని అర్థం చేసుకునేందుకు, దానిని అధిగమించేందుకు, నాదిగా అలవాటు చెందేందుకు, ఒక బాధితుడిగా మాత్రమే ఉండటాన్ని నిరాకరించేందుకు నేను ఎంచుకున్న మార్గం ఈ రాయటం అన్నది కావచ్చు. హింసకు నేను చెప్పే సమాధానం కళ '' అంటారు రష్దీ.

ఈ పుస్తకం రష్దీ ప్రతిస్పందన అయితే, పుస్తకపు శీర్షిక రష్దీ ఉద్దేశపూర్వకమైన ఎంపిక. అతి దారుణంగా ఆయనపై కత్తిపోట్ల దాడి జరిగింది. కత్తి అన్నది తుపాకీకి చాలా భిన్నమైనది. ''కత్తిపోటు ఒక విధమైన హత్తుకోలు. మనిషికి దగ్గరగా వచ్చి పొడిచే ఆయుధం. కత్తిపోట్లు అతి సమీప నేరాలు'' అంటారు రష్దీ. అయితే కత్తి ఒక ఉపకరణం కూడా. ఉపయోగించే దాన్ని బట్టి ఆయుధమో, సాధనమో అవుతుంది. ఆ కోణంలో చూస్తే భాష కూడా పదునైన కత్తి వంటిదే.


''భాషే నా కత్తి'' అని చెబుతారాయన. ''నేనొకవేళ అనుకోకుండా ఒక అవాంఛనీయమైన కత్తి పోరాటంలో చిక్కుకున్నట్లయితే, ఎదురుదాడికి నేను తిప్పే కత్తి బహుశా నా భాషే కావచ్చు. నా ప్రపంచాన్ని నేను పునర్నిర్మించుకోటానికి, తిరిగి నా అధీనంలోకి తెచ్చుకోటానికి నేను వాడే పరికరం అదే కావచ్చు'' అంటారు.

దాడి గురించి రష్దీ వర్ణన సూక్ష్మ సునిశితంగా, వెన్నులో వణుకు పుట్టించేలా, ఆ ఘటనను అదే రీతిలో తిరిగి చూపించినట్లుగా ఉంది.



కత్తి దాడిలో కుడికన్నును కోల్పోయిన సల్మాన్ రష్దీ

''నేను ఇప్పటికీ ఆ క్షణాన్ని నెమ్మదిగా కదిలే దృశ్యంలా చూడగలను. అతడు ప్రేక్షకుల నుంచి ఒక్క ఉదుటున దుమికి పరుగున నన్ను సమీపిస్తున్న ప్పుడు నా కళ్లు అతడిని అనుసరించాయి. దూకుడుగా పడుతున్న అతడి ప్రతి అడుగును నేను గమనిస్తున్నాను. చప్పున నేను నా కాళ్లపై లేవటం నాకు తెలుస్తూ ఉండగా అతడి వైపు తిరిగాను. ఆత్మరక్షణగా నా ఎడమ చేతిని పైకి లేపాను. ఆ చేతిపై అతడు తన కత్తిని దిగపొడిచాడు.''



రష్దీ కొత్త పుస్తకం 'నైఫ్'

బాధితుడిలా కాకుండా, జరుగుతున్న దానిని బయటి నుంచి చూస్తున్న వ్యక్తిగా... ''అతడు చాలా పాశవికంగా పోట్లు పొడుస్తున్నాడు. పొడు స్తున్నాడు, కత్తిని నాపై తిప్పుతున్నాడు. కత్తి దానికదే ప్రాణం కలిగి ఉన్నట్లుగా నాపై విరుచుకుపడింది'' అని రష్దీ రాశారు.

రష్దీ స్పృహ కోల్పోయినట్లు లేదు. జరుగుతున్న దాడి ఎలాంటిదో తెలుస్తూనే ఉన్న దిగ్భ్రాంత స్థితిలో ఆయన ఉన్నారు. ''నేలపై పడి ఉన్న నేను నా శరీరం నుంచి కారుతున్న రక్తపు మడుగును చూస్తూ ఉండటం నాకు గుర్తుంది. చాలా రక్తం. అప్పుడు నాకు అనిపించింది: 'నేను చనిపోతున్నాను' అని. కానీ అదేమీ నాకు భయం కలిగించ లేదు. ఊహించనిది జరుగబోతున్నట్లుగానూ లేదు. బహుశా అలా జరిగే అవకాశం ఉంది అనుకున్నాను. జరగవలసిందే జరిగిపోతున్నదనే ఆలోచన.''

ఆ సమయంలో రష్దీ గ్రహించని విషయం ఏంటంటే, బతికి బట్టకట్టాలని ఆయన గట్టిగా నిర్ణయించుకున్నారు. ''నా క్రెడిట్ కార్డులు ఈ జేబులో ఉన్నాయి. ఇంటి తాళాలు మరో జేబులో ఉన్నాయి'' అని, ఆ స్థితితో ఎవరైతే తన పట్ల శ్రద్ధ వహిస్తున్నారో వారితో అస్పష్టంగా చెబుతున్నారు. ''ఇప్పుడు వెనక్కు తిరిగి చూసుకుంటే, నా బొంగురు గొంతు దైనందిన వస్తువుల గురించి పట్టింపుతో ఉందంటే, నేననుకోవటం నా దేహంలోని ఒక భాగం – లోలోపలి పోరాడే భాగం – చనిపోయేందుకు సిద్ధంగా ఏమీ లేదని; ఆ క్రెడిట్ కార్డులు, ఇంటి తాళాలు మళ్లీ ఉపయోగించాలన్న ఉద్దేశంతో ఉందని, 'బతుకు, బతుకు' అని నాతో గుసగుసలాడుతోందని'' అంటారు రష్దీ.

ఆయన శరీరంపై పదిహేను కత్తిపోట్లు పడ్డాయి. మెడ, కుడి కన్ను, ఎడమ చెయ్యి, కాలేయం, పొత్తి కడుపు, నుదురు, చెంపలు, నోరు, ఇంకా... తల నుంచి కింది భాగమంతటా. 'బీబీసీ' ప్రతినిధి ఎలాన్ యెన్టోబ్‌తో మాట్లాడుతూ, మెత్తగా ఉడికించిన గుడ్డును తన పైచెంప మీద ఉంచినట్లుగా తన కుడికన్నుకు అనిపించిందని రష్దీ అన్నారు. ఆ కన్ను పోవటం అనే తీవ్రమైన కలత గురించి పుస్తకంలో ఆయన మనోభావనతో కాక ఉన్నది ఉన్నట్లుగానే మాట్లాడారు. ''ఇప్పుడు కూడా, ఇది రాస్తున్నప్పుడు ఈ నష్టంతో సర్దుకుని పోవడం నా వల్ల కావటం లేదు. అది శారీరకంగా కష్టమైనది. మానసికంగా మరింత కష్టమైనది. ఇది నా జీవితాంతం ఇలాగే ఉండిపోతుందని అంగీకరించడం నిస్పృహను కలిగిస్తోంది'' అని రాశారు రష్దీ.

మెక్రాన్ (ఫ్రాన్స్ అధ్యక్షుడు), బైడెన్ (అమెరికా అధ్యక్షుడు), ఆఖరికి రష్దీ అంటే ఎప్పుడూ ఇష్టపడని బోరిస్ జాన్సన్ (ఆ సమయంలో బ్రిటన్ ప్రధాని) కూడా రష్దీపై దాడి జరగటం పట్ల భయాన్ని, ఆందోళనను వ్యక్తం చేశారు. ''అతని పోరాటం మా పోరాటం'' అని మెక్రాన్ ప్రముఖంగా ప్రకటించారు. కానీ రష్దీ జన్మించిన దేశంలో, తన జన్మభూమి అని రష్దీ చెప్పుకునే దేశంలో మౌనమే అధికారిక ప్రకటన అయింది. ''నను గన్న నా భారతదేశానికి, నాకు లోతైన ప్రేరణ అయిన భారతదేశానికి ఆ రోజున మాటలే దొరకలేదు'' అన్నారు రష్దీ.

ఎంత సిగ్గుచేటు!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఎప్పటికీ శత్రుత్వమేనా?



'శాశ్వత శత్రువులం' అన్న భ్రమలో ఉండి, అంతు లేని హింసకు పాల్పడే బదులుగా, ఇండియాలోని ఆరోగ్య, విద్యా సౌకర్యాల నుంచి చాలామంది పాకిస్తానీలు లబ్ధి పొందవచ్చు. ఘర్షణ అంతమైతే ఇరుదేశాల ప్రజలకూ లాభిస్తుంది. (19 ఏళ్ల పాకిస్తానీ అమ్మాయి ఆయేషాకు చెన్నైలో గుండె మార్పిడి జరిగిన నేపథ్యంలో.)

– హుసేన్ హక్కానీ, పాకిస్తాన్ మాజీ రాయబారి

అనుకున్నంత లేదు!



పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని చాలా స్థానాల్లో తిరిగాను. ఎన్నికల ఫలితాలను అంచనా వేయడం లేదుగానీ ఒక్క విషయం మాత్రం కచ్చితంగా చెప్పొచ్చు. మందిరం 'వేవ్' అయితే లేదు.

– నకుల్ సింగ్ సహానీ, ఫిలింమేకర్

ఒక జాగ్రత్త



మీరు పంపేది జనాలు చదవకూడదని అనుకుంటే, విషయాన్ని ఈ–మెయిల్ బాడీలో రాయడం కాకుండా పీడీఎఫ్‌గా అటాచ్ చేయండి.

– పాల్ గ్రాహమ్, కంప్యూటర్ శాస్త్రవేత్త

కదులుతారా?



ఎన్నికల రోజు గ్రామీణ భారతంలో పండుగ రోజు. ఎన్నికల రోజు నగర భారతంలో సెలవు రోజు.

– రాజేశ్ సహానీ, ఇన్వెస్టర్

ఇక్కడ చెల్లిపోతుందా?



నెస్లే కంపెనీ తన సెరెలాక్‌లో ఇండియాలో చక్కెర కలుపుతోంది, యూరప్‌లో కలపడం లేదు; లేస్ ఇండియాలో పామ్ ఆయిల్ వాడుతోంది, యూఎస్‌లో వాడట్లేదు; కిట్–కాట్ ఇండియాలో 16.2 శాతం పాలు, 4.5 శాతం కోకోవా వాడుతుండగా, ఆస్ట్రేలియాలో 25 శాతం పాలు, 22 శాతం కోకోవా వాడుతోంది. ఏ దేశస్థులదైనా ఆరోగ్యం ఒకటే కదా! విదేశీ కంపెనీలు భారతీయులకు నాసిరకం ఉత్పత్తులు ఇవ్వడం ఆగాలి.

– రేవంత్ హిమత్‌సింగ్‌కా, ఫుడ్ యాక్టివిస్ట్

అర్థమైపోయిందా?



నేను ఏ పార్టీకి ఓటు వేశాననేది చెప్పనేలేదు. 'అభివృద్ధి, స్థిరమైన ప్రభుత్వం, అవినీతిరహిత ప్రభుత్వానికి' వేశానని చెప్పగానే, చాలామంది నన్ను విమర్శిస్తూ కామెంట్లు పెట్టారు. స్థిరమైన ప్రభుత్వం అంటే ఏదో కాంగ్రెస్ మద్దతుదారులకు కూడా తెలుసన్నమాట!

– ఐశ్వర్య ముద్గిల్, వ్యాఖ్యాత

ఒక దేశం – ఒకే పువ్వు

ఎవరో ఒక కొత్త చట్టం తీసుకొచ్చారు
వీచే ముందు గాలులు అనుమతి తీసుకోవాలని
వీచే ముందు గాలులు తమ దిశ, దశ ఏమిటో ఎటో
వివరాలు తెలియజేయాలని ఎవరో కొత్త చట్టం తెచ్చారు
గాలులు ఎంత దూరం పోవాలనుకున్నాయో / అవి ఎంత వేగంగా వీచాలనుకున్నాయో
వివరాలు సమర్పించనిదే అనుమతి దొరకదని
ఎవరో కొత్త చట్టం తెచ్చారు / ఇప్పుడిక్కడ సుడి గాలులకు అనుమతి లేదు
మేం కడుతున్న ఆ పేక మేడల్ని / సంరక్షించాల్సిన బాధ్యత మాపై ఉంది

అందువల్ల ఈ చట్టాలు / సత్వరమే అమల్లోకొస్తున్నాయి!
తమ చుట్టాలకు అనుగుణంగా / ఎవరో ఇక్కడ కొత్త చట్టాలు తెచ్చారు
ఒడ్డును తాకే కెరటాలక్కూడా ఒక హెచ్చరిక!
ఎగిసెగిసి పడటం మళ్లీ తిరిగి వెళ్లడం
బలం పుంజుకుని మళ్లీ నీటి పిడికిళ్లతో తిరిగి రావడం
ఇవన్నీ ఇప్పుడిక కుదరదు / తిరుగుబాట్లు, ఉద్యమాలు, హోరెత్తి పోవడాలు నిషిద్ధం
ఎంతటి ఉధృతి ఉన్నా బుద్ధిగా ఒడ్డు లోపల మాత్రమే
నిశ్శబ్దంగా ప్రవహించాల్సి ఉంటుంది!

తోటలోని మొక్కలన్నీ ఒకే విధంగా పూయాలని
పూచే పూల రంగు కూడా ఒకటిగానే ఉండాలని
కొత్త చట్టం అమలులోకొచ్చింది / ఒకే రంగు మాత్రమే కాదు
ఏ పువ్వు రంగు ఎంత గాఢంగా ఉండాలో కూడా
వారు నియమించిన వారి అధికారులే నిర్ణయిస్తారట
ఒక దేశం – ఒకే పువ్వు!!
ఈ చట్టాలు చేసిన గౌరవనీయులకు ఎవడు చెప్పాలి?
తోటలో అన్ని మొక్కల పూలూ ఒకే రకంగా ఉండవని
పూలన్నీ ఒకే రంగులో అసలే ఉండవని – ఉండడానికి వీలే లేదని –
ఒక రంగులో అనేక రంగులుంటాయని కూడా / వారికి ఎవడు చెప్పాలి?

గాలులు, కెరటాలు ఎవరి చట్టాలకూ లొంగవనీ
గాలి ఎవరి పిడికిలిలోనో ఖైదీగా ఉండదని
కెరటం ఎవరి జీఓలతోనో వెనక్కి మళ్లదని
ఎంతటి వారైనా సరే, వాటిని గమనిస్తూ
వాటికి అనుగుణంగా బతకాల్సిందే తప్ప / మరో మార్గం లేదని!
లేకపోతే, అవి సృష్టించే సునామీలో / అడ్రసు లేకుండా గల్లంతు కావల్సిందేనని
నామ రూపాలు లేకుండా నశించాల్సిందేనని / వారికి ఎవరైనా చెప్పండి!
కనీస గౌరవమైనా... కాపాడుకొమ్మని!!

– డాక్టర్ దేవరాజు మహారాజు

సామాజిక న్యాయపాలనే గెలిపిస్తుంది!

అభిప్రాయం




ప్రొ॥ గాలి వినోద్ కుమార్

ఇటీవల విశాఖపట్టణంలో ఓ దళిత మేధావుల సమావేశంలో పాల్గొన్నప్పుడు ఏపీ ముఖ్యమంత్రిపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో 90 శాతం దళితులు, క్రైస్తవులు ఉన్నారు. జగన్ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇచ్చే విధంగా అసెంబ్లీ తీర్మానం చేసిన కారణంగా, ఎస్సీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారి సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు ఈ ఎన్నికల్లో ఆయనకు మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. నయా మనువాది చంద్రబాబు నాయుడుకీ, అతని కూటమికీ ఓటు వేయకుండా తిరిగి రెండవసారి జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలనే దృక్పథంతో దళిత సమాజం ఉందనేది వారి మాటల సారాంశం.

విద్యా, వైద్య రంగాల్లో దేశంలో ఎక్కడా లేని విధంగా విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారు జగన్. ఒకసారి ఒక కుటుంబం ఉన్నత చదువులు చదివితే, ఆ కుటుంబం ప్రభుత్వ రాయితీల కోసం ఎదురు చూసే పరిస్థితి ఉండదు. ఆదాయం పెరగడం మూలంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ముఖ్యంగా సబ్సిడీ బియ్యం, వృద్ధాప్య పింఛన్లు, గృహ నిర్మాణ పథకాలపై ప్రభుత్వ భారం తగ్గిపోతుంది. పదేళ్ల కాలంలో 40 శాతం, మరో పది సంవత్సరాల కాలంలో మరో 50 శాతం మొత్తం 20 సంవత్సరాల కాలంలో 90 శాతం సబ్సిడీ పథకం కింద లబ్ధి పొందే వారు, అభివృద్ధి పథకాల కింద లబ్ధిపొందే వారు అభివృద్ధి చెంది ఈ పథకాలను అంటే పెన్షన్ పథకం, సబ్సిడీ పథకాలు వద్దనే స్థాయికి ఈ కుటుంబాలు ఎదిగి పోతాయి. వీటిపై ప్రభుత్వం ఖర్చు చేస్తున్న బడ్జెట్‌లో 90 శాతం బడ్జెట్ తగ్గిపోతుంది.

సామాజిక న్యాయాన్ని దేశంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయని విధంగా జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారు. ఇందుకు కొన్ని ఉదాహరణలు చూద్దాం.

తాజాగా ఎన్నికల కోసం వైఎస్సార్‌సీపీ ప్రకటించిన ఎంపీ సీట్లలో 11 సీట్లనూ; అసెంబ్లీ సీట్లలో 48 సీట్లనూ బీసీలకు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు మొత్తం కలిపి 100 అసెంబ్లీ సీట్లు కేటాయించారు. ఇది దేశంలోనే ఓ రికార్డు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు ముఖ్యమంత్రులుగా ఉన్న రాష్ట్రాలలో కూడా ఇంత ప్రాతినిధ్యం ఆ యా వర్గాలకు ఇవ్వడం కనిపించదు. అలాగే ఇటీవల 18 ఎమ్మెల్సీ స్థానాలకుగాను 11 సీట్లు బీసీలకు కేటాయిస్తే దేశంలోని బీసీలందరూ ఆశ్చర్య పోయారు. పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లు పెట్టి చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపాదించి



చరిత్రను తిరగరాశారు.

గత ఏప్రిల్ 11న చేపట్టిన మంత్రివర్గ పునర్‌వ్యవస్థీకరణలో 25 మందితో కూడిన మంత్రివర్గంలో ఏకంగా 17 పదవులను (70 శాతం) ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకే అవకాశం కల్పించడం ద్వారా సరికొత్త సామాజిక మహా విప్లవాన్ని సీఎం జగన్ ఆవిష్కరించారు. నామినేటెడ్ పోస్టులలో 50 శాతాన్ని వెనుకబడిన వర్గాలకు ఇచ్చారు. అలాగే కాంట్రాక్టు పనులలో వారికి 50 శాతం కోటా కేటాయిస్తూ అసెంబ్లీలో చట్టం చేశారు.

56 బీసీ కులాల కోసం ఏర్పాటు చేసిన కార్పొరేషన్లకు 56 చైర్మన్లు, 672 డైరెక్టర్ల పోస్టులకుగాను మొత్తం 100 శాతం బీసీలకే కేటాయించారు. ఫలితంగా ఆ కులాలలో నాయకత్వ లక్షణాలు పెరిగాయి.

రాజ్యసభలో మొత్తం 9 మంది వైఎస్సార్‌సీపీ సభ్యులు ఉంటే... అందులో నలుగురు బీసీలు. శాసనసభ స్పీకర్; శాసన మండలి చైర్మన్, డిప్యూటీ చైర్మన్ పదవుల కేటాయింపు కూడా జగన్ సామాజిక న్యాయ దృష్టికి నిదర్శనంగా నిలిచాయి. స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గిస్తూ సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. కానీ ఆ మేర బీసీలకు జరిగే నష్టాన్ని పూరించడానికి పార్టీ పరంగా అదనంగా 20 శాతం ఆ వర్గానికి పెంచి మొత్తం 44 శాతం స్థానాలను బీసీలకు కేటాయించారు. జిల్లా పరిషత్ ఎన్నికల్లో మొత్తం 13 జిల్లా పరిషత్‌లను వైఎస్సార్‌సీపీ గెలువగా అందులో తొమ్మిది పదవులను (70 శాతం) ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకే కేటాయించారు. మండల పరిషత్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 635 మండల పరిషత్ అధ్యక్ష పదవులను గెలిస్తే అందులో ఈ వర్గాలకు 442 స్థానాలు (67 శాతం) కేటాయించారు.

చివరగా ముగించే ముందు మూడు రాజధానుల అంశం కూడా పరిపాలన విభజనలో భాగంగా నేను చూస్తాను. సంపద సృష్టి జరగాలన్నా, సంపద పంపిణీ జరగాలన్నా ఒకే ప్రాంతం / లేదా సిటీ అభివృద్ధి చెందితే జరగదు. అందుకే కోస్తాంధ్రా, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలు అభివృద్ధి చెందే విధంగా శాసన రాజధానిగా అమరావతి, కార్యనిర్వహణ రాజధానిగా విశాఖపట్నం, న్యాయ రాజధానిగా కర్నూలును చేయాలని జగన్ సంకల్పించారు. అభివృద్ధి చెందిన దేశాల అభివృద్ధి నమూనా కూడా ఇదే. ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబడాలంటే జగన్‌మోహన్ రెడ్డి రెండవసారి ముఖ్యమంత్రి కావాలని తెలంగాణ సామాజిక న్యాయ కోవిదులు కూడా ఆశిస్తున్నారు.

వ్యాసకర్త ఉస్మానియా, తెలంగాణ విశ్వ విద్యాలయాల మాజీ డీన్–ఫ్యాకల్టీ ఆఫ్ లా

దగ్ధం చేసే నవ్వు

ఇది తమిళ కంబ రామాయణంలోంచి సంగ్రహించిన విషయం. అశోక వనంలో సీతాదేవి కూర్చొని ఉండగా రావణాసురుడు వచ్చి తనను వివాహమాడి లంకకు మహారాణివై దర్జాగా బతకమని అంటాడు. అందుకు సమాధానంగా సీతాదేవి ఓ గడ్డిపరకను అతని ముందు వేసి ఓ నవ్వు నవ్వుతుంది. ఈ నవ్వు వెనుక ఓ అంతరార్థం ఉంది.

సీతారాముల పెళ్ళప్పుడు అందరికీ వర్తమానం పంపారు. కానీ పరమేశ్వరుడికి మాత్రం ఆహ్వానం పంపలేదు. ఇందుకో కారణం ఉంది. పరమేశ్వరుడు అన్ని చోట్లా వ్యాపించి ఉన్నాడు కదా! అందువల్ల ఆహ్వానాన్ని ఎక్కడికి పంపాలో తెలియక



జ్యోతిర్మయం

పోవడంవల్లే ఆహ్వానం పంపలేదట. అంతే తప్ప మరొకటి కాదు. కానీ పరమేశ్వరుడు సీతాదేవికి జరగబోయే పెళ్ళి విషయం తెలుసుకుని అది తిలకించడానికి పరుగుపరుగున వచ్చాడు. కానీ ఏమైందంటే, పరమేశ్వరుడు అక్కడికి వచ్చే లోపు సీతారాముల పెళ్ళి తంతు ముగిసిపోయింది. సీతారాములు పెళ్ళికి వచ్చిన పెద్దలకు నమస్కరించి వారి నుంచి ఆశీస్సులు పొందుతున్నారు.

పరమేశ్వరుడిని చూసిన సీతారాములు అందరికీ నమస్కరించినట్టే ఆయన పాదాలకూ నమస్కరించారు. సీతాదేవి పరమేశ్వరుడితో 'మీరు మమ్మల్ని ఆశీర్వదిస్తే చాలు. అదే మాకు మహత్తర కానుక. మరేవీ మాకు అక్కర్లేదు' అని ఎంతో వినయంగా నెమ్మదైన స్వరంతో చెప్పింది. ఆమె చెప్పిన మాటలన్నీ విన్న పరమేశ్వరుడు 'అలా చెప్పకు. నా వద్ద విలువైన దొకటి ఉంది. అది నీకు కానుకగా ఇస్తాను. భవిష్యత్తులో అది నీకు ఉపయోగపడుతుంది' అంటాడు. సీతాదేవి 'అదేమిటీ' అంటుంది. శివుడు ఓ చిన్న నవ్వు నవ్వి 'అదా, అది నా నవ్వు' అంటాడు.

ఆ నవ్వు అమూల్యమైన కానుక ఎలా అవుతుందని సీత ఆలోచనలో పడుతుంది. అది పరమేశ్వరుడు గ్రహించి 'సీతా! నువ్వు ఏమనుకుంటున్నావో నాకు అర్థమైంది. నా నవ్వుకే త్రిపురం దగ్ధమైంది. అలాంటి నవ్వుని నీకు కానుకగా ఇస్తున్నాను' అన్నాడు.

శివుడి నవ్వుకి త్రిపురం దగ్ధమైనట్టు, శివుడు తనకు ప్రసాదించిన నవ్వుతో లంక నాశనమవుతుందని చెప్పడానికే సీతాదేవి అశోకవనంలో ఆ నవ్వు నవ్వినట్టు మహాకవి కంబన్ తన రామాయణంలో రాశాడు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.పంచమి ఉ.5.37 వరకు, తదుపరి షష్ఠి తె.4.27 వరకు (తెల్లవారితే మంగళవారం), **నక్షత్రం:** పూర్వాషాఢ రా.2.28 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** ప.12.22 నుండి 1.54 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.23 నుండి 1.11 వరకు, తదుపరి ప.2.56 నుండి 3.44 వరకు, **అమృతఘడియలు:** రా.9.40 నుండి 11.32 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.40, **సూర్యాస్తమయం:** 6.14.





ఆదివారం తాడిపత్రి, కందుకూరు సభలకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

మోసగాళ్లకు ఓటుతో వేటు

తాడిపత్రి, వెంకటగిరి, కందుకూరు ఎన్నికల సభల్లో సీఎం జగన్

- నా 58 నెలల పాలనలో ఏం చేశానో చెబుతా
- నీ 14 ఏళ్ల పాలనలో చేసిందేమిటో చెప్పగలవా బాబూ?
- నువ్వేం చేశావో చెప్పుకోలేక నా పథకాల గురించి మాట్లాడతావ్ ఏమిటయ్యా?
- డబ్బులు మీ ఖాతాల్లోకి పంపితే అది జగన్ పాలన
- బాబుకు ఓటేస్తే ఆయన స్నేహితులకే డబ్బులు ట్రాన్స్‌ఫర్

సాక్షి ప్రతినిధి, అనంతపురం/సాక్షి, తిరుపతి/సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కుట్రలు, వెన్నుపోట్లుతో కూటమి కట్టి, జెండాలు జతకట్టి వస్తున్న మోసగాళ్లకు ఓటుతో బుద్ధి చెప్పాలని ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ''58 నెలల కాలంలో నేను ఏం చేశానో చెబుతా. నీ 14 ఏళ్ల పాలనలో ఏం మంచి చేశావో చెప్పగలవా చంద్రబాబూ? నీ పేరు చెబితే గుర్తుకొచ్చే ఒక్క పథకమైనా ఉందా? జగన్ తెచ్చిన స్కీమ్‌లను రద్దు చేస్తానని చెప్పే ధైర్యం ఉందా? జన్మభూమి కమిటీలను మళ్లీ తెస్తానని చెప్పగలవా? నేను తెచ్చిన పథకాల గురించి మాట్లాడతావ్ ఏమిటయ్యా బాబూ? నేను రూపాయి ఇస్తే.. నువ్వు రెండు రూపాయలు ఇస్తానంటావ్ ఏంటయ్యా చంద్రబాబూ?''అంటూ ధ్వజమెత్తారు. ఒక్కటంటే ఒక్క పథకం పేరు కూడా గుర్తుకురాని ఆ మనిషిని నమ్మగలమా? అని సూటిగా ప్రశ్నించారు. 'మేమంతా సిద్ధం'బస్సు యాత్ర విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో ఆదివారం ఉదయం అనంతపురం జిల్లా తాడిపత్రిలో నిర్వహించిన తొలి ఎన్నికల సభతో మలివిడత ఎన్నికల ప్రచారానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారు. మిట్ట మధ్యాహ్నం వేళ తిరుపతి జిల్లా వెంకటగిరిలో, సాయంత్రం శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరులో పోటెత్తిన ఎన్నికల ప్రచార సభల్లో సీఎం జగన్ ప్రసంగించారు. ఆయా సభల్లో ఏమన్నారంటే..

బాబును నమ్మడం అంటే చంద్రముఖిని నిద్ర లేపినట్లే!

మరో రెండు వారాల్లో ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ ఎన్నికలు కేవలం ఎమ్మెల్యేలు, ఎంపీలను ఎన్నుకునేవి కాదు. ఇవి వచ్చే ఐదేళ్ల పాటు మన ఇంటింటి అభివృద్ధి, పేద కుటుంబాల భవిష్యత్తును నిర్ణయించబోయే ఎన్నికలు. జగన్‌కు ఓటు వేస్తే పథకాలన్నీ యథాతథంగా కొనసాగుతాయి. పొరపాటున చంద్రబాబుకు ఓటు వేస్తే పథకాలన్నీ ముగింపు, మళ్లీ మోసపోవటమే. ఇది చంద్రబాబు గురించి చరిత్ర చెప్పిన సత్యం. చంద్రబాబు సాధ్యం కాని హామీలతో మీ ముందుకు వస్తున్నాడు. బాబును నమ్మడం అంటే పులినోట్లో తలకాయ పెట్టడమే అన్నది ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోండి. బాబును నమ్మటం అంటే చంద్రముఖిని నిద్రలేపడమే. వదల బొమ్మాళీ వదలా అంటూ ప్రతి పేదవాడి ఇంటికీ వచ్చి తలుపు తట్టి రక్తం తాగేందుకు వచ్చే ఆ పసుపుపతిని ఆహ్వానించడమే.

మీ బిడ్డ 130 సార్లు బటన్ నొక్కాడు

నాకు వీరిలా జెండాల పొత్తులు లేవు. నాకు ఉన్న పొత్తు మంచి చేసిన ప్రజలతోనే. నా నమ్మకం ఆ దేవుడి దయపైనే. మేనిఫెస్టో హామీలను నూటికి 99 శాతం అమలు చేసిన తర్వాతనే మీ బిడ్డ మీ దగ్గరకు వచ్చి మీ దీవెనలు, ఆశీస్సులు కోరుతున్నాడు. గతంలో ఎన్నడూ జరగని విధంగా ఏకంగా 130 సార్లు మీ బిడ్డ బటన్ నొక్కాడు. రూ.2.70 లక్షల కోట్లు డీబీటీతో అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి పారదర్శకంగా జమ చేశాడు. ఎక్కడా లంచాలు, వివక్ష లేకుండా ఇంటింటికీ అందాయి.

సచివాలయాల్లో నా తమ్ముళ్లు, చెల్లెళ్లు

దశాబ్దాలుగా మన దగ్గర గవర్నమెంట్ ఉద్యోగాలు 4 లక్షలు మాత్రమే ఉంటే మీ బిడ్డ ఈ 58 నెలల కాలంలో ఇచ్చింది ఏకంగా 2.31 లక్షల ఉద్యోగాలు. నా తమ్ముళ్లు, చెల్లెళ్లంతా ఈరోజు గ్రామ సచివాలయాల్లో కనిపిస్తున్నారు. మెరుగుపడిన ఆస్పత్రులు, బడుల్లో సేవలందిస్తున్నారు. ప్రతి సందర్భంలోనూ నేను ''నా..''అని ఆప్యాయంగా పిలిచే సామాజిక వర్గాలకు 80 శాతం ఉద్యోగాలు దక్కాయి.

పేదల ఆత్మగౌరవం కాపాడుతూ..

పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ ఇంటికే రూ.3 వేలు పింఛన్, రేషన్ అందజేస్తున్నాం. ఈరోజు ఇంటి వద్దకే క్యాస్ట్ సర్టిఫికెట్, బర్త్ సర్టిఫికెట్ వస్తోంది. ఏది కావాలన్నా గడప వద్దకే వస్తున్న పరిస్థితులు మీరే చూస్తున్నారు. ఈ విప్లవాత్మక మార్పులను ఎవరైనా ఊహించారా? గవర్నమెంట్ డబ్బులు లంచాలు, వివక్ష లేకుండా అందుతాయని గతంలో ఎవరైనా చెబితే నమ్మేవారా? మీ బిడ్డ ప్రభుత్వం వచ్చిన తర్వాత దీన్ని చేసి చూపించాం.

మహిళా సాధికారతకు దన్నుగా

'అమ్మ ఒడి'అనే కార్యక్రమం గతంలో ఎప్పుడైనా విన్నారా? ఆసరా, సున్నా వడ్డీ, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, పూర్తి ఫీజులు చెల్లిస్తూ విద్యా దీవెన, ఖర్చుల కోసం వసతి దీవెన, పేదలకు 31 లక్షల ఇళ్ల స్థలాలు, 22 లక్షల గృహ నిర్మాణాలు లాంటివి గతంలో ఎప్పుడైనా జరిగాయా? దిశ యాప్, అక్కచెల్లెమ్మలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఏకంగా చట్టం చేయడం లాంటివి విన్నారా?

100 సీట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే

మొట్టమొదటిసారిగా సామాజిక న్యాయానికి మీ బిడ్డ అర్థం చెప్పాడు. చేతల్లో చూపించాడు. నా ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలకు డీబీటీ, నాన్ డీబీటీలో ఏకంగా 75 శాతం పైచిలుకు లబ్ధి చేకూరింది. నామినేటెడ్ పదవులు, పనుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఏకంగా చట్టం చేశాం. 68 శాతం మంత్రి పదవులు ఆ వర్గాలకే ఇవ్వడం ఓ చరిత్ర. వలంటీర్లు మళ్లీ ఇంటికే రావాలన్నా, పేద వాడి భవిష్యత్తు మారాలన్నా, పథకాలన్నీ కొనసాగాలన్నా, లంచాలు, వివక్ష లేని పాలన జరగాలన్నా, మన పిల్లల చదువులు, బడులు బాగుండాలన్నా, వ్యవసాయం, ఆస్పత్రులు మెరుగ్గా ఉండాలన్నా ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై రెండు బటన్లు నొక్కాలి. 175కు 175 అసెంబ్లీ, 25కు 25 ఎంపీ స్థానాల్లో ఒక్కటి కూడా తగ్గకుండా గెలిపించాలి.

మీ బిడ్డ ఎలా చేయగలిగాడు?

నాడూ నేడూ ఇదే రాష్ట్రం, ఇదే బడ్జెట్. అప్పులు కూడా అప్పటి కంటే ఇప్పుడే గ్రోత్ రేటు తక్కువ. మరి మీ బిడ్డ ఎలా బటన్లు నొక్కగలిగాడు? కనీవినీ ఎరుగని స్కీములు ఎలా ఇవ్వగలిగాడు? అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి ఏకంగా రూ.2.70 లక్షల కోట్లు ఎలా పంపించగలిగాడు? అనేది ఆలోచన చేయమని కోరుతున్నా. ఈ డబ్బంతా చంద్రబాబు పాలనలో ఎవరి జేబుల్లోకి వెళ్లిందో ఆలోచన చేయండి. మన రాష్ట్రానికి వచ్చిన పొత్తుల నాయకులను చూస్తుంటే సుమతీ శతకం ''తెప్పలుగ చెరువు నిండిన కప్పలు పదివేలు చేరు కదరా సుమతీ''గుర్తుకొస్తోంది. ఇప్పుడు రాష్ట్రంలో తిరుగుతున్న చంద్రబాబు, దత్తపుత్రుడు, వదినమ్మ, ఈనాడు రామోజీ, ఏబీఎన్ రాధాకృష్ణ, టీవీ 5 నాయుడు వీళ్లలో ఎవరైనా ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడైనా నివాసం ఉంటున్నారా? ఎన్నికలు వచ్చాయి కాబట్టే వీరంతా ఆంధ్రప్రదేశ్‌కు వచ్చారు. ఓడిన వెంటనే వీళ్లంతా మళ్లీ హైదరాబాద్‌కు వెళ్లిపోతారు. ఇదీ వాళ్లకు మన రాష్ట్రంతో ఉన్న అనుబంధం. చంద్రబాబుది అబద్ధాలు, మోసాల ఫ్యాక్టరీ అయితే, ఇంటింటికి చేసిన మంచిని సగర్వంగా చెబుతున్న పార్టీ మనది. ఐదేళ్ల పాలనలో ప్రతి ఇంటికీ చేసిన మంచి ఇదీ అని మీ బిడ్డ సగర్వంగా చెబుతున్నాడు. మీ బిడ్డ వల్ల మీకు మంచి జరిగి ఉంటే తోడుగా, సైనికులుగా నిలవాలని కోరుతున్నా.

జన్మభూమి కమిటీలు మళ్లీ తెస్తానని చెప్పగలవా?

చంద్రబాబు జన్మభూమి కమిటీలను తీసుకొస్తే మీ జగన్ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలను తెచ్చాడు. నువ్వు పెట్టిన జన్మభూమి కమిటీల వ్యవస్థ మీద నీకు నమ్మకం, విశ్వాసం ఉంటే మళ్లీ వాటిని తీసుకొస్తానని చెప్పే ధైర్యం నీకుందా చంద్రబాబు? ఆ విషయం చెప్పే ధైర్యం లేక నేను తెచ్చిన వలంటీర్లు, సచివాలయాల వ్యవస్థలను కొనసాగిస్తానంటావేమిటి? నువ్వు వస్తే వలంటీర్లకు జీతం పెంచుతానంటావేమిటి?

జగన్ స్కీమ్‌లను రద్దు చేస్తాననే ధైర్యముందా?

అయ్యా చంద్రబాబూ.. నువ్వు 14 ఏళ్లు పరిపాలించావ్! నేను 58 నెలలే పరిపాలన చేశా. జగన్ అమ్మ ఒడి తీసుకొస్తే నువ్వు అంతకంటే ఎక్కువ ఇస్తానంటున్నావు. జగన్ చేయూత ప్రవేశపెడితే నువ్వు ఇంకా ఎక్కువమందికి ఇస్తానంటున్నావు. జగన్ రూపాయి ఇస్తే నువ్వు రెండు రూపాయలు ఇస్తానంటావ్! జగన్ తెచ్చిన స్కీమ్‌లను రద్దు చేస్తానని చెప్పే ధైర్యం నీకుందా చంద్రబాబూ? జగన్ తెచ్చిన వలంటీర్, సచివాలయాల వ్యవస్థలను రద్దు చేస్తానని చెప్పే ధైర్యం ఉందా? జగన్ తెచ్చిన రైతు భరోసా కేంద్రాలను తీసేస్తానని చెప్పే ధైర్యం ఉందా? రైతు భరోసా సొమ్ము రద్దు చేసే ధైర్యం బాబుకు ఉందా?



మండుటెండలో మధ్యాహ్నం 2:30 గంటలకు.. తిరుపతి జిల్లా వెంకటగిరిలో ఎండను సైతం లెక్కచేయకుండా సీఎం వైఎస్ జగన్ సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం



పులివెందుల నియోజకవర్గంలోని తొండూరు మండలం ఇనగలూరులో ప్రచారం చేస్తున్న వైఎస్ భారతీరెడ్డి

సకుటుంబ సపరివార సమేతంగా

ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ కుటుంబం

- కడప బాధ్యతల్లో వైఎస్ సోదరులు రవీంద్రనాథరెడ్డి, సుధీకర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి
- వివిధ నియోజకవర్గాలు, మండలాల బాధ్యతలో ఇతర కుటుంబ సభ్యులు
- ఇంటింటి ప్రచారంలో సీఎం జగన్ సతీమణి భారతీరెడ్డి, వైఎస్ సమతారెడ్డి, చవ్వా సునీతారెడ్డి
- సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సంక్షేమాన్ని వివరిస్తూ ప్రచారం
- మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని అభ్యర్థన

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

జగన్.. రేపు నిన్ను చంపితే ఏమవుతుంది?

నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం సభలో చంద్రబాబు వివాదాస్పద వ్యాఖ్యలు

- బహిరంగంగానే బరితెగించిన టీడీపీ అధినేత
- సీఎం జగన్‌పై తెలుగుదేశం పార్టీ కుతంత్రం!
- ముఖ్యమంత్రిని రాజకీయంగా ఎదుర్కోలేక భౌతికంగా నిర్మూలించే కుట్ర
- కొద్దిరోజుల క్రితం 'ఆ దున్నపోతును మనిషికి ఒక రాయి తీసుకుని కొట్టండి'అంటూ వ్యాఖ్య
- ఆ తర్వాతే విజయవాడలో సీఎంపై హత్యాయత్నం
- మరో సభలో.. గాజు గ్లాసు తీసుకుని పొడవమంటూ కేడర్‌కు సైగలు
- తాజాగా.. జగన్ నిన్ను చంపితే ఏమవుతుందంటూ ప్రసంగం
- గతంలో 'గాలిలో వస్తాడు..గాలిలోనే పోతాడు'అంటూ కూడా వ్యాఖ్య

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను ఎదుర్కొనే సామర్థ్యం, ధైర్యంలేక కొట్టుమిట్టాడుతున్న చంద్రబాబుకు కళ్ల ముందే ఓటమి స్పష్టంగా కనిపించడంతో చేసేదిలేక తీవ్ర నిరాశ, నిస్పృహలతో బహిరంగ సభల్లో ఇష్టమొచ్చినట్లు నోరు పారేసుకోవడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం బుచ్చిరెడ్డిపాళెం సభలో.. 'జగన్‌మోహన్‌రెడ్డి.. రేపు నిన్ను చంపితే ఏమవుతుంది'.. అంటూ ఆయన బరితెగించి చేసిన రెచ్చగొట్టే వ్యాఖ్యలతో రాష్ట్ర రాజకీయాలను ఆయన ఎటువైపు తీసుకెళ్తున్నారనే ఆందోళన సాధారణ ప్రజలు, మేధావులు, తటస్థులు వ్యక్తంచేస్తున్నారు. జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకే ఆయన్ను భౌతికంగా నిర్మూలించేందుకు చంద్రబాబు ఏదైనా కుతంత్రం పన్నుతున్నారేమోనని అనుమానిస్తున్నారు. ఎందుకంటే.. ఇటీవలే తాడికొండలో జరిగిన సభలో 'ఆ దున్నపోతును మనిషికి ఒక రాయి తీసుకుని, ఏది దొరికితే అది తీసుకుని కొట్టండి'.. అంటూ సీఎంపై దాడికి పురికొల్పేలా మాట్లాడారు. ఆ తర్వాతే విజయవాడ సింగ్‌నగర్‌లో బస్సుయాత్ర చేస్తున్న జగన్‌పై హత్యాయత్నం జరిగింది. ముఖ్యమంత్రిని దున్నపోతు అంటూ సంబోధించడం, రాయిపెట్టి కొట్టాలనడం ఒక మాజీ ముఖ్యమంత్రి స్థాయికి తగునా అని మేధావులు సైతం ప్రశ్నిస్తున్నారు. మరో సభలో.. గాజు గ్లాసు తీసుకుని పొడవమంటూ ఆయన సైగల ద్వారా చెప్పడం చూసి రాష్ట్ర ప్రజలు నివ్వెరపోయారు. ఇప్పుడు ఏకంగా జగన్‌ను నేరుగా ఉద్దేశిస్తూ నిన్ను చంపితే ఏమవుతుంది అని మాట్లాడడంతో చంద్రబాబు మనసులో దురుద్దేశం ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఆయన ఆ మాట అన్నారంటే జగన్‌పై ఎంత కసి, కక్ష ఉన్నాయో తెలుస్తోందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిని చంపేయాలని ప్రతిపక్ష నేత మాట్లాడడం తగదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏ విషయంలోనూ వైఎస్ జగన్‌ను ధీటుగా ఎదుర్కోలేని పరిస్థితుల్లో ఇలాంటి మాటలు మాట్లాడుతున్నట్లు స్పష్టమవుతోంది. ముఖ్యమంత్రిని పదేపదే వ్యక్తిగతంగా దూషించడం, దాడులకు ప్రోత్సహించేలా వ్యాఖ్యలు చేస్తుండడం, చివరికి ఇంకా దిగజారి చంపమని చెప్పడం చంద్రబాబు మానసిక దౌర్బల్యాన్ని సూచిస్తోందంటున్నారు.

దారుణంగా పడిపోయిన బాబు ఇమేజ్

మరోవైపు.. సీఎం వైఎస్ జగన్ హుందాగా మాట్లాడుతుంటే.. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు ఇంత నీచస్థాయికి దిగజారి మాట్లాడుతుండడం సాధారణ ప్రజానీకంలోనూ చర్చనీయాంశమైంది. ఇప్పటికే ప్రజల్లో, జాతీయ స్థాయి రాజకీయ పక్షాల దృష్టిలో నమ్మదగని నేతగా ముద్రపడిన చంద్రబాబు ఇమేజ్ దారుణంగా పడిపోయింది. ప్రజలే కాదు.. ఏ రాజకీయ పక్షం ఆయన్ను నమ్మే పరిస్థితిలేదు. ప్రస్తుతం ఎన్డీఏతో పొత్తు పెట్టుకున్నా ఆయన్ను బీజేపీ పెద్దలు నమ్మడంలేదని టీడీపీ నేతలు వాపోతున్నారు. చంద్రబాబు నిలకడలేని స్వభావం, అవకాశవాద వైఖరి, ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం ద్వారా తన స్థాయిని దిగజార్చుకున్నారు. ఈ వైఖరే ఆయన్ను ప్రజల్లో మోసగాడిగా నిలబెట్టింది.

బాబు తీరుతో టీడీపీ కేడర్‌లో ఆందోళన..

అలాగే.. జగన్ తన పాలనలో మంచి జరిగిందనుకుంటేనే తనకు ఓటేయాలని కోరుతుంటే చంద్రబాబు మాత్రం 'చంపండి.. పొడవండి.. రాళ్లు విసరండి.. గాలిలో వస్తాడు, గాలిలో పోతాడు'.. అంటూ మాట్లాడడాన్ని టీడీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. వైఎస్ జగన్ తన పాలనలో తాను చేసిన పనులు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి చక్కగా చెబుతున్నారని, చంద్రబాబు వైఫల్యాలు ఆయన గతంలో విడుదల చేసిన మేనిఫెస్టోను చూపించి దాన్ని అమలుచేయలేదని చెబుతున్నారని వీటిపై మాట్లాడకుండా అదే పనిగా తిట్టడంవల్ల ఉపయోగం ఉండదని భావిస్తున్నారు. జగన్ తన మేనిఫెస్టోను, టీడీపీ మేనిఫెస్టోను పోల్చిచూపడం, అందులోని అంశాలను వివరించి చెప్పే విధానం ప్రజల్లోకి బాగా వెళ్తోందనే అభిప్రాయం టీడీపీ నేతల్లో వ్యక్తమవుతోంది.

ఇక చంద్రబాబు తన పాలన, తన విధానాల గురించి కాకుండా కేవలం ఎదురుదాడి చేయడం, దూషించడంవల్ల ఉపయోగం ఏమిటని టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు.ఆయన ప్రసంగాలు ప్రజలకు నమ్మకాన్ని కలిగించేలా ఉండడంలేదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. హద్దులు దాటిపోయి చేస్తున్న ఆరోపణలు, దూషణలు చంద్రబాబులో ఉన్న

ఓటమి భయంతోనే ఇలా..

అసహనం, భయాన్ని చూపుతున్నాయని, ఓటమి భయంతోనే ఆయన అలా మాట్లాడుతున్నారని తటస్థులు సైతం చెబుతున్నారు. తాను చేసిందేమీలేక చెప్పుకోలేకపోవడం, ఏం చేస్తానో చెప్పలేకపోవడం, ఆయన చెప్పే ఇతర విషయాలను జనం పట్టించుకోకపోవడంతో జీవిత చరమాంకంలో ఓటమి భయంతోనే ఇలా చేస్తున్నట్లు చెబుతున్నారు. అదే సమయంలో ఆయన విద్వేషపూరిత ప్రసంగాలవల్ల రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య నెలకొనే పరిస్థితి ఏర్పడుతోంది.

టీడీపీని రద్దు చేయాలి : ఎమ్మెల్యే ప్రసన్న

బుచ్చిరెడ్డిపాళెంలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై కోవూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డి సీరియస్ అయ్యారు. చంద్రబాబు తన పాలనా దక్షత కన్నా.. కుట్రలు, కుతంత్రాలు, హత్యలను నమ్ముకుని రాజకీయం చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ సుమోటోగా తీసుకుని చంద్రబాబుపై కేసు నమోదు చేసి, టీడీపీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు సుమోటోగా కేసు ఫైల్ చేయాలని కోరారు.

వేమిరెడ్డీ.. బాబు వ్యాఖ్యలను సమర్థిస్తున్నావా?

చంద్రబాబు వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సమయంలో ఎంపీ, ఎమ్మెల్యేగా టీడీపీ తరఫున పోటీచేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డి దంపతులు పక్కనే ఉన్నప్పటికీ వారు మౌనంగా ఉండిపోవడంపై నెల్లూరు జిల్లా వాసులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. నైతిక విలువలుంటే ఇలాంటి హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్న చంద్రబాబు పార్టీ నుంచి తప్పుకోవాలని, లేదంటే బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

రెండు దశల్లో మహిళలు 8 శాతమే



న్యూఢిల్లీ: టికెట్ల కేటాయింపులో మహిళలకు పెద్దపీట వేస్తున్నామంటూ రాజకీయ పార్టీలు చెబుతున్న మాటలన్నీ నీటి మూటలేనని స్పష్టమవుతోంది. రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం మరింత పెరగాలని తరచూ చెప్పే పార్టీలు ఆ విషయంలో మాత్రం చొరవ చూపడం లేదు. సార్వత్రిక ఎన్నికల్లో మొదటి రెండు దశల పోలింగ్ ముగిసింది. మొత్తం 2,823 మంది అభ్యర్థులు పోటీచేశారు. వీరిలో మహిళల సంఖ్య ఎంతో తెలుసా? కేవలం 8 శాతం. మొదటి దశలో 135 మంది, రెండో దశలో 100 మంది మహిళలు.. అంటే మొత్తం 235 పోటీపడ్డారు. అత్యధికంగా మొదటి దశలో తమిళనాడు నుంచి 76 మంది, రెండో దశలో కేరళ నుంచి 24 మంది పోటీ పడ్డారు. మొదటి రెండు దశల్లో కాంగ్రెస్ పార్టీ 44 మంది, బీజేపీ 69 మంది మహిళలను రంగంలోకి దింపాయి. సార్వత్రిక ఎన్నికల్లో మహిళల ప్రాతినిధ్యం తగ్గిపోతోందని, రాజకీయ పార్టీలు వారికి సముచిత వాటా ఇవ్వడం లేదని, వివక్ష స్పష్టంగా కనిపిస్తోందని సామాజిక కార్యకర్తలు, రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. పార్టీలకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే మహిళా రిజర్వేషన్ చట్టం అమల్లోకి వచ్చేదాకా వేచి చూడాల్సిన అవసరం లేదని అంటున్నారు. టికెట్ల కేటాయింపుల్లో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తున్నారు. జనాభాలో సగం వరకు ఉన్న మహిళలకు రాజకీయాల్లో ఆ మేరకు ప్రాతినిధ్యం లేకపోవడం ఏమిటని అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఇష్తికార్ అహ్మద్ అన్సారీ ప్రశ్నించారు. మహిళల విషయంలో హామీలను ఆచరణలో అమలు చేసి చూపాలని పార్టీలను కోరారు. రాజకీయాల్లో అతివలకు సమాన అవకాశాలు కల్పించడానికి పార్టీలు నిర్మాణాత్మక చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీ పదవుల్లో ఎక్కువ మంది మహిళలకు అవకాశం కల్పిస్తే వారు చట్టసభల్లో అడుగు పెట్టడానికి ఆస్కారముంటుందన్నారు. బ్రిటన్‌లోని లేబర్ పార్టీ తరహాలో రాజకీయ పార్టీల నిర్మాణంలో, పదవుల్లో మహిళలకు రిజర్వేషన్ ఉండాలని ఢిల్లీ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుశీల రామస్వామి పేర్కొన్నారు.

బాద్‌షాల అరాచకాలు కన్పించ లేదా?

రాహుల్‌పై మోదీ ధ్వజం



బెళగావి/సిర్సీ/దావణగెరె: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. మన దేశానికి చెందిన రాజులు, మహారాజులను కించపర్చిన రాహుల్ నవాబులు, నిజామ్‌లు, సుల్తాన్లు, బాద్‌షాలు సాగించిన అరాచకాలపై మాత్రం నోరుమెదపడం లేదని మండిపడ్డారు. కేవలం బుజ్జగింపు, ఓటు బ్యాంకు రాజకీయాలతో లబ్ధి పొందడానికి రాహుల్ ఆరాటపడుతున్నారని ధ్వజమెత్తారు. ఆదివారం కర్ణాటకలోని బెళగావి, దావణగెరె, ఉత్తర కన్నడ జిల్లాలోని సిర్సీ, హోస్పేట్‌లో లోక్‌సభ ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ మాట్లాడారు. మన దేశ చరిత్ర, స్వాతంత్య్ర పోరాట గాథలను కాంగ్రెస్ పార్టీ పాలనలో బుజ్జగింపు, ఓటు బ్యాంకు రాజకీయాలను దృష్టిలో పెట్టుకొని రాశారని, ఆ పాపాన్ని రాహుల్ గాంధీ ఇప్పటికీ కొనసాగిస్తున్నారని విమర్శించారు. భారతదేశ రాజులు, మహారాజులు పేద ప్రజలపై క్రూరమైన అణచివేత, దౌర్జన్యాలకు పాల్పడ్డారని, ఆస్తులు, భూములు బలవంతంగా లాక్కున్నారంటూ రాహుల్ ఇటీవల ఆరోపించారని గుర్తుచేశారు. ఛత్రపతి శివాజీ, కిత్తూరు రాణి చెన్నమ్మ వంటి గొప్ప పాలకులను రాహుల్ అవమానించారని చెప్పారు. దేశ చరిత్రలో నవాబులు, నిజామ్‌లు, సుల్తాన్లు, బాద్‌షాలు సాగించిన అఘాయిత్యాలు, దారుణాల గురించి మాట్లాడాలంటే కాంగ్రెస్ రాజకుమారుడి నోటికి తాళం పడుతోందని ఎద్దేవా చేశారు. మొఘల్ రాజు ఔరంగజేబు మన ఆలయాలను అపవిత్రం చేశాడని, కూల్చివేశాడని అన్నారు. అలాంటి ఔరంగజేబును ఆరాధించే పార్టీలతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుందని ఆక్షేపించారు. ఔరంగజేబు దుశ్చర్యలపై రాహుల్ ఏనాడూ మాట్లాడలేదన్నారు. రాజులు, మహారాజులు మన దేశానికి ఎన్నో సేవలు చేశారని, వారి త్యాగాలు మరువలేమని పేర్కొన్నారు. రాజులకు వ్యతిరేకంగా మాట్లాడడానికి ఉన్న ధైర్యం సుల్తాన్లకు వ్యతిరేకంగా మాట్లాడడానికి రాహుల్‌కు లేదని విమర్శించారు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు మైండ్‌సెట్ ఆ పార్టీ మేనిఫెస్టోలో కనిపిస్తోందని వెల్లడించారు. ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ) మద్దతు తీసుకుంటోందని ఆరోపించారు. వయనాడ్‌లో నెగ్గడానికి పీఎఫ్ఐకి లొంగిపోతారా? అని రాహుల్‌ని ప్రశ్నించారు.

ప్రజల ఓట్లతోనే నాకు ధైర్యం

ఓటు బ్యాంకు రాజకీయాలు మరింత నీచంగా, విధ్వంసకరంగా తయారవుతున్నాయని నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ చివరి క్షణం వరకూ ఎన్నో అడ్డంకులు సృష్టించిందని ఆరోపించారు. ఆలయ నిర్మాణం జరగకుండా కాంగ్రెస్, దాని కోటరీ 70 ఏళ్లపాటు కుట్రలు సాగించాయని దుయ్యబట్టారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన మరుసటి రోజే అయోధ్యలో ఆలయ నిర్మాణంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా, అప్పటి పాలకులు ఆ పని చేయలేదన్నారు. నిర్ణయం తీసుకొని, అమలు చేయడానికి 56 అంగుళాల ఛాతీ(మోదీ) కావాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వ సొమ్ముతో గానీ, పన్ను చెల్లింపుదార్ల డబ్బుతో గానీ ఆ ఆలయం నిర్మించలేదని, శ్రీరాముడి భక్తుల విరాళాలతోనే ఆలయ నిర్మాణం జరిగిందని వివరించారు. రామమందిర ప్రాణప్రతిష్ఠకు హాజరు కావాలంటూ ఆహ్వానం అందజేస్తే కాంగ్రెస్ తోపాటు కొన్ని పార్టీలు తిరస్కరించాయని గుర్తుచేశారు. ఆ పార్టీలను ఎన్నికల్లో తిరస్కరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో బీజేపీకి మద్దతు పలకాలని, మరింత బలం చేకూర్చాలని కోరారు.

వారసత్వ పన్నును ఆమోదించను

కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే వారసత్వ పన్నుతో ఆస్తులు పోగొట్టుకోవాల్సి వస్తుందంటూ ప్రజలను ప్రధానమంత్రి అప్రమత్తం చేశారు. పిల్లల కోసం ఆదా చేసుకున్న డబ్బులను సైతం లాక్కుంటారని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు 45 శాతం ఆస్తులను మాత్రమే బదిలీ చేసే అవకాశం ఉంటుందని, మిగతా 55 శాతం ఆస్తులను కాంగ్రెస్ ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, ఓటు బ్యాంక్‌కు కట్టబెడుతుందని పేర్కొన్నారు. అయితే, తాను జీవించి ఉన్నంతకాలం ఇలాంటి వారసత్వ పన్ను ఆమోదించే ప్రసక్తే లేదని మోదీ తేల్చిచెప్పారు. మీ ఉద్దేశాలు వదిలేసుకోండి అంటూ కాంగ్రెస్ పార్టీకి హితవు పలికారు. కర్ణాటకలో ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హిందువులపై దాడులు పెరిగిపోయాయని ప్రధానమంత్రి అన్నారు.

2014 కంటే ముందు బ్రోకర్ల రాజ్యం

కొన్ని దేశాలు, సంస్థలు మన దేశం, మన ప్రభుత్వం బలహీనపడాలని కోరుకుంటున్నాయని, అలాగైతే లాభపడొచ్చని, ఆటలు సాగించుకోవచ్చని భావిస్తున్నాయని మోదీ చెప్పారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతుండడం ఆయా దేశాలకు, సంస్థలకు ఇష్టం లేదన్నారు. భారత్ బలమైన దేశంగా ఎదగడం కొందరికి కంటగింపుగా మారిందన్నారు. బీజేపీ ప్రభుత్వం ఉంటే అవినీతికి పాల్పడడం, దోచుకోవడం సాధ్యం కాదని కొన్ని దుష్టశక్తులు భావిస్తున్నాయని పేర్కొన్నారు. 2014 కంటే ముందు బ్రోకర్ల రాజ్యం నడిచిందని, ఢిల్లీ పవర్ కారిడార్లలో వారే అధికారం చెలాయించారని గుర్తుచేశారు. ఢిల్లీలోని హోటళ్లలో సంవత్సరాల తరబడి తిష్ట వేసి లాబీయింగ్ చేస్తూ ఉండేవారని తెలిపారు. 2014లో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పవర్ కారిడార్లను శుద్ధి చేసే ప్రక్రియ చేపట్టామని వివరించారు. బ్రోకర్లకు, లాబీయిస్టులకు అక్కడ స్థానం లేకుండా చేశామని చెప్పారు. బీజేపీని అణగదొక్కడం సాధ్యం కాదన్న సంగతిని కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు తెలుసుకోవాలన్నారు.

మూడో ఆర్థికశక్తిగా ఎదగడం ఖాయం

ప్రధానిగా ఎవరున్నా జరిగేది అదే
అతిశయోక్తిగా చెప్పడంలో మోదీ మాస్టర్స్ చేశారు
మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరం వ్యాఖ్య

ఇంటర్వ్యూ



అతిశయోక్తి కలబోసి చెప్పడంలో ప్రధాని మోదీ ఆరితేరారని మాజీ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత పి.చిదంబరం వ్యాఖ్యానించారు. పీటీఐతో ప్రత్యేక ముఖాముఖి సందర్భంగా దేశార్థిక వ్యవస్థ, సీఏఏ, ఆర్టికల్ 370పై ఆయన వ్యక్తపరిచిన అభిప్రాయాలు ఆయన మాటల్లోనే..

నిర్మలా సీతారామన్ పోటీపై..

నిర్మల మొదట్నుంచీ ప్రత్యక్ష ఎన్నికలను ఎదుర్కోలేదు. రాజ్యసభకే ఎన్నికయ్యారు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ టికెట్ ఆఫర్ చేసినా ఆమె తిరస్కరించారు. ఎందుకంటే ఆమెకు దేశంలో ఏ రాష్ట్రంలోనూ స్థానికంగా రాజకీయ బలం లేదు. ఓడిపోతానని ఆమెకు తెలుసు. ఇంతకుమించి ఆమె రాజకీయ భవితవ్యంపై నేను మాట్లాడదల్చుకోలేదు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా సమకూర్చుకున్న సొమ్ముతో బీజేపీ ఖజానా నిండిపోయింది. ఎక్కువ నిధులతో అలరారుతోంది.

మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఎదగడంపై..


''అంకగణితం ప్రకారం చూస్తే దేశంలో కొనుగోలు శక్తి, వస్తు వినియోగం విపరీతంగా పెరుగుతోంది. ప్రపంచంలోనే అధిక జనాభా గత జనభారతంలో ఏటా స్థూలజాతీయోత్పత్తి(జీడీపీ) పెరగడం అత్యంత సహజం. ఇందులో తానేదో చేసినట్లు అతిశయోక్తితో చెప్పడం మోదీకే చెల్లింది. ప్రధానిగా ఎవరున్నా సరే ఇప్పుడున్న వేగంతో జీడీపీ దూసుకెళ్తే త్వరలోనే భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరిస్తుంది. ఆపడానికి వీలులేని అంకగణిత సాధ్యాలను ఆయన తన గ్యారెంటీలుగా ప్రకటించుకుంటున్నారు. అతిశయోక్తిగా చెప్పడంలో మోదీ మాస్టర్ డిగ్రీ చేశారు. జీడీపీ లెక్కల్లో చూస్తే 2004లో ప్రపంచంలో భారత్ 12వ స్థానంలో ఉండేది. 2014లో ఏడో స్థానానికి ఎగబాకింది. 2024లో ఐదో స్థానానికి వచ్చేసింది. జీడీపీ లెక్కల ప్రకారం భారత ఎకానమీ పురోగమనం ఖాయం. ప్రధానిగా ఎవరున్నా ఇది ఆగదు. ఇందులో ఎలాంటి మేజిక్ లేదు. అత్యధిక జనాభా కారణంగానే ఇది సాధ్యమవుతోంది. వాస్తవానికి జీడీపీ వృద్ధి అనేది దేశ సర్వతోముఖాభివృద్ధిని అస్సలు సూచించదు. తలసరి ఆదాయం మాత్రమే దేశాభివృద్ధికి సరైన గీటురాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి(ఐఎంఎఫ్) సంస్థ తలసరి ఆదాయ లెక్కల ప్రకారం భారత్ ర్యాంక్ దారుణంగా 136 వద్దే ఆగిపోయింది''

సీఏఏ, ఆర్టికల్ 370లపై..

'' స్వదేశం వదిలి శరణార్థులుగా భారత్‌కు 2014 డిసెంబర్ 31లోపు అఫ్గానిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల నుంచి వచ్చిన హిందువులు, బౌద్ధులు, సిక్కులు, పార్శీలు, జైనులు, క్రైస్తవులకు సీఏఏ చట్టం కింద భారత ప్రభుత్వం పౌరసత్వం కల్పిస్తోంది. అయితే పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)కు కాంగ్రెస్ మొదట్నుంచీ వ్యతిరేకం. ప్రస్తుతం సీఏఏ సంబంధ కేసులు సుప్రీంకోర్టులో విచారణలో ఉన్నాయి. తీర్పులు రావాల్సి ఉంది. కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి వస్తే జమ్మూకశ్మీర్‌కు మళ్లీ పూర్తి రాష్ట్ర హోదా కల్పిస్తుంది. మోదీ సర్కార్ ఆర్టికల్ 370ను రద్దుచేయడం, దానిని సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో కాంగ్రెస్ విభేదిస్తోంది. కానీ ఇప్పుడు అది చట్టంగా మారిందికాబట్టి ఏం చేయలేం. **- కోల్‌కతా**

నాడు వ్యతిరేకించి.. ఇప్పుడు సమర్థిస్తున్నారు

రిజర్వేషన్లపై మోహన్ భాగవత్ వ్యాఖ్యలను తప్పుబట్టిన రాహుల్



డామన్/కటక్: రిజర్వేషన్లను ఆర్ఆర్ఎస్ మొదట్నుంచీ సమర్థిస్తూ వస్తోందంటూ ఆ సంస్థ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. డయ్యూ డామన్, దాద్రా నగర్ హవేలీ కేంద్ర పాలిత ప్రాంతంలోని డామన్ పట్టణంలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో రాహుల్ ప్రసంగించారు. '' ఇప్పుడేమో రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం కాదని భాగవత్ చెబుతున్నారు. మరి అప్పుడేమో తాను రిజర్వేషన్లకు పూర్తి వ్యతిరేకినని ఘంటాపథంగా చెప్పేవారు. రిజర్వేషన్లను వ్యతిరేకించే వాళ్లే బీజేపీతో చేరేవారు. వాళ్లకే బీజేపీ స్వాగతం పలికి అక్కున చేర్చుకుంది. తీరా ఎన్నికల వేళ ఇప్పుడొచ్చి మళ్లీ రిజర్వేషన్లకు మా మద్దతు అంటూ భాగవత్ కొత్త రాగం ఆలపిస్తున్నారు'' అని రాహుల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ''ఈసారి ఎన్నికలు కాంగ్రెస్, ఆర్ఎస్ఎస్–బీజేపీ మధ్య సైద్ధాంతిక పోరు. రాజ్యాంగ విత్తనం నుంచే దేశంలోని అనేక విభాగాలు ఉద్భవించాయి. పూర్వకాలంలో మాదిరి రాజ్యపాలన సాగించాలని మోదీజీ, ఆర్ఎస్ఎస్ ఆశ. వీటిని నాశనం చేసి ఆర్ఎస్–బీజేపీ రాజుల్లాగా దేశాన్ని పాలించాలనుకుంటున్నారు'' అని ఆరోపించారు. '' ఆర్ఎస్ఎస్–బీజేపీ వాళ్లకు ఒకే దేశం, ఒకే భాష, ఒక్కడే నేత ఉండే వ్యవస్థ కావాలి. పశ్చిమబెంగాల్ ప్రజలు బెంగాలీ మాట్లాడతారు. అలాగే గుజరాత్ వాళ్లు గుజరాతీ, తమిళులు తమిళమే మాట్లాడతారు. అలాంటపుడు ఒకే భాష, ఒకే నేత విధానంలో హేతుబద్ధత ఎక్కడుంది?'' అని నిలదీశారు. ''డయ్యూ డామన్, దాద్రా నగర్ హవేలీ కేంద్ర పాలిత ప్రాంత అడ్మినిస్ట్రేటర్ పదవిలో మోదీ ప్రఫుల్ పటేల్‌ను 'రాజు' లాగా నియమించారు. ప్రజాభీష్టంతో ప్రఫుల్‌కు పనిలేదు. ఆయన ఏమనుకున్నారో అదే చేస్తారు'' అని ఆరోపించారు.

రేవణ్ణ, ప్రజ్వల్‌పై లైంగిక వేధింపుల కేసు

ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసిన కర్ణాటక ప్రభుత్వం

శివాజీనగర/యశవంతపుర: కర్ణాటకలో లైంగిక వేధింపుల వ్యవహారం సంచలనాత్మకంగా మారింది. జేడీ(ఎస్) అధినేత, మాజీ ప్రధాని హెచ్.డి.దేవెగౌడ కుమారుడు, రాష్ట్ర మాజీ మంత్రి హెచ్.డి.రేవణ్ణ, మనవడు, హసన్ సిట్టింగ్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై కేసు నమోదైంది. ప్రజ్వల్ రాసలీలలంటూ పలు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కర్ణాటకలో తొలి దశలో 14 లోక్‌సభ స్థానాల్లో ఈ నెల 26న పోలింగ్ జరిగింది. ఆ మరుసటి రోజే ఈ వీడియోలు బయటకు వచ్చాయి. రాష్ట్రమంతటా చర్చనీయాంశంగా మారాయి. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రాసలీలల వీడియోలు పొందుపర్చిన పెన్‌డ్రైవ్‌లను హసన్ నియోజకవర్గంలో బహిరంగ స్థలాల్లో విసిరేసినట్లు సమాచారం. ప్రజ్వల్ రేవణ్ణ హసన్ లోక్‌సభ స్థానం నుంచి పోటీకి దిగారు. తండ్రి కుమారులు రేవణ్ణ, ప్రజ్వల్ రేవణ్ణ తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ వారి వంట మనిషి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో హసన్ జిల్లాలోని హొళెనరసిపుర పోలీసులు ఇద్దరు నిందితులపై ఆదివారం కేసు నమోదు చేశారు. ఏ1గా రేవణ్ణ, ఏ2గా ప్రజ్వల్‌ను చేర్చారు. రేవణ్ణ భార్య భవాని తనకు బంధువు అవుతారని, వారి ఇంట్లో వంట మనిషి చేరాక రేవణ్ణ తనను లైంగికంగా వేధించడం ప్రారంభించారని, ప్రజ్వల్ తన కుమార్తెకు వీడియో కాల్స్ చేస్తూ అసభ్యంగా మాట్లాడుతుండేవాడని వంటమనిషి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. .

విచారణకు 'సిట్'

నిజానిజాలను నిర్ధారించేందుకు సిట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. సీఐడీ అదనపు డీజీపీ నేతృత్వంలోని 'సిట్'లో ఇద్దరు మహిళా ఐపీఎస్‌లను సభ్యులుగా నియమించారు. నిందితుడు ప్రజ్వల్ విదేశం వెళ్లినట్లు తెలిసింది. తండ్రి కొడుకులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మహిళా కాంగ్రెస్ నాయకులు ఆదివారం బెంగళూరులో ఆందోళన చేపట్టారు.

పాక్ బోటులో రూ.600 కోట్ల డ్రగ్స్

- గుజరాత్ తీరంలో ఐసీజీ స్వాధీనం
- అందులోని 14 మంది సిబ్బంది నిర్బంధం

అహ్మదాబాద్: గుజరాత్ తీరం సమీపంలో పాకిస్తాన్‌కు చెందిన బోటులో రూ.600 కోట్ల విలువైన 86 కిలోల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు భారత తీర రక్షక దళం(ఐసీజీ) తెలిపింది. బోటులోని 14 మంది పాకిస్తానీలను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించింది. గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్(ఏటీఎస్), నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ)ల సమన్వయంతో ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసినట్లు వివరించింది. నిఘా వర్గాల సమాచారం మేరకు ఐసీజీకి చెందిన ఈ నెల 14న రాజ్‌రతన్ నౌకతోపాటు విమానాల ద్వారా గస్తీ చేపట్టి అనుమానాస్పద బోటును గుర్తించామని, అందులోని వారు ఎలాంటి ప్రతిఘటన లేకుండా లొంగిపోయారని తెలిపింది. పడవలో తనిఖీలు చేపట్టి రూ.600 కోట్ల విలువైన సుమారు 86 కిలోల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుని, అందులోని 14 మంది సిబ్బందిని పోర్‌బందర్‌కు తరలించినట్లు తెలిపింది. పట్టుబడిన డ్రగ్స్ వివరాలను మాత్రం ఐసీజీ వెల్లడించలేదు.

మహాదేవ్ బెట్టింగ్ యాప్ కేసు... నటుడు సాహిల్ ఖాన్ అరెస్ట్



ముంబై: మహాదేవ్ బెట్టింగ్ యాప్ కుంభకోణం కేసులో బాలీవుడ్ నటుడు సాహిల్ ఖాన్‌ను అరెస్ట్ చేసినట్లు ముంబై సైబర్ సెల్ ప్రత్యేక దర్యాప్తు విభాగం(సిట్) ఆదివారం తెలిపింది. ముందస్తు బెయిల్ కోసం సాహిల్ ఖాన్ పెట్టుకున్న అర్జీని బాంబే హైకోర్టు తిరస్కరించింది. ఈ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో ఉన్న సాహిల్‌ను శనివారం అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించింది. దాదర్‌లోని కోర్టు అతడిని మే ఒకటో తేదీ వరకు రిమాండ్‌కు అప్పగించినట్లు తెలిపింది. మహాదేవ్ బెట్టింగ్ యాప్‌కు సంబంధించి రూ.15 వేల కోట్ల కుంభకోణం జరిగిందంటున్న ముంబై పోలీసులు సాహిల్ తదితర 32 మందిపై కేసు పెట్టారు. ఇద్దరిని అరెస్ట్ చేశారు. మనీ లాండరింగ్ కోణంలో విచారణ చేపట్టిన ఈడీ కూడా ఇద్దరిని అరెస్ట్ చేసింది. కాగా, స్టైల్, ఎక్స్‌క్యూజ్‌మి వంటి హిందీ చిత్రాల్లో నటించిన సాహిల్ ఫిట్‌నెస్ నిపుణుడిగా పేరు తెచ్చుకున్నారు.

బస్సు, ట్రక్కు ఢీ: ఆరుగురు మృతి

ఉన్నావ్: ఉత్తరప్రదేశ్‌లో సంభవించిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా మరో 20 మంది గాయాలపాలయ్యారు. హర్దోయి–ఉన్నావ్ రహదారిపై జమల్దీపూర్ గ్రామ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం ఘటన చోటుచేసుకుంది. సుమారు 35 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు ముందున్న ట్రక్కును పక్క నుంచి బలంగా ఢీకొట్టింది. ఘటన అనంతరం బస్సు డ్రైవర్ పరారు కాగా ట్రక్కు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. క్షతగాత్రులైన 20 మంది ప్రయాణికులను కాన్పూర్, ఉన్నావ్ ఆస్పత్రులకు తరలించారు.

రాజ్యాంగాన్ని మార్చేందుకే 400 సీట్లు : పవార్

పుణె: కేంద్రంలో మళ్లీ అధికారం చేపట్టి రాజ్యాంగాన్ని మార్చేందుకే బీజేపీ ఈ లోక్‌సభ ఎన్నికల్లో 400 కుపైగా సీట్లు సాధించాలనుకుంటోందని ఎన్‌సీపీ(ఎస్‌పీ) చీఫ్ శరద్ పవార్ ఆరోపించారు. పుణెలోని సస్వాడ్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో పవార్ మాట్లాడారు. గతంతో పోలిస్తే ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలు భిన్నమైనవని, దేశ భవిష్యత్తు పథాన్ని నిర్ణయించేవని తెలిపారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను జైల్లో పెట్టిన బీజేపీ నేతలు నియంతృత్వ పోకడలతో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. దేశాన్ని రక్షించుకోవాలంటే బీజేపీని ఓడించాల్సిన అవసరం ఉందని పవార్ అన్నారు.

దర్యాప్తు సంస్థలతో బీజేపీ రాజకీయం చేస్తోంది

ఆనాడు కాంగ్రెస్ అదే పనిచేసింది: మాయావతి

మురైనా(ఎంపీ): గతంలో కాంగ్రెస్ పార్టీ చేసినట్లే బీజేపీ సైతం కేంద్ర దర్యాప్తు సంస్థలతో రాజకీయం చేస్తోందని బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లోని మురైనా పట్టణంలో ఆదివారం ఎన్నికల ప్రచారర్యాలీలో మాయావతి మాట్లాడారు. '' ఈవీఎంల ట్యాంపరింగ్‌లేకుండా స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు జరిగితే బీజేపీ విజయం సాధించడం అంత సులువు కాదు. గత రెండేళ్లలో పేదరికం, నిరుద్యోగం, ధరలు మరింత పెరిగాయి. వీటిని కట్టడిచేయడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైంది. అందుకే అత్యంత నిరుపేదలకు కేంద్రం రేషన్ ఇస్తోంది. ఈ తరుణంలో వారికి కావాల్సింది రేషన్ కాదు ఉపాధి. అవినీతి సమసిపోలేదు. బీజేపీ, కాంగ్రెస్.. ఈ రెండింట్లో ఏదీ అధికారంలోకి రాకుండా అడ్డుకునే బాధ్యత మీరు తీసుకోండి. బీఎస్పీకి ఓటేయండి'' అని ఓటర్లనుద్దేశించి అన్నారు. '' బీజేపీ తన సమయాన్ని, శక్తినంతా పెట్టుబడిదారులకు లాభాలు తెచ్చిపెట్టేందుకే ఖర్చుచేస్తోంది. వాళ్లంటేనే బీజేపీకి ఇష్టం. దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల కోసం కాంగ్రెస్ పనిచేయకపోవడం వల్లే బీఎస్పీ ఆవిర్భవించింది'' అని మాయావతి అన్నారు.

ఎలక్షన్ బీట్

కేజ్రీవాల్ భార్యకు ములాఖత్ నిరాకరణ



న్యూఢిల్లీ: తిహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న అరవింద్ కేజ్రీవాల్‌ను భార్య సునీత కలుసుకునేందుకు జైలు యంత్రాంగం అనుమతి నిరాకరించింది. సోమవారం కలిసేందుకు శనివారమే ఆమె అనుమతి కోరగా అందుకు జైలు యంత్రాంగం ఒప్పుకోలేదని ఆప్ వర్గాలు వెల్లడించాయి. '' మోదీ సర్కార్ ఒత్తిళ్లకు తలొగ్గి కేజ్రీవాల్‌తో సునీత ములాఖత్ కాకుండా జైలు యంత్రాంగం అడ్డుతగులుతోంది. మోదీ సర్కార్ పరిధులు దాటి మరీ అమానవీయంగా ప్రవర్తిస్తోంది. కేజ్రీవాల్‌ను ఒక ఉగ్రవాదిలాగా చూస్తోంది'' అని ఆప్ ఆరోపించింది. కారాగార నిబంధనావళి ప్రకారం విచారణ ఖైదీకి వారానికి రెండు ములాఖత్‌లను అనుమతిస్తారు. ఒకేసారి ఇద్దరు కలవొచ్చు. వారంలో గరిష్ఠంగా నలుగురు కలిసి మాట్లాడొచ్చు. అయితే ఇప్పటికే ఖరారైన షెడ్యూల్ ప్రకారం సోమవారం ఢిల్లీ మహిళా మంత్రి అతిశి, మంగళవారం పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కలవాల్సి ఉంది. '' సునీత, అతిశి పేర్లను 27వ తేదీన ఒకేసారి అధికారులకు ఇచ్చాం. వాళ్లు ఉద్దేశపూర్వకంగా సునీతకు అనుమతి నిరాకరించారు'' అని ఆప్ వెల్లడించింది.

వివరణ ఇచ్చిన జైలు యంత్రాంగం

''కేజ్రీవాల్‌ను సునీత ఎప్పటికప్పుడు కలుస్తూనే ఉన్నారు. ఆమెకు మాత్రమే అనుమతి ఇవ్వలేదనే ప్రశ్నే లేదు. కేజ్రీవాల్‌ను 29వ తేదీన కలిసేందుకు అతిశి వారం క్రితమే అనుమతి కోరారు. సునీత మాత్రం ఆలస్యంగా ఆదివారం అనుమతి కోరారు. అందుకే అతిశికే ములాఖత్‌కు అనుమతి మంజూరుచేశాం''అని జైలు యంత్రాంగం వివరణ ఇచ్చింది.

భరతమాత బిడ్డగా అర్థిస్తున్నా.. ఓటేయండి

ఆమ్ ఆద్మీ పార్టీ తరఫున లోక్‌సభ ఎన్నికల ప్రచారం మొదలెట్టిన సునీత ఆదివారం వెస్ట్ ఢిల్లీ నియోజకవర్గ అభ్యర్థి మహాబల్ మిశ్రాకు ఓటేయాలంటూ రోడ్‌షో చేపట్టారు. '' భరతమాత బిడ్డనైన నేను మిమ్మల్ని ఒక్కటే వేడుకుంటున్నా. కేంద్రంలో నిరంకుశపాలనకు అంతం పలికేందుకు ఆప్‌కు ఓటేయండి. మీ ఓటును ఉన్న విలువను అర్థంచేసుకోండి'' అని అన్నారు.

రిజర్వేషన్లు రద్దు చెయ్యం: అమిత్ షా

కాస్‌గంజ్/మైన్‌పురి/ఇటావా: ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను బీజేపీ రద్దు చేయదు, ఎవరినీ చేయనివ్వదు..ఇదే మోదీ గ్యారెంటీ అని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో 400పైగా సీట్లు గెలుచుకుంటే రిజర్వేషన్లను తొలగిస్తుందంటూ బీజేపీపై ప్రతిపక్షాలు పదేపదే చేస్తున్న ఆరోపణలపై ఆయన ఈ మేరకు స్పందించారు. యూపీలోని కాస్‌గంజ్, మైన్‌పురి, ఇటావాల్లో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీల్లో అమిత్ మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలు వెనుకబడిన వర్గాల ప్రజల ప్రయోజనాలను విస్మరించాయని, మోదీ ప్రధాని అయ్యాకనే బీసీలకు హక్కులను కల్పించారని వివరించారు. రెండు పర్యాయాలు ప్రధానిగా ఉన్న మోదీ పార్లమెంట్‌లో పూర్తి మెజారిటీ ఉన్నప్పటికీ రిజర్వేషన్ల జోలికి వెళ్లలేదని ఆయన గుర్తు చేశారు. విపక్షాలు అయోధ్య రామాలయం అంశాన్ని దశాబ్దాలుగా నాన్చుతూ వచ్చాయంటూ.. రామభక్త కరసేవకులపై కాల్పులు జరిపిన వారు కావాలో, రామ మందిరం నిర్మించిన మేము కావాలో నిర్ణయించుకోవాలని ప్రజలను కోరారు. ఏటా వేసవిలో థాయ్‌లాండ్ విహారానికి వెళ్లే రాహుల్ గాంధీ ఒక వైపు, సరిహద్దుల్లోని సైనికులతో 23 ఏళ్లుగా దీపావళి వేడుకలు జరుపుకునే మోదీ మరో వైపు ఉన్నారని వ్యాఖ్యానించారు. ఓటు బ్యాంకుకు గండిపడుతుందనే భయంతోనే అయోధ్యలో రాముని విగ్రహ ప్రతిష్ఠకు ఎస్పీ చీఫ్ అఖిలేశ్, డింపుల్ యాదవ్ దంపతులు రాలేదని మండిపడ్డారు.

'జైల్ కే జవాబ్ మే..' పాట మార్చండి

ఆమ్ ఆద్మీ పార్టీకి ఎన్నికల కమిషన్ ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ జైలు ఊచల వెనక ఉన్న ఫొటోతో 'జైల్ కే జవాబ్ మే హమ్ వోట్ దేంగే...(జైలుకు ఓటుతో బదులిస్తాం)'అంటూ సాగిన ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్నికల ప్రచార పాటలో మార్పులు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. బీజేపీ ఫిర్యాదుపై ఈసీ ఈ మేరకు స్పందించింది. న్యాయవ్యవస్థను చులకన చేయడంతోపాటు బీజేపీని, కేంద్ర దర్యాప్తు విభాగాలను దూషిస్తున్నట్లుగా ఆ పాట అర్థమిస్తోందని, ఇది నియమావళి ఉల్లంఘనే అని తెలిపింది. ఆ పాటను నిషేధించడం లేదని తెలిపింది. అందులో మార్పులు చేసి తిరిగి సమర్పించాలని ఆ నోటీసులో పేర్కొంది. అయితే, దీన్ని బీజేపీ రాజకీయంగా ఆప్ అభివర్ణించింది. తటస్థంగా వ్యవహరించాల్సిన ఈసీ బీజేపీ చేతిలో రాజకీయ అస్త్రంగా మారిపోయిందని విమర్శించింది. ప్రచార గీతాన్ని ఈసీ నిషేధించడం దేశ చరిత్రలోనే తొలిసారని పేర్కొంది. పాటలో ఎక్కడా బీజేపీ ప్రస్తావనే లేదని, ఉల్లంఘన కిందికి రాదని పేర్కొంది. నియంతృత్వం గురించి మాట్లాడితే, అధికార పార్టీని విమర్శించినట్లేనని ఈసీ అంటోందని ఢిల్లీ మంత్రి అతిశీ వ్యాఖ్యానించారు.

బీజేపీకి కాంగ్రెస్, సీపీఎంల సాయం: మమత

కలియాచక్: కాంగ్రెస్, సీపీఎంలపై పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. బెంగాల్‌లో ఆ రెండు పార్టీలు బీజేపీకి అండగా నిలుస్తున్నాయని అన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో తమ టీఎంసీ మాత్రమే రాష్ట్రంలో ఒంటరి పోరు సాగిస్తోందని చెప్పారు. మాల్దా దక్షిణ నియోజకవర్గంలో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో మమత మాట్లాడారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్‌తో ఎలాంటి ఎన్నికల పొత్తు లేదు. సీపీఎం, కాంగ్రెస్ జట్టు కట్టాయి. ఈ రెండు పార్టీలు బీజేపీతో చేతులు కలిపాయి. కాంగ్రెస్, సీపీఎంలు బీజేపీకి రెండు కళ్లు. కాంగ్రెస్‌కు గానీ, సీపీఎంకు గానీ ఓటేస్తే బీజేపీ వ్యతిరేక ఓటుకు గండిపడి ప్రధాని మోదీకి సాయం చేసినట్లే'అని మమత వ్యాఖ్యానించారు. 'సీపీఎంతో పొత్తు వద్దనే షరతుతో బెంగాల్‌లో కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు చేసుకుందామని భావించాం. అయితే, కాంగ్రెస్ ఒప్పుకోలేదు. కాంగ్రెస్, సీపీఎం నేతలు బీజేపీ మాదిరిగానే మాట్లాడుతున్నారు. టీఎంసీ ప్రభుత్వ ప్రజానుకూల విధానాలపై కుట్ర పన్నుతున్నారు. అందుకే రాష్ట్రంలోఇండియా కూటమి లేదు'అని మమత వివరించారు. ఎన్నికల తర్వాత ఇండియా కూటమి ప్రభుత్వ ఏర్పాటులో టీఎంసీ కీలకంగా వ్యవహరిస్తుందని వెల్లడించారు.

ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్‌గా లవ్లీ రాజీనామా



న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల వేళ విపక్షాల 'ఇండియా' కూటమికి మరో తలనొప్పి మొదలైంది. ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ పదవికి అర్విందర్ సింగ్ లవ్లీ శనివారం రాజీనామా చేశారు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీతో పొత్తుకు ఢిల్లీ కాంగ్రెస్ శాఖ వ్యతిరేకమని ఆయన వ్యాఖ్యానించారు. ఢిల్లీ రాష్ట్ర నేతలకు ఇష్టం లేకపోయినా కాంగ్రెస్ అధిష్టానం సూచనల మేరకు ఆప్‌తో కలిపి కూటమిని సమర్థించాల్సి వచ్చిందని, ఇప్పుడు తన రాజీనామాకు అది కూడా ఒక కారణమని అర్విందర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం తన రాజీనామా లేఖను పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గేకు పంపించారు. '' గతంలో ఇదే ఆప్ కాంగ్రెస్‌పై నిరాధార అవినీతి, తప్పుడు ఆరోపణల బురదచల్లింది. ఆప్ మంత్రివర్గంలో సగం మంది మంత్రులు ఇప్పుడు జైళ్లో ఉన్నారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూ బేషరతు మద్దతు పలుకుతూ కేజ్రీవాల్ అరెస్ట్‌వేళ ఆయన ఇంటికి కూడా వెళ్లొచ్చా. నార్త్ ఈస్ట్ ఢిల్లీ కాంగ్రెస్ అభ్యర్థి కన్హయ్య కుమార్ మన పార్టీని కాదని కేజ్రీవాల్‌ను పొగడ్తల్లో ఆకాశానికెత్తేస్తున్నారు. ఇది పార్టీ సిద్ధాంతాలకే విరుద్ధం. ఇది పార్టీ నేతలకేకాదు కార్యకర్తలకు కూడా నచ్చట్లేదు. పాఠశాలలు, ఆస్పత్రులు, మౌలిక సదుపాయాలు ఆప్ హయాంలో అధ్వాన్నంగా తయారయ్యాయి. డీపీసీసీ చీఫ్‌గా నేను తీసుకునే నిర్ణయాలు, నియామకాలను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి(ఢిల్లీ ఇన్‌చార్జ్) బుట్టదాఖలుచేశారు. 150కిపైగా బ్లాక్‌లకు ఇప్పుడు బ్లాక్ ప్రెసిడెంట్ కూడా లేరు. పార్టీ కార్యకర్తల ప్రయోజనాలు కూడా కాపాడలేని నేను ఈ పదవిలో కొనసాగడంలో అర్థంలేదు'' అని లేఖలో లవ్లీ పేర్కొన్నారు.

సాక్షి కరీంనగర్

సోమవారం : 29 ఏప్రిల్ : 2024



చల్లంగా చూడు రాజన్నా..

వేములవాడ: రాజన్నను ఆదివారం 25వేల మంది భక్తులు దర్శించుకున్నారు. దీంతో జాతరగ్రౌండ్‌ ఆలయ పరిసరాలు, బద్ది పోచమ్మ, భీమన్నగుడి ప్రాంతాలు రద్దీగా మారాయి.



మల్లన్న సన్నిధిలో సందడి

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధిలో భక్తుల సందడి నెలకొంది. భారీసంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారి పేరిట పట్నాలు వేయించారు. బోనాలు తయారు చేసి నైవేద్యం సమర్పించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
42.0/29.0

జిల్లాలో ఈరోజు వాతావరణం ఎండగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. తీవ్ర ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్‌

కవిత్వం సామాజిక హితాన్ని కలిగి ఉండాలి



పుస్తకావిష్కరణలో కవులు, రచయితలు

కరీంనగర్‌కల్చరల్‌: నియమాలతో కూడిన లఘు కవితలను కవులు, సాహిత్యాభిమానులు సొంతం చేసుకున్నప్పుడే అవి నిలుస్తాయని, కవిత్వం ఏ రూపంలో ఉన్నా సామాజిక హితాన్ని కలిగి ఉండాలని ప్రముఖ కవి, సినీగేయ రచయిత, నంది పురస్కార గ్రహీత సాధనాల వెంకటస్వామినాయుడు అన్నారు. ఆదివారం నగరంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో భవానీ సాహిత్య వేదిక కరీంనగర్‌ అధ్వర్యంలో నగునూరి రాజన్న రచించిన 'శ్రీపద మంజీరాలు' పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కొత్త సాహిత్య ప్రక్రియను ఎవరు రాసినా అది కవుల సొంతమైనప్పుడే ప్రచారానికి నోచుకుంటుందని, ఆ సాహిత్య ప్రక్రియలో కవులు రచనలు చేసినప్పుడే నిలదొక్కుకుంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. శ్రీ పదాలు రూపకర్త అనుశ్రీ గౌరోజు మాట్లాడుతూ శ్రీపదాలు సాహిత్య ప్రక్రియను రూపొందించినది తానే అయినా, ఆ ప్రక్రియను సొంతం చేసుకొని శ్రీ పదాలు రాస్తున్న కవులందరూ ఈ ప్రక్రియను ముందుకు తీసుకొస్తున్నారని పేర్కొంటూ వారికి ధన్యవాదాలు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్‌ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీపదాలు గ్రూపు అడ్మిన్‌ జీవీ.రాజు, కవులు గంప ఉమాపతి, స్తంభంకాడి గంగాధర్‌, బొమ్మకంటి కిషన్‌, వేల్పుల కృష్ణారావు, ఆది విజయలక్ష్మి, నూగూరి నాగవేణి, కొమురోజు మాధవి, దార స్నేహలత తదితరులు ఉన్నారు.

నామినేషన్ల ఉపసంహరణకు నేడే ఆఖరు

- ఎన్నికల అధికారి, కలెక్టర్‌ పమేలా సత్పతి



కరీంనగర్‌ అర్బన్‌: కరీంనగర్‌ లోక్‌సభ స్థానం కోసం నామినేషన్లు దాఖలు చేసినవారు ఉపసంహరణ కోసం దరఖాస్తు చేసుకునేందుకు సోమవారం ఆఖరురోజని ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్‌ పమేలా సత్పతి తెలిపారు. ఈ నెల 29న ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్ణీత నమూనాలో కలెక్టరేట్లోని ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని పేర్కొన్నారు. మూడు గంటల తర్వాత నామినేషన్ల ఉపసంహరణకు వచ్చే దరఖాస్తులను ఎన్నికల కమిషన్‌ నిబంధనల ప్రకారం అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఎవరైనా నామినేషన్ల ఉపసంహరణకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఉదయం 10:30 గంటల నుంచి మూడు గంటలలోపే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్‌ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అ..అక్రమం ఆ..ఆదాయం



పక్షం రోజుల క్రితం తిమ్మాపూర్‌ ఎమ్మార్సీలో ఉపాధ్యాయులకు సంబంధించిన జీతాలు రూ.10లక్షల గోల్‌మాల్‌ వ్యవహారంలో సీనియర్‌ హెచ్‌ఎంతో పాటు జూనియర్‌ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వారిపై ఆరోపణలు వచ్చాయి. విచారణ చేపట్టిన విద్యాశాఖ అధికారులు సదరు హెచ్‌ఎంను సస్పెండ్‌ చేశారు.

జిల్లా విద్యాశాఖను గాడిలో పెట్టాల్సిన డీఈవో గత నాలుగేళ్లుగా నిబంధనలకు విరుద్ధంగా ఇంటి అద్దెకు సంబంధించి దొంగ రశీదులు సమర్పించాడు. ఐటీరిటర్న్స్‌లో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2,45,710 పన్ను ఉద్దేశపూర్వకంగా ఎగ్గొట్టిన విషయం వెలుగులోకి రావడం ఉపాధ్యాయవర్గాలను విస్మయానికి గురి చేసింది.

- అడ్డదారులు తొక్కుతున్న కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు
- సొంత ఆదాయం.. ప్రైవేట్‌ వ్యవహారాలకే అధిక ప్రాధాన్యం
- అనధికారికంగా చిట్టీలు, రియల్‌ ఎస్టేట్‌ దందాలు
- బోగస్‌ ధ్రువపత్రాలతో పదోన్నతులు, అక్రమార్జన
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న విద్యాశాఖ ఉన్నతాధికారులు?

కంచే చేను మేసినట్లు..

కరీంనగర్‌ డీఈవో జనార్దన్‌రావు వైఖరి రోజు రోజుకూ వివాదాస్పదమవుతోంది. దొంగఅద్దె రశీదులతో ఆదాయపు పన్ను ఎగ్గొట్టిన విషయం సోషల్‌ మీడియా ద్వారా వైరల్‌ కావడం సంచలనం సృష్టించింది. డీఈవో వాస్తవానికి రేకుర్తి సమీపంలోని సూర్యనగర్‌లోని ఓ ప్రభుత్వ టీచర్‌ ఇంట్లో అద్దెకుంటున్నారు. అందుకు భిన్నంగా 2023-24 ఏడాది ఐటీ ప్రతిపాదనల్లో కోతిరాంపూర్‌లోని సత్యనారాయణ ఇంట్లో అద్దెకుంటున్నట్లు, ప్రతీ నెల రూ.36వేలు అద్దె చెల్లిస్తున్నట్లు ఐటీరిటర్న్‌లో చూపించారు. ఏడాదికి రూ.4,32,000 అద్దె చెల్లించినట్లు రశీదులు జతచేశారు. కానీ సత్యనారాయణ పేరు మీద మున్సిపల్‌ రికార్డుల ప్రకారం ఇల్లే లేదు. కేవలం ఐటీ రిటర్న్‌ కోసం దొంగ రశీదులు సృష్టించి లేని యాజమానుల ఇళ్లలో నివాసం ఉంటున్నట్లు రికార్డులు చూపడం.. ఉద్దేశపూర్వకంగానే ఆదాయపన్ను ఎగ్గొట్టేందుకేనని, ఇది ఆదాయపు పన్ను నిబంధనలు ఉల్లంఘించడమేనని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ విషయమై వివరణ కోరేందుకు 'సాక్షి' డీఈవోను సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

కరీంనగర్‌: అ-అమ్మ, ఆ-ఆవు, ఇ-ఇల్లు, ఈ-ఈగ అని బోధించాల్సిన కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు అడ్డదారులు తొక్కుతున్నారు. అ అంటే అక్రమం.. ఆ అంటే ఆదాయం అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం నుంచి నెలనెలా రూ.వేల జీతం తీసుకుంటూ.. రియల్‌ఎస్టేట్‌, చిట్టీలు, అక్రమ వడ్డీల్లాంటి అక్రమార్జనపై దృష్టిసారిస్తున్నారు. వేలాదిమంది ఉపాధ్యాయులు వృత్తిధర్మాన్ని కొనసాగిస్తూ వన్నెతెస్తుంటే.. మరికొందరు విద్యాశాఖ పరువును బజారుకీడుస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారవుతోంది.

చిట్టీలు.. రియల్‌దందా..

ఉమ్మడి కరీంనగర్‌ జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో కొందరు అదనపు ఆదాయం కోసం చిట్టీలు, రియల్‌ఎస్టేట్‌తో పాటు వడ్డీవ్యాపారం నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తోటి ఉపాధ్యాయులు, ప్రైవేట్‌ ఉద్యోగులతో చిట్టీల గ్రూపులు ఏర్పాటు చేసి దందా నిర్వహిస్తున్నారు. రిజిస్ట్రేషన్‌ లేకుండా చిట్టీలు వేస్తూ డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేస్తున్నారనే ఫిర్యాదులు అనేకం. ఇటీవల కరీంనగర్‌ జిల్లాకేంద్రంలో ఓ ఉపాధ్యాయుడు చిట్టీపాడుకుని సదరు ఏజెంట్‌కు మిగిలిన సొమ్ము చెల్లించకపోవడంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కొందరు ఉపాధ్యాయులు అధికవడ్డీలకు అప్పులిస్తూ... సదరు వ్యవహారం నిర్వహణ కోసం పాఠశాలలకు సైతం డుమ్మా కొడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మరికొందరు రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారం నిర్వహిస్తూ క్లాస్‌రూముల్లోనూ సెల్‌ఫోన్‌ మాట్లాడుతూ బోధనకు మంగళం పాడుతున్నారనే విమర్శలున్నాయి. రియల్‌ఎస్టేట్‌ రంగంలో ఉపాధ్యాయులు సిండికేట్‌గా మారి ఎకరాల కొద్ది భూములు కొనుగోలు చేసి ప్లాట్లుగా చేసి అమ్ముతున్నారనే విమర్శలున్నాయి. ఈ పనులకు ఎక్కువగా సమయం కేటాయిస్తూ పాఠశాలలకు డుమ్మా కొడుతున్నట్లు సమాచారం. రియల్‌ దందాలో మారుమూల ప్రాంతాల్లో పనిచేసే ఉపాధ్యాయులే ఎక్కువగా ఉన్నట్లు అధికారులు సేకరించిన సమాచారంలో ఉన్నట్లు వెల్లడైంది.

మాయని మచ్చలా

- రెండేళ్ల క్రితం పెద్దపల్లి జిల్లా మంథని ప్రాంతంలో ఓ ఉపాధ్యాయుడు పాఠశాలల విధులకు ఎగనామం పెట్టి గంజాయి రవాణాలో పట్టుబడటం, కరీంనగర్‌లో వడ్డీవ్యాపారం నిర్వహిస్తున్న ఓ ఉపాధ్యాయుడి ఇంటిపై టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు దాడి చేయడం లాంటి సంఘటనలు విద్యాశాఖకే మచ్చతెచ్చి పెడుతున్నాయి.
- జమ్మికుంట ఎంఈవోగా పనిచేసిన ఓ ఉపాధ్యాయుడు ఫ్యామిలీప్లానింగ్‌ ఆపరేషన్‌ అయినట్లుగా రికార్డు సృష్టించి రెండు ఇంక్రిమెంట్లు కాజేయడంతో తనిఖీల్లో సస్పెండ్‌ అయ్యాడు.
- కరీంనగర్‌లో కొందరు ఉపాధ్యాయులు లేని రోగాలను ఉన్నట్లు చూపుతూ దొంగ మెడికల్‌ సర్టిఫికెట్లు సృష్టించుకుని పదోన్నతులు, ఇంక్రిమెంట్లు పొందుతూ, బదిలీ సమయాల్లో అదనపు పాయింట్లతో అనుకున్న చోటికి బదిలీ చేయించుకున్న సంఘటనలు అనేకం.
- అనధికారికంగా ఎమ్మార్సీల్లో ఉంటూ కొందరు ఉపాధ్యాయులకు సంబంధించిన జీపీఎఫ్‌, ఈఎల్స్‌ నిధులను వారికి తెలియకుండా డ్రా చేసుకున్న సంఘటనలు అనేకం. వీటిపై ఎన్నో ఫిర్యాదులు అందినా ఇప్పటి వరకు విద్యాశాఖ తీసుకుంటున్న చర్యలు శూన్యమని తెలుస్తోంది.

అ'పూర్వ' స్వర్ణోత్సవం

మానకొండూర్‌: పదేళ్లు, ఇరవై ఏళ్లు కాదు.. 50ఏళ్ల తరువాత వారంతా ఒక్కచోట కలిశారు. ఆరుపదుల వయసు దాటిన తరువాత పాఠశాల పిల్లల్లా రోజంతా సరదాగా గడిపారు. గత స్మృతులను నెమరువేసుకున్నారు. ఈ సంబరానికి మానకొండూర్‌లోని ఓ ప్రయివేటు ఫంక్షన్‌హాల్‌ వేదికకాగా.. మానకొండూర్‌ ప్రభుత్వ హైస్కూల్‌లో 1974లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. 50ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకుని స్వర్ణోత్సవ సమ్మేళనం జరుపుకున్నారు. సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో గంప రాజేందర్‌, కొడిత్యాల మల్లేశం, ఎం.నరేందర్‌, ఎస్‌.విజయలక్ష్మి, దివ్యారాణి, ఎం.రామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రేవంత్‌, సంజయ్‌ మ్యాచ్‌ ఫిక్సింగ్‌



చొప్పదండిలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌, పక్కన వినోద్‌కుమార్‌ తదితరులు

- సంజయ్‌ని గెలిపించేందుకే అనామకుడికి కాంగ్రెస్‌ టికెట్‌
- 10, 12 ఎంపీ సీట్లు గెలిస్తే ఏడాదిలోగా కేసీఆర్‌ రాష్ట్రాన్ని శాసిస్తారు
- తల్లిలాంటి బీఆర్‌ఎస్‌ కష్టాల్లో ఉంది
- కలిసికట్టుగా వినోద్‌కుమార్‌ను గెలిపించండి
- బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌, ఎమ్మెల్యే కే. తారకరామారావు

ఎలక్షన్‌ 2024



చొప్పదండిలో రోడ్‌షోకు హాజరైన ప్రజలు

కరీంనగర్‌/తిమ్మాపూర్‌/చొప్పదండి: పార్లమెంట్‌ ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే జూన్‌ 4న మొట్టమొదటి జంప్‌ జిలానీ అయ్యేది చోటాభాయ్‌ రేవంత్‌రెడ్డేనని, రేవంత్‌, సంజయ్‌ మ్యాచ్‌ ఫిక్సింగ్‌ చేశారని, అందుకే కరీంనగర్‌లో అనామకుడికి కాంగ్రెస్‌ టికెట్‌ ఇచ్చారని బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కే.తారకరామారావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో బీఆర్‌ఎస్‌ బూత్‌ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్‌ మ్యాచ్‌ ఫిక్సింగ్‌ చేసుకుని బీఆర్‌ఎస్‌ను ఓడించేందుకు కరీంనగర్‌, మల్కాజిగిరి, నిజామాబాద్‌, చేవెళ్ల, మరికొన్ని స్థానాల్లో డమ్మీ క్యాండెట్లను రేవంత్‌రెడ్డి పోటీలో నిలిపారని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌ ఒక్క స్థానంలోనూ గెలవదని చోటా భాయ్‌ అంటే, రెండు సీట్లు గెలిస్తే మంత్రి పదవి వదులుకుంటానని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కరీంనగర్‌లో వినోద్‌కుమార్‌ గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పిన సంజయ్‌కి జూన్‌ 4 తర్వాత రాజకీయ సన్యాసం తప్పదని అన్నారు. హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేసేందుకు కాంగ్రెస్‌, బీజేపీలు కుట్ర చేస్తున్నాయని, దాన్ని అడ్డుకునే సత్తా కేవలం బీఆర్‌ఎస్‌కే ఉందని, అందుకే పార్లమెంట్‌ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ గెలవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. బీఆర్‌ఎస్‌ అధికారంలోకి వచ్చి ఉంటే ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ మానేరు రివర్‌ ఫ్రంట్‌ను పూర్తిచేసి కరీంనగర్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేవారని, ఇప్పుడు ఆ పనులు నిలిచిపోయాయని అన్నారు. కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసులు తోకాడిస్తున్నారని, 10, 12 పార్లమెంట్‌ స్థానాలను గెలిపిస్తే, కేసీఆర్‌కు రాష్ట్రాన్ని ఏడాదిలో శాసించే శక్తి వస్తుందని, తోకాడిస్తున్న పోలీసులు మళ్లీ మనముందు వచ్చి నిలబడతారని పార్టీశ్రేణుల్లో భరోసా నింపారు. కరీంనగర్‌లో ఓట్లు ఎక్కువగా ఉండటమే కాకుండా మానకొండూర్‌, చొప్పదండిపై కూడా ప్రభావం పడుతుందని, భారీ మెజార్టీతో వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి వినోద్‌ కుమార్‌ మాట్లాడుతూ.. కరీంనగర్‌ ఓటర్లను ఓట్లు అడిగే హక్కు తనకు ఒక్కడికే ఉందన్నారు. రూ.1000 కోట్లు తెచ్చి కరీంనగర్‌ను అభివృద్ధి చేశానని మరింత అభివృద్ధికోసం తననే గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌, మేయర్‌ వై.సునీల్‌రావు, డిప్యూటీ మేయర్‌ చల్ల స్వరూపరాణి హరిశంకర్‌, మాజీ ఎమ్మెల్సీ నారదాసులక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌, బీజేపీ కుమ్మక్కు

'కాంగ్రెస్‌ అభ్యర్థిని ఆ పార్టీ కార్యకర్తలే గుర్తుపట్టరు. కండువా లేకుండా చౌరస్తాలో నిలబడితే బస్సుకోసం చూస్తుండు అనుకుంటారు. అసొంటోన్ని తీసుకొచ్చి కాంగ్రెసోల్లు అభ్యర్థిగా పెట్టిర్రు. బీజేపీ, కాంగ్రెస్‌ కుమ్మక్కై వినోద్‌ కుమార్‌ను ఓడించే ప్రయత్నం చేస్తున్నారు. బీఆర్‌ఎస్‌ ఓడించి ప్రశ్నించే గొంతును నొక్కేయాలని చూస్తున్నారు' అని బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కె.తారకరామారావు విమర్శించారు. చొప్పదండిలో ఆదివారం రాత్రి నిర్వహించిన రోడ్‌షోకు బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌తో కలిసి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్‌ హామీలు నెరవేర్చలేదని, ఉచిత బస్సు ప్రయాణం ఎన్నికల తర్వాత ఎత్తేస్తారన్నారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌, ఎంపీపీ చిలుక రవిందర్‌, జెడ్పీటీసీ మాచర్ల సౌజన్య, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐకమత్య లోపంతోనే ఓటమి

బీఆర్‌ఎస్‌ను ప్రజలు ఓడించలేదని, పార్టీలో ఉన్న ఐక్యమత్యలోపమే ఓటమికి ప్రధాన కారణమని పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ అన్నారు. అల్గునూర్‌లో మానకొండూరు నియోజకవర్గస్థాయి బీఆ ర్‌ఎస్‌ బూత్‌ ముఖ్య నాయకుల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆదానీకంపెనీకి రూ.15లక్షల కోట్లు మాఫీచేసి దేశానికి మోదీ ద్రోహి అయ్యారని అన్నారు. రాష్ట్రంలో చోట బాయ్‌ రేవంత్‌ను గెలిపించినందుకు ప్రజలు సిగ్గుపడుతున్నారని పేర్కొన్నారు. దేవుళ్ల పేరు చెప్పి ఓట్లు అడగడం తప్ప, ఏమీ తెలియని బండి సంజయ్‌కి ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చా రు. విబేధాలు పక్కనపెట్టి పనిచేయాలని కార్యకర్తలను కోరారు. వినోద్‌ కుమార్‌ మాట్లాడుతూ మానకొండూర్‌ నియోజకవర్గంలో 25వేల మెజార్టీని సాధించవచ్చని తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్‌ కనుమల్ల విజయ, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌ రెడ్డి, టెస్కాబ్‌ చైర్మన్‌ కొండూరి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌, బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

డొంక కదిలేనా?



తెలంగాణ చౌక్‌ జంక్షన్‌

- స్మార్ట్‌సిటీ అక్రమాలపై విజిలెన్స్‌'
- నేడు విచారణకు బల్దియా అధికారులు
- రోడ్లు, జంక్షన్ల లోపాలపై విచారణ

కరీంనగర్‌ కార్పొరేషన్‌: ఊహించినట్లుగానే కాంగ్రెస్‌ ప్రభుత్వం కరీంనగర్‌ స్మార్ట్‌సిటీ అక్రమాలపై దృష్టి పెట్టింది. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో రూ.వందలకోట్లతో నగరంలో చేపట్టిన స్మార్ట్‌సిటీ పనుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ ఆరోపణలు, ఫిర్యాదులు వెల్లువెత్తడం తెలిసిందే. ఈ క్రమంలోనే నగరంలోని పలురోడ్లు, కూడళ్ల అభివృద్ధి పనులపై విజిలెన్స్‌ అధికారులు విచారణ చేపట్టారు. సోమవారం స్మార్ట్‌సిటీ పనులను పర్యవేక్షించిన నగరపాలకసంస్థ గత, ప్రస్తుత అధికారులను విచారించనున్నారు. స్మార్ట్‌సిటీ అక్రమాలపై విజిలెన్స్‌ అధికారులు తీగలాగుతుండగా డొంక కదలడం ఖాయమనే చర్చ మొదలైంది.

ఆరోపణలు.. ఫిర్యాదులు

కేంద్ర ప్రభుత్వ స్మార్ట్‌సిటీ జాబితాలో కరీంనగర్‌కు చోటు దక్కడంతో సుమారు రూ.వేయి కోట్లతో అభివృద్ధి పనులు మొదలయ్యాయి. వివిధ ప్యాకేజీల కింద రోడ్లు, కూడళ్లు, హెచ్‌బీకాలనీ, కమాండ్‌కంట్రోల్‌, ఆధునిక దోబీఘాట్‌లు, మార్కెట్‌, పార్క్‌లు తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. గత ఆరేళ్లుగా కొనసాగుతున్న స్మార్ట్‌సిటీ పనుల్లో దాదాపు 95శాతం పూర్తయ్యాయి. మిగతావి ప్రగతిదశలో ఉన్నాయి. పనులు జరుగుతున్న సమయంలోనే నాణ్యతపై, అంచనాల అక్రమాలపై అనేక ఆరోపణలు వచ్చాయి. వాస్తవ పనికి మించి అంచనాలు అడ్డగోలుగా పెంచారని, పనుల్లో నాసిరకం మెటీరియల్‌ వాడారని, నాణ్యత లోపించిందని అప్పట్లోనే ఉన్నతాధికారులకు పలువురు బీఆర్‌ఎస్‌ కార్పొరేటర్లు, వివిధ సంస్థలు ఫిర్యాదులు చేశాయి. అయితే అవేవీ కూడా విచారణకు నోచుకోలేకపోయాయి. రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకకూడా స్మార్ట్‌సిటీ అక్రమాలపై ఫిర్యాదులు వచ్చాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్‌సిటీ అక్రమాలపై దృష్టి సారించింది. ఈ క్రమంలోనే విజిలెన్స్‌ అధికారులు విచారణ చేపట్టారు.

17 పనులపై విచారణ

స్మార్ట్‌సిటీ పనులపై విజిలెన్స్‌ అధికారులు విచారణ మొదలు పెట్టడంతో మరోసారి అక్రమాల వ్యవహారం తెరపైకి వచ్చింది. ప్రస్తుతం స్మార్ట్‌సిటీ ప్యాకేజీ-3 కింద నగరంలో చేపట్టిన 17 పనులకు సంబంధించి ప్రత్యేకంగా విచారణ చేస్తున్నట్లు సమాచారం. నగరంలోని తెలంగాణ చౌక్‌ జంక్షన్‌, హౌసింగ్‌ బోర్డుకాలనీ చౌరస్తా జంక్షన్‌ (ఓల్డ్‌పవర్‌హౌస్‌), రాజీవ్‌రహదారి జంక్షన్‌, వన్‌టౌన్‌ పోలీసు స్టేషన్‌ జంక్షన్‌ (చొక్కారావు కూడలి)లతో పాటు, నగరంలోని వివిధ ప్రాంతాల్లో వేసిన రోడ్ల పనులపై విజిలెన్స్‌ దృష్టి సారించినట్లు తెలిసింది. స్మార్ట్‌ సిటీ పనులను పర్యవేక్షించిన నగరపాలకసంస్థకు చెందిన ఏడుగురు అధికారులను సోమవారం తమ కార్యాలయంలో హాజరు కావాల్సిందిగా ఇప్పటికే రీజినల్‌ విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారి ఆదేశాలు జారీ చేశారు. ఏడుగురిలో ముగ్గురు ఎస్‌ఈలు కాగా ఇద్దరు ఈఈలు, ఒక డీఈ, ఒక ఏఈ ఉన్నారు. ఇందులో ప్రస్తుతం ఒక డీఈ, ఏఈ మా త్రమే స్థానికంగా పనిచేస్తున్నారు. ఒకరు పదవీవిరమణ పొందగా, మిగతా అధికారులు వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్నారు. స్మార్ట్‌ సిటీ పనుల్లో అక్రమాలపై సంవత్సరాలుగా అనేక ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చినా ఇప్పటివరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. తాజాగా 17 పనులకు సంబంధించి విచారణ కొనసాగుతుండడం, ఇప్పటికే కొన్ని లో పాలు గుర్తించడంతో అక్రమాలు వెలుగులోకి వస్తాయనే చర్చ మొదలైంది. కొంతమంది నగరపాలకసంస్థ అధికారులు, కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ఇష్టారీతిన అంచనాలు పెంచి ఖజానాకు గండికొట్టారనే ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయి. విజిలెన్స్‌ విచారణలో ఈ అధికారులు, కాంట్రాక్టర్ల బాగోతాలు బయటకు వస్తాయనే చర్చ సర్వత్రా సాగుతోంది.

ఓటమి భయంతో కాంగ్రెస్‌ విషప్రచారం

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌



హుజూరాబాద్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న బండి సంజయ్‌కుమార్‌

హుజూరాబాద్‌: పార్లమెంట్‌ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో కాంగ్రెస్‌ విష ప్రచారం చేస్తోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ అన్నారు. హుజూరాబాద్‌లో ఆదివారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓట్లు అభ్యర్థిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గతంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు కేటాయించిన ఖాళీల్లో జనరల్‌ కేటగిరీ అభ్యర్థులతో నింపి కాంగ్రెస్‌ పార్టీ రిజర్వేషన్లకు తూట్లు పొడిచిందన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల కోసం బీజేపీ పకడ్బందీ చట్టం తెచ్చిందన్నారు. విద్యార్థులకు మెరిట్‌ స్కాలర్‌షిప్‌ల కోసం ఏడాదిలోనే రూ.59వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం మోదీదేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌ పార్టీ జిన్నా ఆలోచనలను అమలు చేస్తోందని, సుప్రీంకోర్టు వద్దన్నా మతపరమైన రిజర్వేషన్లు తెచ్చి పేదల పొట్టకొట్టిందన్నారు. రాజ్యాంగాన్ని మార్చేస్తామని కేసీఆర్‌ ప్రకటిస్తే ఆనాడు కాంగ్రెస్‌ నోరు మెదపలేదని, బీజేపీ తిరుగుబాటు చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్‌ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. మహిళలకు రూ.2500, రైతులకు రూ.500 బోనస్‌, ఎకరాకు రూ.15వేల రైతు భరోసా, ఇళ్లు లేనివారికి ఇంటిస్థలం, రూ.5 లక్షలు, విద్యార్థులకు రూ.5లక్షల భరోసాకార్డు, వృద్ధులు, వితంతవులకు రూ.4వేల పెన్షన్‌ ఇవ్వకుండా మళ్లీ ఓట్లు ఎలా అడుగుతున్నారని అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయని కాంగ్రెస్‌ వద్దని, మోదీ ప్రభుత్వం రావాలని అందరూ కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పట్టణాధ్యక్షుడు గంగిశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

మీకోసం ఎందాకైనా పోరాడతా

కరీంనగర్‌ టౌన్‌: 'నేను మీరు తయారు చేసిన నాయకుడిని.. నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చిన కరీంనగర్‌ పార్లమెంట్‌ నియోజకవర్గ ప్రజలకు కోసం చేయాల్సింది ఎంతో ఉంది. మీకోసం ఎందాకైనా పోరాడతా' అని కరీంనగర్‌ అభ్యర్థి బండి సంజయ్‌ కుమార్‌ అన్నారు. ఎల్‌ఐసీ ఏజెంట్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో గణేశ్‌నగర్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బండి సంజయ్‌ మాట్లాడుతూ.. ఎంపీగా ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశానని, ఎల్‌ఐసీ ఏజెంట్ల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లే బాధ్యత తనది అన్నారు. ఎంపీ లాడ్స్‌తో ఎల్‌ఐసీ ఏజెంట్ల అసోసియేషన్‌ భవనాలకు సౌకర్యాలు కల్పిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

అవినీతి సొమ్ముతో సంజయ్‌ పోటీ

- అభివృద్ధి చేసేందుకు ఒక్క అవకాశమివ్వండి
- కాంగ్రెస్‌ ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావు

కరీంనగర్‌రూరల్‌/కొత్తపల్లి: 2014 అసెంబ్లీ ఎన్నికల్లో భార్య మంగళసూత్రం అమ్మి పోటీచేసిన బండి సంజయ్‌ ఎంపీగా గెలిచి అక్రమంగా వందల కోట్లు సంపాదించారని కాంగ్రెస్‌ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. ఆదివారం కరీంనగర్‌ మండలం చామనపల్లిలో కాంగ్రెస్‌ పార్టీ కార్నర్‌ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా, రెండు పర్యాయాలు ఎంపీగా పోటీ చేసేందుకు బండి సంజయ్‌కు అంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పాలని డిమాండ్‌ చేశారు. ఎలాంటి వ్యాపారాలు, ఆస్తుల్లేని సంజయ్‌ అవినీతితో కోట్లాది రూపాయలు సంపాదించారని ఆరోపించారు. తనకు ఎంపీగా ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపెడతానని తెలిపారు. కొత్తపల్లి, బావుపేటలో మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే అంబేద్కర్‌ రచించిన రాజ్యాంగాన్ని రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలపై వివక్షతను కొనసాగిస్తారన్నారు. తనను గెలిపిస్తే బావుపేటను మండలంగా చేస్తానని, సొంత నిధులతో ఎస్సీకాలనీలో మినరల్‌ వాటర్‌ ప్లాంట్‌, ఓపెన్‌ జిమ్‌ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్‌, టీపీసీసీ అధికార ప్రతినిధి మెనేని రోహిత్‌రావు, జిల్లా కాంగ్రెస్‌ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.పద్మాకర్‌రెడ్డి, మండల కాంగ్రెస్‌ అధ్యక్షుడు కె.రాంరెడ్డి, బ్లాక్‌ అధ్యక్షుడు ఎస్‌.తిరుపతి, ఎలగందల్‌ ఎంపీటీసీ ఎం.రమేశ్‌గౌడ్‌ పాల్గొన్నారు.



చామనపల్లిలో మాట్లాడుతున్న కాంగ్రెస్‌ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు

క్లుప్తంగా

అంజన్నకు భక్తుడి భూ విరాళం



కొండగట్టు ఆలయం

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి భూమి విరాళంగా ఇచ్చేందుకు ఆదివారం ఓ భక్తుడు ముందుకు వచ్చాడు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన కప్పెర బాపురెడ్డి గ్రామంలోని తన 2.20 ఎకరాల భూమిని కొండగట్టు ఆలయానికి విరాళంగా ఇస్తానని, ఆలయ సూపరింటెండెంట్ సునీల్‌కు సంబంధిత పాస్‌బుక్, పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఈవో చంద్రశేఖర్‌తో మాట్లాడి త్వరలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తామని సూపరింటెండెంట్ పేర్కొన్నారు.

జగిత్యాల జిల్లాలో భానుడి ప్రతాపం

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకున్నాయి. వెల్గటూర్‌లో అత్యధికంగా 45.1 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకోగా, ఇబ్రహీంపట్నం గోదూర్‌లో 44.9, ధర్మపురి మండలం జైనాలో 44.5, బీర్‌పూర్ మండలం కొల్వాయి, జగిత్యాల రూరల్ మండలం పొలాసలో 43.9 డిగ్రీల సెల్సియస్ చొప్పున ఉష్ణోగ్రతలు నమోదైనాయి. కథలాపూర్‌లో 43.7, బుగ్గారం మండలం సిరికొండలో 43.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనాయి.

కరీంనగర్ డీఈవోకు షోకాజ్ నోటీస్

కరీంనగర్: ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తూ అక్రమ బదిలీకి పాల్పడిన కరీంనగర్ డీఈవో జనార్దన్‌రావుపై రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవో వికాస్‌రాజ్ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఈనెల 20న డీఈవో వ్యవహరించిన తీరుపై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు వివరాలు.. కరీంనగర్‌రూరల్ మండలం నగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పి.శ్రీనివాస్‌ను ఎస్సెస్సీ పరీక్షలో ఇన్విజిలేటర్‌గా విధులు నిర్వహించలేదనే కారణంతో మార్చి 19న పాఠశాల విధుల నుంచి డీఈవో సస్పెండ్ చేశారు. అనంతరం జరిగిన పరిణామాల్లో భాగంగా ఆ ఉద్యోగిని వీణవంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పునర్నియామకం చేస్తూ ఈనెల 8న ఉత్తర్వులు జారీ చే శారు. రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమలు లో ఉండగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా పని చేస్తున్న ఒక ఉద్యోగి సస్పెన్షన్, పునర్నియామకం ఎలక్షన్ కమిషన్ మార్గ నిర్దేశాల కు విరుద్ధంగా జరిగిందని డీటీఎఫ్ ఆరోపిస్తూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఈ మే రకు ఎన్నికల సంఘం డీఈవోకు షోకాజ్ నో టీసు జారీ చేసింది. దీంతో ఇప్పటికే అనేక వివాదాల్లో చిక్కుకొని ఆరోపణలు ఎదుర్కొంటు న్న డీఈవో వ్యవహారంపై ఎన్నికల కమిషన్ ఎ లాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

నివేశ్‌కు కన్నీటి వీడ్కోలు

హుజూరాబాద్: అమెరికాలో గత ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇంజినీరింగ్ వి ద్యార్థి ముక్క నివేశ్ (20) అంత్యక్రియలు హుజూరాబాద్‌లో ఆదివారం జరిగాయి. ప్రమాదం జరిగిన వారం రోజులకు మృతదేహం ఇంటికి చేరడంతో కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. నివేశ్ మృతదేహాన్ని చూసేందుకు ప్రజలు తరలివచ్చారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అంతిమ యాత్రలో పాల్గొని పాడె మోశారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు నివేశ్ మృతదేహానికి నివాళి అర్పించారు.

సెలవులొచ్చాయ్ జాగ్రత్త

- 'నాలుగు రోజుల క్రితం కోరుట్ల పట్టణం వెంకటసాయి నగర్‌లో ఓ వృద్ధురాలి మెడ నుంచి మోటార్‌సైకిల్‌పై మాస్క్ ధరించి వచ్చిన యువకులు రెండు తులాల చైన్ లాక్కెళ్లారు'.
- 'గురువారం మెట్‌పల్లిలో మండలం వెల్లుల్ల గ్రామంలో దొంగలు ఓ ఇంటి తాళం పగులగొట్టి ఐదున్నర తులాల బంగారం, వెండి, రూ.42వేల నగదు దోచుకెళ్లారు'.
- 'శుక్రవారం రాత్రి కోరుట్ల మండలం అయిలాపూర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. తాళాలు పగులగొట్టి సుమారు తులంన్నర బంగారం ఎత్తుకెళ్లారు'.
- 'జగిత్యాల జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్‌లో శుక్రవారం రాత్రి తాళం వేసి ఉన్న రెండు ఇండ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. తాళాలు పగులకొట్టి సుమారు రూ.60వేలు ఎత్తుకెళ్లారు'.

- ఇళ్లకు తాళాలు వేసి టూర్లకు వెళ్తున్నారా..?
- ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సిందే..
- జిల్లాలో వేసవి చోరీల ముఠా సంచారం..?
- అప్రమత్తమైన పోలీసులు.. పెరిగిన నిఘా

కోరుట్ల: జగిత్యాల జిల్లాలో వారం వ్యవధిలో వరుస చోరీలు చోటుచేసుకున్నాయి. నాలుగు చోరీల ఘటనలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఒక్కసారిగా పెట్రోలింగ్ పెంచడంతో పాటు రోజూ పట్టణాలు, మండలాల సరిహద్దుల్లో నాకాబందీ నిర్వహించి అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని వివరాలు ఆరా తీస్తున్నారు.

తాళం వేసిన ఇళ్లపై కన్ను..

ఏటా వేసవిలో పిల్లలకు సెలవులు ఉండడంతో చాలా మంది వివాహాది శుభకార్యాలు, పుణ్యక్షేత్రాల సందర్శన, విహారయాత్రలకు వెళ్తుంటారు. ఈ క్రమంలో ఇండ్లకు తాళాలు వేసి రోజుల తరబడి టూర్లకు వెళ్లడంతో దొంగలు చోరీలకు పాల్పడే అవకాశం చిక్కుతోంది. గత ఐదారేళ్లుగా వేసవిలో ఇండ్ల తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్న ఘటనలు పెరిగిపోతుండటంతో వేసవి రాగానే పోలీసు శాఖ అవసరమైన ముందు జాగ్రత్తలు చేపడుతున్నా అక్కడక్కడా చోరీలు జరుగుతున్నాయి. ఈ వేసవిలో పాఠశాలలకు సెలవులు ఇచ్చి వారం గడవక ముందే తాళాలు వేసి ఉన్న ఇండ్లలో చోరీలు మొదలయ్యాయి. జగిత్యాల జిల్లాలో తాళం వేసి ఉన్న ఇండ్లపై ఒకట్రెండు రోజులు నిఘా పెట్టి ఆ తర్వాత తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడే దొంగల ముఠా సంచరిస్తున్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో రాత్రి వేళ పెట్రోలింగ్ పెంచడంతో పాటు ఇదివరకు తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడిన పాత నేరస్తుల వివరాలు సేకరించి వారు ఎక్కడెక్కడ ఉన్నారు, ఏం చేస్తున్నారన్న అంశంపై లోతుగా విచారణ సాగిస్తున్నట్లు సమాచారం.



ఇటీవల మెట్‌పల్లి మండలం వెల్లుల్లలో ఓ ఇంట్లో వస్తువులను చిందరవందర పడేసిన దొంగలు

జాగ్రత్త పడితే మేలు..

- వేసవిలో ఇండ్లకు తాళాలు వేసి టూర్లకు, పుణ్యక్షేత్రాలకు వెళ్లేవారికి పోలీసులు కొన్ని జాగ్రత్తలు సూచిస్తున్నారు.
- ఇంట్లో విలువైన వస్తువులు, నగదు ఉంచకపోవడం ఉత్తమం. బంధువులు లేదా తెలిసిన వారి వద్ద వాటిని ఉంచి వెళ్తే పెద్ద నష్టం ఉండదు. బ్యాంకు లాకర్లలో ఉంచితే మేలు.
- ఇండ్లు విడిచిన నాలుగైదు రోజుల పాటు దూరంగా ఉండే పరిస్థితి ఉంటే పోలీసులకు తమ చిరుమానా వివరాలు ఇవ్వాలి. ఇంటికి ఎదురుగా ఉన్న తలుపులకు కాకుండా పక్కన ఉండే ద్వారాలకు తాళాలు వేయడం మంచిది. రోడ్డుపై సంచరించే వారికి ఎదురుగా తాళాలు వేసి కనిపిస్తే చోరీలకు ఆస్కారం ఉంటుంది. ఒకవేళ ఎదురుగా ఉన్న తలుపుకు తాళాలు వేయాల్సి వస్తే కర్టెన్ వేయాలి.
- ఇంట్లో సెక్యూరిటీ అలారం లేదా మోషన్ సెన్సార్ ఏర్పాటు చేసుకుంటే మంచిది. మోటార్‌సైకిళ్లను ఇంటి ఆవరణలో ఉంచి తాళాలు వేయాలి. ఇంట్లో సీసీ కెమెరాలను ఆన్‌లో ఉంచి వెళ్లాలి. తరచూ వాటిని సెల్‌ఫోన్‌లో గమనిస్తూ ఉండాలి. ఇంట్లో లేకున్నా కొన్ని గదుల లైట్లు వేసి ఉంచాలి.

అవసరమైన చర్యలు చేపట్టాం



వేసవిలో తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడే ముఠాలను పట్టుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాం. ఇప్పటికే రాత్రి వేళ పెట్రోలింగ్ పెంచడంతో బ్లూకోల్ట్స్ పహారా పెంచినం. రోజూ నాకాబందీ చేపట్టి అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నాం. ఇళ్లకు తాళాలు వేసేవారు సమాచారం ఇచ్చి పోలీసులు సూచించిన మేరకు ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. అనుమానాస్పద వ్యక్తుల సంచరిస్తే 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలి.

– ఉమామహేశ్వర్‌రావు, డీఎస్పీ, మెట్‌పల్లి

అస్తమించిన కార్మిక నేస్తం

- అనారోగ్యంతో కన్నుమూసిన కార్మిక పక్షపాతి సామల మల్లేశం
- జీవితకాలం ప్రజా పోరాటాలకు అంకితమైన నేత
- నివాళి అర్పించిన కేటీఆర్, వినోద్‌కుమార్, కేకే మహేందర్‌రెడ్డి, కమ్యూనిస్టులు

సిరిసిల్ల: జీవితకాలం ప్రజాపోరాటలకు అంకితమై, కార్మికవర్గ సమస్యల పరిష్కారానికి ఉద్యమించిన యోధుడు, కార్మిక పక్షపాతి, సీపీఐ నాయకుడు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామల మల్లేశం (78) అస్తమించారు. సిరిసిల్ల పట్టణం బద్దం ఎల్లారెడ్డినగర్‌కు చెందిన మల్లేశం కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మరణించారు. ఐదు దశాబ్దాలుగా ఆయన బీడీ, పవర్ లూమ్ కార్మికుల సమస్యలపై పోరాటం సాగించారు. కార్మిక ఉద్యమాల్లో కీలక భూమిక పోషించిన మల్లేశం సిరిసిల్ల కార్మిక క్షేత్రంలో పేదలకు భూమి పట్టాలు ఇప్పించారు. సిరిసిల్ల మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వర్‌రావు సహచరుడిగా పని చేశారు. సుభాష్‌నగర్‌లో కార్మిక భవన్ నిర్మాణం, కమ్యూనిస్ట్ పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారు. సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంకు డైరెక్టర్‌గా పని చేశారు. జిల్లా కేంద్రంలోని బీవైనగర్‌లోని ఆయన ఇంట్లోనే తుది శ్వాసను విడిచారు. ఆయనకు భార్య శ్యామల, కొడుకు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఆయన మృతదేహంపై ఎర్రజెండా కప్పి.. కామ్రెడ్ సామల మల్లేశం ఆశయాలు కొనసాగిస్తామంటూ.. కార్మికుల నినాదాల మధ్య .. కన్నీటి నివాళితో ఆయన అంత్యక్రియలు సిరిసిల్లలో నిర్వహించారు.

ప్రముఖుల నివాళి

సామల మల్లేశం అస్తమించారని తెలిసి సిరిసిల్ల ఎమ్మె ల్యే, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్ఎస్ నాయకులు తోట ఆగయ్య, గూడూరి ప్రవీణ్, జిందం చక్రపాణి ఆయన భౌతికకాయంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. సిరిసిల్ల కాంగ్రెస్ నాయకులు కేకే మహేందర్‌రెడ్డి, వైద్యశివప్రసాద్, కాముని వనిత, తిరుపతిరెడ్డి, అడ్వకేట్ శాంతిప్రకాశ్‌శుక్లా, కమ్యూనిస్ట్ పార్టీ నాయకులు మల్రి వెంకటస్వామి, గుంటి వేణు, పంతం రవి, కడారి రాములు, అజ్జ వేణు, సోమ నాగరాజు, మణికంఠరెడ్డి, సుతారి రాములు, కోడం రమణ, ఎల్లారెడ్డి తదితరు నాయకులు నివాళి అర్పించారు.



సామల మల్లేశం(ఫైల్)

కార్మిక లోకానికి తీరని లోటు

కరీంనగర్: సీనియర్ నాయకుడు, కార్మిక ఉద్యమ నేత సామల మల్లేశం అకాల మరణం సీపీఐకి, కార్మిక లోకానికి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్రి వెంకటస్వామి ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గంలో నాడు పార్టీ నిర్మాణంలో చెన్నమనేని రాజేశ్వర్‌రావుతో కలిసి పనిచేశారని, ఆ ప్రాంతంలో అనేక కార్మిక సంఘాలను నెలకొల్పి కార్మికుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణంలో బద్దం ఎల్లారెడ్డి పేరున ఒక కాలనీ ఏర్పాటు చేసి అనేక మంది పేదలకు ఇండ్లు నిర్మించిన మహనీయుడని కొనియాడారు. ఆయన మృతి పట్ల సీపీఐ కరీంనగర్ జిల్లా సమితి పక్షాన సంతాపం ప్రకటించారు.

శుభకార్యానికి వెళ్తూ అనంతలోకాలకు..

- డిచ్‌పల్లి వద్ద జరిగిన ప్రమాదంలో భార్య మృతి, భర్తకు గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదం ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో విషాదం నింపింది. శుభకార్యానికి వెళ్తున్న క్రమంలో భార్య మృతిచెందగా, భర్తకు తీవ్రగాయాలైనాయి. వివరాలు.. రాచర్లబొప్పాపూర్‌కు చెందిన మట్ట సురేశ్‌రెడ్డి, దీప్తి (45) దంపతులు కూతురు సమీక్షతో కలిసి బతుకుదెరువు రీత్యా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. నిర్మల్ జిల్లాలో బంధువుల ఇంట్లో ఆడెల్లి పోచమ్మ బోనాల పండుగ ఉండడంతో ఆదివారం ఉదయం హైదరాబాద్ నుంచి కారులో భార్యాభర్తలు బయలుదేరారు. డిచ్‌పల్లి వద్ద కారు అదుపుతప్పి బోల్తాపడడంతో దీప్తి ఘటన స్థలంలోనే మృతిచెందింది. సురేశ్ రెడ్డి తీవ్ర గాయాలకు గురికాగా, ప్రాణప్రాయం లేదని వైద్యులు తెలిపారు. తల్లి మరణవార్త విన్న కూతురు సమీక్ష కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. రాచర్లబొప్పాపూర్‌లోని బంధువులు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.



సురేశ్‌రెడ్డి-దీప్తి దంపతులు

శతాధిక వృద్ధురాలి కన్నుమూత



బుర్ర రాజమ్మ(ఫైల్)

ఎలిగేడు(పెద్దపల్లి): నర్సాపూర్ గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు బుర్ర రాజమ్మ ఆదివారం ఉదయం కన్నుమూసింది. రాజమ్మ వయసు 100 ఏళ్ల వయసుపైబడి ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఆమెకు కోడలు బుర్ర భాగ్యమ్మ, మనుమలు ఉన్నారు.

స్వగ్రామానికి మృతదేహం

కోరుట్లరూరల్: మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన మెహమ్మద్ నబి (55) గత నెలలో సౌదీలో ప్రమాదవశాత్తు మృతిచెందగా, అతడి మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. స్థానికుల వివరాలు.. మెహమ్మద్ నబి కొన్నేళ్లుగా బతుకుదెరువు కోసం సౌదీ వెళ్లి వస్తున్నాడు. గత నెలలో ఓ కంపెనీలో పని చేస్తుండగా పొక్లెయిన్ యాక్సిడెంట్ కావటంతో తీవ్రగాయాలైనాయి. తోటి కార్మికులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మార్చి 30న మృతిచెందాడు. గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్ విమానాశ్రయం నుంచి ఉచిత అంబులెన్స్ ద్వారా ఎన్నారై డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ సహకారంతో మృతదేహాన్ని మాదాపూర్‌కు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

విధుల్లో చేరిన నెల రోజులకే..

- రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడి దుర్మరణం

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): కొడుకు జీవితం బాగుండాలని తను అన్‌ఫిట్ అయి ఉద్యోగంలో చేర్పించిన నెల రోజులకే కుమారుడు మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. ముగ్గురు ఆడపిల్లల తర్వాత పుట్టిన ఒక్కగానొక్క కొడుకు సింగరేణి ఉద్యోగం చేసి కుటుంబానికి అండగా ఉంటాడని భావించిన ఆ తండ్రి ఆశలు అడియాశలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. యైటింక్లయిన్‌కాలనీ టీ2–187 క్వార్టర్‌లో నివాసముంటున్న సింగరేణి రిటైర్డ్ కార్మికుడు పెర్క శంకర్‌కు ముగ్గురు కూతుర్లు, కుమారుడు పెర్క హేమంత్(22) సంతానం. హేమంత్ ట్రెనింగ్ పూర్తి చేసుకుని ఆర్జీ–2 ఏరియా వకీల్‌పల్లి గనిలో బదిలీ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం డ్యూటీ నుంచి వచ్చి ఇంట్లో ఉండగా, అతడి స్నేహితులు రావడంతో బయటకు వెళ్లాడు. అనంతరం అర్ధరాత్రి తన స్నేహితుడు రోహిత్ హైదరాబాద్ వెళ్తాననడంతో అతడిని షిర్కె బస్‌స్టాప్ వద్ద బస్సు ఎక్కించేందుకు.. మరో స్నేహితుడు మణికంఠతో కలిసి ద్విచక్రవాహనంపై అతడి వద్దకు బయలుదేరారు. సంతోష్‌నగర్ ఏరియాలోని సులభ్‌కాంప్లెక్స్ వద్దకు చేరుకోగానే బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన కరెంట్ స్తంభానికి ఢీకొనడంతో హేమంత్ అక్కడికక్కడే మృతిచెందాడు. మణికంఠకు తీవ్రగాయాలు కాగా, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని 108లో గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపారు.



హేమంత్(ఫైల్)

గుండెపోటుతో బీజేపీ నాయకుడి మృతి



ఆది కేశవరావు(ఫైల్)

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మండలం కనగర్తి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు ఆది కేశవరావు(51) శనివారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. గోదావరిఖనిలో జరిగిన పార్టీ సమావేశానికి హాజరైన ఆయనకు అకస్మాత్తుగా ఛాతిలో నొప్పితో అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే చికిత్స కోసం కరీంనగర్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కేశవరావు విద్యార్థి దశనుంచి బీజేపీలో చేరి దాదాపు 30 ఏళ్లకు పైగా పనిచేశారు. ఆదివారం కనగర్తిలో జరిగిన అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణారెడ్డి, కాసిపేట లింగయ్య పాల్గొని పాడె మోశారు. చాలా ఏళ్లుగా కరీంనగర్‌లో నివాసముంటూ, అందరితో కలివిడిగా ఉండే కేశవరావు మృతితో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. మండల, గ్రామస్థాయి బీజేపీ నాయకులు అంత్యక్రియల్లో పాల్గొని కంటతడిపెట్టారు. కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య సుమలత, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

క్రేన్ బావిలో పడి మహిళ..



మల్లవ్వ మృతదేహం

వేములవాడరూరల్: పూడిక తీసేందుకు వినియోగించే క్రేన్ ప్రమాదవశాత్తు బావిలో పడిన ఘటనలో ఓ మహిళ మృతిచెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. వేములవాడ రూరల్ మండలం వట్టెంల గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో ఆదివారం ఫాజుల్‌నగర్‌కు చెందిన దండుగుల మల్లవ్వ (70), ఆమె కుమారుడు కొమురయ్య, కోడలు గంగమణి, మరో వ్యక్తి మేడుదుల దేవయ్యలో కలిసి పూడికతీత పని చేస్తుండగా ప్రమాదవశాత్తు క్రేన్ బావిలో పడింది. ఆ సమయంలో క్రేన్ నడుపుతున్న మల్లవ్వ కూడా బావిలో పడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మారుతి తెలిపారు.

చెరువులో మునిగి యువకుడు..



అనిల్ (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): ధర్మారం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బానోతు అనిల్ (26) ప్రమాదవశాత్తు చెరువు నీటిలో మునిగి మృతిచెందాడు. ఎస్సై సత్యనారాయణ వివరాల ప్రకారం.. మతి స్థిమితం సరిగా లేని అనిల్ శనివారం ఇంటి నుంచి బొమ్మారెడ్డిపల్లి వైపు వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం సాయంత్రం ధర్మారం శివారులోని ఊర చెరువులో అతడి మృతదేహం కనిపించింది. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువు నీటిలో పడి మరణించి ఉండవచ్చని అనిల్ తల్లి చిన్నమ్మ ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాహన తనిఖీల్లో మద్యం పట్టివేత

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని లింగంపేట రోడ్డులో ఆదివారం ఉదయం పట్టణ ఎస్ఐ నరేశ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టగా అంతర్గాం గ్రామానికి చెందిన షేర్ కిషన్ వద్ద రూ.13,200 విలువైన 12.60 లీటర్ల మద్యం పట్టుకుని కేసు నమోదు చేశారు. జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా చెర్లపల్లె గ్రామానికి చెందిన బండారి రాజిరెడ్డి తన ద్విచక్ర వాహనంలో తీసుకెళ్తున్న రూ.3,800 విలువైన 3.5 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. అలాగే కొత్తబస్టాండ్‌లో పట్టణ ఎస్ఐ మన్మథరావు వాహనాల తనిఖీ చేపట్టగా టీఆర్‌నగర్ గ్రామానికి చెందిన అనంతుల వెంకటి తన ద్విచక్ర వాహనంలో తీసుకెళ్తున్న రూ.6,376 విలువైన 10 లీటర్ల మద్యం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'బై బ్యాక్ పద్ధతి'లో సజ్జ సాగు

- క్వింటాల్‌కు రూ.7వేల చొప్పున విక్రయించేలా ఒప్పందం

జగిత్యాల అగ్రికల్చర్: వేసవి సీజన్‌లో జగిత్యాల జిల్లాలోని చాలా ప్రాంతాల్లో నువ్వులు, మొక్కజొన్న, పెసర, కంది పంటలకు ప్రత్యామ్నాయంగా సజ్జ సాగు చేస్తూ రైతులు మంచి ఆదాయం పొందుతున్నారు. సజ్జ పంటను విక్రయించేందుకు నేరుగా ప్రైవేట్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. వేసవిలో జిల్లాలో అనువైన వాతావరణ పరిస్థితులు ఉండటంతో సజ్జను విత్తనోత్పత్తిగా పలు కార్పొరేట్ కంపెనీలు ఇక్కడి రైతుల చేత ఉత్పత్తి చేయిస్తున్నాయి.

ధర ఆశాజనకంగా ఉండటంతో..

విత్తనోత్పత్తి చేసిన రైతులకు ప్రైవేట్ కంపెనీలు క్వింటాల్‌కు రూ.7 వేల వరకు ఇస్తున్నాయి. కంపెనీలే విత్తనాలు ఇవ్వడం, పంట పండిన తర్వాత బై బ్యాక్ పద్ధతిలో ఆ పంటను కొనుగోలు చేయడం రైతులకు కలిసివస్తుంది. జిల్లాలో అనువైన వాతావరణం ఉండటంతో ప్రైవేట్ కంపెనీలు ఇప్పటి వరకు వరి, ఆవాల పంటలో విత్తనోత్పత్తి చేయించగా, తాజాగా సజ్జలో చేయిస్తున్నాయి. అలాగే రైతులు ఎక్కువగా సాగు చేసే వరి, మక్క, పత్తి, కంది, పెసర వంటి పంటలకే ప్రభుత్వ మద్దతు ధర ఉండగా, మిగతావాటికి లేదు. దీంతో రైతులు ఏదైనా కొత్త పంట సాగు చేస్తే, ఆయా పంట ఉత్పత్తులు మార్కెట్‌కు వచ్చే వరకు ఏ ధర ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో, పంటకు ముందే ఫలానా ధర చెల్లిస్తామని కంపెనీలు ముందుకు రావడంతో రైతులు సజ్జ వైపు మొగ్గు చూపుతున్నారు. దీనికి తోడు తక్కువ కాలంలో పెద్దగా ఖర్చు లేకుండా పంట చేతికి అందుతుండటంతో ఈ పంట వైపు దృష్టి పెడుతున్నారు.



మెట్‌పల్లి ప్రాంతంలో సాగవుతున్న సజ్జ పంట

పదివేల ఎకరాల్లో..

జిల్లాలోని మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కథలాపూర్ ప్రాంతాల్లో ఎక్కువగా, జగిత్యాల, మేడిపల్లి, రాయికల్ ప్రాంతాల్లో మోస్తరుగా జిల్లా మొత్తంగా దాదాపు 10 వేల ఎకరాల్లో రైతులు బై బ్యాక్ పద్ధతిన సజ్జను సాగు చేశారు. కాగా జిల్లాలో అటవీ ప్రాంతం ఎక్కువగా ఉండటంతో మొక్కజొన్న, వేరుశనగ వంటి పంటలు వేస్తే అడవి పందులు, కోతులు, రామచిలుకలు తీవ్ర నష్టం చేస్తున్నాయి. వీటికి ప్రత్యామ్నాయ పంటగా రైతులు సజ్జ సాగు చేస్తున్నారు. ఐదారు నీటి తడులు ఇస్తే సరిపోతుండటం, పెద్దగా ఎరువులు వేసే అవకాశం లేకపోవడంతో పాటు పంట 85–90 రోజుల్లోనే చేతికి వస్తుంది.

ఎకరాకు కిలో విత్తనం

ప్రైవేట్ కంపెనీలే విత్తనాలు కిలోకు రూ.800 చొప్పున సరఫరా చేస్తున్నాయి. ఎకరాకు కిలో విత్తనాలు అవసరమవుతాయి. ఆడ, మగ విత్తనాలు ఇస్తారు. విత్తనోత్పత్తి కింద సాగు చేసిన రకాల్లో ఎకరాకు 10–14 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మంచి దిగుబడి వస్తే ఎకరాకు రూ.80 వేల వరకు ఆదాయం వచ్చే అవకాశముంది. ఇక్కడి పంటను సీడ్ కంపెనీలు పంజాబ్, హర్యానా, రాజస్తాన్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలకు సరఫరా చేస్తాయి. అక్కడ పాడి గేదెలకు ఆహారంగా, పశుగ్రాసంగా ఇక్కడి విత్తనాలు ఉపయోగిస్తారు. ఏదైనా గ్రామంలో 50 శాతం మంది రైతులకు 10 క్వింటాళ్ల కంటే తక్కువ దిగుబడి వస్తే పది క్వింటాళ్ల వరకు రేటు చెల్లిస్తారు. అంతకంటే ఎక్కువ దిగుబడి వస్తే ఆ మేరకు ధర చెల్లిస్తారు.

మంచి ఆదాయం



పసుపు, మొక్కజొన్న పంట పూర్తయిన తర్వాత నువ్వు పంటకు ప్రత్యామ్నాయంగా సజ్జ పంటను మా ఊర్లోనే 300 ఎకరాల్లో సాగు చేస్తున్నాం. కంపెనీలు చెప్పిన మాదిరిగా అన్ని రకాల యాజమాన్య పద్ధతులు పాటిస్తుండటంతో మంచి ఆదాయం వస్తుంది.

– మారు మురళీధర్‌రెడ్డి, వెల్లుల్ల, మెట్‌పల్లి

అనుకూల వాతావరణం



యాసంగిలో జగిత్యాల జిల్లాలో సజ్జ పంట విత్తనోత్పత్తికి అనుకూలమైన వాతావరణం ఉంటుంది. ఉష్ణోగ్రతలు అంతగానం తక్కువ, ఎక్కువ కాకుండా ఉంటాయి. దీంతో పంట దిగుబడులు బాగా వస్తున్నాయి. రైతులకు మంచి ఆదాయం వస్తుంది.

– మిట్టపెల్లి రాజేశ్‌రెడ్డి, జగ్గాసాగర్, మెట్‌పల్లి

రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు



గాయపడిన మైనొద్దీన్





గాయపడిన మహిళ, ఆమె కుమారుడు

కమాన్‌పూర్(మంథని): మండలంలోని మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారి నుంచి పోలీస్‌స్టేషన్ వెళ్లే దారిలో ఆదివారం రాత్రి జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు గాయపడ్డారు. స్థానికుల వివరాలు.. కమాన్‌పూర్‌కు చెందిన మైనొద్దీన్ ద్విచక్రవాహనంపై వస్తుండగా అదుపుతప్పి పడిపోవడంతో గాయపడ్డాడు. అలాగే యైటింక్లయిన్ కాలనీకి చెందిన శ్రీనివాస్, అతడి భార్య, కుమారుడు స్కూటీపై వస్తుండగా అదుపుతప్పి పడిపోవడంతో ముగ్గురికి గాయాలైనాయి. రోడ్డు కుంగిపోయి, గుంతలు పడడంతో నిమిషాల వ్యవధిలో రెండు ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదానికి గురైనాయి. రోజూ వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని ఇటీవల పోలీస్, రెవెన్యూ ఉద్యోగులు సైతం ప్రమాదాలకు గురయ్యారని స్థానికులు తెలిపారు. కొద్దిరోజుల క్రితం రహదారి విస్తరణ చేపట్టగా, పనులు నాసిరకంగా చేయడంతో రోడ్డు కుంగి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాహనదారులు, పేర్కొంటున్నారు.



నగరంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నరేందర్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీకి మద్దతివ్వండి

కరీంనగర్ కార్పొరేషన్: లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతునివ్వాలని, పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి కోరారు. ఆదివారం నగరంలోని 57వ డివిజన్ విద్యానగర్‌లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్‌రావుకు ఓటు వేయాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ బండి సంజయ్ కార్పొరేటర్‌గా ఉన్నప్పుడు 57వ డివిజన్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేదని విమర్శించారు. అలాంటి సంజయ్‌కి ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మామిడి సత్యనారాయణరెడ్డి, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, ఎజ్రా, అస్తపురం రమేష్, ఊరడి లత, మహాలక్ష్మి, తిరుమల, రజితా రెడ్డి, కిరణ్ రెడ్డి, జిలకర రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



రేకుర్తిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

కరీంనగర్ టౌన్: కరీంనగర్ పట్టణంలోని రేకుర్తి 17, 18 డివిజన్ 36, 37, 38, 39, 40, 365వ బూత్‌ల పరిధిలో బీజేపీ నాయకులు ఆదివారం ఇంటింటి ప్రచార నిర్వహించారు. గడపగడపకు నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, బండి సంజయ్ చేసిన అభివృద్ధి గురించి కరపత్రాలు పంపిణీ చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి, బూత్ అధ్యక్షులు మహేశ్వర్‌రెడ్డి, నాంపల్లి శంకర్, పింగిలి ప్రతాప్ రెడ్డి, ముదిమడుగుల లక్ష్మీరాజం, కీచర విష్ణు ప్రసాద్‌రెడ్డి, బండ రాకేశ్, కోఆర్డినేటర్లు మహిపాల్‌రెడ్డి, నరసింహారెడ్డి, దేవరాజ్, గోదారి నరేశ్, గోలె రమేశ్, చంద్రకాంత్, జనగం రజిత, దుర్గం భూమయ్య, లింభారెడ్డి, మల్లెపూల శ్రీనువాసు, వంశీ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



దుర్శేడ్‌లో చేతిపంపు నుంచి పైపులు తీస్తున్న సిబ్బంది

చేతిపంపులు తనిఖీ

సాక్షి ఎఫెక్ట్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో చేతిపంపులను అధికారులు తనిఖీ చేశారు. ఆదివారం 'సాక్షి'లో 'బోర్ల మరమ్మతులో అవినీతి' శీర్షికన ప్రచురితమైన కథనానికి పంచాయతీ, మిషన్ భగీరథ అధికారులు స్పందించారు. ఎంపీవో జగన్మోహన్ రెడ్డి, గ్రామ ప్రత్యేక అధికారి రామకృష్ణ, భగీరథ ఏడీఈ సూర్యప్రకాశ్ తదితరులు శనివారం మరమ్మతు చేసిన చేతిపంపులను పరిశీలించారు. హెల్త్ సబ్‌సెంటర్ వద్ద చేతిపంపును విప్పి పైపులను తనిఖీ చేశారు. అనంతరం మెకానిక్ అనిల్‌కుమార్ నుంచి రాతపూర్వక వాంగ్మూలం తీసుకున్నారు. గతంలో మరమ్మతు చేసినప్పుడు పాతపైపులకు రంధ్రాలు పడితే సైకిల్‌ట్యూబులు చుట్టి మళ్లీ వేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చీటీలు పంచుతూ.. అవగాహన పెంచుతూ

- పోల్ చీటీలతో ఓటు చైతన్యం
- ఓటర్లకు పంపిణీ చేస్తున్న బీఎల్‌వోలు
- పోలింగ్‌శాతం పెంచేలా చర్యలు


కరీంనగర్‌రూరల్: లోక్‌సభ ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో అధికారులు ఒక్కో ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. మే 13న పోలింగ్ ఉండటంతో ఓటుపై చైతన్యం కలిగించేందుకు బీఎల్‌వోలు ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లకు పోల్ చీటీలు పంపిణీ చేస్తున్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని అవగాహన కల్పిస్తున్నారు. ఈనెల 25 నుంచి వచ్చేనెల 8వరకు ప్రక్రియ పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కరీంనగర్ నియోజకవర్గంలో మొత్తం 3,67,353 ఓటర్లుండగా 395 పోలింగ్ కేంద్రాలున్నాయి.

పారదర్శకతను పెంచేందుకు..

గతంలో ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులు గ్రామాల్లోని పార్టీ కార్యకర్తల ద్వారా పోల్ చీటీలను ఇంటింటికీ పంపిణి చేయించే వారు. చీటీలపై రాజకీయ పార్టీ పేరు, పార్టీ గుర్తులుండేవి. ఓటర్లపై రాజకీయ పార్టీలు ఒత్తిడి చేసే ఈ పద్ధతికి ఎన్నికల సంఘం చెక్ పెట్టింది. గత అసెంబ్లీ ఎన్నికల నుంచి బీఎల్‌వోల ద్వారా ఇంటింటికీ పోల్ చీటీల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. కరీంనగర్ నియోజకవర్గంలోని కరీంనగర్ కార్పొరేషన్, కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలాల్లో గత మూడు రోజుల నుంచి ఓటర్లకు పోల్ చీటీలు పంపిణీ చేస్తూ ఓటుపై అవగాహన కల్పిస్తున్నారు.



చెర్లభూత్కూర్‌లో ఓటరుకు పోల్ చీటీ అందజేస్తున్న బీఎల్‌వో పద్మ



పోల్ చీటీ వెనుకభాగంలో పోలింగ్ కేంద్రం రూట్‌మ్యాప్

గూగుల్ మ్యాప్‌లో పోలింగ్ కేంద్రం

ఓటరుకు అందించే చీటీలపై ఓటరు పేరు, ఫొటో, చిరునామా, నియోజకవర్గం తదితర వివరాలుంటాయి. గతంలో జరిగిన ఎన్నికల్లో తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలియక ఓటర్లు ఆందోళనకు గురయ్యారు. పోలింగ్ కేంద్రాల సర్దుబాటులో పలుప్రాంతాల్లో చిరునామా మారాల్సి వస్తోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు గత అసెంబ్లీ ఎన్నికల నుంచి కొత్తగా ఓటరు చీటీల వెనుకవైపు పోలింగ్ కేంద్రం రూట్‌మ్యాప్ రూపొందించారు. నియోజకవర్గం, పోలింగ్ కేంద్రం నంబరు, బీఎల్‌వో సెల్‌ఫోన్ నంబర్ ముద్రించారు. ఎలాంటి సందేహాలున్నా ఆయా ఫోన్‌నంబర్లలో సంప్రదించే సదుపాయాన్ని కల్పించారు.

8వరకు చీటీల పంపిణీ

ఓటర్లందరికీ ఈ నెల 25నుంచి వచ్చేనెల 8 వరకు పోల్ చీటీలను బీఎల్‌వోల ద్వారా పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాం. ఓటింగ్‌శాతం పెంచేందుకు బీఎల్‌వోలు ఇంటింటికీ తిరుగుతూ చీటీలు అందిస్తు అవగాహన కల్పిస్తున్నారు.

– నవీన్‌కుమార్, ఏఈఆర్‌వో, కరీంనగర్ నియోజకవర్గం

చిత్ర కథ



ఎన్నికల సమావేశాలపై మూడో కన్ను

ఎన్నికల సమావేశాలపై మూడో కన్ను ఏమిటని అనుకుంటున్నారా.. అదేనండి నిఘా నేత్రం.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్ ఎంపీ నియోజకవర్గం పరిధిలో ఎఫ్‌ఎస్టీ బృందాల వాహనాల పైభాగంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆదివారం కరీంనగర్ మండలం చామనపల్లిలో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్నర్ సమావేశాన్ని అధికారులు వాహనాన్ని నిలిపివేసి సీసీ కెమెరా ద్వారా చిత్రీకరించారు. ఎంత మంది ప్రజలు హాజరయ్యారు, ఎన్ని వాహనాలు, కళాకారుల ఆటపాటలు, నాయకుల ప్రసంగాలను రికార్డు చేశారు. – కరీంనగర్‌రూరల్

క్లుప్తంగా

కాంగ్రెస్‌లోకి గందె కల్పన



కాంగ్రెస్‌లో చేరుతున్న గందె కల్పన

కరీంనగర్ కార్పొరేషన్: బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, ఆ పార్టీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు గందె కల్పన విశ్వేశ్వరరావు కాంగ్రెస్ గూటికి చేరారు. నగరంలోని 60వ డివిజన్‌కు చెందిన కల్పన తెలంగాణ జాగృతి ఉమ్మడి జిల్లా కన్వీనర్‌గా, రాష్ట్ర నాయకురాలిగా వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రస్తుతం బీఆర్ఎస్ మహిళా విభాగం నగర అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. నగరంలోని మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో ఆదివారం ఆమె కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, పార్లమెంట్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు, పార్టీ నాయకులు మాచర్ల ప్రసాద్, రాచకొండ చక్రధర్‌రావు, రజనీకాంత్ తదితరులు ఉన్నారు.

'బండి'ని కలిసిన సివిల్స్ విజేత

కరీంనగర్‌టౌన్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో 82వ ర్యాంకు సాధించిన సివిల్స్ విజేత మెరుగు కౌశిక్ ఆదివారం సాయంత్రం కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో బండి సంజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జనగాం జిల్లాకు చెందిన కౌశిక్‌ను బండి సంజయ్ అభినందించారు. పట్టుదల, అంకిత భావంతో పరీక్షలు రాసి అత్యున్నత ఉద్యోగానికి ఎంపిక కావడం మామూలు విషయం కాదన్నారు. సివిల్స్ ఉద్యోగంలో చేరిన తర్వాత సమాజంలో అట్టడుగునున్న పేదలను ఉన్నత స్థాయికి తీసుకొచ్చేలా కృషి చేయాలని కోరారు.

ఇండియా కూటమి విజయం సాధిస్తుంది

విద్యానగర్(కరీంనగర్): పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి ఘన విజయం సాధించి కేంద్రంలో అధికారంలోకి రాబోతుందని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. ఆదివారం ప్రజామిత్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులు ఇండియా కూటమి గెలుపునకు కృషి చేయలన్నారు. బీజేపీ తన పదేళ్ల పాలనలో సాధించింది ఏమి లేదన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పుతారని తెలిపారు.

పరామర్శ



అఖిల్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న గులాం అహ్మద్

విద్యానగర్(కరీంనగర్): ఇటీవల గుండెపోటుతో మరణించిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు సయ్యద్ అఖిల్ కుటుంబసభ్యులను ఆదివారం ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ పరామర్శించారు. అఖిల్ కుటుంబానికి ఎంఐఎం పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అఖిల్ కుటుంబసభ్యులను పరామర్శించిన వారిలో ఎంఐఎం జాయింట్ సెక్రెటరీ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాదిరి యూసుఫ్, 52వ డివిజన్ కార్పొరేటర్, ఫ్లోర్ లీడర్ మహ్మద్ అఖిల్ ఫిరోజ్, 52వ డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు మహ్మద్ అంజద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఇంటింటి ప్రచారం చేపట్టాలి

కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా నగరంలోని డివిజన్‌లలో ఇంటింటి ప్రచారం చేయాలని పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మల్లికార్జున రాజేందర్, ఎండీ.ఆరిఫ్ అన్నారు. ఆదివారం నగరంలోని 14, 15, 16, 37, 38, 55 డివిజన్‌లకు సంబంధించి మల్లికార్జున రాజేందర్, 4, 5, 27, 28, 29 డివిజన్‌లకు సంబంధించి ఆరిఫ్‌లు డీసీసీ కార్యాలయంలో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభేదాలు ప్రక్కన పెట్టి పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఎండలు మండుతున్నందున ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి ఇంటింటి ప్రచారం చేపట్టాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరుగ్యారంటీలను ప్రజలకు వివరిస్తూ ఓటు అభ్యర్థించాలని తెలిపారు. ఈ సమావేశాల్లో ఆయా డివిజన్‌లకు సంబంధించిన ముఖ్యనాయకులు పాల్గొన్నారు.



పార్టీ ముఖ్యనాయకులతో సమావేశమైన మల్లికార్జున రాజేందర్

బీఆర్ఎస్‌ను భూస్థాపితం చేయాలి

సప్తగిరికాలనీ(కరీంనగర్): పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని భూస్థాపితం చేయాలని తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపెల్లి అమర్‌నాథ్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని తెలంగాణ అంబేడ్కర్ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమిని చూసిన తర్వాత ఆ పార్టీ నాయకులు బీజేపీ, కాంగ్రెస్‌లలోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. పదేళ్ల అధికారంలో ఉండి దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానని, దళితులకు ప్రతీ కుటుంబానికి మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఇస్తానని, ప్రతీ కుటుంబానికి దళిత బంధు ఇస్తానని, అనేక రకాలుగా ఆశ చూపి దళితుల ఓట్లను దండుకొని చివరకు వారిని అవమానాలకు గురిచేశారని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు గోపాల భూషణ్ రావు, సంతోష్‌కుమార్, తిరుమలయ్య, పురుషోత్తం, విజయ్‌కుమార్, అనిల్ కుమార్, కత్తెర దేవదాస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అమర్‌నాథ్

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

చిగురుమామిడి: ఇందుర్తి–గాగిరెడ్డిపల్లి, సుందరగిరి వరకు, ఇందుర్తి–నవాబుపేట–కొండాపూర్ వరకు ఎంపీ నిధులు రూ.39కోట్లతో చేపట్టిన రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఏడు నెలల క్రితం రోడ్డు పనులకు కాంట్రాక్టర్లు శ్రీ కారం చుట్టి రోడ్డును తవ్వి కంకర పోసి వదిలేశారు. దీంతో ప్రజలు, వాహన చోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానికులు పలుమార్లు బండి సంజయ్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన రోడ్డు పనులు ప్రారంభించేలా చూశారు. ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపెల్లి శ్రీనివాస్, మండల కార్యదర్శి శ్రీనివాస్, బూత్ అధ్యక్షులు రాజు, సంతోష్, వెంకటేశం, పలువురు నాయకులు రోడ్డు పనులను పరిశీలించారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధిగా అజీమ్



అజీమ్‌కు నియామక పత్రం అందజేస్తున్న రాహుల్

కరీంనగర్ కార్పొరేషన్: యువజన కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధిగా నగరానికి చెందిన ఎండీ.అజీమ్ నియమితులయ్యారు. ఈమేరకు ఆదివారం యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పడాల రాహుల్ నియామకపత్రాన్ని అందచేశారు. తన నియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులకు ఈ సందర్భంగా అజీమ్ కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న బండి సంజయ్

కరీంనగర్ టౌన్: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ 44వ డివిజన్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆదివారం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ సమక్షంలో బీజేపీలో చేరారు. అంబేడ్కర్ క్లబ్ అధ్యక్షుడు కొంపల్లి రమణ్ కుమార్ ఆధ్వర్యంలో పావులా అనిల్ కుమార్, పిట్టల హరీశ్ కిరణ్, కొరివి కరుణాకర్, జి.చరణ్, క్రర నవీన్‌కుమార్, బి.శంకర్, సాయి ధనుష్, రుత్విక్, మేకల సిద్ధార్థ, పిట్టల ఆశీష్, బి.జైలుదాస్ తదితరులు ఆదివారం ఎంపీ కార్యాలయానికి విచ్చేసి సంజయ్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. వారందరినీ పార్టీలోకి ఆహ్వానించిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. మోదీ హయాంలోనే దేశ అభ్యున్నతి సాధ్యమన్నారు.

మద్దతుపై మే 5న తీర్మానం

సప్తగిరికాలనీ(కరీంనగర్): పార్లమెంట్ ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతు ఇవ్వాలో మే 5న తీర్మానిస్తామని రజక సంఘాల వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో జరిగిన తెలంగాణ రజక సంఘం రాష్ట్ర ప్రతినిధుల రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో రజకులను గుర్తించడంలో అన్ని పార్టీలు మోసం చేస్తున్నాయని అన్నారు. కుల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న రజకులను గత ఆంధ్ర ప్రభుత్వాలు తాత్కాలిక ప్రయోజనాలకే పరిమితం చేసి చిన్న చిన్న హామీలు అమలు చేస్తున్నారని తెలిపారు. రజకులను గుర్తించని పార్టీలకు రాజకీయ మనుగడ లేకుండా చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు శంకర్, కొమురయ్య, శంకర్, మల్లేశం, తిరుపతి, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

మలబార్ గోల్డ్ నాణ్యతకు బ్రాండ్

కరీంనగర్: మలబార్ గోల్డ్ నాణ్యతకు బ్రాండ్ అని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. ఆదివారం నగరంలోని తెలంగాణచౌక్ వద్ద మలబార్ గోల్డ్ డైమండ్స్ కొత్తగా పునరుద్ధరించిన కరీంనగర్ షోరూంను మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్‌తో కలిసి ప్రారంభించారు. నగర మేయర్ సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్, కార్పొరేటర్ వాల రమణారావు, నగర ప్రముఖులు, వినియోగదారులు, మలబార్ మేనేజ్‌మెంట్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.



మలబార్ గోల్డ్ షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల

హమాలీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కరీంనగర్‌రూరల్: హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.బుచ్చన్న యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం బొమ్మకల్‌లోని సిమెంట్ గోదాంల వద్ద జరిగే 138వ మే డే ఉత్సవాలను జయప్రదం చేయాలని వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుందన్నారు. ఎన్నో పోరాటాలను చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాల పునరుద్ధరణకు బీజేపీని ఓడించాలని కోరారు. జిల్లాలోని కార్మికులందరూ మే డే వేడుకలను ఘనంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిమెంట్ గోదాం అధ్యక్షుడు జంగం తిరుపతియాదవ్, ఉపాధ్యక్షుడు వీరయ్య, సభ్యులు కొమురయ్య, శ్రీనివాస్, రాములు, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు


ప్రైవేట్ పాఠశాలల దోపిడీపై ప్రత్యక్ష ఆందోళన

కరీంనగర్: ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల దోపిడీ, అనుమతి లేని పాఠశాలల గుర్తింపు రద్దుకై ప్రత్యక్ష ఆందోళనలు నిర్వహిస్తామని యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సంద గణేశ్ అన్నారు. ఆదివారం సంఘ కార్యాలయంలో తిరుపతి అధ్యక్షతన జరిగిన నగర కమిటీ సమావేశంలో మాట్లాడారు. విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే, ప్రభుత్వం ఎలాంటి అడ్మిషన్లకు అనుమతి ఇవ్వకముందే తమ ఇష్టానుసారంగా అడ్మిషన్లు చేస్తూ ఫీజులు వసూలు చేస్తున్నాయని అన్నారు. అనేక సందర్భాల్లో జిల్లా విద్యాధికారులకు ఫిర్యాదు చేసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. యజమాన్యాలతో విద్యాధికారులు కుమ్మక్కయ్యారని మండిపడ్డారు. విద్యాధికారుల నిర్లక్ష్యం వల్లనే నగరంలో ఉన్న ప్రైవేటు విద్యాసంస్థల యజమాన్యాలు విచ్చలవిడి వ్యవహరిస్తున్నాయని తెలిపారు. జిల్లా విద్యాధికారులపై కలెక్టర్ సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు కుమార్, నవీన్, తిరుపతి, మహేశ్, అఖిల్, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంద గణేశ్

పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారిగా రమేశ్



రమేశ్

సప్తగిరికాలనీ(కరీంనగర్): ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర కోశాధికారిగా కరీంనగర్ జిల్లాకు చెందిన రత్నం రమేశ్‌ను ఎన్నుకున్నారు. కొత్తగూడెంలో జరిగిన రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



దేశాయిపేట కొనుగోలు కేంద్రం పరిశీలిస్తున్న డీఆర్‌డీవో శ్రీధర్

చొప్పదండి: దేశాయిపేట వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్‌డీవో శ్రీధర్ ఆదివారం పరిశీలించారు. కేంద్రంలో ధాన్యం తరలింపులో జాప్యం జరుగుతోందని దృష్టికి రావడంతో.. డీఆర్‌డీవో అధికారులతో కలిసి కొనుగోలు కేంద్రానికి వచ్చారు. తరలింపు సమస్యతో కుప్పలు పేరుకుపోవడంతో ఆయన లారీ అసోషియేషన్ నాయకులతో మాట్లాడారు. లారీలను ఏర్పాటు చేసి కొనుగోలు చేసి తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే తరలించాలని సూచించారు. ట్రాన్స్‌పోర్టు సమస్యను పరిష్కరించడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఈసారి ఎవరు?

ప్రతి ఎన్నికల్లోనూ మార్పును ఆహ్వానిస్తున్న మల్కాజిగిరి ఓటర్లు

సాక్షి, మేడ్చల్ జిల్లా: దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గంతో పాటు మినీ భారత్‌గా పేరొందిన మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో గెలుపు మూడు ప్రధాన పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారింది. 37 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అయితే ప్రధానంగా బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మధ్యనే పోటీ కొనసాగుతోంది. సీనియర్ నేత, మాజీ మంత్రి ఈటల అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్, గజ్వేల్ స్థానాల నుంచి పోటీ చేసి ఓటమి పాలైన సంగతి తెలిసిందే. పట్నం సునీత జెడ్పీ చైర్‌పర్సన్‌గా మూడు పర్యాయాలు పనిచేశారు. ఇక అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్‌లో చేరిన రాగిడి ఈసారి ఆ పార్టీ అభ్యర్థిగా తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ముగ్గురు నేతలు కింది స్థాయి కార్యకర్తల పనితీరును సమన్వయం చేసుకుంటూ విజయమే లక్ష్యంగా ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. దీంతో ప్రతి ఎన్నికల్లోనూ మార్పును ఆహ్వానించే మల్కాజిగిరి ఓటర్ల తీర్పుపై ఆసక్తి నెలకొంది.

రేవంత్‌కు ప్రతిష్టాత్మకంగా కాంగ్రెస్ గెలుపు

మల్కాజిగిరి సిట్టింగ్ స్థానం కావటంతో పాటు ఇక్కడ ఎంపీగా పని చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ గెలుపు ప్రతిష్టాత్మకంగా మారింది. వాస్తవానికి చేవెళ్ల నుంచి పోటీ చేసేందుకు సిద్ధమైన సునీతా మహేందర్‌రెడ్డికి కాంగ్రెస్ అధిష్టానం మల్కాజిగిరి టికెట్ కట్టబెట్టింది. మహిళ కావటం, పార్టీ అధికారంలో ఉండటం, ఇటీవల బీఆర్‌ఎస్ సహా ఇతర పార్టీలకు చెందిన పలువురు నేతలు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరటం ఆమెకు కలిసొచ్చే అంశాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పైగా నియోజకవర్గంలోని నేతలందర్నీ సమన్వయం చేసే బాధ్యతను స్వయంగా రేవంత్‌రెడ్డి తీసుకోవటంతో సునీత విజయావకాశాలు మెరుగయ్యాయని అంటున్నారు. లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయగా నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు కనుసన్నల్లో ఎన్నికల ప్రచారం సాగుతోంది.


బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై గెలుపు భారం

అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గం పరిధిలో 7 అసెంబ్లీ స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో అక్కడ పార్లమెంట్ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఉప ఎన్నిక కూడా జరుగుతోంది. దీంతో ఇక్కడ గెలుపు బీఆర్‌ఎస్‌కు ప్రతిష్టాత్మకంగా మారింది. పార్టీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు రాగిడి గెలుపు కోసం అంత చురుగ్గా వ్యవహరించటం లేదని పార్టీ వర్గాల్లోనే విమర్శలు విన్పిస్తున్నాయి. బీఆర్‌ఎస్ టికెట్ దక్కించుకోవటంలో విజయం సాధించిన రాగిడి లక్ష్మారెడ్డి పార్టీలో నెలకొన్న అనిశ్చితిని తొలగిస్తేనే విజయం సాధ్యమవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ బలంగా ఉండటంతో బీఆర్‌ఎస్ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గం పరిధిలో పలు సమావేశాలకు హాజరవుతూ కేడర్ ప్రచారంలో పాల్గొనేలా ఉత్సాహపరుస్తున్నారు. రాగిడి కూడా భారీ ర్యాలీలతో వాతావరణాన్ని వేడెక్కిస్తున్నారు.



విజయమే లక్ష్యంగా బీజేపీ వ్యూహం

బీజేపీ టికెట్ ఈటలను వరించటం ఓ అనూహ్య పరిణామమని చెప్పవచ్చు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నేతగా పేరున్నప్పటికీ, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన రెండు స్థానాల్లో ఈటల ఓటమి పాలయ్యారు. అయితే పార్లమెంటు ఎన్నికలనేవి అనేక అంశాలపై ఆధారపడి జరిగేవి కావడం, ప్రధాని మోదీ చరిష్మా, హిందుత్వ నినాదం, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అండదండలు కలిసివచ్చే అంశాలుగా భావించవచ్చు. పార్టీలోని క్రియాశీలకమైన నాయకుల తోడ్పాటు సానుకూల అంశంగా చెప్పవచ్చు. ఇప్పటికే ప్రధాని మోదీ ఇక్కడ రోడ్ షో నిర్వహించటం, పలువురు కేంద్ర మంత్రులు కూడా స్థానికంగా ఎన్నికల సభల్లో పాల్గొని కేడర్‌ను ఉత్తేజితులను చేయటం గెలుపునకు అనుకూలతగా పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఈటల కూడా సామాజిక వర్గాల వారీగా ఆత్మీయ సమ్మేళనాల్లో విస్తృతంగా పాల్గొంటూ ఎన్నికల ప్రచారాన్ని వేడెక్కిస్తున్నారు.



కార్మికుల ఓట్లు కీలకం!

ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను కంటోన్మెంట్ మినహాయించి ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, మేడ్చల్, ఎల్బీనగర్ పరిధిలోని జీడిమెట్ల, బాలానగర్, శామీర్‌పేట్, మేడ్చల్, కుషాయిగూడ, చర్లపల్లి, మౌలాలి, నాచారం, మల్లాపూర్, ఉప్పల్ ప్రాంతాల్లో పారిశ్రామికవాడలున్నాయి. ప్రభుత్వ రంగ పరిశ్రమలతో పాటు ప్రైవేటులో ఇంజనీరింగ్, ఫార్మా, ఫుడ్ ఇండస్ట్రీలు ఉన్నాయి. మౌలాలి ప్రాంతంలో ఫ్యాబ్రికేషన్, స్టీల్, ప్లాస్టిక్ ఫర్నిచర్, కెమికల్, ఎలక్ట్రానిక్స్ తరహా పరిశ్రమలు ఉన్నాయి. కోకాకోలా కంపెనీల్లో కూడా కార్మికులు, ఉద్యోగులు ఉపాధి పొందుతున్నారు. బాలానగర్ పారిశ్రామికవాడ పరిధిలో ఫ్యాన్లు తయారు చేసే కంపెనీలు, ఆటోమొబైల్ వస్తువుల తయారీ, బీర్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్, ఫాబ్రికేషన్, వైర్ మెష్ యూనిట్లు, ఫుడ్ ప్రొడక్ట్స్, ఫార్మా యూనిట్లు తదితర కంపెనీలు ఉన్నాయి. ఐడీఏ బాలానగర్, ఐడీఏ కూకట్‌పల్లి, సీఐఈ గాంధీనగర్ ఒకే చోట ఉన్నాయి. శామీర్‌పేట్, మేడ్చల్ మండలాల్లో బయోటెక్, కెమికల్, ఇతర చిన్న తరహా పరిశ్రమలు ఉన్నాయి. గుండ్లపోచంపల్లిలో అపరెల్ టెక్స్‌టైల్ పార్కు ఉంది. తుర్కపల్లిలో ఐసీఐసీఐ నాలెడ్జి కంపెనీ పేరుతో పరిశ్రమల హబ్ ఏర్పడ్డాయి. ఘట్‌కేసర్, కీసరలలో కూడా చిన్న కంపెనీలు, వందలాది పరిశ్రమలు ఉన్నాయి. దీంతో ఈ పరిశ్రమల్లో పని చేసే కార్మికుల ఓట్లపై కూడా ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు ఓటములు ఆధారపడి ఉన్నాయనే చర్చ సాగుతోంది.

ఇక్కడ గెలిస్తే మంచి భవిష్యత్తు!

మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం పలువురు రాజకీయ నాయకులకు పునర్జన్మనిచ్చిందనటంలో అతిశయోక్తి లేదు. ఇక్కడ ఎంపీగా గెలుపొందిన నేతలకు తమ పార్టీలో అత్యున్నత పదవులు దక్కడమే కాకుండా పాలనా పరంగా ముఖ్యమంత్రిగా, కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా పని చేసే అవకాశం లభించింది. అదే సమయంలో ఇక్కడ పోటీ చేసి ఓడిపోయిన నాయకులకు కూడా రాజకీయ రంగంలో మేలు జరిగిందనే అభిప్రాం కూడా ఉండటం గమనార్హం.

- 2009లో కాంగ్రెస్ తరఫున గెలుపొందిన సర్వే సత్యనారాయణకు కేంద్రమంత్రి వర్గంలో స్థానం దక్కింది. 2014లో టీడీపీ తరఫున గెలుపొందిన చామకూర మల్లారెడ్డి తన పదవీ కాలం పూర్తి చేసుకోక ముందే మేడ్చల్ అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొంది మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్నారు.
- మహబూబ్‌నగర్ జిల్లా కొడంగల్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయిన రేవంత్‌రెడ్డి 2019 పార్లమెంట్ ఎన్నికల్లో అనూహ్యంగా మల్కాజిగిరి నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. తదనంతరం టీపీసీసీ అధ్యక్ష పదవిని దక్కించుకున్నారు. అలాగే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ కొడంగల్‌లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలుపొందిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఒక్కసారి కూడా మంత్రిగా పని చేయని రేవంత్‌రెడ్డి ఏకంగా సీఎం కావటానికి మల్కాజిగిరి నియోజకవర్గ సెంటిమెంటే కారణమని స్థానికులు చర్చించుకుంటూ ఉంటారు.
- 2019 పార్లమెంట్ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన మాజీ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి..ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి గెలుపొందడాన్ని కూడా స్థానికులు ప్రస్తావిస్తూ ఉంటారు.

అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓట్ల వివరాలు

అసెంబ్లీ సెగ్మెంట్	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు	మొత్తం
మేడ్చల్	3,40,218	3,25,703	58	6,65,979
మల్కాజిగిరి	2,55,325	2,52,712	11	5,08,048
కుత్బుల్లాపూర్	3,78,362	3,46,468	162	7,24,992
కూకట్‌పల్లి	2,51,424	2,30,506	126	4,82,056
ఉప్పల్	2,79,495	2,60,516	41	5,40,052
కంటోన్మెంట్	1,26,699	1,26,997	0	2,53,706
ఎల్బీనగర్	3,14,101	2,90,528	134	6,04,763
మొత్తం	19,45,624	18,33,430	542	37,79,596

మల్కాజిగిరి పార్లమెంట్‌లో గత ఎన్నికల్లో (2019) ప్రధాన పార్టీలు సాధించిన ఓట్ల వివరాలు

ఎనుముల రేవంత్‌రెడ్డి (కాంగ్రెస్)	మర్రి రాజశేఖర్‌రెడ్డి (టీఆర్‌ఎస్)	రామచందర్‌రావు (బీజేపీ)	మహేందర్‌రెడ్డి (జనసేన)
6,03,748	5,92,829	3,04,282	28,420

తెలంగాణలో తమిళిసై ప్రచారం

బీజేపీ వలంటీర్లతో నేడు రాక



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా మాజీ గవర్నర్, తమిళనాడు బీజేపీ నేత తమిళిసై సౌందరరాజన్ ప్రచారం చేయనున్నారు. తమిళనాడు బీజేపీ వలంటీర్లతో కలిసి చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో సోమవారం ఉదయం 8 గంటలకు నాంపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. అనంతరం పది రోజులకు పైగా రాష్ట్రంలోని అన్ని పార్లమెంటు నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తారు. తమిళులు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో తమిళనాడు బీజేపీ వలంటీర్లతో కలిసి ఆమె ప్రచారం చేస్తారు.

మల్లారెడ్డి ముందస్తు శుభాకాంక్షలు చెప్పారు

మల్కాజిగిరిలో నాదే గెలుపు అన్నారు: ఈటల

రసూల్‌పురా (హైదరాబాద్): ఎన్నికలకు పదిహేను రోజుల ముందే మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి తాను రెండు లక్షల మెజార్టీతో గెలుస్తున్నానని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తనకు ముందస్తు శుభాకాంక్షలు చెప్పారని బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. 'మల్కాజ్‌గిరిలో మీ గెలుపును బ్రహ్మదేవుడు కూడా ఆపలేరు. అడ్వాన్స్ కంగ్రాచ్యులేషన్స్'అని మల్లారెడ్డి ప్రజల నాడి పసిగట్టి చెప్పారని తెలిపారు. ఇక్కడ తన గెలుపు ఖాయమని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ ఒకటేనని కాంగ్రెస్ నాయకులు చెప్పడం సిగ్గుచేటని అన్నారు. కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గంలోని తిరుమలగిరి అరుణ్ ఎన్‌క్లేవ్ పరిసర కాలనీల్లో ఈటల రాజేందర్ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

'అధికారం పోతుందని భయపడుతున్న మోదీ'

సాక్షి, హైదరాబాద్: కేంద్రంలో తాము అనుభవించిన పదేళ్ల అధికారం పోతుందని ప్రధాని మోదీ భయపడుతున్నారని రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హన్మంతరావు పేర్కొన్నారు. గాంధీభవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఏడాదికి ఒకరు ప్రధాని అవుతారని మోదీ చెబుతున్న మాటలు ఆయనలోని భయాన్ని బహిర్గతం చేస్తున్నాయన్నారు. ఇండియా కూటమికి మూడంకెల సీట్లు రావని ఓవైపు చెబుతూనే సంవత్సరానికి ఒక ప్రధాని అవుతారని ఎట్లా అంటున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ కులగణన చేస్తామని చెప్పడంతో బీజేపీ దిగజారి మాట్లాడుతుందని విమర్శించారు. పదేళ్ల పాలనలో మోదీ అయోధ్య కట్టడం తప్ప చేసిన అభివృద్ధి ఏంలేదన్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

- ఇప్పటివరకు రూ.104 కోట్ల విలువైన సొత్తు స్వాధీనం
- పట్టుబడిన దానిలో రూ.63.41 కోట్ల నగదు
- పోలీసు శాఖ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. మార్చి 16న ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఆదివారం వరకు రాష్ట్రవ్యాప్తంగా పోలీసుల తనిఖీల్లో మొత్తం రూ.104,18,76,091 విలువైన నగదు, మద్యం, గంజాయి, డ్రగ్స్, ఇతర విలువైన వస్తువులు పట్టుబడినట్లు పోలీసు శాఖ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి మొత్తం 477 చెక్‌పోస్టులు, రాష్ట్ర సరిహద్దుల్లో 89 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. అదేవిధంగా ఈనెల 18 నుంచి 464 స్ట్రాటజిక్ సర్వైలెన్స్ టీంలను ఏర్పాటు చేసి నగదు, మద్యం, మత్తుపదార్థాల అక్రమ రవాణాపై దృష్టిపెట్టినట్టు వివరించారు.

మార్చి 16 నుంచి ఈనెల 28 వరకు తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న సొత్తు

నగదు: రూ.63,41,66,697
మద్యం (విలువ రూ.లలో): రూ.5,38,12,583
గంజాయి, ఇతర మత్తుపదార్థాలు: రూ.7,12,31,697
బంగారం (34.333 కేజీలు), వెండి (70.734కేజీలు): రూ. 21,34,75,691
ఇతర వస్తువుల విలువ: రూ.6,91,89,423

అయితే తిట్టు.. లేదంటే ఒట్టు

అరచేతిలో వైకుంఠం చూపి గద్దెనెక్కారు

- మైనార్టీలకు మంత్రి పదవి ఇవ్వలేకపోయారు
- సీఎం రేవంత్‌పై హరీశ్‌రావు ధ్వజం
- రాష్ట్రంలో త్వరలోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం వస్తుందని వ్యాఖ్య



వెల్దుర్తిలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

వెల్దుర్తి (తూప్రాన్), చిన్నశంకరంపేట(మెదక్): సీఎం రేవంత్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని, అయితే తిట్టు.. లేదంటే ఒట్టు అన్నట్లుగా ఆయన విధానం ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. దేవుడిని అడ్డం పెట్టుకొని రేవంత్‌రెడ్డి రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో, చిన్నశంకరంపేటలో నిర్వహించిన సభలో హరీశ్ మాట్లాడారు. తప్పుడు వాగ్దానాలతో గద్దెనెక్కిన గుంపుమేస్త్రీ గువ్వ గుయ్యిమనేలా ఓటర్లు ఎంపీ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని పిలుపునిచ్చారు. హామీల అమలు చేయమని సవాల్ చేస్తే తోక ముడిచి పారిపోయారని విమర్శించారు. మండుటెండల్లో గోదావరి నీరు తెచ్చి ఈ ప్రాంత ప్రజల కాళ్లు కడిగిన మాజీ సీఎం కేసీఆర్ రుణం తీర్చుకోవాలని కోరారు. బీజేపీకి ఓటేస్తే ప్రజల పరిస్థితి పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డ చందంగా మారుతుందన్నారు.

బీజేపీతో చేతులు కలిపి ముస్లింలకు మోసం

మైనార్టీలకు కనీసం కేబినెట్‌లో మంత్రి పదవి కూడా ఇవ్వలేదని, ముస్లింలను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. బీజేపీతో చేతులు కలిపి ముస్లింలను రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కనీసం రంజాన్ తోఫా కూడా అందించలేకపోయారని విమర్శించారు. కాంగ్రెస్ హామీలు అమలు చేస్తే తాను రాజీనామా చేస్తానని సవాల్ విసిరితే సీఎం పారిపోయారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో త్వరలోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం వస్తుందని.. ప్రజలకు మేలు చేస్తుందని హరీశ్ చెప్పుకొచ్చారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగింది

బీఆర్‌ఎస్ నేత పటోళ్ల కార్తీక్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో విపరీతమైన వ్యతిరేకత పెరిగిందని బీఆర్‌ఎస్ నేత పటోళ్ల కార్తీక్‌రెడ్డి పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వానికి రానంత వ్యతిరేకత కొద్ది రోజుల్లోనే కాంగ్రెస్ సర్కార్‌పై వచ్చిందని ఆయన విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం పటోళ్ల మీడియాతో మాట్లాడుతూ...ఎవరు ఏం చెప్పినా నమ్మే తెలంగాణ ప్రజలు మోసాన్ని సైతం వెంటనే పసిగడుతారన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసాలను తెలంగాణ ప్రజలు గ్రహించారని, ఆరు గ్యారంటీల్లో ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదని తెలిపారు. సాగు, తాగు నీటి కోసం, కరెంటు కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కేసీఆర్, రేవంత్ రెడ్డి పాలనకు తేడాను ప్రజలు గమనించారని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారమదం తలకెక్కిందా అని ప్రముఖ జాతీయ జర్నలిస్ట్ బర్కాదత్ ట్వీట్ చేశారని, సీఎం భద్రతా సిబ్బంది తనను ఎలా నెట్టి వేసిందో ఆమె చెప్పారని తెలిపారు.

ముస్లిం రిజర్వేషన్లనే రద్దు చేస్తాం

వాటిని మిగతా వర్గాలకు పంచుతాం

- రిజర్వేషన్ల రద్దు.. కాంగ్రెస్ విష ప్రచారమే
- ఆరు గ్యారంటీలపై ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ డ్రామాలు
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

హుజూరాబాద్: 'స్వదేశీ బీజేపీకి.. విదేశీయుడు స్థాపించిన కాంగ్రెస్ పార్టీకి మధ్య ఎన్నికల పోరు జరుగుతోంది'అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ అన్నారు. రిజర్వేషన్ల రద్దు ప్రచారం రాజకీయ లబ్ధికోసమేనన్నారు. వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తామని మోసం చేసిన కాంగ్రెస్ పార్టీపై ప్రజలు ఆగ్రహంతో ఉండటంతో వారి దృష్టిని మళ్లించేందుకు ఆడుతున్న రాజకీయ డ్రామా అని విమర్శించారు. ఆదివారం ఆయన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో 'ఇంటింటికీ బీజేపీ'పేరుతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, రాజ్యాంగాన్ని తూ.చ. తప్పకుండా అమలు చేసే పార్టీ బీజేపీ అని, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మత రిజర్వేషన్లకు రాజ్యాంగం వ్యతిరేకమైనప్పటికీ..సుప్రీం కోర్టు తీర్పులను సైతం ధిక్కరించి ముస్లింలకు రిజర్వేషన్లు అమలు చేస్తున్న పార్టీ కాంగ్రెస్ అని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం ప్రకారం ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేసి.. వాటిని ఎస్సీ, ఎస్టీ, బీసీలతోపాటు అగ్రవర్ణాల్లోని పేదలకు పంచుతామన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తామని కేసీఆర్ ప్రకటిస్తే కనీసం నోరు మెదపని కాంగ్రెస్ నేతలు అంబేడ్కర్‌ను అడుగడుగునా అవమానించారన్నారు. అంబేడ్కర్‌ను ఓడించడంతోపాటు ఆయన చనిపోతే పార్థివదేహాన్ని ఢిల్లీలో ఉంచకుండా, ముంబైకి పంపించిన నీచమైన పార్టీ కాంగ్రెస్సేనని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్ ఏనాడూ జనం గురించి పట్టించు కోలేదన్నారు. కరీంనగర్‌కు కేంద్రం ఇచ్చిన నిధులను కేసీఆర్ దారి మళ్లిస్తే ఆయన నోరు విప్పలేదని, ఇక్కడి ప్రజలు బాధల్లో ఉంటే ఏనాడూ పట్టించుకోలేదని, కేసీఆర్‌కు దోచి పెట్టడం, తన కుటుంబానికి దాచి పెట్టడం తప్ప సాధించిందేమీ లేదని ధ్వజమెత్తారు. కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఎవరో ప్రజలకు ఆ పార్టీ నేతలకు కూడా తెలియదని ఎద్దేవా చేశారు. తమ పార్టీ అగ్రనేత అమిత్ షా ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేసి, పేదలకు అందజేస్తామని ప్రకటిస్తే కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో ముస్లిం అనే పదాన్ని తొలగించి రిజర్వేషన్లనే రద్దు చేస్తామన్నట్లుగా దుష్ప్రచారం చేయడం సిగ్గు చేటన్నారు. తాము రిజర్వేషన్లు ఎక్కడ ఎత్తివేశామో చెప్పాలని ప్రశ్నించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బండి సంజయ్

అలా రుజువు చేస్తే పోటీ నుంచి తప్పిస్తా


- బీజేపీ హామీలను అమలు చేసినట్టు నిరూపిస్తారా
- సంజయ్‌కు మంత్రి పొన్నం సవాల్



కొత్తపల్లి (కరీంనగర్): బీజేపీ ప్రభుత్వం పదేళ్లలో ఇచ్చిన హామీలు నెరవేర్చినట్లు రుజువు చేస్తే కాంగ్రెస్ అభ్యర్థిని పోటీ నుంచి తప్పిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. బీజేపీ నేత, ఎంపీ బండి సంజయ్‌కు సవాల్ విసిరారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తే పోటీ నుంచి తప్పుకుంటానన్న సంజయ్ సవాల్‌కు మంత్రి పైవిధంగా ప్రతి సవాల్ చేశారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బావుపేటలో కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుతో కలిసి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో పొన్నం మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ఆర్టీసిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.10 లక్షల ఆరోగ్యబీమా అందిస్తున్నామని తెలిపారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రూ.15 లక్షలను ఒక్కొక్కరి ఖాతాలో వేశారా..?, 2 కోట్ల ఉద్యోగాలిచ్చారా..?, రైతుల ఆదాయం రెట్టింపు చేశారా?, రైతులకు పెన్షన్ ఇచ్చారా? అని నిలదీశారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా ప్రజలను బీజేపీ నేతలు ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. దేవుడు గుళ్లో ఉండాలి.. భక్తి గుండెల్లో ఉండాలని..రాముడి ఫొటోతో ఓట్లు అడగడం ఎంత వరకు సమంజసమని పొన్నం నిలదీశారు.

నేటితో ఉపసంహరణకు గడువు ముగింపు

- 17 స్థానాల్లో 625 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం
- 16 నియోజకవర్గాల్లో 15మందికి మించి అభ్యర్థుల నామినేషన్లు
- ఆయా చోట్ల ఒకటికి మించిన సంఖ్యలో బ్యాలెట్ యూనిట్ల వినియోగం?
- నామినేషన్ల ఉపసంహరణ తర్వాత రానున్న స్పష్టత



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల్లో అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారంతో ముగియనుంది. అనంతరం ఎన్నికల బరిలో మిగలనున్న తుది అభ్యర్థుల జాబితాలు వెల్లడి కానున్నాయి. పరిధిలో మొత్తం 893 మంది నామినేషన్లు దాఖలు చేయగా, వివిధ కారణాలతో 268 మంది అభ్యర్థుల నామినేషన్లను శుక్రవారం నిర్వహించిన పరిశీలనలో తిరస్కరించారు. మొత్తంగా 625 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించారు. ఎవరైనా అభ్యర్థులు తమ అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకోవాలనుకుంటే సోమవారం మధ్యాహ్నం 3 గంటలలోగా స్థానిక లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నిర్దేశిత ఫారం-5 దరఖాస్తును సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థి స్వయంగా లేదా తన ఎన్నికల ఏజెంట్/ప్రపోజర్ ద్వారా రిటర్నింగ్ అధికారికి ఫారం-5 దరఖాస్తును సమర్పించాలి. అభ్యర్థి తరఫున ఏజెంట్/ప్రపోజర్ ఫారం-5 దరఖాస్తును సమర్పించే సందర్భాల్లో వారికి నామినేషన్ ఉపసంహరణ దరఖాస్తును సమర్పించడానికి అధికారం(ఆథరైజేషన్) కల్పిస్తూ అభ్యర్థి రాతపూర్వకంగా జారీ చేసిన లేఖను సైతం జత చేయాల్సి ఉంటుంది.

ఈ స్థానాల్లో బ్యాలెట్ బద్దలు కావాల్సిందే

రాష్ట్రంలోని 16 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఈసారి ఒకటికి మించి ఎక్కువ సంఖ్యలో బ్యాలెట్ యూనిట్లను వినియోగించాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. నామినేషన్ల ఉపసంహరణ తర్వాతే పూర్తి స్పష్టత వస్తుంది. రాష్ట్రంలోని 16 లోక్‌సభ నియోజకవర్గాల్లో 15 మందికి మించి అభ్యర్థుల నామినేషన్లు చెల్లుబాటైనట్టు ఎన్నికల యంత్రాంగం ప్రకటించింది. లోక్‌సభ స్థానాల వారీగా పరిశీలిస్తే పెద్దపల్లిలో 49 మంది, కరీంనగర్‌లో 33 మంది, నిజామాబాద్‌లో 32 మంది, జహీరాబాద్‌లో 26 మంది, మెదక్‌లో 53 మంది, మల్కాజ్‌గిరిలో 37 మంది, సికింద్రబాద్‌లో 46 మంది, హైదరాబాద్‌లో 38 మంది, చెవెళ్లలో 46 మంది, మహబూబ్‌నగర్‌లో 35 మంది, నాగర్‌కర్నూల్‌లో 21 మంది, నల్లగొండలో 31 మంది, భువనగిరిలో 51 మంది, వరంగల్‌లో 48 మంది, మహబూబాబాద్‌లో 25 మంది, ఖమ్మంలో 41 మంది అభ్యర్థుల నామినేషన్లను ఎన్నికల యంత్రాంగం ఆమోదించింది. నామినేషన్ల ఉపసంహరణ ముగిసిన తర్వాత ఆయా స్థానాల్లో ఎన్ని బ్యాలెట్ యూనిట్లతో ఎన్నికల నిర్వహించాలో స్పష్టత రానుంది. 15మంది అభ్యర్థులు, ఆలోపు ఉంటే ఒక బ్యాలెట్ యూనిట్ సరిపోనుంది. అభ్యర్థుల సంఖ్య 16-31 మధ్యలో ఉంటే రెండు బ్యాలెట్ యూనిట్లు అవసరం కానున్నాయి. అభ్యర్థుల సంఖ్య 32-47 మధ్య ఉంటే మూడు బ్యాలెట్ యూనిట్లను వాడాల్సి ఉండనుంది. 48-63 మధ్యలో ఉంటే నాలుగు బ్యాలెట్ యూనిట్లు వినియోగించక తప్పదు. ప్రస్తుతానికి అత్యధికంగా మెదక్ స్థానంలో 53 మంది, భువనగిరి స్థానంలో 51 మంది అభ్యర్థులుండడం గమనార్హం.

ఖనిజం ఎవరికి సొంతం?!

గత ఎన్నికల్లో బీజేపీదే ఆధిపత్యం

నిలువరించేందుకు కాంగ్రెస్ యత్నం

స్టేట్ స్కాన్

హంగ్ ప్రభుత్వాలు. పదేపదే సీఎంల మార్పు. రాష్ట్రపతి పాలన. నేతల అరెస్టులు. ఇలాంటి పరిణామాలతో రాజకీయ అస్థిరతకు నెలవుగా మారింది జార్ఖండ్. దేశ ఖనిజ వనరుల్లో 40 శాతానికి నెలవైనా, అపారమైన సహజ వనరులున్నా 40 శాతం ప్రజలు పేదరికంలో మగ్గుతున్నారు. భారీ అటవీ సంపద ఉండటంతో మావోయిస్టుల ప్రాబల్యమూ ఎక్కువే. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలు, కాంగ్రెస్ మెరుగైన ప్రదర్శన చేస్తున్నా లోక్‌సభకు వచ్చేసరికి జార్ఖండ్‌లో పదేళ్లుగా కమనాథులే సత్తా చాటుతున్నారు. ఈసారి క్లీన్‌స్వీప్‌పై కన్నేసిన బీజేపీని అడ్డుకోవడానికి కాంగ్రెస్ సారథ్యంలో ఇండియా కూటమి సర్వశక్తులూ ఒడ్డుతోంది...

- సాక్షి, నేషనల్ డెస్క్

జార్ఖండ్ రాజకీయాల్లో నిత్యం ఏదో అలజడి రేగుతూనే ఉంటుంది. జార్ఖండ్ ముక్తి మోర్చా చీఫ్ హేమంత్ సోరెన్ మనీ లాండరింగ్ కేసులో అరెస్టవడంతో ఆయన అనుచరుడు చంపయ్ సోరెన్ సీఎంగా పగ్గాలు చేపట్టారు. బీజేపీ ఇక్కడ పదిహేనేళ్లుగా లోక్‌సభ ఎన్నికల్లో బలం పెంచుకుంటూ వస్తోంది. గత ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమి హవాయే సాగింది. 14 స్థానాలకు గాను బీజేపీ 13 చోట్ల పోటీ చేసి 11 సీట్లు చేజిక్కించుకుంది. భాగస్వామ్య పక్షం ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఏజేఎస్‌యూ) ఒకచోట పోటీ చేసి గెలిచింది. కాంగ్రెస్ ప్రాభవం అంతకంతకూ మసకబారుతోంది. 2004లో 12 లోక్‌సభ సీట్ల నుంచి 2009లో ఒక్క సీటుకు దిగజారింది. 2014లోనైతే ఏకంగా సున్నా చుట్టింది! 2019లో జేఎంఎం, జార్ఖండ్ వికాస్ మోర్చా (జేవీఎం)తో కలసి పోటీ చేసినా లాభం లేకపోయింది. కాంగ్రెస్ 7, జేఎంఎం 4 చోట్ల పోటీ చేసి చెరో సీటు గెలచుకున్నాయి. జేవీఎం ఖాతా తెరవలేదు.



జార్ఖండ్ సంప్రదాయ నృత్యం ఛావూ

ఉప ఎన్నికల బరిలో కల్పన...

హేమంత్ సోరెన్ అరెస్టుతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఆయన భార్య కల్పన ఎన్నికల సమరానికి సై అంటున్నారు. గాండే అసెంబ్లీ స్థానానికి మే 20న జరిగే ఉప ఎన్నికల్లో జేఎంఎం తరఫున ఆమె పోటీ చేయనున్నారు. జేఎంఎం సిట్టింగ్ ఎమ్మెల్యే సర్ఫరాజ్ అహ్మద్ రాజీనామాతో ఇక్కడ ఉప ఎన్నిక జరుగుతోంది. కల్పనను ఎమ్మెల్యేను చేసి సీఎం సీట్లో కూర్చోబెట్టేందుకే అహ్మద్‌తో రాజీనామా చేయించారని బీజేపీ ఆరోపిస్తోంది. ఇండియా కూటమి తరఫున కల్పన జోరుగా ప్రచారం చేస్తున్నారు.

ఇండియా కూటమి సై...

రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వ భాగస్వాములైన కాంగ్రెస్, జేఎంఎం, ఆర్జేడీ, సీపీఐ(ఎంఎల్) ఇండియా కూటమిగా బరిలోకి దిగాయి. కాంగ్రెస్ 7, జేఎంఎం 5, ఆర్జేడీ, సీపీఐ (ఎంఎల్) ఒక్కో స్థానంలో పోటీలో ఉన్నాయి. విపక్షాలపై మోదీ సర్కారు వేధింపులు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం తదితరాలను ప్రధానాంశాలుగా ఇండియా కూటమి ప్రచారం చేస్తోంది. కేంద్రంలో అధికారంలోకి వస్తే జార్ఖండ్‌లో ఉద్యోగ కల్పనతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని హామీలిస్తోంది. కాంగ్రెస్ జాతీయ మేనిఫెస్టోలోని 6 న్యాయాలు, 25 గ్యారంటీలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తోంది.



పోలింగ్ తేదీలు: మే 13, 20, 25, జూన్ 1

కుర్చీలాట...

జార్ఖండ్ రాష్ట్ర రాజకీయాల్లో తొలి నుంచీ కుర్చీలాట సర్వసాధారణంగా మారింది. 2000 సంవత్సరంలో బిహార్ నుంచి విడిపోయి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక బీజేపీ సారథ్యంలోనే తొలి ప్రభుత్వం కొలువుదీరింది. ఎన్డీఏ కూటమి తరఫున బాబూలాల్ మరాండీ తొలి సీఎం అయ్యారు. పదిహేనేళ్ల లోపే 9 సంకీర్ణాలు ఏర్పడ్డాయి. ఐదుగురు సీఎంలు మారారు. రెండుసార్లు రాష్ట్రపతి పాలన విధించారు. 2014లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ మెజారిటీ దక్కించుకుంది. బీజేపీ నేత రఘుబర్ దాస్ ఐదేళ్లు సుస్థిర సర్కారు నడిపారు. 2019 ఎన్నికల్లో హేమంత్ సోరెన్ సారథ్యంలో జేఎంఎం అత్యధిక సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్, ఆర్జేడీ తదితర యూపీఏ పక్షాల మద్దతుతో హేమంత్ మళ్లీ సీఎం అయ్యారు. ముగ్గురు సీఎంలు శిబు సోరెన్, హేమంత్ సోరెన్, మధు కోడా మనీ లాండరింగ్, హత్య కేసుల్లో జైలుపాలవడం విశేషం. బీజేపీ నుంచి విడిపోయి 2006లో జార్ఖండ్ వికాస్ మోర్చా (జేవీఎం) స్థాపించిన బాబూలాల్ మరాండీ 2020లో దాన్ని బీజేపీలో విలీనం చేశారు.

బీజేపీ పట్టు నిలుపుకుంటుందా?

లోక్‌సభ ఎన్నికల తర్వాత ఈ ఏడాది చివర్లో జార్ఖండ్ అసెంబ్లీకి కూడా ఎన్నికలున్నాయి. దాంతో రెండింటిపైనా బీజేపీ గురిపెడుతోంది. అవినీతి నాయకుల వల్లే అభివృద్ధి జరగడం లేదంటూ జోరుగా ప్రచారం చేస్తోంది. మోదీ హయాంలో అభివృద్ధి, అయోధ్య రామమందిరం తదితరాలను ప్రధానంగా ప్రస్తావిస్తోంది. గత ఎన్నికల్లో **కాంగ్రెస్** నుంచి గెలిచిన సింగ్భూమ్ ఎంపీ గీతా కోరా తాజాగా బీజేపీలోకి జంప్ చేశారు. అక్కడి నుంచే బరిలో దిగుతున్నారు. జేఎంఎం అధ్యక్షుడు శిబు సోరెన్ కోడలు, సిట్టింగ్ ఎమ్మెల్యే సీతా సోరెన్ కూడా బీజేపీ తీర్థం పుచ్చుకోవడంతో ఎన్నికల వేళ ఇండియా కూటమికి షాక్ మీద షాక్ తగిలింది. ఈసారి కూడా బీజేపీ 13 చోట్ల, మిత్రపక్షం ఏజేఎస్‌యూ 1 స్థానంలో పోటీ చేస్తున్నాయి.

సర్వేలు ఏం చెబుతున్నాయి...

జార్ఖండ్‌లో బీజేపీ ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంటుందని సర్వేలు అంటున్నాయి. ఎన్డీఏ కూటమికి 12 సీట్లు దక్కుతాయని, కాంగ్రెస్, జేఎంఎం ఒక్కో సీటుకు పరిమితం కావచ్చని అంచనా వేస్తున్నాయి.



అభివృద్ధికి పర్యాయపదం బీజేపీ. జార్ఖండ్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నాం. సింద్రీ ఎరువుల ప్లాంటు పునాదివడ్డ ఏడేళ్లలోనే ఉత్పత్తి కూడా ప్రారంభించింది. మోదీ గ్యారంటీకి ఇదే నిదర్శనం. కాంగ్రెస్, జేఎంఎం అభివృద్ధి నిరోధక పార్టీలు. అవినీతి–వారసత్వ–బుజ్జగింపు రాజకీయాలకు మారుపేరు. జనం సొమ్ము దోచుకు తింటున్నాయి. గిరిజనులను లూటీ చేస్తూ వారిని ఓటు బ్యాంకులుగా మార్చుకున్నాయి.

- ధన్‌బాద్ సభలో ప్రధాని మోదీ



రాష్ట్రంపై మోదీ సర్కారుది సవతి తల్లి ప్రేమ. అరచేతిలో స్వర్గం చూపిస్తూ ప్రజలను వంచిస్తోంది. యువత, మహిళలు, గిరిజనులను మోదీ మోసం చేస్తున్నారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. బీజేపీయేతర ప్రభుత్వాలపై మోదీ కక్షగట్టారు. ప్రతిపక్షాల గొంతు నులిమేస్తున్నారు. మేం మా హక్కుల కోసం డిమాండ్ చేస్తుంటే జైల్లో పెడుతున్నారు.

- రాంచీ సభలో హేమంత్ సోరెన్ భార్య కల్పన

ఒడిశా ప్రచారంలో 'లుంగీ' లొల్లి!

ఒకపక్క, భానుడి భగభగ. మరోపక్క ప్రచార సెగ. పానకంలో పుడకలా ఒడిశాలో లుంగీ వివాదం రాజుకుంది. బిజూ జనతాదళ్ చీఫ్, సీఎం నవీన్ పట్నాయక్ ముదురు రంగు లుంగీ ధరించి రెండు చేతుల్లో పార్టీ గుర్తు శంఖాన్ని రెండు చేతులతో పట్టుకున్న రీల్‌ను ఇన్‌స్టాలో అప్‌లోడ్ చేశారు. రాష్ట్రంలో లోక్‌సభతో పాటు అసెంబ్లీ ఎన్నికలూ జరుగుతున్నందున, 'ఈసారి జోడు శంఖాలు. ఒకటి ఎమ్మెల్యే, ఇంకొకటి ఎంపీ. రెండు ఓట్లూ మన పార్టీకే వేసి ఆశీర్వదించండి' అంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. ఒడిశా సంస్కృతిలో ధోతీ ఉంది కానీ లుంగీ ఎక్కడిదంటూ బీజేపీ విమర్శలు ఎక్కుపెట్టింది. దక్షిణాది వ్యక్తులు, బెంగాలీ ముస్లింల్లా విచిత్రంగా లుంగీలో దర్శనమివ్వడం బాలేదంటూ దుయ్యబట్టింది. ''సీఎంతో ఇలాంటి విచిత్ర వేషధారణ చేయిస్తున్న చేతిలో ప్రభుత్వం బందీగా మారింది. ఒడిశా గుర్తింపును చెడగొడుతున్నారు'' అంటూ కేంద్ర మంత్రి, బీజేపీ అగ్ర నేత ధర్మేంద్ర ప్రధాన్ విమర్శించడంతో వివాదం పెద్దదైంది. బీజేపీవి చిల్లర వేశాలంటూ బీజేడీ నేతలు లుంగీలు ధరించి మరీ కౌంటరిచ్చారు. ''సంభాల్‌పురీ చేనేత లుంగీ ప్రాధాన్యాన్ని తెలియజేసేందుకే సీఎం అలా చేశారు. బీజేపీ వ్యాఖ్యలు లక్షలాది నేతన్నలను, ప్రజలను అవమానించడమే'' అన్నారు. బీజేపీ తగ్గకపోగా, బయటి సంస్కృతికి పట్టం కడుతున్నారంటూ డోసు పెంచింది. దాంతో లుంగీ–ధోతీ వార్ వైరల్‌గా మారింది.



భారీ కుంభకోణాలు, అవినీతి ఆరోపణలు, ధరల పెరుగుదల. పదేళ్ల పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి. వీటికి తోడు మోదీ మేనియా. అన్నీ కలిసి యూపీఏ కూటమి పుట్టిముంచాయి. 2014లో జరిగిన 16వ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాభవం మూటగట్టుకుంది. కనీసం ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. లోక్‌సభలో సంపూర్ణ మెజారిటీ సాధించిన ఏకైక కాంగ్రెసేతర పార్టీగా బీజేపీ చరిత్ర సృష్టించింది. భారత రాజకీయాల్లో మోదీ శకం మొదలైంది...

- సాక్షి, నేషనల్ డెస్క్

2014లో ఏప్రిల్ 7 నుంచి మే 12 వరకు తొమ్మిది దశల్లో ఎన్నికలు జరిగాయి. బీజేపీ ఏకంగా 282 స్థానాలు కైవసం చేసుకుంది. ప్రభుత్వ ఏర్పాటుకు సొంతగానే సంపూర్ణ మెజారిటీ సాధించింది. మోదీ వారణాసి నుంచి పోటీ చేయడం యూపీలో బాగా కలిసొచ్చింది. ఏకంగా 70 స్థానాలు ఒడిసిపట్టింది. గుజరాత్, రాజస్థాన్‌ల్లోనూ క్లీన్ స్వీప్ చేసింది. ఎన్డీఏకు 353 స్థానాలు దక్కాయి. 2014 మే 26న 15వ ప్రధానిగా మోదీ ప్రమాణం చేశారు.

మోదీ 1.0

ఒంటి చేత్తో బీజేపీకి విజయం

- 282 స్థానాలతో సొంతంగానే మెజారిటీ
- 44 సీట్లతో కాంగ్రెస్ ఘోర పరాజయం



కాంగ్రెస్ కకావికలు

గతం

2009 లోక్‌సభ ఎన్నికల్లో 206 స్థానాలు నెగ్గిన కాంగ్రెస్ 2014లో ఏకంగా 162 సీట్లు కోల్పోయింది. తన చరిత్రలోనే అత్యల్పంగా 44 స్థానాలకు పరిమితమైంది! దాంతో లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు! యూపీఏ కూటమి 78 సీట్లతో కుదేలైంది. యూపీలోనైతే సోనియా, రాహుల్ పోటీ చేసిన రాయ్‌బరేలీ, అమేథీ మినహా ఎక్కడా గెలవలేకపోయింది. వామపక్షాలకూ కోలుకోలేని దెబ్బ తగిలింది. సీపీఎం 9, సీపీఐ ఒక్క స్థానానికి పరిమితమయ్యాయి.

ప్రచారంలో బీజేపీ మార్కు...

మోదీ సారథ్యంలో ఎన్నికల ప్రచారాన్ని బీజేపీ కొత్త పుంతలు తొక్కించింది. సంప్రదాయ ప్రసార సాధనాలతో పాటు సామాజిక మాధ్యమాలు, డిజిటల్ చానళ్లు... ఇలా ప్రతి మార్గంలోనూ ప్రజలకు చేరువైంది. ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్ తదితరాలను పూర్తిగా వాడుకుంది. ప్రచారమంతా మోదీ చుట్టే సాగేలా వ్యూహాలు అమలు చేసింది. 11.7 కోట్ల కొత్త ఓటర్లను విపరీతంగా ఆకట్టుకుంది. నిరాసక్త ఓటర్లను కూడా బూత్‌లకు రప్పించగలిగింది. కాంగ్రెస్ సంప్రదాయ ఓటర్లలోనూ మూడింట ఒక వంతు బీజేపీ వైపు మొగ్గినట్టు అంచనా! 'మోదీ చాయ్‌లు అమ్ముకునేవా'డన్న కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ వ్యాఖ్యలను రెండు చేతులా అందిపుచ్చుకుంది. 'చాయ్ పే చర్చ'తో హోరెత్తించింది.

రాహుల్ వర్సెస్ మోదీ

ప్రధాని అభ్యర్థిత్వానికి తాను దూరమని మన్మోహన్‌సింగ్ ముందే ప్రకటించడంతో 2009లో కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సారథిగా రాహుల్ వ్యవహరించారు. భావి సారథి ఆయనేనని సంకేతాలిచ్చింది. నాటి గుజరాత్ సీఎం నరేంద్ర మోదీని బీజేపీ ప్రధాని అభ్యర్థిగా ప్రకటించడంతో అద్వానీ మనస్తాపం చెందారు. పార్టీ పదవులన్నింటికీ రాజీనామా చేసినా మర్నాడే వెనక్కు తీసుకున్నారు. నాలుగుసార్లు గుజరాత్ సీఎంగా చేసిన మోదీ విషయ పరిజ్ఞానం ముందు ప్రచార పర్వంలో రాహుల్ పూర్తిగా తేలిపోయారు.

16వ లోక్‌సభలో పార్టీల బలాబలాలు

(మొత్తం స్థానాలు 543)

పార్టీ	స్థానాలు
బీజేపీ	282
కాంగ్రెస్	44
అన్నాడీఎంకే	37
టీఎంసీ	34
బీజేడీ	20
శివసేన	18
ఇతరులు	108

హజారే దీక్ష

యూపీఏ–2 పాలనలో అగస్టా, కామన్వెల్త్, బొగ్గు, 2జీ తదితర కుంభకోణాలు వెలుగు చూశాయి. అవినీతికి వ్యతిరేకంగా ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే చేపట్టిన ఆందోళనలు కాంగ్రెస్‌ను కోలుకోలేని దెబ్బ తీశాయి. అరవింద్ కేజ్రీవాల్ రాజకీయ రంగప్రవేశానికి కూడా ఆ ఆందోళనలే వేదికగా మారడం విశేషం! పప్పులు, వంట నూనెలు, ఉల్లిగడ్డల ధరలు గరిష్ట స్థాయికి చేరాయి. ఇతర నిత్యావసరాల ధరలూ అడ్డగోలుగా పెరిగాయి. యూపీఏ పాలనపై తీవ్ర ఆగ్రహంతో ప్రజలు బీజేపీకి బ్రహ్మరథం పట్టారు.

విశేషాలు...

- ఈవీఎంలకు ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీప్యాట్) అనుసంధానాన్ని ప్రయోగాత్మకంగా 8 లోక్‌సభ స్థానాల్లో అమలు చేశారు.
- తొలిసారిగా నోటా ఆప్షన్ అమల్లోకి వచ్చింది.
- 2014 ఎన్నికల ముందు చేసిన ఆంధ్రప్రదేశ్ విభజనతో ఏపీ, తెలంగాణ అక్కడ కాంగ్రెస్ చావుదెబ్బ తిన్నది.

రోహిణీ ఆచార్య. ఆర్జేడీ దిగ్గజం లాలుప్రసాద్ కూతురు. బిహార్ రాజకీయాల్లో ఇప్పుడు చర్చనీయంగా మారిన పేరు. రెండేళ్ల కింద తండ్రికి కిడ్నీ ఇచ్చి వార్తల్లో నిలిచిన ఆమె పట్నా ర్యాలీలో వేదిక ఎక్కినప్పుడే రాజకీయ అరంగేట్రంపై వార్తలొచ్చాయి. వాటిని నిజం చేస్తూ ఇప్పుడు తండ్రి నియోజకవర్గమైన సరన్ నుంచి లోక్‌సభకు పోటీ చేస్తున్నారు...

- సాక్షి, నేషనల్ డెస్క్

పరిచయం

లాలు కుటుంబం నుంచి ఆరో నేత...

ఆర్జేడీ వ్యవస్థాపకుడు లాలుప్రసాద్ రాజకీయ ఉద్దండుడు. బిహార్ రాజకీయాల్లో ఒకప్పుడు తిరుగులేని కుటుంబం. భార్య రబ్రీదేవి కూడా మూడుసార్లు బిహార్ సీఎంగా చేశారు. ప్రస్తుతం శాసనమండలిలో విపక్ష నేతగా ఉన్నారు. పెద్ద కూతురు మీసా భారతి రాజ్యసభ ఎంపీ. రెండుసార్లు పాటలీపుత్ర లోక్‌సభ స్థానంలో ఓడిన ఆమె ఈసారి మళ్లీ అదృష్టం పరీక్షించుకుంటున్నారు. లాలు కొడుకులు తేజ్ ప్రతాప్, తేజస్వీ ఎమ్మెల్యేలు. తేజస్వీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత కూడా. లాలు కుటుంబం నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్న ఆరో వ్యక్తి రోహిణి. ఆమె ఎంబీబీఎస్ చదివినా వైద్య వృత్తి చేపట్టలేదు. తండ్రి స్నేహితుడైన రాయ్ రణవిజయ్‌సింగ్ కుమారుడు సమ్రేశ్‌ను పెళ్లి చేసుకుని అమెరికాలో స్థిరపడ్డారు. భర్త ఉద్యోగరీత్యా సింగపూర్‌కు మారారు. ఇద్దరు పిల్లలతో ప్రస్తుతం అక్కడే ఉంటున్నారు.

• రోహిణీ ఆచార్య


లాలు హృదయకాలేయం

'కిడ్నీ టికెట్' విమర్శలకు దీటుగా జవాబు

రోహిణికి టికెటివ్వగానే బీజేపీ విమర్శల దాడికి దిగింది. కిడ్నీ ఇచ్చినందుకు కూతురికి లాలు లోక్‌సభ టికెట్ అమ్ముకున్నారంటూ ఎద్దేవా చేసింది. అందుకు రోహిణి గట్టిగానే బదులిచ్చారు. ''నాన్నకు కిడ్నీ ఇవ్వడం నా బాధ్యత. అయితే బిహార్ కోసం ప్రాణాలిచ్చేందుకైనా సిద్ధం. అల్పబుద్ధులు దీన్ని అర్థం చేసుకోలేరు'' అన్నారు. రోహిణిని 2017లోనే రాజ్యసభకు పంపుతారని వార్తలొచ్చినా ఆమె క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఐదేళ్లుగా సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ వస్తున్నారు. ఇటీవల బిహార్ సీఎం, జేడీ(యూ) అధినేత నితీశ్ కుమార్ ఆర్జేడీ కూటమికి చెయ్యిచ్చి మళ్లీ ఎన్డీఏ గూటికి చేరినప్పుడు, 'చెత్త ఎప్పుడూ డస్ట్‌బిన్‌కే చేరుతుంది' అంటూ ఆమె చేసిన వ్యాఖ్య సంచలనం రేకెత్తించింది. సామాజిక సమస్యలపైన రోహిణి నిత్యం సోషల్ మీడియాలో చురుగ్గా స్పందిస్తారు.

ఇంటి పేరు ఆసక్తికరం...

లాలుప్రసాద్, రబ్రీ దేవిలకు రోహిణి రెండో కూతురు. ఆమె పేరు వెనుక ఆసక్తికరమైన కథే ఉంది. ఆమె 1979లో పుట్టారు. పట్నాకు చెందిన గైనకాలజిస్ట్ డాక్టర్ కమలా ఆచార్య ప్రసవం చేశారు. వైద్యానికి ఫీజు తీసుకోవడానికి నిరాకరించారు. లాలు పట్టుబట్టడంతో పాపకు తన ఇంటి పేరు పెట్టమని అడిగారు. అందుకు లాలు అంగీకరించారు. పాప జన్మనక్షత్రం రోహిణి. దానికి డాక్టర్ ఇంటిపేరు కలిపి రోహిణీ ఆచార్యగా పేరు పెట్టారు. మీసా చట్టం వచ్చిన 1971లో పుట్టిన పెద్ద కూతురుకు మీసా భారతి అని లాలు పేరు పెట్టుకోవడం తెలిసిందే!



అవ్వాతాతలకు బాబు బ్యాచ్ తెచ్చిన కష్టాలు

- పింఛనుదారులను ఇబ్బందుల్లోకి నెట్టిన చంద్రబాబు అండ్ కో
- ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే ఠంఛనుగా పింఛను అందిస్తున్న సీఎం జగన్
- పచ్చ బ్యాచ్‌కు కంటగింపుగా మారిన ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ
- కేంద్ర ఎన్నికల సంఘానికి బాబు సన్నిహితుల ఫిర్యాదు
- వలంటీర్లను పింఛన్ల పంపిణీకి దూరంగా ఉంచాలన్న ఈసీ
- ఈ నెలలో సచివాలయాల ద్వారా పంపిణీ.. కొందరికి ఇంటి వద్ద పంపిణీ
- అయినా ఫిర్యాదులు ఆపని చంద్రబాబు బ్యాచ్
- తాజాగా మరోసారి ఆదేశాలు జారీ చేసిన ఎన్నికల సంఘం
- మే, జూన్ నెలల పింఛను బ్యాంకు ఖాతాల్లో జమకు నిర్ణయం
- అన్ని ఊర్లలో బ్యాంకులు ఉండవు
- వ్యయప్రయాసలకోర్చి మండల కేంద్రం లేదా పట్టణానికి వెళ్లక తప్పని పరిస్థితి

మే నెల పింఛను బ్యాంకు ఖాతాలో జమ

- 1వ తేదీనే పింఛను పంపిణీ మొదలు.. జూన్ నెలకూ ఇదే విధానం

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఆర్థిక కేటుగాళ్లకు టీడీపీ అడ్డా

మాల్యా, నీరవ్ మోదీ వారసులు సుజనా, రఘురామకృష్ణరాజు, సీఎం రమేశ్, గంటా

బ్యాంకులకు దాదాపు రూ. 4,563 కోట్లు ఎగ్గొట్టిన వైనం

- వీళ్లు ఎక్కడున్నా చంద్రబాబు మనుషులే.. ఆయన కోసం పనిచేయడమే లక్ష్యం
- తన బినామీలను బీజేపీలోకి పంపి టికెట్లు ఇప్పించుకున్న చంద్రబాబు
- ప్రజల సొమ్మును దోచుకుని.. అందులో టీడీపీకి కొంత వాటా
- ప్రతిఫలంగా వారికి, వారు సూచించిన వారికి టికెట్లు ఇస్తున్న చంద్రబాబు
- ఇలాంటి నేతలతో సమాజానికి తీవ్ర ప్రమాదం అంటున్న బ్యాంకింగ్ నిపుణులు

సాక్షి, అమరావతి:

ఈ ఎన్నికలు పెత్తందారులు, పేదలకు మధ్య పోటీ.. ఆర్థిక నేరగాళ్లతో నిండిన టీడీపీ కూటమికి.. పేదల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా జైత్రయాత్ర చేస్తున్న ఈ ప్రభుత్వానికి మధ్య పోటీ..

ఈ ఎన్నికల్లో ఆర్థిక నేరగాళ్లకు చంద్రబాబు టికెట్లు కట్టబెట్టడమే కాకుండా..తన బినామీలను పక్క పార్టీలోకి పంపి అక్కడ కూడా వారిని బరిలో నిలిపారు. వ్యాపార వేత్తల ముసుగులో బ్యాంకుల నుంచి వందల కోట్ల రుణాలు తీసుకుని ఎగ్గొట్టిన ఈ వైట్‌కాలర్ ఆర్థిక నేరగాళ్లు సూచించిన వారికీ చంద్రబాబు టికెట్లిచ్చారు. రుణాల పేరుతో బ్యాంకులకు కన్నం పెట్టిన ఈ కేటుగాళ్లలో భీమిలి నుంచి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, ఉండి నుంచి రఘురామకృష్ణరాజు టీడీపీ నుంచి పోటీ చేస్తుండగా.. 2019 వరకు టీడీపీ రాజ్యసభ ఎంపీగా ఉన్న సీఎం రమేశ్, సుజనా చౌదరిలను బీజేపీలోకి పంపిన చంద్రబాబు.. వారికి టికెట్లు దక్కేలా ప్లాన్ చేశారు. అనకాపల్లి పార్లమెంటు నుంచి సీఎం రమేశ్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి సుజనా చౌదరి పోటీ చేస్తున్నారు. ఈ నలుగురు బ్యాంకుల నుంచి సుమారు రూ.4,563 కోట్ల రుణాలు ఎగ్గొట్టి, సీబీఐ ఈడీ, బ్యాంకు జప్తు కేసులు ఎదుర్కొంటున్నారు.



మోసాల్లో దిట్ట రఘురామకృష్ణరాజు

రుణాల ఎగవేతలో విజయ్ మాల్యా, నీరవ్‌మోదీ సరసన నిలిచే కేటుగాడు రఘురామకృష్ణరాజు. ఇండ్ భారత్ థర్మల్ పవర్ లిమిటెడ్ పేరుతో రఘురామకృష్ణరాజు వివిధ బ్యాంకుల నుంచి సుమారు రూ.1,383 కోట్ల రుణాలు తీసుకున్నాడు. వీటిని కంపెనీ అవసరాలకు వాడకుండా వేరే ఖాతాల్లోకి మళ్లించి బ్యాంకుల్ని మోసగించాడు. పంజాబ్ నేషనల్ బ్యాంకు, దాని అనుబంధ బ్యాంకుల నుంచి ఇండ్-భారత్ థర్మల్ పవర్ పేరిట తీసుకున్న రూ.826.17 కోట్ల రుణాన్ని పక్కదారి పట్టించాడు. వడ్డీ కూడా చెల్లించలేదు. దీంతో బ్యాంకులు సీబీఐని ఆశ్రయించడంతో అతని మోసాలు వెలుగులోకి వచ్చాయి. తనఖాగా పెట్టిన భూముల్ని మోసపూరితంగా అమ్మేశాడని, 95 శాతం బొగ్గు తరిగిపోయిందని చెప్పి దాన్ని తగలబెట్టేశారని పంజాబ్ నేషనల్ బ్యాంకు ఫిర్యాదుతో సీబీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. 2020 అక్టోబర్‌లో రఘురామకృష్ణరాజుకు చెందిన ఇళ్లు, కంపెనీలు, కార్యాలయాల్లో 11 సీబీఐ ప్రత్యేక దర్యాప్తు బృందాలు సోదాలు నిర్వహించి పలు ఫైళ్లు, హార్డ్ డిస్కులు స్వాధీనం చేసుకున్నాయి. కంపెనీకి చైర్మన్‌గా ఉన్న రఘురాజుతో పాటు ఆయన భార్య, కుమార్తె ఇతర డైరెక్టర్లపై కేసులు నమోదు చేశారు. ఇండ్-భారత్ సన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట విదేశాల్లో తీసుకున్న రుణాల్ని భారత్‌కు అక్రమంగా తరలించడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగింది. 2011లో మారిషస్‌కు చెందిన స్ట్రాటజిక్ ఎనర్జీ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ అనే కంపెనీ నుంచి రూ.202 కోట్లు రుణం తీసుకున్నారు. ఆ నిధులు అందిన మరుసటి రోజే రూ.200 కోట్లను ఇండ్ - భారత్ ఎనర్జీ లిమిటెడ్(ఉత్కళ్)కు తరలించేశారు. ఈ వ్యవహారం మొత్తం ఫారెన్ ఎక్స్ఛేంజ్ మెయింటెనెన్స్ యాక్ట్(ఫెమా) దృష్టిలో పడింది. ఫెమా అధికారులు మారిషస్ కంపెనీ నుంచి రూ.202 కోట్లు ఇండ్ భారత్ సన్ ఎనర్జీకి అందినట్లు గుర్తించారు. మరుసటి రోజే బదిలీ చేసినట్లు నిర్ధారించారు. ఫెమా నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ కావడంతో ఈడీ రఘురామ కంపెనీకి రూ.40 కోట్లు పెనాల్టీ విధించింది.

సుజనా చౌదరి.. ఎగవేతలో నంబర్ వన్

బ్యాంకుల నుంచి రూ. వేల కోట్ల రుణాలు తీసుకుని మోసగించిన ఘనుడు సుజనా చౌదరి. ఈ కేసులో ఈడీ దర్యాప్తుతో అతని మోసాలు వెలుగులోకి వచ్చాయి. రూ.1,289 కోట్ల జీఎస్టీ ఎగవేతతో పాటు రూ.700 కోట్ల బ్యాంకు రుణాల ఎగవేత కేసులున్నాయి. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత అనేక డొల్ల కంపెనీలు ఏర్పాటు చేసి ఎలాంటి వ్యాపారాలు చేయకుండానే రూ.1,289 కోట్ల ఇన్వాయిస్‌లు సుజనా కంపెనీలు తయారుచేశాయి. ఈ మొత్తంపై రూ.224 కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ తీసుకున్నారు. దొంగ ఇన్వాయిస్‌లు చూపి బ్యాంకుల నుంచి రూ.700 కోట్ల రుణాలు తీసుకున్నారు. జీఎస్టీ విభాగం దర్యాప్తులో ఈ మోసం బయటపడటంతో గ్రూపునకు చెందిన డైరెక్టర్లను అరెస్ట్ చేశారు. బ్యాంకు రుణాలు తీర్చడం లేదని నల్లగొండ జిల్లాలో ఉన్న స్టీల్ ప్లాంటును బ్యాంకులు సీజ్ చేశాయి. విదేశీ బ్యాంకులకు కూడా టోపీ పెట్టారు. మారిషస్ బ్యాంక్ నుంచి రూ.100 కోట్ల రుణం తీసుకొని చెల్లించకపోవడంతో ఆ బ్యాంక్ హైదరాబాద్ కోర్టును ఆశ్రయించింది. ఈ కేసులో కోర్టు ఏకంగా అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. బ్యాంకుల నుంచి రుణాలు ఎగ్గొట్టిన వారికి కేంద్ర మంత్రి వర్గంలో చోటు ఇవ్వడానికి ప్రధాని మోదీ నిరాకరించినా చంద్రబాబు అతనికే ఇవ్వాలని పట్టుబట్టారు. బీజేపీ తీర్థం పుచ్చుకొని విజయవాడ పశ్చిమ నుంచి పోటీ చేస్తున్నారు. రూ. 500 కోట్లు ఎగవేతకు సంబంధించి ఎన్‌సీఎల్టీ(నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్)లో ఎస్‌బీఐ 2021లో దివాలా పిటిషన్ దాఖలు చేసింది. దీనిని పరిశీలించిన ఎన్‌సీఎల్‌టీ ఆ పిటిషన్‌కు అనుమతిస్తూ తాజాగా ఉత్తర్వులిచ్చింది.

సుజనా

బినామీ 'బాబు'..సీఎం రమేశ్

చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు, బినామీ సీఎం రమేశ్.. అతని అక్రమ లావాదేవీలను ఆదాయపన్ను శాఖ వెలికి తీసింది. సబ్ కాంట్రాక్టర్ల ముసుగులో పనులు చేయకుండానే చేసినట్లు చూపి రూ.800 కోట్ల నిధులు సొంత ఖాతాల్లోకి మళ్లించారు. పనులు చేయకుండానే చేసినట్లు బిల్లులు తీసుకుని వాటిని చిరునామా లేని కంపెనీల్లోకి మళ్లించి ఆ కంపెనీల నుంచి సీఎం రమేశ్ సంస్థ నగదును వెనక్కి తీసుకుంది. అతనికి చెందిన నిర్మాణ రంగ కంపెనీ రిత్విక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సుమారు రూ.800 కోట్ల నిధులను వివిధ కంపెనీల ద్వారా దారి మళ్లించినట్లు ఐటీ శాఖ అధికారులకు ఆధారాలు లభించాయి. గత ఆర్నెళ్లలో ఎడ్కో(ఇండియా) అనే సబ్‌కాంట్రాక్టర్‌కు రూ.12 కోట్లు చెల్లించినట్లు పుస్తకాల్లో చూపారు. రికార్డుల్లో పేర్కొన్న నాలుగు చిరునామాల్లో ఆ కంపెనీ ఆనవాళ్లు ఎక్కడా కనిపించలేదు. రిత్విక్ ప్రాజెక్టులో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న సాయిబాబా వద్ద ఎడ్కో కంపెనీకి చెందిన స్టాంపులు, సీల్ దొరకడంతో గుట్టు రట్టయ్యింది. దొంగ వ్యాపారాల ద్వారా సంపాదించిన మొత్తాన్ని పార్టీకి ఇచ్చి వరుసగా రెండుసార్లు రాజ్యసభ సీటు దక్కించుకున్నారనేది అందరికీ తెలిసిందే. కేసుల నుంచి తప్పించుకోవడానికి బీజేపీలో చేరి.. ఇప్పుడు ఆ పార్టీ నుంచి అనకాపల్లి ఎంపీగా పోటీ చేస్తున్నారు.

గంటా శ్రీనివాసరావు.. రూ.390.7 కోట్ల ఎగవేత


టీడీపీ హయాంలో మంత్రిగా ఉన్న గంటా శ్రీనివాసరావు బ్యాంకుల నుంచి భారీగా రుణాలు తీసుకొని తిరిగి చెల్లించకుండా ముప్పతిప్పలు పెడుతున్నారు. ప్రభుత్వ బ్యాంకుల నుంచి సుమారు రూ.390.7 కోట్ల రుణాలను తిరిగి చెల్లించకపోవడంతో అతని ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి బ్యాంకులు ఐదేళ్లుగా పోరాడుతున్నాయి. గంటాకు సంబంధించిన ప్రత్యూష గ్రూపు కంపెనీలు వివిధ బ్యాంకులకు వడ్డీతో కలిపి రూ.390.7 కోట్లకుపైగా రుణం తీసుకొని ఇంతవరకు ఒక్క వాయిదా కూడా చెల్లించలేదు. ఆస్తుల స్వాధీనానికి ఇండియన్ బ్యాంకు రంగంలోకి దిగింది. ఈ రుణానికి గంటా హామీ ఉండడంతో ఆయనకు చెందిన ఆస్తులు స్వాధీనం చేసుకుంటున్నట్లు పత్రికా ప్రకటనలు జారీ చేసింది. గత నెలలో ఇండియన్ బ్యాంకు విశాఖలోని బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని గంటా స్థలాన్ని వేలం వేసేందుకు పత్రికా ప్రకటన ఇచ్చింది.

ఈమె గారి పతి పేరులోనే దేవుడు...లీలల్లో రావణుడే... ఈ సతీపతుల విచ్చలవిడి దోపిడీకినంద్యాల సమీపంలోని ఓ నియోజకవర్గం అడ్డాగా మారింది. నీరు-చెట్టు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు, తాగునీటి పేరిట వీరి అక్రమాలు లెక్కలేనన్ని ఉన్నాయి. వీరి దోపిడీని లెక్కగడితే రూ.వంద కోట్లు దాటి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ దంప తులకంటికి నదురుగా ఎవరి స్థలమైనా కనిపించినా.. లేదా.. స్థల వివాదాల్లో న్యాయం చేయాలని ఎవరైనా వీరి వద్దకు వచ్చినా.. పెట్టపోరు.. పెట్ట పోరు.. పిల్లి తీర్చిందన్న చందంగా ఆ స్థలాలను కాజేసే దాకా వీరు నిద్రపోరు.

మాయ మాటలతో రైతులను వంచించడంలో ఈ దంపతులను మించిన వారు లేరని వీరిఅఘాయిత్యాలే చెబుతాయి..

ఎవరైనా వీరి అన్యాయాలనుప్రశ్నించారో వారిపై విరుచుకుపడతారు. డబ్బుల కోసం ఏమైనా చేయడానికి వెనుకాడరనివీరి చరిత్ర చెబుతోంది. జైలుకెళ్లి వచ్చినా పద్ధతి మార్చుకోకపోవడం వీరికే చెల్లింది.

పేరేమో అందరికీ 'ప్రియం'గా అనిపిస్తుంది.. వ్యవహార శైలి చూసినా, విన్నా అన్నీ అప్రియాలే... టీడీపీ హయాంలో మంత్రిగా అవకాశం లభించేసరికి దోపిడీకి లైసెన్సుపొందినట్లయింది.



అక్రమాల ప్రియ

- నంద్యాలకు ఆనుకుని ఉన్న నియోజకవర్గంలోని మూడు మండలాల గుండా ప్రవహించే వక్కిలేరులో అప్పటి టీడీపీ మంత్రి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి దాదాపు మూడేళ్ల పాటు ఏటా నీరు-చెట్టు పేరిట పనులు చేస్తున్నట్లు హడావుడి చేశారు. ఒకటి రెండు కాదు.. ఏకంగా 350 పనులుగా దీన్ని విభజించి తన బంధువులైన రామతీర్థ పుట్టాలమ్మ ఆలయ అప్పటి చైర్మన్ (ప్రస్తుత బీజేపీ నాయకుడు), అప్పటి సహకార సంఘం చైర్మన్, కోటకందుకూరు మాజీ సర్పంచికి అప్పగించారు. వారు వాగులో అరకొర పనులు చేసి ఏకంగా రూ.3 కోట్లకు పైగా నిధులు కొల్లగొట్టారు. ఇందులో నాటి మంత్రికి సగం ముట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి వర్క్ ఆర్డర్ లేకపోయినా అధికారులను బెదిరించి బిల్లులు చేయించుకున్నట్లు సమాచారం.
- రుద్రవరం మండలం నాగులవరం సమీపంలోని టీజీపీ పంట కాలువలో పూడిక తీసినట్టు అధికారులు బిల్లులూ మంజూరు చేశారు. ఇదే గ్రామానికి చెందిన నాటి మంత్రి అనుచరుడు ఇలాంటి పది పనులు సుమారు రూ.కోటితో చేసినట్లు తెలుస్తోంది. ఇందులో నాలుగు పనులు నాసిరకంగా చేపట్టగా, ఆరు పనులను అసలు చేయకుండానే బిల్లులు ఆమోదింపజేసుకుని రూ.60 లక్షలు మింగేశారని సమాచారం. ఇలా పైపై పనులు చేపట్టి దాదాపు రూ.130 కోట్ల మేర నాటి మంత్రి, జన్మభూమి కమిటీలు, వారి అనుచరులు బొక్కేశారు. రైతులకు ఉచితంగా ఇచ్చే శనగ విత్తనాల నుంచి మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నామని ఇతర రాష్ట్రాల నుంచి మినుములను రప్పించి ఇక్కడి రైతులవే అని చెప్పి కొల్లగొట్టేశారు.

సాక్షి, టాస్క్‌ఫోర్స్:

గత ప్రభుత్వంలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన యువ మహిళా మంత్రి అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారారు. అక్రమాలను అవలీలగా చేసేశారు. ఇప్పుడామె అధికారంలో లేకున్నా... కబ్జాలకు కొదవలేదు. ఎదిరించేవారిపై దౌర్జన్యాలకూ వెనుకాడటం లేదు. ఆమెతోపాటు ఆమె రెండో భర్త చేసిన అరాచకాలు అన్నీఇన్నీకావు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏ పనిచేసినా వారికి వాటాలు ముట్టజెప్పాల్సి వచ్చేది. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ నియామకాల్లోనూ ఈ సతీపతుల వసూళ్ల దందా సాగింది. అభివృద్ధి పనుల్లోనూ ఆ దంపతులు రూ.కోట్లలో పర్సంటేజీలు మూటగట్టుకున్నారు. చివరకు పారిశుద్ధ్య కార్మికుల నియామకంలోనూ వసూళ్లు కొనసాగించారు. వివిధ పనుల్లో టెండర్లతో పని లేకుండా రూ.200 కోట్ల వరకూ స్వాహా చేశారు. అధికారం కోల్పోయినా తమ దందాకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది.

అభివృద్ధి పేరుతో అక్రమాలు...

ఆమె టీడీపీ హయాంలో నియోజకవర్గంలో వివిధ పనుల కోసం కోట్లాది రూపాయలు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించుకుని వాటిని పక్కదారి పట్టించారు. అధికారులను బెదిరించి పనులు చేయకుండానే బిల్లులు చేయించుకున్నారు. నియోజకవర్గ పరిధిలో జరిగిన ప్రతి పనినీ తన అనుయాయులకే టెండర్‌తో ప్రమేయం లేకుండా కట్టబెట్టించి వారి వద్ద పర్సంటేజీలు నొక్కేశారు.

సతి ఆదేశం.. పతి దౌర్జన్యం..

చింతకుంట గ్రామానికి చెందిన గూడా నరసింహుడు భార్య వెంకట లక్ష్మమ్మకు ఆళ్లగడ్డ పట్టణ శివారులో 25 సెంట్ల స్థలముంది. ఆ స్థలాన్ని మహమ్మద్‌హుసేన్, నూర్ అహమ్మద్‌ల నుంచి 1995 మార్చి 27న కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. రూ.2 కోట్ల విలువ చేసే ఈ స్థలం ఖాళీగా ఉండటాన్ని గమనించిన ఈ దంపతులు ఓ సర్వేయర్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది ద్వారా 1952లో అల్లిసా పేరిట రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను బయటకు తీశారు. అవుకు మండలం సంగపట్నంలో నివసించే వారి మనవడు నూర్‌బాషాకు నచ్చజెప్పి మూడు భాగాలుగా చేసి 2022 డిసెంబర్1న అనుచరుల పేరున రిజిస్ట్రేషన్ చేయించారు. ఇప్పుడు 'గూడా' దంపతులు లబోదిబోమంటున్నారు. ఈ అరాచక దంపతుల దౌర్జన్యంలో ఇది మరో కోణం.

కబ్జాలు, దౌర్జన్యాలు, దోపిడీలకు నిలువుటద్దం

- టీడీపీ హయాంలో 'నీరు-చెట్టు' పేరుతో రూ.కోట్ల దందా
- టెండర్‌తో పనిలేకుండా రూ.200 కోట్లు స్వాహా
- ఖాళీ స్థలాలు కనిపిస్తే దర్జాగా కబ్జా
- హైదరాబాద్‌లో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడి జైలు శిక్ష
- అయినా పద్ధతి మార్చుకోక స్వస్థలంలోనూ దౌర్జన్యాలు
- పంచాయితీకొచ్చిన ఓ వ్యక్తి నుంచి రూ.1.30 కోట్లు లాక్కున్న వైనం
- తప్పుడు పత్రాలతో బ్యాంకులకూ బురిడీ

తాగునీటి సరఫరా పేరుతో దోపిడీ...

చంద్రబాబు ఐదేళ్ల పాలనలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆ సమస్యను తమకు అనుకూలంగా మార్చుకుని అప్పటి మంత్రిగా అడ్డంగా దోచేశారు. పట్టణంలో ట్యాంకరుకు రూ.500 నుంచి రూ.750 వరకు ప్రభుత్వం బిల్లులు చెల్లించింది. మంత్రి అనుచరులు ట్యాంకర్లను కొని మున్సిపాలిటీకి అద్దెకిచ్చారు. నీటిని వారు తరలించకుండానే కోట్లాది రూపాయలు దోపిడీ చేశారు.

ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్ వేషంలో వెళ్లి కిడ్నాప్..


హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లిలో 40 ఎకరాల భూమి ఆక్రమించుకునేందుకు మాజీ మంత్రి, ఆమె వర్గీయులు చేసిన కిడ్నాప్ సినిమాను తలపించింది. ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్ల వేషంలో వెళ్లి కిడ్నాప్ చేయడంతో అప్పట్లో సంచలనమైంది. అయితే తీరా కిడ్నాప్ చేసిన మనుషులు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బంధువులు కావడంతో కథ అడ్డం తిరిగింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి కిడ్నాప్ చేసిన వ్యవహారంలో మాజీ మంత్రిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆమె ఏ1 నిందితురాలు. నెలల తరబడి జైలు జీవితం గడిపారు. కిడ్నాప్ కేసులో ఓ మహిళా మాజీ మంత్రి జైలుకు వెళ్లడం అదే తొలిసారి.

దౌర్జన్యాలకు చిరునామాగా..

- **తాజాగా ఓ పంచాయితీ కోసం ఇంటికొచ్చిన ఓ ముస్లిం మైనార్టీ నాయకుడిని అందరూ చూస్తుండగానే మాజీ మంత్రి దంపతుల ఆదేశాల మేరకు** అనుచరులు చితకబాది వారి వద్దనున్న రూ.1.30 కోట్లు దోచే యదం ఇప్పుడు సంచలనమైంది.
- జగత్ డెయిరీకి చెందిన అమాయక రైతుల పేర్లపై బ్యాంకు రుణాలు తీసుకుని మంత్రి తిరిగి చెల్లించకపోవడంతో ఆ రైతులు డిఫాల్టర్లుగా మారి పంట రుణాలూ పొందలేక అల్లాడిపోయారు.
- మంత్రిగా ఉన్నప్పుడు కమీషన్లకు ఆశపడి మున్సిపల్ శానిటరీ, స్వీపర్ పోస్టులతోపాటు టూరిజం శాఖలో విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఉద్యోగాలను అమ్ముకున్నారు.
- నీరు చెట్టు పనుల్లో అడిగినంత కమీషన్ ఇవ్వలేదని భాచాపురం గ్రామ నాయకుడి చెక్‌బుక్ దొంగిలించి అతనిపై చెక్‌బౌన్స్ కేసు పెట్టి వేధించారు.
- మాజీ మంత్రి ప్రస్తుత భర్త ద్వారా ఖాళీ స్థలాలపై కన్నేసి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. భూ కబ్జాలకు పాల్పడి బాధితులను చంపుతామని బెదిరించారు. వ్యాపారవర్గాలను భయభ్రాంతులకు గురి చేశారు.
- అవసరమైనప్పుడు అప్పులిచ్చి ఆదుకున్న స్నేహితులు, శ్రేయోభిలాషులను మోసం చేశారు. రుణాలు ఎగ్గొట్టారు. వారిని ఇంట్లోకి రానివ్వకుండా అవమానించారు.
- తండ్రి ఇంటిపేరును దుర్వినియోగం చేయడంతో విసిగిపోయిన బంధువులు ఆమెకు దూరమయ్యారు. ఆమెను, ఆమె భర్తను బహిష్కరించారు. ఎన్నికల్లో పోటీ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నారు.
- నాలుగేళ్లుగా హైదరాబాద్‌కే పరిమితమైన మాజీ మంత్రి దంపతులు ఇప్పుడు ఎన్నికలు రావడంతో పదవి కోసం మళ్లీ నియోజకవర్గంలో తిష్టవేశారు.

ప్రజల మనిషి జగన్

- పాలనపట్ల విజన్ ఉన్న నాయకుడు
- ఆయన దృష్టి అంతా రాష్ట్ర భవిష్యత్ పైనే...
- ప్రజల కోసం ఏదో ఒకటి చేయాలన్నదే ఆయన తపన
- కొన్ని తరాలపాటు ఆయన పేరు నిలిచిపోవాలన్నదే ఆకాంక్ష
- సాక్షితో ప్రసిద్ధ సినీ నటుడు భానుచందర్



'రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. నిరంతరం ప్రజల మనిషిగా నిలిచిపోవాలన్నదే ఆయన ఆకాంక్ష. గత ఎన్నికల సమయంలోనే ఆయనలో ఉన్న గొప్ప ప్రజాసేవకుడిని గుర్తించాను. ఆయన తన ఆకాంక్షలు అంచనాలకు మించి జగన్ పనిచేస్తున్నారు' అని ప్రముఖ చలన చిత్ర నటుడు భానుచందర్ అన్నారు. జగన్ పాలనా దక్షతపై 'సాక్షి'తో ప్రత్యేకంగా ఆయన మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

ఇంటర్వ్యూ

నిస్సందేహంగా జగన్ ఒక బ్రిలియంట్ గై. ఆయన ఏది చేసినా ప్రజల గురించి చేస్తున్నారు. ఆయనో అసలు సిసలు యువ నేత. ఆయనది నవ యువ భావజాలం. ఆయన రాష్ట్ర భవిష్యత్తు గురించి ప్రతీ నిమిషం ఆలోచన చేస్తున్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ ఎలాగైతే భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పని చేస్తున్నారో... అలాగే జగన్ బాబు కూడా అదే ఆలోచనతోనే ప్రయాణం చేస్తున్నారు. ఆయన ప్రజల కోసం ఏదో ఒకటి చేయాలనే సంకల్పంతో ముందుకు వెళుతున్నారు. ప్రజల మేలు కోరి చేసే ఆయన ఆలోచనలు, ప్రణాళికలు... అన్నీ సాకారం కావాలని నేను కోరుకుంటున్నాను.

వైఎస్సార్‌లాగా కాదు... అంతకు మించి

ఈ భూమ్మీద ఎవరూ శాశ్వతం కారు. బతికినంత కాలం మనం నలుగురికి ఏం మంచి చేశామనేదే ముఖ్యం. కొన్ని తరాల పాటు మన పేరు ప్రజలకు గుర్తుండిపోవాలి. దివంగత వైఎస్సార్ విషయంలో అదే జరిగింది కదా. ఆరోగ్యశ్రీ అనే ఒక్క పథకం వల్ల వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇప్పటికీ జనం గుండెల్లో శాశ్వతంగా బతికున్నారు. అలాగే జగన్‌బాబు కూడా అంతకు మించి అనేక మంచి పనుల ద్వారా ప్రజలకు గుర్తుండిపోవాలి అని ఆశపడుతున్నారు. నిజంగా యుక్త వయసులోనే ఇలాంటి ఆలోచనా ధోరణి రావడం చాలా గొప్ప విషయం. అది సాధించే శక్తి కూడా ఆయనకు ఉంది.

మంచికే మద్దతు పలకాలి

మోదీ నుంచి జగన్ బాబు దాకా ప్రజలకు మంచి చేసే వారికి మద్దతివ్వాలి అనేది నా మనస్తత్వం. విమర్శలు చేసేవాళ్లు ఎప్పుడూ ఉంటారు. మన దేశంలో గాంధీజీ మీద కూడా విమర్శలు చేస్తారు. ఎవరి విమర్శల వెనక ఏముందో ప్రజలకు బాగా తెలుసు. అయితే అవన్నీ పక్కనబెట్టి మనం ప్రజలకు ఏం చేస్తున్నాం? మన వల్ల ప్రజలకు కలుగుతున్న లాభమేమిటి? అనేది జగన్ బాబుకు ముఖ్యం. తను నమ్ముకున్న అదే పంథాలో ఆయన వెళుతున్నారు. కచ్చితంగా ఆయనకు అంతా శుభమే జరగాలి. జరుగుతుంది కూడా. నేను గత ఎన్నికల ముందు కూడా జగన్ ఆలోచనలు అద్భుతంగా ఉన్నాయని, ఆయన గొప్ప పాలన అందిస్తారని అప్పుడే చెప్పాను. ఇప్పుడు అదే జరుగుతోంది. గెలిచిన తర్వాత ఒక్కసారి కూడా జగన్‌ను నేను కలవలేదు. అయితే అది ముఖ్యం కాదు. ఆయన ప్రజలకు మంచి చేయడం నాకు ముఖ్యం. అలాంటి ముఖ్యమంత్రికి నాలా ప్రజల మంచి కోరుకునే ప్రతీ ఒక్కరూ మద్దతివ్వాలి. ఇస్తారనే నేను నమ్ముతున్నాను. తమకెవరు మంచి చేశారనేది ప్రజల్లో ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. తమ గురించి నిరంతరం ఆలోచించే మంచి చేసిన వారినే జనం గెలిపిస్తారు. జనం గురించి ఎప్పుడూ ఆలోచించే నాయకుడు జగన్. నా ఉద్దేశం ప్రకారం మళ్లీ జగన్ గెలవడం... ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగడం ఖాయం. -సాక్షి, అమరావతి



మంచిమాట

చింత - చింతన

చిత్త వ్యాపారాలే చింత, చింతన. మనస్సు చేత ప్రేరేపితమైన ఇంద్రియ వ్యాపారాలను భద్రపరచేది చిత్తం. విషయాలను, అనుభవాలను, భావోద్వేగాలు మొదలైనవాటిని జ్ఞాపకాల రూపంలో భద్రపరచి దాచి ఉంచేది చిత్తం. దానిలో ప్రతి మనోవ్యాపారం ముద్రితమై ఉంటుంది. ఒకోసారి మర్చి పోయాం అనుకొన్నవి కూడా సందర్భానుసారం బయట పడుతూ ఉంటాయి. అందుకే ఏదైనా మరచి పోతే కళ్ళు మూసుకుని ఆలోచిస్తాం. అప్పుడు జ్ఞాపకాల గది తలుపు తెరుచుకుంటుంది.

చింత అంటే జరిగి పోయిన లేదా జరగబోయే విషయాలను తలుచుకుంటూ బాధపడుతూ వేదన చెందుతూ ఉండటం. పైకి వ్యక్తం చేయక పోయినా మనసు లోపల నిరంతరం అదే విషయం మెదులుతూ సంతోషమన్నది లేకుండా చేస్తుంది. కొంతమంది ముఖాలు చూస్తూనే చెప్ప వచ్చు వాళ్ళు ఏదో విషయంలో చాలా బాధ పడుతున్నారు అని. సాధారణంగా ఆ విషయానికి పరిష్కారం వాళ్ళకి తెలియక పోవటమో, తెలిసినా చేయగలిగే పరిస్థితిలో లేకపోవటమో దానికి కారణం అయి ఉంటుంది. ఆ అనిశ్చితి, అసమర్థత నిరంతరం మనసులో తిరుగుతూ వేదనని కలిగించి కుంగదీస్తాయి. పరిష్కారం దొరికితే కొంత ఉపశమనం కలుగుతుంది. దానిని అమలు చేయగల శక్తి ఉంటే ధైర్యం కలుగుతుంది. వేదన కొంత ఉపశమిస్తుంది. ఇక్కడ అర్థమయ్యే విషయం ఏమంటే ఒక విషయం గురించి తీవ్రంగా ఆలోచించ గల శక్తి మనిషి మనస్సుకి ఉంది అని. దానిని ఉపయోగపడని వాటికి వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవచ్చు. అప్పుడు అది చింతన అవుతుంది.

చింతన మనిషిని తాత్త్వికుడిగా పరిణమింపచేస్తుంది. వ్యక్తిగతమైన సమస్యలు, వాటి పరిష్కారాలు అనే స్థాయి దాటి ఏదైనా ఒక అంశం గాని, సిద్ధాంతం గాని, మరేదైనా గాని – దానిని గురించి లోతుగా, అన్ని కోణాలలోనూ, పరిశీలించి, అధ్యయనం చేసి, మూలతత్త్వాన్ని తెలుసుకునేందుకు సహకరిస్తుంది. ఆధ్యాత్మికత, మతం, రాజనీతి, సాంఘిక సామాజిక పరిస్థితులు, కమ్యూనిజం వంటి ఆధునిక సిద్ధాంతాలు – ఒకటేమిటి ఏవైనా కావచ్చు, వాటి మౌలికతత్త్వం తెలుసుకోవటానికి వాటి గురించిన చింతన ఒకటే మార్గం. ఆ విషయానికి సంబంధించిన అంశాలనే నిరంతరం తలుచుకుంటూ, మననం చేస్తూ ఉంటే, పైకి కనపడే అంశానికి మూలమైన సూత్రం, అసలు లక్షణం, సరిగా చెప్పాలంటే బీజం స్ఫురిస్తుంది. దానితో విరాడ్రూపం మనో నేత్రం ముందు కదలాడుతుంది. లోతుపాతులు, మంచిచెడులు, విస్తరణ, పరిమితులు మొదలైన వన్నీ చాలావరకు అర్థం అవుతాయి. ఇతరులు గుర్తించలేని రహస్యాలు స్ఫురిస్తాయి. శాస్త్రవేత్తలని దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు. ఎంతోమంది శాస్త్రవేత్తలు తాము చేసే పరిశోధనల గురించి నిరంతరం ఆలోచిస్తూనే ఉంటారు నిత్యకృత్యాలు నిర్వహిస్తూ కూడా. కొన్నిమార్లు వారికి నిద్రలో కలల రూపంలోనో, పరిసరాల్లో జరుగుతున్న సంఘటనల రూపంలోనో, ఆహారం తీసుకుంటున్నప్పుడో హఠాత్తుగా చేయవలసినది కానీ, పరిష్కారం గాని స్ఫురిస్తుంది. ఆర్కిమిడీస్ దానికి పెద్ద ఉదాహరణ. అతడికి తొట్టిలో స్నానం చేస్తుండగా నీళ్ళలో మునిగినప్పుడు పదార్థం బరువు తగ్గటానికి కారణం స్ఫురించింది. దానికి అతడు దాని గురించి చింతన చేస్తూ ఉండటమే కారణం.

చింతన అంటే నిరంతరం ఒక విషయాన్ని గురించి తలచుకుంటూ, మననం చేయటం. ఇది కూడా చిత్తం చేసే పనే అయినా చింతకి చింతనకి మధ్య ఎంతో తేడా ఉంది. నక్కకి నాకలోకానికి ఉన్నంత. లౌకిక స్థాయిలోచింతన మనిషి మేధకి మెఱుగులు పెడుతుంది. ఆలోచనలకి పదును పెడుతుంది. ఒక విషయాన్ని గురించి కూలంకషంగా విశ్లేషించి తగిన నిర్ణయం తీసుకోవటానికి తోడ్పడుతుంది. ఇది వ్యక్తిగతంగా తన సమస్యలని పరిష్కరించుకోవటానికి ఎంతో అవసరం.

మనిషి దేనిని చింతన చేస్తే దానిగా మారిపోతాడు అన్నది ఆధునిక మనస్తత్వశాస్త్ర పరిశోధకులు నిర్ధారించి చెప్పిన మాట.

సాధకుడు ఏమి పొందాలని అనుకుంటున్నాడో దానిని సిద్ధింపచేసేది చింతన అని ఆధ్యాత్మికవేత్తలు చెప్పే మాట.

– డా. ఎన్. అనంతలక్ష్మి

గృహస్థాశ్రమ వైశిష్ట్యం



ఇష్టాయిష్టాలు కలిసాయా!?

గృహస్థాశ్రమ ప్రవేశం చేయడానికి ఒక యువకుడికి, ఒక యువతికి ఉండవలసిన సాధారణ లక్షణాలు ఐదింటిని శ్రీరామాయణం నిర్దేశించింది. వాటిలో మొదటిది శీలం. అంటే స్వభావం. అది పుట్టుకతో వస్తుంది. ఒక్కొక్కరికి ఒక్కొక్క స్వభావం ఉంటుంది. కొంతమందికి సంగీతం, కొంతమందికి ఆధ్యాత్మిక చింతన, మరికొందరికి చిత్రలేఖనం.... అలా అది వారికి బాగా ఇష్టమైన విషయంగా ఉంటుంది. పెళ్ళి సంబంధం చూసే టప్పుడు ఒకరికి ఇష్టమైన విషయం మరొకరికి కూడా ఇష్టమేనా, అయిష్టం లేదు కదా.. అని చూస్తారు. ఆ పరిశీలన పెద్దలు చేస్తారు. తరువాత వయస్సు. ఇద్దరిలో ఎవరు ఎక్కువ ఎవరు తక్కువ అన్నది ఉండదు. రెండు కళ్ళల్లో ఏది మంచిదంటే ఏమని చెప్పగలం? బండి చక్రాలు రెండూ సమన్వయంతో పనిచేయాలి. జీవితం నుండి మొదట ఆయన నిష్క్రమిస్తే.. ఆవిడ పుణ్యకార్యం చేయదు. ఆమె వెళ్ళి పోతే...ఆయన తమ కడుపున పుట్టిన కూతురును కూడా కన్యాదానం చేయలేడు. ఆవిడ నిష్క్రమణతోనే ఆయనకు పుణ్య కార్యం చేసే అధికారం కూడా పోతుంది. అందువల్ల ఇద్దరూ సమానమే. ఇద్దరూ కలిసి ఉంటేనే సౌభాగ్యం, సంతోషం. అంటే వాళ్ళ వయసులో ఎవరు పెద్దయితే గొప్ప అన్నదానికన్నా ప్రధానమైనది– ఒకరు నడిపించాలి, మరొకరు నడవాలి–అనేది. ఇక్కడ నడిపించేవారిది ఎక్కువ, నడిచేవారిది తక్కువ అనుకోకూడదు. అన్వయం జాగ్రత్తగా చేసుకోవాలి. వరుడి వయసు పెద్దదయి ఉండాలి–అన్నారు. వయస్సు అంటే కాలం. కాలం అనుభవానికి, అవగాహనకు గుర్తు. ఎవరు ముందు ప్రపంచంలోకి వచ్చారో.. వాళ్ళఅనుభవాన్ని, అవగాహనను ఎక్కువ సాధిస్తారు. మనం ఎంత చదివాం అన్నదానికన్నా... దానికి అనుభవం ఎంత తోడయింది... అన్నది ప్రధానం. ఒక ఉద్యోగానికి వెడితే అనుభవం ఎంత అన్నదానికి ప్రాధాన్యత ఇస్తారు. అలాగే వివాహం విషయంలో.. లోకజ్ఞానం, లోక ప్రవృత్తిని సరిగా అర్థం చేసుకుని భార్యకు అవగాహన కలిగించగలిగిన వాడయి ఉండాలి.

అనుభవం అన్నమాటలోనే అంతర్లీనంగా ఉండే విషయం – భార్య పట్ల పరమ ప్రేమతో మెలుగుతూ ఆమెకు రక్షకుడయి ఉండాలన్నది. ఆమె గుణాలు, ప్రతిభ ప్రకాశించడానికి ఆయన అవకాశం కల్పించగలగాలి. ఆమె బలహీనతలు... శారీరకం కావచ్చు, నడవడి రీత్యా కావచ్చు... వాటిని కప్పగలగడంతోపాటూ ఆమె గౌరవమర్యాదలు తగ్గకుండా చూడగలగాలి. సంసారాన్ని సాఫీగా నడపడంలో ఆమెకు ఆయన అనుక్షణం అండగా నిలవాలి. ఒక అమాయకురాలైన కూతురు తెలిసీ తెలియక చేసే తప్పులను తల్లిదండ్రులు ఎలా సరిదిద్దుతూ కాపాడుతుంటారో భార్యను అలా కాపాడుకోగలిగి ఉండాలి. అది భర్త లక్షణం. భార్యది – అంకిత భావం. పిచ్చి ప్రేమ. భర్త ప్రేమకు కారణం ఉంటుంది. భార్య ప్రేమకు కారణం ఉండదు. అనుగమించడం, అంకితభావంలో మసులు కోవడం ఆమె కర్తవ్యం. ఆమెకు ప్రేమను పంచడం, ప్రతి కష్టంలో ఆమెకు రక్షణగా నిలవడం ఆయన బాధ్యత. ఆమెది పాతివ్రత్యం. ఆయనది ఏకపత్నీవ్రతం. అందువల్ల ఎక్కువ తక్కువలను వారి మధ్య పోల్చిచూడకూడదు. కామసంబంధమైన ప్రవత్తి కలిగినా ఆయన దృష్టిలో ఆమె వినా మరొకరికి స్థానం ఉండదు. ఆమెకు ఆయనే సర్వస్వం. ఇది దాంపత్యం. ఇదే గృహస్థాశ్రమం. ఇది సనాతన ధర్మ వైభవం.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

బౌద్ధవాణి

మట్టికుండ నేర్పిన పాఠం



విదిశా నగర సమీపంలోని ఒక వ్యాపార కేంద్రం సువర్ణపురి. ఆ పట్టణంలో ప్రజోతుడు పేరున్న ధనిక వ్యాపారి. ప్రజోతునికి మణిమాలుడు అనే కుమారుడు.

అతనూ పెరిగి పెద్దవాడయ్యాడు. తండ్రి వ్యాపారంలో తోడుగా ఉండేవాడు. మణిమాలుడు తమ వ్యాపారాన్ని మరింతగా పెంచాడు. ప్రజోతుడు వృద్ధుడయ్యాడు. కుమారునికి వ్యాపార పద్ధతులు, సుదూర రాజ్యాల ప్రజల తీరుతెన్నులు చెప్పుతూ... కాలం గడపసాగాడు.

అప్పుడప్పుడూ జైన సాధువుల్ని, బౌద్ధ భిక్షువుల్ని పిలిచి దానాలు ఇచ్చేవాడు. నగరంలో కొన్ని ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉండేవాడు. కొన్నాళ్ళకు మణిమాలుడు కూడా పెద్ద వ్యాపారి అయ్యాడు. ధనం పెరిగిన కొద్దీ అతనికి ధనదాహం కూడా పెరిగింది. అక్రమ వ్యాపారాలు సాగించాడు. దానితో ధనం ఇబ్బడి ముబ్బడిగా పెరిగింది. దానధర్మాలు మానాడు. ధనంతోపాటు మానసిక అశాంతీ పెరిగింది. నిద్ర సుఖానికి దూరం అయ్యాడు. భయానికీ, ఉలికిపాటుకూ చేరువయ్యాడు. తండ్రి తన కుమారునిలో పెరిగిపోతున్న అశాంతిని గమనించాడు. ఒకరోజున పిలిచి– ''నాయనా! నీవు నైతికతకి దూరమవుతున్నావు. మనోవేదనకి దగ్గరవుతున్నావు. నీవు ఇక నాతోపాటు బుద్ధ సందేశాలు వినడానికి రా.. ప్రస్తుతం భగవాన్ బుద్ధుడు ఇక్కడకు సమీపంలోనే ఉంటున్నారు'' అని అనునయంగా చెప్పాడు.

అలా... తనతో రెండు మూడుమార్లు మణిమాలుణ్ణి బుద్ధుని దగ్గరకు తీసుకుని వెళ్ళాడు ప్రజోతుడు. ఆ తర్వాత తానే స్వయంగా బుద్ధుని దగ్గరకు వెళ్ళసాగాడు మణిమాలుడు. ఒకరోజు మణిమాలుడు బుద్ధునితో–

''భగవాన్! నేను నా తండ్రిలా దానాలు చేయలేదు. సాధువుల్ని గౌరవించలేదు. వారిని సత్కరించలేదు. వ్యాపారాన్నీ ధర్మబద్ధంగా చేయనూ లేదు. ఇప్పుడే నా తప్పు తెలుసుకున్నాను. కానీ... నాకు ఒక బెంగ ఉంది. మరణానంతరం నా తండ్రికి గానీ, నాకు గానీ స్వర్గం లభిస్తుందా?'' అని అడిగాడు.

అతని ఆంతర్యం గ్రహించాడు బుద్ధుడు. ''మణిమాలా! రేపు వచ్చేటప్పుడు ఒక మట్టికుండ, కొంత వెన్నపూస, కొన్ని గులకరాళ్ళు తీసుకుని రా'' అన్నాడు. మరునాడు అవి తీసుకువచ్చాడు మణిమాలుడు. కుండలో గులకరాళ్ళు పోయించి, వాటిమీద వెన్నముద్ద పెట్టించి,''మణిమాలా! దగ్గరలో ఉన్న తటాకం దగ్గరకు తీసుకుపోయి ఈ కుండను నీటిమీద ఉంచి, కర్రతో పగలగొట్టు. వెన్న మునిగితే నీ తండ్రికి స్వర్గప్రాప్తి, రాళ్ళు తేలితే నీకు స్వర్గప్రాప్తి..'' అని చెప్పి పంపాడు.

మణిమాలుడు గబగబా వెళ్ళి నీటిపై కుండను ఉంచి కర్రతో పగలగొట్టాడు. వెన్న తేలింది. రాళ్ళు మునిగాయి. దానితో ఆందోళనపడుతూ బుద్ధుని దగ్గరకు పరుగున వచ్చి పడ్డాడు. విషయం చెప్పి...''మా ఇద్దరికీ స్వర్గం దక్కే మార్గం ఏమిటి భగవాన్'' అని అడిగాడు.

''నాయనా నీటిలో రాళ్ళు మునగడం వాటి ప్రకృతిధర్మం. నీటిపై తేలడం వెన్న సహజ ధర్మం. అవి వాటి సహజ ధర్మాల్ని తప్పి ఎప్పుడూ ప్రవర్తించవు. అలాగే... మంచి పనులు చేస్తే మనిషికి మనశ్శాంతి. సుఖ నిద్ర, సుఖ జీవనం. అదే స్వర్గం. చెడ్డపనులు చేస్తే మనస్సుకు అశాంతి. దుఃఖం. నిద్రకు దూరం. మనోవ్యథ. అదే నరకం. మంచిగా మానవునిగా, మానవతతో జీవించు. దుఃఖాన్ని ఇచ్చే అకుశల కర్మలు ఆచరించకు. అదే స్వర్గం. ...'' అని చెప్పాడు.

మణిమాలుని మనస్సు తేటపడింది. మట్టికుండ మహోపదేశాన్ని అందించింది. ధర్మబద్ధంగా జీవించడం నేర్చుకున్నాడు. దానాలు చేస్తూ, ధర్మకార్యాలు నెరవేరుస్తూ జీవితం ఆనందంగా కొనసాగించారు.

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా

హారర్ కామెడీ



● రాశీఖన్నా

తమన్నా, రాశీఖన్నా హీరోయిన్లుగా, సుందర్ సి. కీలక పాత్రలో నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'అరణ్మనై 4'. 'వెన్నెల' కిషోర్, శ్రీనివాసులు, ఢిల్లీ గణేష్, కోవై సరళ కీలక పాత్రల్లో నటించారు. తమిళ చిత్ర పరిశ్రమలో 'అరణ్మనై' మూవీ సూపర్ హిట్ ఫ్రాంచైజీగా నిలిచింది. ఈ ఫ్రాంచైజీలో నిర్మించిన తాజా చిత్రం 'అరణ్మనై 4'. అవ్ని సినిమాక్స్‌పై ఖుష్బు సుందర్, ఏసీఎస్ అరుణ్ కుమార్ నిర్మించారు. ఈ మూవీని 'బాక్' పేరుతో ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్ఎల్‌పీ తెలుగులో విడుదల చేస్తోంది. తాజాగా 'బాక్' సెన్సార్ పూర్తి చేసుకుంది.. 'యూ/ఏ' సర్టిఫికెట్ వచ్చింది. మే 3న ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నామన్నారు మేకర్స్. ''హారర్ కామెడీ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'బాక్'. మా మూవీ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది. హిప్‌హాప్ తమిళ అద్భుతమైన సంగీతం అందించారు. ఈ మూవీ నుంచి విడుదలైన 'పంచుకో..' పాటకి అనూహ్యమైన స్పందన వచ్చింది. తమన్నా, రాశీఖన్నాలపై చిత్రీకరించిన ఈ పాట సినిమాకి హైలెట్‌గా ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: ఇ.కృష్ణమూర్తి అకా కిచ్చ.

థగ్‌లైఫ్ కోసం పాట



● కమల్‌హాసన్

నటన, నిర్మాణం, డైరెక్షన్, స్టోరీ రైటింగ్.. వంటి విషయాల్లోనే కాదు.. వీలైనప్పుడు కొరియోగ్రాఫర్, గీత రచయితగా తన ప్రతిభను చూపిస్తుంటారు కమల్‌హాసన్. ఇటీవల తన కూతురు, హీరోయిన్ శ్రుతీహాసన్ మ్యూజిక్ డైరెక్టర్‌గా చేసిన 'ఇనిమెల్' సాంగ్‌కు కమల్‌హాసన్ లిరిక్స్ రాశారు. దర్శకుడు లోకేష్ కనగరాజ్, శ్రుతీహాసన్ యాక్ట్ చేసిన ఈ సాంగ్‌కు శ్రోతల నుంచి మంచి పాజిటివ్ రెస్పాన్స్ లభించింది. తాజాగా కమల్‌హాసన్ మరో పాట రాశారు. అది 'థగ్‌లైఫ్' సినిమా కోసం. 'నాయగన్' (1987) వంటి హిట్ ఫిల్మ్ తర్వాత కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో వస్తున్న సినిమా ఇది. ఈ సినిమా కోసం ఓ పాటను రాసినట్లు ఇటీవల కమల్‌హాసన్ పేర్కొన్నారు. అంతే కాదు.. ఈ పాట మొత్తం రెండు గంటల్లోనే పూర్తయిందని, చిత్ర మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహమాన్ ఈ పాటను రికార్డు చేసేశారని కమల్‌హాసన్ పేర్కొనడం విశేషం. త్రిష, 'జయం' రవి, దుల్కర్ సల్మాన్, శింబు ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్న 'థగ్‌లైఫ్' సినిమా వచ్చే ఏడాది విడుదల కానుందని కోలీవుడ్ టాక్.

మా ఇంటి బంగారం



● సమంత

హీరోయిన్ సమంత కొత్త కబురు చెప్పారు. 'మా ఇంటి బంగారం' అనే టైటిల్‌తో తన తర్వాతి సినిమా తెరకెక్కనున్నట్లు వెల్లడించారు. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్, గ్లింప్స్ వీడియోను ఇన్‌స్టాగ్రామ్ వేదికగా సమంత షేర్ చేశారు. అలాగే 'మా ఇంటి బంగారం' మూవీ సమంత సొంత నిర్మాణ సంస్థ అయిన 'ట్రా లా లా మూవింగ్ పిక్చర్స్' పతాకంపై తెరకెక్కనుంది. నిర్మాతగా సమంత రూపొందిస్తున్న తొలి చిత్రం కూడా ఇదే కావడం విశేషం. ఈ మూవీలో ఓ సమస్యపై పోరాడే గృహిణి పాత్రలో సమంత నటించనున్నట్లు తెలుస్తోంది. అయితే ఆదివారం సమంత బర్త్ డే (ఏప్రిల్ 28). ఈ సందర్భంగా 'మా ఇంటి బంగారం' సినిమా అనౌన్స్‌మెంట్ వచ్చినట్లు ఊహించ వచ్చు. ఇదిలా ఉంటే.. హీరో వరుణ్‌ధావన్‌తో కలిసి సమంత నటించిన 'సిటాడెల్' వెబ్‌సిరీస్ ఇండియన్ వెర్షన్ స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోన్న సంగతి తెలిసిందే.

వాస్తవ ఘటనలతో...



● అక్షయ్ కుమార్


బాలీవుడ్ హీరో అక్షయ్‌కుమార్ నటించిన తాజా యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'స్కై ఫోర్స్'. సందీప్ కెవ్లాని– అభిషేక్ కపూర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సారా అలీఖాన్, నిమ్రత్ కౌర్ హీరోయిన్లుగా నటించారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ ముగిసింది. ఈ మూవీ షూటింగ్ దాదాపు వంద రోజులు జరగ్గా, అరవై రోజుల పాటు అక్షయ్‌కుమార్ సెట్స్‌లో పాల్గొన్నారని బాలీవుడ్ సమాచారం. వాస్తవ ఘటనల ఆధారంగా రూపుదిద్దుకున్న ఈ సినిమాను జ్యోతిదేశ్‌పాండే, అమర్ కౌశిక్, దినేష్ విజన్ నిర్మించారు. 'స్కైఫోర్స్' చిత్రం అక్టోబరు 2న విడుదల కానుందని బాలీవుడ్ సమాచారం.

సీతారాముడు ఆన్ సెట్స్



● రణ్‌బీర్ కపూర్

'**రా**మాయణం' ఆధారంగా హిందీలో 'రామాయణ' అనే సినిమా తెరకెక్కుతున్నట్లుగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. 'దంగల్' ఫేమ్ నితీష్ తివారి దర్శకత్వంలో నమిత్ మల్హోత్రా, యశ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి, రావణుడిగా యశ్ నటిస్తున్నారనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది. అయితే ఈ మూవీ చిత్రీకరణ ఆల్రెడీ మొదలైందని, ప్రస్తుతం రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి షూటింగ్‌లో పాల్గొంటుండగా నితీష్ తివారి కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుపుతున్నారని బాలీవుడ్ సమాచారం. కాగా రాముడి గెటప్‌లో రణ్‌బీర్ కపూర్, సీత గెటప్‌లో సాయిపల్లవి ఉన్న ఫోటోలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి. అలాగే హిందీ 'రామాయణ' సినిమాను మూడుభాగాలుగా తెరకెక్కిస్తున్నారని, తొలి భాగాన్ని వచ్చే ఏడాది దీపావళి సందర్భంగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని బాలీవుడ్ టాక్. అయితే ఈ సినిమా గురించి పూర్తి స్థాయి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



● సాయిపల్లవి, రణ్‌బీర్

అలాంటి సన్నివేశాలకు నో – మృణాళ్ ఠాకూర్



'కథకి, పాత్రకి అవసరమైతే గ్లామర్ సన్నివేశాల్లో, ముద్దు సీన్స్‌లో నటించేందుకు సిద్ధం' అనే మాటని ఎక్కువ శాతం హీరోయిన్లు అంటుంటారు. అయితే అలాంటి సన్నివేశాలకు నో అనే కథానాయికలూ లేకపోలేదు. హీరోయిన్ మృణాళ్ ఠాకూర్ కూడా గ్లామర్ సన్నివేశాలు, ముద్దు సీన్స్‌లో నటించేందుకు నో చెబుతాను అంటున్నారు. 'సీతా రామం'(2022) సినిమాతో తెలుగు పరిశ్రమలో ఎంట్రీ ఇచ్చారు ఈ మరాఠీ బ్యూటీ. అందం, అభినయంతో తొలి చిత్రంతోనే సూపర్ హిట్ అందుకున్నారు మృణాళ్. ఆ తర్వాత తెలుగులో నానితో 'హాయ్ నాన్న', విజయ్ దేవరకొండతో 'ఫ్యామిలీ స్టార్' సినిమాల్లో నటించి, తెలుగు ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక అభిమానులను సొంతం చేసుకున్నారామె. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మృణాల్ ఠాకూర్ మాట్లాడుతూ–''ఇంటెన్స్ కిస్సింగ్ సీన్స్, బెడ్ రూమ్ సన్నివేశాల్లో నటించడం నాకు ఇష్టం ఉండదు. పైగా నేను అలాంటి సీన్స్‌లో యాక్ట్ చేసేందుకు నా తల్లిదండ్రులు కూడా ఒప్పుకోరు. అందుకే మొహమాటం లేకుండా నో చెబుతాను'' అన్నారు.

నవ్వులే నవ్వులు



● ప్రియదర్శి

'**మ**ల్లేశం, జాతిరత్నాలు, బలగం, ఓం భీమ్ బుష్' చిత్రాల ఫేమ్ ప్రియదర్శి హీరోగా కొత్త సినిమా ప్రకటన వచ్చింది. ఈ చిత్రానికి హీరో రానా సమర్పకుడిగా వ్యవహరిస్తుండటం విశేషం. నిర్మాత నారాయణ్ దాస్ నారంగ్ ఆశీస్సులతో రూపొందనున్న ఈ మూవీతో నవనీత్ శ్రీరామ్ దర్శకునిగా పరిచయమవుతున్నారు. ప్రతిష్ఠాత్మక 'టైమ్స్ పవర్ ఉమెన్ 2024' అవార్డును అందుకున్న జాన్వీ నారంగ్ నిర్మించనున్న ఈ మూవీని అధికారికంగా ప్రకటించారు మేకర్స్. ''వినోదాత్మకంగా రూపొందనున్న చిత్రమిది. త్వరలోనే ప్రీ ప్రొడక్షన్ పనులు ప్రారంభించనున్నాం. ఈ మూవీ టైటిల్, నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో తెలియజేస్తాం'' అన్నారు చిత్రయూనిట్. ఈ చిత్రానికి సమర్పణ: సునీల్ నారంగ్, భరత్ నారంగ్, శ్రీ వెంకటేశ్వర ఏషియన్ సినిమాస్ ఎల్ఎల్‌పీ, రానా దగ్గుబాటి(స్పిరిట్ మీడియా).

గుట్టు చప్పుడు మలుపు తిప్పుతుంది – సంజయ్‌రావ్



● బ్రహ్మాజీ, సంజయ్ రావ్

''**గు**ట్టు చప్పుడు'లో అన్ని వర్గాలను ఆకట్టుకునే అంశాలు ఉన్నాయి. నా కెరీర్‌ని మంచి మలుపు తిప్పే సినిమా అవుతుందనే నమ్మకం ఉంది. అంతేకాదు.. మా టీమ్‌కి సూపర్ సక్సెస్ ఇచ్చే చిత్రం ఇది'' అని నటుడు బ్రహ్మాజీ తనయుడు, హీరో సంజయ్ రావ్ అన్నారు. మణీంద్రన్ దర్శకత్వంలో సంజయ్ రావ్, ఆయేషాఖాన్ జంటగా నటిస్తున్న చిత్రం 'గుట్టు చప్పుడు'. డా.లివింగ్‌స్టన్ నిర్మిస్తున్న ఈ సినిమా టీజర్‌ని హీరో సాయి దుర్గా తేజ్ ఆన్‌లైన్‌లో రిలీజ్ చేయగా, ఆఫ్‌లైన్‌లో బ్రహ్మాజీ రిలీజ్ చేశారు. మణీంద్రన్ మాట్లాడుతూ–''రొమాంటిక్, యాక్షన్, లవ్, ఎంటర్‌టైనర్‌గా 'గుట్టు చప్పుడు' తెరకెక్కుతోంది. ప్రేక్షకుల టిక్కెట్ ధరకు మించిన ఆనందాన్ని ఇచ్చే సినిమా ఇది'' అన్నారు. ''మణీంద్రన్‌తో నాకు 12 సంవత్సరాల అనుబంధం. ఈ చిత్ర కథ చెప్పినప్పుడు ఎగ్జైట్‌గా ఫీలయ్యాను'' అన్నారు లివింగ్‌స్టన్. చిత్ర సంగీత దర్శకుడు గౌర హరి మాట్లాడారు.

వేట ఆలస్యం



● ఆరోన్ టేలర్

ఆరోన్ టేలర్ జాన్సన్ ప్రధాన పాత్రలో, అరియానా డిబోస్, ఫ్రెడ్ హెచింజర్, క్రిస్టోఫర్ అబాట్, రస్సెల్ క్రోవ్, అలెస్సాండ్రో నివోల కీలక పాత్రల్లో నటిస్తున్న హాలీవుడ్ సూపర్ హీరో ఫిల్మ్ 'క్రావెన్ ది హంటర్'. జేసీ చందర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. కాగా ఈ సినిమాను తొలుత ఆగస్టు 30న విడుదల చేయాలనుకున్నారు. కానీ, డిసెంబరు 13న విడుదల చేయనున్నట్లు ఈ సినిమాను డిస్ట్రిబ్యూట్ చేయనున్న సోనీ పిక్చర్స్ ప్రకటించింది.



షూటింగ్‌లో భారత్‌కు 21వ ఒలింపిక్ బెర్త్

పారిస్ ఒలింపిక్స్ చివరి క్వాలిఫయింగ్ షూటింగ్ టోర్నీలో భారత మహిళా స్కీట్ షూటర్ మహేశ్వరి చౌహాన్ రజత పతకం సాధించింది. దాంతో భారత్‌కు 21వ ఒలింపిక్ బెర్త్ ఖరారైంది. దోహాలో ఆదివారం జరిగిన స్కీట్ ఈవెంట్ ఫైనల్లో మహేశ్వరి 'షూట్ ఆఫ్'లో 3–4తో ఫ్రాన్సిస్కా క్రొవెట్టో (చిలీ) చేతిలో ఓడిపోయింది. నిర్ణీత 60 షాట్‌ల తర్వాత ఇద్దరూ 54–54తో సమంగా ఉండటంతో విజేతను నిర్ణయించేందుకు 'షూట్ ఆఫ్'ను నిర్వహించారు.

రేణుక విజృంభణ... భారత్ శుభారంభం



బంగ్లాదేశ్‌తో ఆదివారం సిల్హెట్‌లో జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 44 పరుగుల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 145 పరుగులు చేసింది. యస్తిక భాటియా (36 ; 6 ఫోర్లు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (30 : 4 ఫోర్లు), షఫాలీ వర్మ (31 : 3 ఫోర్లు, 1 సిక్స్) ఆకట్టుకున్నారు. అనంతరం బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 101 పరుగులకే పరిమితమైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రేణుక సింగ్ (3/18), పూజ వస్త్రకర్ (2/25) బంగ్లాదేశ్‌ను కట్టడి చేశారు. రెండో టి20 మంగళవారం జరుగుతుంది.

ప్రపంచ అండర్-8 చెస్ చాంపియన్ దివిత్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ బాలుడు అదుళ్ల దివిత్ రెడ్డి అద్భుతం చేశాడు. అల్బేనియాలో జరుగుతున్న ప్రపంచ క్యాడెట్ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో అండర్–8 ఓపెన్ విభాగంలో విజేతగా నిలిచాడు. నిర్ణీత 11 రౌండ్ల తర్వాత దివిత్ రెడ్డి 10 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. దివిత్ 10 గేముల్లో గెలిచి, ఒక గేమ్‌లో ఓడిపోయాడు. ఇదే టోర్నీలో అండర్–12 బాలికల విభాగంలో భారత్‌కే చెందిన ఏఎస్ శ్రావణిక విజేతగా నిలిచింది.

క్వార్టర్ ఫైనల్లో భారత్



అన్‌మోల్

చెంగ్డూ: ఉబెర్ కప్ మహిళల టీమ్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత జట్టు వరుసగా రెండో విజయంతో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా సింగపూర్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 4–1తో గెలిచింది. తొలి మ్యాచ్‌లో అష్మిత 15–21, 18–21తో యో జియా మిన్ చేతిలో ఓడిపోయింది. రెండో మ్యాచ్‌లో ప్రియ-శ్రుతి ద్వయం 21–15, 21–16తో జియా ఎన్ హెంగ్-జిన్ యు జియా జోడీపై గెలిచింది. మూడో మ్యాచ్‌లో ఇషారాణి 21–13, 21–16తో ఇన్సిరా ఖాన్‌ను ఓడించింది. నాలుగో మ్యాచ్‌లో సిమ్రన్-రితిక జంట 21–8, 21–11తో యి టింగ్ ఎల్సా-జాన్ మిచెల్లి జోడీపై గెలిచింది. చివరిదైన ఐదో మ్యాచ్‌లో అన్‌మోల్ 21–15, 21–13తో లీ జిన్ మేగన్‌ను ఓడించింది.



క్యాండిడేట్స్ చెస్ టోర్నీ విజేత గుకేశ్‌ను సన్మానించిన తమిళనాడు సీఎం స్టాలిన్, క్రీడా శాఖ మంత్రి ఉదయనిధి. ఈ సందర్భంగా గుకేశ్‌కు తమిళనాడు ప్రభుత్వం రూ. 75 లక్షలు నజరానా అందజేసింది.

జాక్స్ ధమాకా...

రెండే ఓవర్లలో 44 పరుగుల నుంచి 100 నాటౌట్

- 16 ఓవర్లలోనే 201 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన బెంగళూరు
- మెరిపించిన విరాట్ కోహ్లి
- గుజరాత్ టైటాన్స్‌కు ఆరో ఓటమి

బెంగళూరు గెలిచేందుకు 6 ఓవర్లలో 53 పరుగులు చేయాలి. కోహ్లి 69 పరుగులతో... విల్ జాక్స్ 44 పరుగులతో క్రీజులో ఉన్నారు. ఇక్కడ సెంచరీ అయితే గియితే కోహ్లిదే అవుతుంది లేదంటే లేదు! కానీ ఎవరూ ఊహించని విధంగా జాక్స్ రెండే ఓవర్లలో సెంచరీ పూర్తి చేశాడు. మోహిత్ శర్మ వేసిన 15వ ఓవర్లో జాక్స్ 4, 6, నోబాల్ 6, 2, 6, 4, 0లతో 29 పరుగులు సాధించాడు. రషీద్ ఖాన్ వేసిన 16వ ఓవర్లో తొలి బంతికి కోహ్లి ఒక పరుగు తీసి జాక్స్‌కు స్ట్రయిక్ ఇచ్చాడు. జాక్స్ వరుసగా 6, 6, 4, 6, 6లతో 28 పరుగులు పిండుకొని సంచలన శతకం సాధించి అబ్బుర పరిచాడు. జాక్స్ 29 బంతుల్లో 44 పరుగులు చేయగా... ఆ తర్వాత 12 బంతుల్లో ఏకంగా 56 పరుగులు సాధించి సెంచరీ మైలురాయిని అందుకోవడం విశేషం.

అహ్మదాబాద్: మళ్లీ బౌలర్ డీలా... బంతేమో విల విల... బ్యాట్ భళా! అంతే మరో 200 పైచిలుకు స్కోరు... దీన్ని 16 ఓవర్లలోనే ఛేదించిన తీరు చూస్తుంటే ఈ వేసవి వడగాడ్పులతో వేడెక్కించడమే కాదు... ఐపీఎల్ సిక్సర్లతో కిక్ ఎక్కిస్తోంది! ప్లే ఆఫ్స్ రేసుకు దాదాపు దూరమనుకున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఇంటాబయటా పరుగుల హోరెత్తిస్తోంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ 9 వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్‌పై జయభేరి మోగించింది. 201 పరుగుల లక్ష్యాన్ని 16 ఓవర్లలోనే ఉఫ్‌మని ఊదేసింది. మొదట బ్యాటింగ్ చేపట్టిన టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 200 పరుగుల భారీస్కోరు చేసింది. సాయి సుదర్శన్ (49 బంతుల్లో 84 నాటౌట్; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు), షారుఖ్ ఖాన్ (30 బంతుల్లో 58; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) చెలరేగారు. అనంతరం ఆర్‌సీబీ 16 ఓవర్లలోనే ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 206 పరుగులు చేసి ఘనవిజయం సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విల్ జాక్స్ (41 బంతుల్లో 100 నాటౌట్; 5 ఫోర్లు, 10 సిక్స్‌లు), విరాట్ కోహ్లి (44 బంతుల్లో 70 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) సిక్సర్లతో హోరెత్తించారు.

జాక్స్ 2 ఓవర్ల విధ్వంసంతో...

కోహ్లితో ఛేదన ప్రారంభించిన డుప్లెసిస్ (12 బంతుల్లో 24; 1 ఫోర్, 3 సిక్స్‌లు) నాలుగో ఓవర్లో నిష్క్రమించాడు. సాయికిశోర్ వేసిన ఆ ఓవరే వికెట్ దక్కించుకుంది. ఆ తర్వాత ఎవరూ బౌలింగ్‌కు దిగినా... పరుగులు, ఈ దశ దాటి మెరుపులు... దాన్ని మించి ఉప్పెనే! పవర్‌ప్లేలో బెంగళూరు 63/1 స్కోరు చేసింది. సగం ఓవర్లు ముగిసేసరికి 98/1 అంటే వంద కూడా చేయని జట్టు ఇంకో 6 ఓవర్లు ముగిసేసరికే 108 పరుగుల్ని చేసి మ్యాచ్‌నే ముగించింది. కోహ్లి 32 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నప్పుడు జాక్స్ 16 బంతుల్లో 16 పరుగులే చేశాడు. 14 ఓవర్లలో బెంగళూరు స్కోరు 148/1. ఈ దశలో మోహిత్ వేసిన 15వ ఓవర్లో, రషీద్ ఖాన్ వేసిన 16వ ఓవర్లో జాక్స్ విశ్వరూపం ప్రదర్శించడంతో ఆర్‌సీబీ 16 ఓవర్లలోనే లక్ష్యాన్ని అధిగమించి విజయతీరానికి చేరింది.



కోహ్లి, జాక్స్

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	9	8	1	16	0.694
కోల్‌కతా	8	5	3	10	0.972
చెన్నై	9	5	4	10	0.810
హైదరాబాద్	9	5	4	10	0.075
లక్నో	9	5	4	10	0.059
ఢిల్లీ	10	5	5	10	-0.276
గుజరాత్	10	4	6	8	-1.113
పంజాబ్	9	3	6	6	-0.187
ముంబై	9	3	6	6	-0.261
బెంగళూరు	10	3	7	6	-0.415

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

కోల్‌కతా X ఢిల్లీ
వేదిక: కోల్‌కతా
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) కరణ్ శర్మ (బి) స్వప్నిల్ 5; గిల్ (సి) గ్రీన్ (బి) మ్యాక్స్‌వెల్ 16; సుదర్శన్ (నాటౌట్) 84; షారుఖ్ (బి) సిరాజ్ 58; మిల్లర్ (నాటౌట్) 26; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 200. వికెట్ల పతనం: 1–6, 2–45, 3–131. బౌలింగ్: స్వప్నిల్ 3–0–23–1, సిరాజ్ 4–0–34–1, యశ్ దయాళ్ 4–0–34–0, మ్యాక్స్‌వెల్ 3–0–28–1, కరణ్ శర్మ 3–0–38–0, గ్రీన్ 3–0–42–0. **రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్:** కోహ్లి (నాటౌట్) 70; డుప్లెసిస్ (సి) సబ్–శంకర్ (బి) సాయికిశోర్ 24; విల్ జాక్స్ (నాటౌట్) 100; ఎక్స్‌ట్రాలు 12; మొత్తం (16 ఓవర్లలో వికెట్ నష్టానికి) 206. వికెట్ల పతనం: 1–40. బౌలింగ్: అజ్మతుల్లా 2–0–18–0, సందీప్ 1–0–15–0, సాయికిశోర్ 3–0–30–1, రషీద్ ఖాన్ 4–0–51–0, నూర్ అహ్మద్ 4–0–43–0, మోహిత్ 2–0–41–0.

ధీరజ్ బృందం సంచలనం

- ఒలింపిక్ చాంపియన్ దక్షిణ కొరియాపై విజయం
- 14 ఏళ్ల తర్వాత ఆర్చరీ ప్రపంచకప్ టోర్నీలో స్వర్ణం

షాంఘై (చైనా): సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్–1 టోర్నీలో భారత పురుషుల రికర్వ్ జట్టు స్వర్ణ పతకంతో మెరిసింది. టోక్యో ఒలింపిక్స్ చాంపియన్ దక్షిణ కొరియాతో ఆదివారం జరిగిన రికర్వ్ టీమ్ విభాగం ఫైనల్లో ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్, తరుణ్‌దీప్ రాయ్, ప్రవీణ్ జాధవ్‌లతో కూడిన భారత జట్టు 5–1 (57–57, 57–55, 55–53)తో సంచలన విజయం సాధించింది. తద్వారా 14 ఏళ్ల తర్వాత ప్రపంచకప్ టోర్నీలో టీమ్ విభాగంలో పసిడి పతకం సొంతం చేసుకుంది. చివరిసారి భారత్ 2010 ఆగస్టులో షాంఘైలోనే జరిగిన ప్రపంచకప్ స్టేజ్–4 టోర్నీలో స్వర్ణం సాధించింది. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో ధీరజ్ –అంకిత ద్వయం కాంస్య పతకం గెలిచింది. కాంస్య పతక మ్యాచ్‌లో ధీరజ్–అంకిత జోడీ 6–0 (35–31, 38–35, 39–37)తో వలెన్సియా–మతియాస్ (మెక్సికో) జంటపై నెగ్గింది. మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగం ఫైనల్లో భారత స్టార్ దీపిక కుమారి 0–6 (26–27, 27–29, 27–28)తో ఆసియా క్రీడల చాంపియన్ లిమ్ సిహైన్ (కొరియా) చేతిలో ఓడిపోయి రజత పతకం దక్కించుకుంది.



స్వర్ణాలతో తరుణ్‌దీప్, ధీరజ్, ప్రవీణ్ (ఎడమ నుంచి)

సన్‌రైజర్స్ తడబాటు...

చెన్నై చేతిలో 78 పరుగులతో ఓటమి • చెలరేగిన రుతురాజ్, మిచెల్, తుషార్



రుతురాజ్

చెన్నై: మొన్న బెంగళూరు బౌలర్లు... ఇప్పుడేమో చెన్నై బౌలర్లు... సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు బ్యాటర్ల ఆటల్ని సాగనివ్వలేదు. దీంతో 250 ప్లస్ స్కోర్లను అవలీలగా చేసిన హైదరాబాద్ తాజాగా 213 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక ఓడిపోయింది. సొంతగడ్డపై చెన్నై 78 పరుగుల తేడాతో హైదరాబాద్‌పై ఘనవిజయం సాధించింది. ముందుగా చెన్నై 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 212 పరుగుల భారీస్కోరు చేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (54 బంతుల్లో 98; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ అవకాశాన్ని చేజార్చుకున్నాడు. మిచెల్ (32 బంతుల్లో 52; 7 ఫోర్లు, 1 సిక్స్), శివమ్ దూబే (20 బంతుల్లో 39 నాటౌట్; 1 ఫోర్లు, 4 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ 18.5 ఓవర్లలో 134 పరుగులకే కుప్పకూలి ఓడిపోయింది. తుషార్ దేశ్‌పాండే (4/27) సన్‌రైజర్స్ ను దెబ్బ కొట్టాడు.

స్కోరు వివరాలు

చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్: రహానే (సి) షహబాజ్ (బి) భువనేశ్వర్ 9; రుతురాజ్ (సి) నితీశ్ (బి) నటరాజన్ 98; మిచెల్ (సి) నితీశ్ (బి) ఉనాద్కట్ 52; దూబే (నాటౌట్) 39; ధోని (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 9; మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 212. వికెట్ల పతనం: 1–19, 2–126, 3–200. బౌలింగ్: భువనేశ్వర్ 4–0–38–1, నితీశ్ 1–0–8–0, షహబాజ్ 3–0–33–0, నటరాజన్ 4–0–43–1, ఉనాద్కట్ 4–0–38–1, కమిన్స్ 4–0–49–1. **సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్:** హెడ్ (సి) మిచెల్ (బి) తుషార్ 13; అభిషేక్ (సి) మిచెల్ (బి) తుషార్ 15; అన్‌మోల్‌ప్రీత్ (సి) మొయిన్ అలీ (బి) తుషార్ 0; మార్క్‌రమ్ (బి) పతిరణ 32; నితీశ్ (సి) ధోని (బి) జడేజా 15; క్లాసెన్ (సి) మిచెల్ (బి) పతిరణ 20; సమద్ (సి) సబ్–రిజ్వీ (బి) శార్దుల్ 19; షహబాజ్ (సి) మిచెల్ (బి) ముస్తఫిజుర్ 7; కమిన్స్ (సి) మిచెల్ (బి) తుషార్ 5; భువనేశ్వర్ (నాటౌట్) 4; ఉనాద్కట్ (సి) మొయిన్ (బి) ముస్తఫిజుర్ 1; ఎక్స్‌ట్రాలు 3; మొత్తం (18.5 ఓవర్లలో ఆలౌట్) 134. వికెట్ల పతనం: 1–21, 2–21, 3–40, 4–72, 5–85, 6–117, 7–119, 8–124, 9–132, 10–134 బౌలింగ్: దీపక్ చహర్ 3–0–22–0, తుషార్ 3–0–27–4, ముస్తఫిజుర్ 2.5–0–19–2, జడేజా 4–0–22–1, శార్దుల్ 4–0–27–1, పతిరణ 2–0–17–2.

విద్య, ఉద్యోగ సమాచారం

ఏడీసెట్-2024

ఏపీ ఉన్నత విద్యా మండలి(ఏపీఎస్‌సీహెచ్‌ఈ).. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడపలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ.. ఆర్ట్ అండ్ డిజైన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏడీసెట్)-2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్(బీఎఫ్ఏ), బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(బీ డిజైన్) కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

కోర్సుల వివరాలు

- పెయింటింగ్/స్కల్ప్చర్/యానిమేషన్/అప్లైడ్ ఆర్ట్స్/ఫోటోగ్రఫీలో బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్(బీఎఫ్ఏ).
- ఇంటీరియర్ డిజైన్‌లో బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ (బీడిజైన్).
- **అర్హత:** 10+2/ఇంటర్మీడియట్(ఎంపీసీ/ఎంఈసీ/బైపీసీ/ఎంబైపీసీ/సీఈసీ/హెచ్ఈసీ లేదా తత్సమాన ఉత్తీర్ణులై ఉండాలి.
- **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్షలో పొందిన ర్యాంక్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
- **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) ఉంటుంది. బీఎఫ్ఏ, బీడిజైన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఒకే ఉమ్మడి ప్రశ్న పత్రం ఉంటుంది. ఆన్‌లైన్(సీబీటీ) విధానంలో ఈ పరీక్షను నిర్వహిస్తారు. మొత్తం 100 మార్కులకు 100 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం 120 నిమిషాలు. పరీక్ష మాధ్యమం తెలుగు, ఇంగ్లిష్.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 23.04.2024.
- **ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.05.2024.
- **హాల్‌టిక్కెట్ డౌన్‌లోడ్ తేది:** 04.06.2024.
- **ప్రవేశ పరీక్ష తేది:** 13.06.2024.
- **వెబ్‌సైట్:** https://cets.apsche.ap.gov.in/ADCET

యూపీఎస్సీ - సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ పరీక్ష-2024

న్యూఢిల్లీలోని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్(అసిస్టెంట్ కమాండెంట్) ఎగ్జామినేషన్-2024 నిర్వహిస్తోంది. ఈ పరీక్ష ద్వారా బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్, సశస్త్ర సీమా బల్‌లో అసిస్టెంట్ కమాండెంట్ల(గ్రూప్ ఏ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 506
- **పోస్టుల వివరాలు:** బీఎస్ఎఫ్-186, సీఆర్‌పీఎఫ్-120, సీఐఎస్ఎఫ్-100, ఐటీబీపీ-58, ఎస్ఎస్‌బీ-42.



- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక, వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.
- **వయసు:** 01.08.2024 నాటికి 20 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాత పరీక్ష (పేపర్1, పేపర్ 2), ఫిజికల్ స్టాండర్డ్స్/ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్ ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.05.2024.
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 15.05.2024 నుంచి 21.05.2024.
- **రాతపరీక్ష తేది:** 04.08.2024.
- **వెబ్‌సైట్:** https://upsc.gov.in

టీఎంసీలో 87 మెడికల్, నాన్-మెడికల్ పోస్టులు

టాటా మెమోరియల్ సెంటర్‌కు చెందిన టాటా మెమోరియల్ హాస్పిటల్ ముంబై, గువాహటి, విశాఖపట్నంలోని టీఎంసీ ఆసుపత్రుల్లో మెడికల్, నాన్-మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 87
- **పోస్టుల వివరాలు:** మెడికల్ ఆఫీసర్ ఈ-08, మెడికల్ ఫిజిసిస్ట్-02, ఆఫీసర్ ఇన్‌ఛార్జ్-01, సైంటిఫిక్ అసిస్టెంట్-02, అసిస్టెంట్ నర్సింగ్ సూపరింటెండెంట్-01, ఫీమేల్ నర్స్-58, కిచెన్ సూపర్‌వైజర్-01, టెక్నీషియన్ సి-01, టెక్నీషియన్ ఎ-04, స్టెనోగ్రాఫర్-06, లోయర్ డివిజన్ క్లర్క్-03.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, 12వ తరగతి, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**07.05.2024
- **వెబ్‌సైట్:** https://tmc.gov.in

దివ్యాంగుల సేవలో!

- బీపీటీ, బీఓటీ, బీపీఓ, బీ.ఏఎస్ఎల్‌పీ కోర్సులు
- దివ్యాంగులకు బోధనకు ఉద్దేశించిన కోర్సులు
- కోర్సు పూర్తి చేసుకుంటే విస్తృత కెరీర్ అవకాశాలు
- ఎస్‌వీఎన్‌ఐఆర్‌టీఏఆర్ సెట్‌తో పలు కళాశాలల్లో ప్రవేశం

హెల్త్‌కేర్ రంగంలో సేలందించాలని కోరుకుంటున్నారా.. దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపాలనే సమున్నత ఆశయం ఉందా!ఇందుకు అవసరమైన నైపుణ్యాలు పొందేందుకు చక్కటి మార్గం.. ఎస్‌వీఎన్‌ఐఆర్‌టీఏర్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్! ఈ సెట్‌లో ఉత్తీర్ణత సాధిస్తే.. జాతీయ స్థాయిలో పేరున్న స్పెషల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్స్ అందించే కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది.ఇటీవల ఎస్‌వీఎన్‌ఐఆర్‌టీఏఆర్ సెట్-2024 నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. ఈ సెట్‌తో ప్రవేశం కల్పించే కోర్సులు, ఆయా కోర్సుల ప్రత్యేకత, కెరీర్ అవకాశాలపై ప్రత్యేక కథనం.

హెల్త్‌కేర్ రంగంలో కెరీర్ అనగానే ఎంబీబీఎస్‌నే లక్ష్యంగా చేసుకుంటారు. కాని సీట్ల పరిమితి కారణంగా అందరికీ మెడిసిన్ కోర్సుల్లో చేరే అవకాశం లభించదు. ఇలాంటి వారికి చక్కటి ప్రత్యామ్నాయ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ, బ్యాచిలర్ ఆఫ్ ఆక్యుపేషనల్ థెరపీ, బ్యాచిలర్ ఇన్ ప్రోస్థెటిక్స్ అండ్ ఆర్థోటిక్స్, బ్యాచిలర్ ఇన్ ఆడియాలజీ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ (బీ.ఏఎస్ఎల్‌పీ) ముఖ్యమైనవి.

ఎస్‌వీఎన్‌ఐఆర్‌టీఏఆర్ అంటే

స్వామి వివేకానంద నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిహాబిలిటేషన్ ట్రెనింగ్ అండ్ రీసెర్చ్.. సంక్షిప్తంగా ఎస్‌వీఎన్‌ఐఆర్‌టీఏఆర్! దేశంలో దివ్యాంగులు, ఇతర శారీరక వైకల్యాలున్న వారి సంఖ్య పెరుగుతోంది. వీరి సమస్యలు, వ్యాధులకు చికిత్సను అందించే లక్ష్యంతో.. అందుకు అవసరమైన సిబ్బందిని తీర్చిదిద్దేందుకు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఫర్ పర్సన్స్ విత్ డిజేబిలిటీస్ దేశ వ్యాప్తంగా పలు ఇన్‌స్టిట్యూట్‌లను ఏర్పాటు చేసింది. వీటిలో జాతీయ స్థాయిలో ఉన్నత ప్రమాణాలను అనుసరిస్తున్న సంస్థగా కటక్(ఒడిస్సా)లోని ఎస్‌వీఎన్‌ఐఆర్‌టీఏఆర్‌కు గుర్తింపు ఉంది. ఈ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో కామన్ ఎంట్రన్స్ టెస్ట్(సెట్)ను నిర్వహించి.. దేశంలోని పలు స్పెషల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తున్నారు.

బ్యాచిలర్ స్థాయి కోర్సులు

ప్రస్తుతం ఎస్‌వీఎన్‌ఐఆర్‌టీఏఆర్-సెట్ స్కోర్ ఆధారంగా బ్యాచిలర్ స్థాయిలో నాలుగు కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. అవి.. బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ (బీపీటీ), బ్యాచిలర్ ఆఫ్ ఆక్యుపేషన్ థెరపీ (బీఓటీ), బ్యాచిలర్ ఇన్ ప్రోస్థెటిక్స్ అండ్ ఆర్థోటిక్స్(బీపీఓ), బ్యాచిలర్ ఇన్ ఆడియాలజీ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ (బీ.ఏఎస్ఎల్‌పీ).

కోర్సు వ్యవధి నాలుగేళ్లు

బ్యాచిలర్ స్థాయిలోని బీపీటీ, బీఓటీ, బీపీఓ, బీఏఎస్ఎల్‌పీ కోర్సుల వ్యవధి నాలుగేళ్లు. దీనికి అదనంగా మరో ఆరు నెలల ఇంటర్న్‌షిప్ అంటే మొత్తం నాలుగున్నరేళ్లపాటు ఈ కోర్సుల బోధన సాగుతుంది.

అయిదు ఇన్‌స్టిట్యూట్‌లు

ఎస్‌వీఎన్‌ఐఆర్‌టీఏఆర్-సెట్ స్కోర్ ద్వారా మొత్తం అయిదు ఇన్‌స్టిట్యూట్‌లలో 443 సీట్ల భర్తీ చేస్తారు. అవి..

- ఎస్‌వీఎన్‌ఐఆర్‌టీఏఆర్-కటక్(బీపీటీ-62, బీఓటీ-62, బీపీఓ-46, బీఏఎస్ఎల్‌పీ-10)
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ లోకోమోటర్ డిజేబిలిటీస్ (ఎన్ఐఎల్‌డీ)-కోల్‌కత (బీపీటీ-57; బీఓటీ-56; బీపీఓ-47)
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజేబిలిటీస్ (ఎన్ఐఈపీడీ)-చెన్నై (బీపీటీ-18, బీఓటీ-18, బీపీఓ-20, బీఏఎస్ఎల్‌పీ-27)
- కాంపోజిట్ రీజనల్ సెంటర్ ఫర్ స్కిల్ డెవలప్‌మెంట్, రిహాబిలిటేషన్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజేబిలిటీస్ (సీఆర్‌సీఎస్ఆర్ఈ)- గువహతి (బీఏఎస్ఎల్‌పీ-20)
- యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ పరిధిలోని పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఫిజికల్ డిజేబిలిటీస్‌లోని బీపీటీ (68 సీట్లు), బీఓటీ (68 సీట్లు), బీపీఓ (39 సీట్లు) కోర్సులకు కూడా ఎస్‌వీఎన్‌ఐఆర్‌టీఏఆర్-సెట్ స్కోర్‌నే పరిగణనలోకి తీసుకుంటారు.



ఎస్‌వీఎన్‌ఐఆర్‌టీఏఆర్-సెట్ 2024

అర్హతలు వేర్వేరుగా

- **బీపీటీ, బీఓటీ:** కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్ బైపీసీ ఉత్తీర్ణత ఉండాలి.
- **బీపీఓ:** కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్ బైపీసీ లేదా ఎంపీసీ ఉత్తీర్ణులవ్వాలి.
- **బీఏఎస్ఎల్‌పీ:** కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్ ఎంపీసీ/బైపీసీ ఉత్తీర్ణత ఉండాలి. అర్హత కోర్సు చివరి సంవత్సరం ఫలితాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వంద మార్కులకు సెట్

బీపీటీ, బీఓటీ, బీపీఓ, బీఏఎస్ఎల్‌పీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎస్‌వీఎన్‌ఐఆర్‌టీఏఆర్-సెట్‌ను నాలుగు విభాగాల్లో 100 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో **పార్ట్-ఎ:** జనరల్ ఎబిలిటీ అండ్ జనరల్ నాలెడ్జ్-10 ప్రశ్నలు; **పార్ట్-బి:** ఫిజిక్స్-30 ప్రశ్నలు; **పార్ట్-సి:** కెమిస్ట్రీ-30 ప్రశ్నలు; **పార్ట్-సి:** బయాలజీ/ మ్యాథమెటిక్స్-30 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున కేటాయిస్తారు. పార్ట్-డిలోని బయాలజీ/ మ్యాథమెటిక్స్ ప్రశ్నలకు సంబంధించి అభ్యర్థులు ఇంటర్మీడియెట్‌లో చదివిన గ్రూప్ ఆధారంగా సదరు సబ్జెక్ట్‌ను ఎంచుకోవాలి. బైపీసీ విద్యార్థులు బయాలజీని, ఎంపీసీ విద్యార్థులు మ్యాథమెటిక్స్ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. పరీక్షకు లభించే సమయం రెండు గంటలు.

ఇంటర్మీడియెట్ స్థాయి.. ప్రిపరేషన్

ఎస్‌వీఎన్‌ఐఆర్‌టీఏర్-సెట్‌లో మంచి స్కోర్ సాధించడానికి విద్యార్థులు ఇంటర్మీడియెట్ స్థాయిలోని అకడమిక్స్‌పై పట్టు సాధించాలి. ఆయా అంశాలకు సంబంధించి కాన్సెప్ట్‌లు, ఫార్ములాలు, అప్లికేషన్స్‌పై అవగాహన పెంచుకోవాలి. జనరల్ ఎబిలిటీ, జనరల్ నాలెడ్జ్ విభాగంలో రాణించేందుకు.. కరెంట్ అఫైర్స్, స్టాక్ జీకే అంశాల(ముఖ్యమైన ప్రాంతాలు,సదస్సులు, వ్యక్తులు, అవార్డులు-గ్రహీతలు, క్రీడలు-విజేతలు తదితర)పై దృష్టి సారించాలి.

ఉమ్మడి కౌన్సెలింగ్

సెట్‌లో పొందిన మార్కుల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందించి.. ఉమ్మడి కౌన్సెలింగ్ ద్వారా ఆయా కోర్సులు-ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం ఖరారు చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, మే 20
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం:** 2024, జూన్ 4
- **ఎంట్రన్స్ తేదీ:** 2024, జూన్ 23
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** http://www.svnirtar.nic.in

ఉపాధి అవకాశాలు

- బీపీటీ, బీఓటీ, బీపీఓ, బీఏఎస్ఎల్‌పీ కోర్సులు పూర్తి చేసుకున్నవారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ఫిజియోథెరపీ ఉత్తీర్ణులు ఆస్పత్రులు, రిహాబిలిటేషన్ సెంటర్లలో, స్పోర్ట్ క్లబ్స్‌లో ఫిజియోథెరపిస్ట్‌గా కొలువు దక్కించుకోవచ్చు. అదే విధంగా వారు సొంతంగా క్లినిక్స్‌ను ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందే అవకాశం ఉంది.
- ఆక్యుపేషనల్ థెరపీలో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన వారు ఆస్పత్రులు, రిహాబిలిటేషన్ సెంటర్లు, మానసిక చికిత్స కేంద్రాలు, విద్యా సంస్థలు, లెప్రసీ రిహాబిలిటేషన్ సెంటర్లలో ఉపాధి సొంతం చేసుకోవచ్చు. వీరికి థెరపిస్ట్, కన్సల్టెంట్ కొలువులు లభిస్తున్నాయి.
- ప్రోస్థెటిక్స్ అండ్ ఆర్థోటిక్స్ ఉత్తీర్ణులు ట్రామా కేర్ సెంటర్లు, కృత్రిమ అవయవాల ఉత్పత్తి సంస్థలు, ఆస్పత్రులు, రిహాబిలిటేషన్ సెంటర్లలో ఉద్యోగాలు సాధించొచ్చు. అదే విధంగా స్వయం ఉపాధి అవకాశాలు పొందొచ్చు.
- బ్యాచిలర్ ఇన్ ఆడియాలజీ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి.. స్వచ్ఛంద సంస్థలు, స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్స్, రిహాబిలిటేషన్ సెంటర్లలో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

సేవా దృక్పథం ఉంటేనే

జాబ్ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ కోర్సుల్లో చేరడం సరికాదని, అభ్యర్థులకు స్వతహాగా సేవా దృక్పథం ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఈ కోర్సుల ద్వారా లభించే కొలువులన్నీ ఇతరులకు సహానుభూతితో సేవలు అందించేవిగా ఉంటాయని పేర్కొంటున్నారు. ముఖ్యంగా దివ్యాంగులకు సేవ చేసే క్రమంలో పూర్తి సేవా దృక్పథం అవసరమంటున్నారు.ఇలాంటి దృక్పథం ఉన్న వారే ఈ కోర్సులను ఎంచుకుంటే భవిష్యత్తులో మెరుగ్గా రాణించగలరని నిపుణుల అభిప్రాయం.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
609	150
73,730	22,420

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	15,928	△	316
డోజోన్స్	38,240	△	154
ఎఫ్‌టీఎస్ఈ 100	8,140	△	61
డాక్స్	18,167	△	250
షాంఘై	3,089	△	36
నికాయ్	37,944	△	315

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		84.14	85.17
£	బ్రిటన్ పౌండ్		101.81	106.76
€	యూరో		87.13	91.68
¥	జపాన్ ఎన్ (100)		41.00	66.00
AU$	ఆస్ట్రేలియా డాలర్		52.05	56.89
S$	సింగపూర్ డాలర్		58.96	63.67
SAR	సౌదీ రియాల్		21.32	22.88
UAE D	యూఏఈ దిర్హామ్		21.80	23.58
¥	చైనా యువాన్		10.38	12.45

కేవైసీతోనే.. ఫండ్స్‌లో పెట్టుబడులు

- గతంలో ఎప్పుడో చేసి ఉన్నారా?
- కేవైసీ స్థితిని ఒకసారి చెక్ చేసుకోవాల్సిందే
- వ్యాలిడేటెడ్ అని ఉండాలి
- లేదంటే తిరిగి సమర్పించాల్సిన అవసరం
- ఆధార్ సాయంతో సుస్పష్ట కేవైసీ

KNOW YOUR CUSTOMER



మీరు మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నారా..? గతంలో ఎప్పుడో కేవైసీ (నో యువర్ కస్టమర్) చేసి ఉన్నారా..? అయితే ఒక్కసారి మీరు మీ కేవైసీ స్థితిని తెలుసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టేవారు మరో విడత కేవైసీ అప్‌డేట్ చేసుకోవాల్సిన తరుణం వచ్చింది. ఇందుకు విధించిన ఏప్రిల్ 1 గడువు ఇప్పటికే ముగిసింది. దీంతో ఇప్పటి వరకు ఇన్వెస్ట్ చేస్తున్న పథకాలు కాకుండా.. కొత్త వాటిల్లో ఇన్వెస్ట్ చేయాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనికి ఉన్న ఏకైక పరిష్కారం కేవైసీని అప్‌డేట్ చేసుకోవడమే. దీన్ని ఎలా చేయాలో తెలుసుకుందాం.



మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులకు సంబంధించి తిరిగి కేవైసీ చేసే విషయంలో గందరగోళం నెలకొంది. కొంత మంది ఇన్వెస్టర్లు మినహా చాలా మందిలో దీనిపై స్పష్టత లేదు. కేవైసీ చేసేందుకు ప్రయత్నించకపోవడం, ఏ డాక్యుమెంట్లు కావాలో అవగాహన లేకపోవడమే ఈ అయోమయానికి కారణమని ఎడెల్‌వీజ్ మ్యూచువల్ ఫండ్, ఇన్వెస్టర్ సర్వీసెస్ హెడ్ అబ్దుల్లా చౌదరి అంటున్నారు. మ్యూచువల్ ఫండ్స్ సంస్థల వెబ్‌సైట్ నుంచే ఆన్‌లైన్‌లో సులభంగా కేవైసీని మరోసారి చేసుకోవచ్చని తెలిపారు.

ప్రతి ఒక్క ఇన్వెస్టర్ తిరిగి కేవైసీ చేసుకోవాల్సిన అవసరం ఉందా..? అంటే లేదన్నదే సమాధానం. అసలు ఎవరు కేవైసీ ప్రక్రియను తిరిగి నిర్వహించుకోవాలో తెలుసుకోవాలంటే.. ఆన్‌లైన్‌లో తమ కేవైసీ స్థితిని ఒకసారి పరిశీలించుకుంటే కానీ తెలియదు. సాధారణంగా ఎక్కువ మంది ఇన్వెస్టర్లు సీవీఎల్‌ను కేవైసీ కోసం ఉపయోగిస్తుంటారు. కనుక సీవీఎల్‌కేఆర్‌ఏ డాట్ కామ్ సైట్‌కు వెళ్లాలి. లేదంటే ఎన్‌డీఎంఎల్ కేఆర్‌ఏ, క్యామ్స్ (సీఏఎంఎస్) కేఆర్‌ఏ లేదా కార్వీ కేఆర్‌ఏ ద్వారా తమ కేవైసీ స్థితిని తెలుసుకోవచ్చు. సీవీఎల్‌కేఆర్‌ఏ పోర్టల్‌కు వెళ్లి పైన కనిపించే మెనూ ఆప్షన్లలో కేవైసీ ఇంక్వైరీ సెలక్ట్ చేసుకోవాలి. తర్వాత వచ్చే విండోలో పాన్ నంబర్ నమోదు చేయాలి. ఐ యామ్ హ్యూమన్ పక్కన ఉన్న బాక్స్‌లో టిక్ చేసి సబ్‌మిట్ చేయాలి. అప్పుడు మీ కేవైసీ స్థితి అక్కడ కనిపిస్తుంది.

చెక్ చేసుకోవాల్సిందే..

కేవైసీ వ్యాలిడేటెడ్.. అని ఉంటే తిరిగి కేవైసీ చేయాల్సిన అవసరం లేదు. దీనర్థం మీరు అప్పటికే సమర్పించిన కేవైసీ ఆధార్ ఆధారితమైనది. మొబైల్, ఈమెయిల్ కూడా వ్యాలిడేట్ అయి ఉన్నట్టు. కనుక అన్ని మ్యూచువల్ ఫండ్స్ సంస్థల పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఉన్న పెట్టుబడులను వెనక్కి తీసుకోవచ్చు. మళ్లీ కేవైసీ అవసరం లేదు.

NOTE: ఇక్కడ కేవైసీ వ్యాలిడేటెడ్ అనే స్థితి ఉన్న వారు మినహా మిగిలిన ప్రతి ఒక్కరూ ఆధార్ ఆధారితంగా తాజా కేవైసీ సమర్పించడం మంచిది.

కేవైసీ రిజిస్టర్డ్.. అని ఉంటే మీరు గతంలో అధికారికంగా చెల్లుబాటు అయ్యే డాక్యుమెంట్ (ఓవీడీ) ఆధారంగా కేవైసీ చేసినట్టు. అంటే ఆ సమయంలో ఆధార్ ధ్రువీకరణ చేయలేదు. మొబైల్, ఈ మెయిల్ ధ్రువీరణ చేసినట్టు. అప్పటికే పెట్టుబడులు కలిగిన మ్యూచువల్ ఫండ్స్ సంస్థల పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. వాటిని వెనక్కి తీసుకోవచ్చు. కానీ, ఇప్పటి వరకు పెట్టుబడులు లేని కొత్త సంస్థల పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవడానికి అనుమతి ఉండదు.

ఆన్ హోల్డ్.. మొదట సమర్పించిన కేవైసీ ఓవీడీ ఆధారితం కాదని దీనర్థం. లేదంటే ఈ మెయిల్, మొబైల్ నంబర్ మనుగడలో లేవని అర్థం. ఈ స్థితి చూపిస్తుంటే, అన్ని రకాల మ్యూచువల్ ఫండ్స్ లావాదేవీల నిర్వహణకు అనుమతి లేదని తెలుసుకోవాలి. వీరు తాజాగా కేవైసీ సమర్పించాలి.

రిజెక్టెడ్ ఆన్ హోల్డ్ 10–15 రోజుల పాటు ఉన్న తర్వాత రిజెక్టెడ్‌గా మారుతుంది. వీరు కూడా అన్ని రకాల మ్యూచువల్ ఫండ్స్ లావాదేవీలు నిర్వహించలేరు. అంటే తాజాగా ఇన్వెస్ట్ చేయలేరు. అప్పటికే ఉన్న పెట్టుబడులు వెనక్కి తీసుకోలేరు. తాజాగా కేవైసీ సమర్పించి, వ్యాలిడేట్ చేసుకోవాల్సి ఉంటుంది.

ఎన్‌డీఎంఎల్ కేఆర్‌ఏ అయితే..

పాన్ నంబర్ నమోదు చేసి, క్యాపెచా కోడ్ తర్వాత సబ్‌మిట్ చేయాలి. ఆ తర్వాత కనిపించే ఆప్షన్లలో మీరు చేయాల్సినది ఎంపిక చేసుకుని ముందుకు వెళ్లాలి. ఎన్‌డీఎంఎల్ కేఆర్‌ఏ వద్ద కేవైసీ నమోదు చేయని వారు ఇక్కడ కేవైసీ చేయడానికి వీలు పడదు. అదే సీవీఎల్-కేఆర్‌ఏలో అయితే మీ వివరాలు సమర్పించిన అనంతరం.. కేవైసీ ఎక్కడ నమోదై ఉన్నది కూడా చూపిస్తుంది. అంటే సీవీఎల్ కేఆర్‌ఏ/ఎన్‌డీఎంఎల్ కేఆర్‌ఏ/డాటెక్స్ కేఆర్‌ఏ/క్యామ్స్ కేఆర్‌ఏ/ కార్వీ కేఆర్‌ఏ వీటిల్లో ఎక్కడ నమోదైతే కేవైసీ స్టేటస్ కాలమ్‌లో అక్కడ వివరాలు కనిపిస్తాయి. మీ కేవైసీ ఎక్కడ నమోదై ఉందన్న విషయం ఇక్కడ తెలుస్తుంది. లేదంటే మీ పెట్టుబడులు కలిగిన ఫండ్ హౌస్ (ఏఎంసీ) పోర్టల్‌కు వెళ్లి కూడా తెలుసుకోవచ్చు. మ్యూచువల్ ఫండ్స్ సంస్థ లేదా సెబీ నమోదిత ఆర్‌టీఏ (రిజిస్ట్రార్, ట్రాన్స్‌ఫర్ ఏజెంట్) హెల్ప్‌లైన్‌కు కాల్ చేయవచ్చు.

కేవైసీ స్థితి తెలుసుకున్న తర్వాత ఏ మ్యూచువల్ ఫండ్ సంస్థ వెబ్‌సైట్‌కు అయినా వెళ్లి కేవైసీని అప్‌డేట్ చేసుకోవచ్చు. ఏదైనా మ్యూచువల్ ఫండ్ సంస్థ కార్యాలయానికి నేరుగా వెళ్లి ఫిజికల్ కేవైసీని సమర్పించొచ్చు. ఇలా ఒకసారి కేవైసీ అప్‌డేట్ అయితే అన్ని మ్యూచువల్ ఫండ్ సంస్థల పెట్టుబడుల్లోనూ అదే ప్రతిఫలిస్తుంది. ఉదాహరణకు ఎడెల్‌వీజ్ మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టర్ అయితే, సంస్థ పోర్టల్‌కు వెళ్లి తమ ఖాతాలోకి లాగిన్ అవ్వాలి. ప్రొఫైల్ సెక్షన్‌లో కేవైసీ స్టేటస్ తెలుసుకోవచ్చు.

కేవైసీ అప్‌డేట్

'రిజిస్టర్డ్' లేదా 'ఆన్‌హోల్డ్' చూపిస్తుంటే ఎం-ఆధార్ లేదా డిజిలాకర్ ఖాతా నుంచి ఈ-ఆధార్ సమర్పించొచ్చు. దీంతో యూఐడీఏఐ ద్వారా వచ్చే ఓటీపీని సమర్పించిన అనంతరం కేవైసీ వ్యాలిడేట్ అవుతుంది. కేవైసీ రిజిస్టర్డ్ అనే స్థితితో ఉన్న వారు మరో సంస్థ పథకంలో ఇన్వెస్ట్ చేయాల్సి వస్తే, తాజాగా కేవైసీ సమర్పించేంత వరకు సాధ్యపడదు. అప్పటి వరకు పెట్టుబడులు లేని మరో సంస్థ పథకంలో ఇన్వెస్ట్ చేస్తున్నట్టు అయితే.. అప్పుడు ఆయా సంస్థ కేవైసీని పరిశీలిస్తుంది. వ్యాలిడేటెడ్ అని ఉంటేనే వారు ఆమోదిస్తారు. రిజిస్టర్డ్ అని ఉంటే మాత్రం కేవైసీ సమర్పించాలి. నేరుగా వెళ్లి ఫిజికల్ కేవైసీ సమర్పించే వారు ఆధార్ కాపీపై క్యూఆర్ కోడ్ స్పష్టంగా ఉండేలా చూసుకోండి. లేకపోతే దాన్ని సిస్టమ్ రీడ్ చేయలేదు. అలాంటప్పుడు అది వ్యాలిడేట్ కాదు. ఎప్పుడో ఆధార్ తీసుకున్న వారి డాక్యుమెంట్‌పై క్యూఆర్ కోడ్ మసకగా మారుతుండడాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.

మరి ఎన్‌ఆర్‌ఐల పరిస్థితి?

భారతీయులతో పోలిస్తే ప్రవాస భారతీయులకు (ఎన్‌ఆర్‌ఐ) కేవైసీ అంత సులభం కాదు. ఇతర దేశాల్లో నివసిస్తూ, భారత మొబైల్ నంబర్ కలిగి లేని వారు.. ఆధార్ ఆధారిత ఓటీపీ స్వీకరణ, నమోదు చేయలేరు. దీంతో ఎన్‌ఆర్‌ఐల కేవైసీ స్థితి 'రిజిస్టర్డ్'గానే కొనసాగొచ్చు. దీంతో అప్పటికే పెట్టుబడులు కలిగిన మ్యూచువల్ ఫండ్స్ సంస్థల పథకాల్లో ఇకమీదటా పెట్టుబడులను ఎన్‌ఆర్‌ఐలు కొనసాగించుకోవచ్చు. ఎన్‌ఆర్‌ఐలు భారత్‌లో జారీ అయిన మొబైల్ నంబర్ కలిగి ఉంటే, ఆన్‌లైన్‌లో ఆధార్ ఆధారితంగా కేవైసీని సమర్పించి, వ్యాలిడేట్ చేసుకోవచ్చు. లేదంటే వీరు కొత్త సంస్థలో పెట్టుబడులు పెట్టాల్సిన ప్రతి సందర్భంలోనూ అధికారికంగా చెల్లుబాటయ్యే ఇతర డాక్యుమెంట్ల సాయంతో కేవైసీ సమర్పించడమే మార్గం.

తిరిగి కేవైసీ.. ఏ డాక్యుమెంట్?

అధికారికంగా చెల్లుబాటయ్యే ఏ డాక్యుమెంట్ (ఆధార్, పాస్‌పోర్ట్, ఓటర్ ఐడీ, ఎంఎస్‌ఆర్‌ఈజీఏ కార్డ్) సాయంతో తిరిగి కేవైసీ చేసుకోవచ్చు. కానీ, భవిష్యత్తులో మరోసారి ఇబ్బందులు రాకుండా ఉండాలంటే ఆధార్ సాయంతో కేవైసీ వ్యాలిడేట్ చేసుకోవడమే అత్యుత్తమం. ఇతర డాక్యుమెంట్‌తో కేవైసీ చేస్తే కనుక, కొత్త మ్యూచువల్ ఫండ్ సంస్థ పథకంలో ఇన్వెస్ట్ చేసిన ప్రతిసారి మళ్లీ కేవైసీ సమర్పించాల్సి వస్తుంది. అదే ఆధార్‌తో చేస్తే ఈ ఇబ్బంది ఉండదు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

29-4-2024 ఫామ్ ధర...

విశాఖ	400–00
చిత్తూరు	453–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	350–00
విజయవాడ	350–00
రిటైల్ ధర (డజను)	48.00
హైదరాబాద్	350–00
వరంగల్	352–00
రిటైల్ ధర	4.10

ఐసీఐసీఐ బ్యాంక్ లాభం అప్

- క్యూ4లో రూ. 11,672 కోట్లు
- షేరుకి రూ. 10 డివిడెండ్

ముంబై: ఐసీఐసీఐ బ్యాంక్ మార్చి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి (క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 18 శాతం పైగా ఎగసి రూ. 11,672 కోట్లను తాకింది. ప్రొవిజన్లు తగ్గడం ఇందుకు సహకరించింది. స్టాండెలోన్ లాభం సైతం 17 శాతం పుంజుకుని రూ. 10,708 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం 8 శాతం బలపడి రూ. 19,093 కోట్లయ్యింది. ఇందుకు రుణాల్లో 17 శాతం వృద్ధి సహకరించింది. అయితే నికర వడ్డీ మార్జిన్లు 4.9 శాతం నుంచి 4.4 శాతానికి నీరసించాయి. ట్రెజరీ మినహా వడ్డీయేతర ఆదాయం 16 శాతం అధికమై రూ. 5,930 కోట్లను తాకింది. ప్రొవిజన్లు సగానికి తగ్గి రూ. 718 కోట్లకు పరిమితమయ్యాయి. డిపాజిట్లలో 19 శాతం వృద్ధిని సాధించింది. తాజా స్లిప్పేజీలు రూ. 5,139 కోట్లకు చేరగా.. రిటైల్ విభాగం నుంచి రూ. 4,900 కోట్లు నమోదయ్యాయి. ఎన్‌పీఏలు 2.3 శాతం నుంచి 2.16 శాతానికి తగ్గాయి. వాటాదారులకు షేరుకి రూ. 10 చొప్పున డివిడెండ్ ప్రకటించింది.



పూర్తి ఏడాదికి సైతం

పూర్తి ఏడాదికి ఐసీఐసీఐ బ్యాంక్ స్టాండెలోన్ నికర లాభం రూ. 40,888 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2022–23) రూ. 31,896 కోట్లు మాత్రమే ఆర్జించింది. కొత్తగా 623 బ్రాంచీలను తెరవడంతో వీటి సంఖ్య 6,500కు చేరింది.

స్టాక్స్ వ్యూ

టాటా టెక్నాలజీస్ | జేఎం ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,071 టార్గెట్: రూ. 1,370

ఎందుకంటే: గ్లోబల్ ఆటో దిగ్గజం బీఎండబ్ల్యూ గ్రూప్‌తో భాగస్వామ్య సంస్థ(జేవీ)ను ఏర్పాటు చేసేందుకు టాటా గ్రూప్ కంపెనీ టాటా టెక్నాలజీస్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. 1,000కిపైగా రిసోర్సెస్(నిపుణులు)తో కూడిన సాఫ్ట్‌వేర్ కేంద్రానికి(హబ్) జేవీ తెరతీయనుంది. తద్వారా బీఎండబ్ల్యూ గ్రూప్‌నకు ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, డిజిటల్ ఇంజినీరింగ్ సర్వీసులను అందించనుంది. తాజా అంచనాల ప్రకారం నిలకడైన పనితీరుతో జేవీ ప్రస్తుత ఆర్జనకు అదనంగా 4–5 శాతాన్ని జమ చేసుకునే అవకాశముంది. సమీపకాలంలో మెరుగుపడనున్న ఆర్జన అంచనాను పక్కనపెడితే.. ఈ డీల్ అత్యంత ప్రాధాన్యతను సంతరించుకోవడంతోపాటు కీలకంగా నిలవనుంది. సంప్రదాయ ఓఈఎం(ఆటో దిగ్గజాలు)ల నుంచి బిజినెస్‌ను పొందడంలో మాతృ సంస్థ(టాటా గ్రూప్) కారణంగా టాటా టెక్నాలజీస్ సవాళ్లు ఎదుర్కొంటుందన్న అంచనాలను తుడిచిపెట్టింది. అంతేకాకుండా బీఎండబ్ల్యూతో ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్ సంబంధ భాగస్వామ్యం కంపెనీకున్న బలిమిని ప్రస్ఫుటం చేస్తోంది. సాఫ్ట్‌వేర్ ఈఆర్అండ్‌డీ, వాహనాల పూర్తిస్థాయి ఇంజినీరింగ్ సామర్థ్యం కొత్త అవకాశాలకు తెరతీయనుంది. కీలక(యాంకర్) క్లయింట్ల నుంచేకాకుండా ఇతరత్రా ఆదాయం పొందడంలో కంపెనీ కృషికి తార్కాణంగా నిలవనుంది. ప్రధానంగా ఓఈఎంలు ఎదుర్కొంటున్న సాఫ్ట్‌వేర్ క్లిష్టతలుసహా వివిధ సవాళ్లకు పరిష్కారంగా మల్టీఇయర్ ఆఫ్‌షోర్ అవసరాలు పెరగవచ్చన్న అంచనాలను జేవీ ఏర్పాటు ధృవపరుస్తోంది. ఈ ట్రెండ్‌పై ప్రస్తుతం అంచనాలకు రాలేకపోయినప్పటికీ కొట్టిపారేయలేం.



రిస్క్ తక్కువ.. రాబడి ఎక్కువ!

ఎడెల్‌వీజ్ లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్

ఫండ్ రివ్యూ

లార్జ్‌క్యాప్ స్టాక్స్‌లో రిస్క్ తక్కువ. అదే సమయంలో రాబడి మెరుగ్గా ఉంటుంది. మిడ్ క్యాప్ స్టాక్స్‌లో కొంచెం రిస్క్ ఎక్కువ, లాభాలు కూడా ఎక్కువగా ఉంటుంటాయి. ఈ రెండింటిలోనూ ఇన్వెస్ట్ చేయడం ద్వారా రిస్క్‌కు మించి రాబడులను ఇచ్చే విధంగా పనిచేసేదే ఎడెల్‌వీజ్ లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్. ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటున్న కొద్దీ లార్జ్‌క్యాప్‌తో పాటు, మధ్య, చిన్న స్థాయి కంపెనీలు కూడా మంచి పనితీరు చూపిస్తుంటాయి. ఖానీ, రిస్క్ కాస్తంత తక్కువగా ఉండాలని కోరుకునే వారు.. లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్స్‌ను దీర్ఘకాలం కోసం ఎంపిక చేసుకోవచ్చు. ప్రధానంగా లార్జ్‌క్యాప్‌తో పోలిస్తే లార్జ్ అండ్ మిడ్ క్యాప్ ఎక్కువ రాబడులకు మార్గం అవుతుంది.

రాబడులు

ఎడెల్‌వీజ్ లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్ ఏడాది కాలంలో ఇన్వెస్టర్లకు 42 శాతం రాబడులను ఇచ్చింది. ఐదేళ్ల కాలంలో 19.5 శాతం, ఏడేళ్లలో 16.1 శాతం, పదేళ్లలో ఏటా 16.45 శాతం చొప్పున పెట్టుబడులపై ప్రతిఫలాన్ని తెచ్చి పెట్టింది. ఈ విభాగంలో మెరుగైన పథకాల్లో ఇదీ ఒకటి. లార్జ్‌అండ్‌మిడ్‌క్యాప్ విభాగం సగటు రాబడులతో పోలిస్తే ఈ పథకమే అధిక రాబడులను ఇచ్చింది. ప్రస్తుతం స్టాక్స్ విలువలు గరిష్టాలకు చేరి ఉన్నాయి. మార్కెట్లు ఇక్కడి నుంచి మరింత ముందుకు వెళతాయని, లేదంటే భారీగా పడిపోతాయని ఎవరూ నూరు శాతం కచ్చితంగా అంచనా వేయలేరు. కనుక ఏక మొత్తంలో కంటే సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) అనుకూల సాధనం. ప్రతీ నెలా ఎంపిక చేసుకున్నంత మేర సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేస్తూ వెళ్లొచ్చు. దీంతో మార్కెట్లు మరింత ర్యాలీ చేసినా అప్పటికే ఉన్న పెట్టుబడులపై ప్రతిఫలాన్ని పొందొచ్చు. దిద్దుబాటుకు లోనైతే తక్కువ విలువల వద్ద ఎక్కువ యూనిట్లను సొంతం చేసుకోవచ్చు.



నాణ్యమైన, బలమైన వ్యాపారాలను పెట్టుబడులకు ఈ పథకం ఎంపిక చేసుకుంటుంది. ఈ తరహా కంపెనీలు అయితే ఆర్థిక వ్యవస్థ రికవరీతో వేగంగా పుంజుకుంటాయన్నది ఫండ్ మేనేజర్ల అంచనా. బలహీనమైన యాజమాన్యాల చేతుల్లోని కంపెనీలకు దూరంగా ఉంటుంది. లిక్విడిటీ కూడా ప్రధానంగా చూస్తుంది. ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.2849 కోట్ల ఇన్వెస్టర్ల పెట్టుబడులున్నాయి.

పెట్టుబడుల విధానం

ఇందులో 97.46 శాతం ఈక్విటీలకు కేటాయించింది. డెట్‌లో మూడు శాతం పెట్టుబడులు కలిగి ఉంది. ఈక్విటీల్లోనూ 57 శాతం వరకు లార్జ్‌క్యాప్ కంపెనీల్లో, 39.65 శాతం మిడ్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసింది. మరో 3.49 శాతం పెట్టుబడులను చిన్న కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసింది. పోర్ట్‌ఫోలియోలో మొత్తం 75 స్టాక్స్ ఉన్నాయి. పోర్ట్‌ఫోలియోని ఒకసారి గమనించినట్టయితే.. అత్యధికంగా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీల్ల 24 శాతానికి పైగా పెట్టుబడులు ఈ రంగాల కంపెనీల్లోనే ఉన్నాయి. ఆ తర్వాత అత్యధికంగా ఇండస్ట్రియల్ రంగ కంపెనీల్లో 16 శాతం, కన్జ్యూమర్ డిస్క్రీనరీ స్టాక్స్‌లో 16 శాతం, టెక్నాలజీ కంపెనీల్లో 12.56 శాతం, మెటీరియల్స్ కంపెనీల్లో 11.59 శాతం చొప్పున పెట్టుబడులు ఉన్నాయి.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
ఐసీఐసీఐ బ్యాంక్	3.53
ఎల్అండ్‌టీ	3.01
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	2.94
ఎస్‌బీఐ	2.38
పర్సిస్టెంట్ సిస్టమ్స్	2.21
రిలయన్స్ ఇండస్ట్రీస్	2.20
బిర్లాసాఫ్ట్	2.08
మదర్సన్ సుమి	2.01
డిక్సన్ టెక్	2.01
ఫెడరల్‌బ్యాంక్	1.91

హిండ్‌వేర్ హోమ్ | చాయిస్ ఇంటర్నేషనల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 367 టార్గెట్: రూ. 503

ఎందుకంటే: బిల్డింగ్ ప్రొడక్టుల కంపెనీ హిండ్‌వేర్ హోమ్ ఇన్నొవేషన్ లిమిటెడ్ 2019 ఆగస్ట్‌లో ఏజీఐ గ్రీన్‌ప్యాక్ లిమిటెడ్(గతంలో హెచ్ఎస్ఐఎల్) నుంచి విడివడింది. ఇంతక్రితం సామానీ హోమ్ ఇన్నొవేషన్‌గా కార్యకలాపాలు నిర్వహించిన హిండ్‌వేర్ హోమ్ దేశీ కన్జూమర్ అప్లయెన్సెస్ రంగంలో వేగవంత వృద్ధిని సాధిస్తున్న సంస్థగా నిలుస్తోంది. వినియోగదారులకు ప్రత్యేకించిన సర్వీసులు సమకూర్చడంతోపాటు.. వివిధ ప్రొడక్టుల విభాగాలలో తయారీ, బ్రాండింగ్, మార్కెటింగ్, అమ్మకాలు, పంపిణీ తదితర పలురకాల సేవలు అందిస్తోంది. కంపెనీ ప్రధానంగా మూడు బిజినెస్ విభాగాలను ఏర్పాటు చేసుకుంది. ప్రతీ విభాగానికీ ఒక సీఈవో, సీవోవోను నియమించింది. వీటిని స్వతంత్రత కలిగిన వ్యూహాత్మక బిజినెస్ యూనిట్లు(ఎస్‌బీయూలు)గా ఏర్పాటు చేసింది. కంపెనీ బాత్‌వేర్ ప్రొడక్టుల విభాగంలో ప్రత్యేక దృష్టిని సారించి బిజినెస్‌ను వేగంగా విస్తరిస్తోంది. తద్వారా మరింత మార్కెట్ వాటాను సొంతం చేసుకోవడంతోపాటు.. లాభదాయకతను సైతం మెరుగుపరచుకుంటోంది. వృద్ధిలో ఉన్న ప్లాస్టిక్ పైపింగ్ బిజినెస్‌లోని అవకాశాలను అందిపుచ్చుకునేందుకు రూర్కీలో ఏడాదికి 12,500 ఎంటీ సామర్థ్యంతో కొత్తగా ప్లాంటును ఏర్పాటు చేసింది. మరోవైపు రుణభారాన్ని తగ్గించుకోవడం ద్వారా బ్యాలన్స్‌షీట్‌ను పటిష్టపరచుకుంటోంది. అంతేకాకుండా కొత్త బిజినెస్ విభాగాలలోకి ప్రవేశిస్తూ మార్కెట్ పరిమాణాన్ని పెంచుకుంటోంది. వెరసి 2023–26 కాలంలో వార్షికంగా ఆదాయం 7 శాతం, ఇబిటా 20 శాతం, నికర లాభం 40 శాతం చొప్పున పురోగతిని సాధించగలదని భావిస్తున్నాం.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

క్వీన్ ఆఫ్ హైట్ ఇక లేరు

7 అడుగుల 3 అంగుళాల పొడవుతో గతంలో ప్రపంచ ఖ్యాతి	77 ఏళ్ల వయసులో అనారోగ్యంతో కన్నుమూసిన మారియా ఫెలిసియానా దోస్ శాంటోస్



ప్రపంచంలోని అతిపొడవైన మహిళల్లో ఒకరిగా ఖ్యాతిగాంచిన బ్రెజిల్‌వాసి మారియా ఫెలిసియానా దోస్ శాంటోస్ (77) అనారోగ్యంతో కన్నుమూశారు. ఆమె యుక్త వయసులో ఏకంగా 7 అడుగుల 3.8 అంగుళాల ఎత్తు పెరిగి అందరినీ అవాక్కు చేశారు. చాలా ఏళ్లపాటు ఆమెను ప్రపంచంలోకెల్లా అత్యంత పొడవైన మహిళగా పరిగణించినట్లు చెబుతుంటారు. అయితే ఆ తర్వాతి కాలంలో ఆమె ఎత్తు కాస్త తగ్గుతూ వచ్చారు. కొన్నేళ్లుగా న్యుమోనియాతో బాధపడుతున్న మారియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి తుదిశ్వాస విడిచినట్టు ఆమె కుటుంబ సభ్యులు ఆదివారం తెలిపారు. గాయని, బాస్కెట్‌బాల్ క్రీడాకారిణి అయిన మారియా తన టీనేజీలో అసాధారణ రీతిలో ఎత్తు పెరిగింది. యుక్త వయసులో ఆమె దేశంలోని వివిధ నగరాల్లో జరిగే సర్కస్‌లలో పనిచేస్తూ వీక్షకులను అబ్బురపరిచేది. ఆ తర్వాత 1960లలో క్వీన్ ఆఫ్‌హైట్ బిరుదు గెలుచుకోవడంతో బ్రెజిల్ అంతటా ఆమె పేరు మార్మోగింది. 2022 మేలో బ్రెజిల్‌లోని ఓ మ్యూజియం తమ ప్రవేశద్వారం వద్ద మారియా విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆమెను గౌరవించింది. మారియా కుటుంబమంతా పొడగరులే! ఆమె తండ్రి ఆంటోనియో టింటినో డా సిల్వా ఏకంగా 7 అడుగుల 8.7 అంగుళాల పొడవు ఉండేవారు. అలాగే ఆమె తాత (తల్లి తరపు) 7 అడుగుల 5.4 అంగుళాలు పొడవు ఎదిగారు. ఆమెకు ముగ్గురు సంతానంకాగా వారిలో ఇద్దరు కుమారులు దాదాపు 7 అడుగుల ఎత్తు పెరిగారు. ప్రస్తుతం జీవించి ఉన్న వారిలో ప్రపంచంలోకెల్లా అత్యంత పొడవైన మహిళగా టర్కీకి చెందిన రుమ్మేసా గెల్గీ నిలిచింది. ఆమె ఎత్తు 7 అడుగుల 0.71 అంగుళాలు.

– సాక్షి సెంట్రల్ డెస్క్




సదస్సుకు హాజరైన సెక్యూరిటీ రీసెర్చ్ విద్యార్థులు

సైబర్ భద్రత నిపుణులకు ఉజ్వల భవిష్యత్తు

ది హాకర్స్ మీటప్ కార్యక్రమంలో సైబర్ ఫోరెన్సిక్ నిపుణుడు ప్రగతి రతన్

సాక్షి, హైదరాబాద్: అన్ని రంగాల్లో సైబర్ భద్రత అనేది అత్యంత ప్రధానాంశంగా మారుతున్న నేపథ్యంలో సైబర్ భద్రత నిపుణులకు మెరుగైన భవిష్యత్తు ఉందని తెలంగాణ పోలీస్ అకాడమీ సైబర్ ఫోరెన్సిక్ నిపుణుడు ప్రగతి రతన్ అభిప్రాయపడ్డారు. ది హాకర్స్ మీటప్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం హైటెక్ సిటీ వైట్‌ఫీల్డ్స్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో భాగంగా సైబర్ సెక్యూరిటీ రీసెర్చ్ విద్యార్థులతో సమావేశమయ్యారు. తాజాగా జరుగుతున్న సైబర్ నేరాలు, సైబర్ నేర దర్యాప్తులో తెలంగాణ పోలీసులు అనుసరిస్తున్న విధానాలు, కేసుల ఛేదన, సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రగతిరతన్, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వివరించారు. సైబర్ ఫోరెన్సిక్‌లో వాడుతున్న సాంకేతికత, వివిధ రకాల టూల్స్‌ను వివరించారు. సైబర్ సెక్యూరిటీ ట్రైనర్ కంభం అద్వైత్ మాట్లాడుతూ, సైబర్‌నేరాలతోపాటు సైబర్ టెర్రరిజం సైతం భవిష్యత్తు ప్రమాదాల్లో ఒకటని హెచ్చరించారు. సైబర్ టెర్రరిజానికి అడ్డుకట్ట వేసేందుకు ఎలా సంసిద్ధం కావాలో సూచించారు.



కలిసుంటే కలదు సుఖం

- కుటుంబ కలహాల కేసులలో 65 శాతం మద్యపానం కారణంగానే
- భార్యలను వేధిస్తున్న వారిలో చదువుకున్నోళ్లే అధికం
- వివాహం అయిన ఐదేళ్లలోపే ఎక్కువ గొడవలు
- జంటలను కలిపేందుకు తెలంగాణ పోలీస్ సరికొత్త ప్రయోగం
- దేశంలోనే మొదటగా సీడీఈడబ్ల్యూ కాల్ సెంటర్ల ఏర్పాటు
- ఆత్మహత్య లక్షణాలున్న 853 మంది మహిళలను ప్రత్యేక కౌన్సెలింగ్‌కు పంపిన వైనం

• పదేళ్లు కలిసి కాపురం చేసిన ఫతేనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నివాసం ఉండే శ్రీలత (పేరు మార్చాం), మురళి(పేరు మార్చాం) దంపతులు ఇటీవల కాపురంలో కలహాలు పెరగడంతో విడాకుల కోసం పోలీసులను ఆశ్రయించారు. ముగ్గురు పిల్లల తర్వాత భర్త మద్యానికి బానిసై, మానసికంగా శారీరకంగా హింసిస్తుండడంతో శ్రీలత భర్త నుంచి విడాకులు తీసుకోవాలని ధృడంగా నిశ్చయించుకుంది. దంపతులిద్దరికీ జీడిమెట్లలోని సీడీఈడబ్ల్యూ (సెంటర్ ఫర్ డెవలప్మెంట్ అండ్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్) సెంటర్‌లో అధికారులు కౌన్సిలింగ్ చేశారు. పలు దఫాల్లో సర్దిచెప్పిన తర్వాత వారి మధ్య సయోధ్య కుదిరింది. మురళిలోనూ మార్పు వచ్చింది. వారిప్పుడు సంతోషంగా కలిసి ఉంటున్నారు.

• లక్డీకపూల్‌లోని నీలోఫర్ ఆసుపత్రి సమీపంలో నివాసం ఉండే 43 ఏళ్ల ముంతాజ్ బేగం (పేరు మార్చాం) 2013 వరకు సెక్యూరిటీ గార్డుగా పనిచేసి ఉద్యోగం మానేశారు. 63 ఏళ్ల రిటైర్డ్ ఇంజినీర్ ఖలీల్ (పేరు మార్చాం)ను రెండో వివాహం చేసుకున్నారు. లాక్‌డౌన్ ముందు వరకు ముంతాజ్‌ను బాగానే చూసుకున్న ఖలీల్ ఆ తర్వాత ఆర్థిక ఇబ్బందులతో ఆమెను మానసికంగా, శారీరకంగా చిత్రహింసలు పెట్టడం మొదలు పెట్టాడు. తన బతుకుతెరువుకు సైతం డబ్బు ఇవ్వకపోవడంతో బషీర్‌బాగ్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు నాంపల్లి సీడీఈడబ్ల్యూ సెంటర్‌లో దంపతులకు కౌన్సిలింగ్ చేయడంతో ఖలీల్‌లో మార్పు వచ్చింది. ఇప్పుడు వారిద్దరూ కలిసి ఉంటున్నారు.

కొద్దిపాటి మనస్పర్థలు కాపురాలు కూల్చేస్తున్నాయి. ఇక మద్యం మహమ్మారి దంపతుల మధ్య గొడవలకు మరింత ఆజ్యం పోస్తోంది. దంపతుల్లో ఒకరిపై ఒకరికి నమ్మకం సన్నగిల్లడంతో అనుమానం పెనుభూతమవుతోంది. దీంతో వివాహబంధాన్ని తెంచుకోవాలన్న కఠిన నిర్ణయానికి వస్తున్నారు. విడాకుల కోసం కోర్టు మెట్లు తొక్కుతూ ఏళ్లపాటు వ్యక్తిగత జీవితాలు బలిపెట్టుకుంటున్నారు కొందరు. ఈ నేపథ్యంలో బలమైన కారణం లేకుండానే వివాహ బంధాలను బలి చేసుకోకుండా, కొద్దిపాటి సర్దుబాట్లతో కాపురం తిరిగి కాపురాలు నిలబడేలా తెలంగాణ పోలీసులు ప్రయత్నిస్తున్నారు. కుటుంబ కలహాలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే జంటలకు ప్రాథమికంగా కౌన్సెలింగ్ ఇచ్చేందుకు దేశంలోనే తొలిసారిగా తెలంగాణ పోలీస్‌శాఖలోని మహిళా భద్రత విభాగం అధికారులు సీడీఈడబ్ల్యూ సెంటర్లు అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో కలిపి మొత్తం 27 కౌన్సిలింగ్ సెంటర్లను నెలకొల్పారు. 2023 ఫిబ్రవరి నుంచి ఈ సెంటర్లు పనిచేస్తున్నాయి. వీటిల్లో గృహహింస కేసుల్లో బాధిత మహిళలు, వారి భర్తలు, అవసరం మేరకు ఇతర కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తూ సమస్యల పరిష్కారానికి బాటలు వేస్తున్నారు.




ఓ కౌన్సిలింగ్ సెంటర్‌లో..


ఇలా పోలీసులను ఆశ్రయించిన జంటల్లో 42 శాతం మందిని తిరిగి కలిపినట్టు మహిళా భద్రత విభాగం ఉన్నతాధికారులు తెలిపారు. మరో 29 శాతం మంది మాత్రం విడాకులు తీసుకునేందుకే నిశ్చయించుకున్నారు. 2023 ఫిబ్రవరి నుంచి 27 కౌన్సిలింగ్ సెంటర్ల పరిధిలో ఏప్రిల్ 26 నాటికి మొత్తం 7,474 ఫిర్యాదులు నమోదైనట్టు వారు వెల్లడించారు. మొత్తం అందిన ఫిర్యాదుల్లో 853 మంది బాధితుల్లో ఆత్మహత్యలు చేసుకునే మానసిక స్థితి ఉండడంతో వారిని మానసిక నిపుణులైన కౌన్సిలర్ల వద్దకు పంపి వారిలో తిరిగి స్థైర్యాన్ని నింపేలా కౌన్సిలింగ్ ఇప్పించినట్టు అధికారులు తెలిపారు. మొత్తం అందిన 7,474 ఫిర్యాదుల్లో 6,600 కేసులలో పరిష్కారం లభించినట్టు తెలిపారు.

గృహ హింస కేసులు ఉంటున్న వారి విద్యార్హతలు (శాతంలో)..:

విద్యార్హత	భార్య	భర్త
పోస్టు గ్రాడ్యుయేషన్, ఆపై	12.3	10.5
గ్రాడ్యుయేషన్	25.5	23.1
హైస్కూల్	36.0	34.5
ప్రైమరీ స్కూల్	15.1	17.0
నిరక్షరాస్యులు	11.1	15.0

సాక్షి, హైదరాబాద్





ఏమిటీ సీడీఈడబ్ల్యూ సెంటర్లు

గృహ హింస కేసుల్లో దంపతులు విడాకులు తీసుకోకుండా, సమస్యను గుర్తించి.. వారికి అర్థమయ్యేలా సర్దుబాటు చేసి తిరిగి కలిపేందుకు తెలంగాణ పోలీస్‌శాఖ మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో సేఫ్ సిటీ ప్రాజెక్టు నిధులతో సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ కౌన్సిలింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఇందులో ఒక మహిళా కౌన్సెలర్, మహిళా సిబ్బంది ఉంటారు. వీరు గృహహింసకు సంబంధించి వివిధ పోలీస్ స్టేషన్లకు వచ్చే జంటలకు, అవసరం మేరకు వారి కుటుంబ సభ్యులకు పలు దశల్లో కౌన్సిలింగ్ నిర్వహించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు.

ఆ సెంటర్లు మరింతగా విస్తరిస్తాం



గృహ హింస కేసులలో బాధితులకు సకాలంలో తగిన సాయం అందించి, వారి సమస్యల పరిష్కారానికి ఈ సీడీఈడబ్ల్యూ సెంటర్లు ఏర్పాటు చేశాం. దంపతులిద్దరికీ పలు దశల్లో కౌన్సిలింగ్ నిర్వహించడం ద్వారా వారి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ప్రస్తుతం మూడు కమిషనరేట్ల పరిధిలో మొత్తం 27 సెంటర్లు ఉన్నాయి. అవసరం మేరకు భవిష్యత్తులో మరింత విస్తరిస్తాం.

– శిఖాగోయల్, తెలంగాణ మహిళా భద్రత విభాగం అడిషనల్ డీజీ

పదో తరగతి ఫలితాలు రేపు

సాక్షి, హైదరాబాద్: పదో తరగతి పరీక్షల ఫలితాలు మంగళవారం వెలువడనున్నాయి. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం హైదరాబాద్‌లో ఉదయం 11 గంటలకు ఫలితాలను అధికారికంగా విడుదల చేస్తారు. టెన్త్ పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకూ జరగడం తెలిసిందే. దాదాపు 5 లక్షల మంది పరీక్షలకు హాజరయ్యారు. మార్చి 16 నుంచే సమాధాన పత్రాల మూల్యాంకనం చేపట్టారు. ఈ ప్రక్రియ ఏప్రిల్ మొదటి వారంలో పూర్తయింది. సాంకేతిక అంశాలను పరిశీలించిన తర్వాత ఫలితాల విడుదలకు అధికారులు ముహూర్తం నిర్ణయించారు.

'సాక్షి'లో వేగంగా టెన్త్ ఫలితాలు

ఇంటర్ ఫలితాలను వేగంగా అందించిన 'సాక్షి'.. టెన్త్ ఫలితాలను అదేవేగంతో అందించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ చేస్తోంది. విద్యార్థులు 30వ తేదీ ఉదయం 11 గంటలకు www.sakshieducation.comకు లాగినై, ఫలితాలు చూసుకోవచ్చు.



ఎయిర్‌పోర్టులో ఏర్పాటు చేసిన బోన్లు

ఎయిర్‌పోర్టు వద్ద చిరుత సంచారం!

అడవిపిల్లిగా అధికారుల అనుమానం

శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద చిరుత సంచారం కలకలం రేపుతోంది. ఎయిర్‌పోర్టులో రన్‌వే సమీపంలో శనివారం రాత్రి ఒంటి గంట సమయంలో చిరుత సంచరిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎయిర్‌పోర్టు భద్రతాధికారులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సమీపంలోని గ్రామస్తులు కూడా చిరుత సంచారం గురించి అధికారులకు చెప్పారు. అయితే చిరుతగా భావిస్తున్న ఆ జంతువు అడవిపిల్లి అయి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. దీంతో అటవీశాఖ అధికారులు ఎయిర్‌పోర్టులోని అటవీప్రాంతాలతో పాటు సమీపంలోని గ్రామాల పరిసరాల్లో కూడా విస్తృతంగా గాలింపు చేపట్టారు. చిరుత సంచరించినట్లు అనుమానిస్తున్న ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం బోన్లు ఏర్పాటు చేశారు. రెండేళ్ల కిందట కూడా ఎయిర్‌పోర్టు పరిసరాల్లో చిరుత సంచరించినట్లు వార్తలు వచ్చినప్పటికీ చివరికి అది అడవిపిల్లి అని అటవీశాఖ అధికారులు నిర్ధారించారు.



ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్

ఐడీఈఏ కొత్త కార్యవర్గం

అధ్యక్షునిగా సీతారామారావు

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ కొత్త కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి కె.సీతారామారావు అధ్యక్షునిగా, అభ్యాసక సహాయ సేవా విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి కార్యదర్శిగా, వివిధ రాష్ట్రాలకు చెందిన నలుగురిని ఉపాధ్యక్షులుగా, మరో ముగ్గురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కె.మురళి మనోహర్‌ను ఎన్నుకున్నారు. ఉస్మానియా వర్సిటీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, ఇండియన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో హైదరాబాద్‌లో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు సదస్సు జరిగింది. దూరవిద్య బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరుతూ సమావేశం తీర్మానం చేసింది. సమావేశంలో పలు విశ్వవిద్యాలయాల ఉప కులపతులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.